

ఈనాడు



విజయవాడ 19-11-2025 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 99
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఛాంపియన్

ప్రపంచ ఛాంపియన్‌కు ప్రీతి షాక్


ప్రీతి

- ఫైనల్లో ప్రవేశం
- అరుంధతి, పర్వీన్, మీనాక్షి కూడా

గ్రేటర్ నోయిడా: ప్రపంచ బాక్సింగ్ కప్‌లో భారత బాక్సర్ల హవా కొనసాగుతోంది. మంగళవారం మహిళల 54 కేజీల సెమీఫైనల్లో ప్రీతి 4-0తో ప్రపంచ ఛాంపియన్ హంగ్ హిసావో (చైనీస్ తైపీ)ని కంగుతినిపించి తుది పోరుకు అర్హత సాధించింది. ప్రపంచ ఛాంపియన్ మీనాక్షి హుడా (48 కేజీ) కూడా ఫైనల్ చేరింది. సెమీస్‌లో ఆమె 5-0తో బాక్ బోరంగ్ (కొరియా)ను చిత్తు చేసింది. నుపుర్ (80 కేజీల పైన) అంతే తేడాతో మారియా (ఉక్రెయిన్)ను ఓడించింది. పునరాగమనంలో అరుంధతి చౌదరి (70 కేజీ), పర్వీన్ (60 కేజీ) అదరగొట్టారు. లియోన్ (జర్మనీ)పై అరుంధతి నెగ్గగా.. అనెటా (పోలెండ్)ను పర్వీన్ ఓడించింది. మణికట్టు గాయంతో ఏడాదిన్నర తర్వాత బరిలో దిగిన అరుంధతి.. లియోన్‌తో పోరులో ఏమాత్రం తడబడలేదు. ఆమె పంచ్‌ల ధాటికి ప్రత్యర్థి తాళలేకపోవడంతో రిఫరీ బౌట్‌ను ఆపి అరుంధతిని విజేతగా ప్రకటించాడు. సెమీఫైనల్లో ఓడిన నవీన్ కుమార్ (90 కేజీ), స్వీటీ (75 కేజీ) కాంస్యాలతో సరిపెట్టుకున్నారు. ఇసాక్ (ఇంగ్లాండ్) చేతిలో నవీన్ ఓడగా.. ఎమ్మా (ఆస్ట్రేలియా)కు స్వీటీ తలొంచింది.

డెఫ్‌లింపిక్స్
ధనుష్ జోడీకి స్వర్ణం


మహిత్, ధనుష్

టోక్యో: డెఫ్‌లింపిక్స్‌లో హైదరాబాదీ షూటర్ ధనుష్ శ్రీకాంత్ జోరు కొనసాగుతోంది. వ్యక్తిగత విభాగంలో స్వర్ణం గెలిచిన అతడు మరో పసిడి పతకాన్ని ఖాతాలో వేసుకున్నాడు. మంగళవారం 10మీ ఎయిర్‌రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లో ధనుష్, మహిత్ సంధు జంట బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. ఇదే విభాగంలో ముర్తజా వానియా, కోమల్ మిలింద్ ద్వయం కాంస్యం సాధించింది. ఫైనల్లో ధనుష్ జోడీ 17-7తో దక్షిణ కొరియాకు చెందిన జియాన్ డైన్, కిమ్ వూరిమ్ జంటను ఓడించింది. కాంస్య పతక పోరులో వానియా, మిలింద్ జోడీ 16-12తో ఉక్రెయిన్ ద్వయంపై గెలిచింది. డెఫ్‌లింపిక్స్‌లో భారత షూటర్లు ఇప్పటివరకు 9 పతకాలు సాధించారు.

చెస్ ప్రపంచకప్
టైబ్రేకర్‌కు అర్జున్ పోరు


అర్జున్

పంజిమ్: చెస్ ప్రపంచకప్‌లో భారత స్టార్ అర్జున్ ఇరిగేశి సెమీఫైనల్ చేరాలంటే టైబ్రేకర్‌లో సత్తా చాటక తప్పదు. వీయ్ యీ (చైనా)తో క్వార్టర్‌ఫైనల్లో వరుసగా రెండో గేమ్‌ను కూడా డ్రాగా ముగించిన అర్జున్.. టైబ్రేకర్‌కు సిద్ధమయ్యాడు. మంగళవారం రెండో గేమ్‌లో అర్జున్ 32 ఎత్తుల్లో వీయ్ యీతో పాయింట్ పంచుకున్నాడు. ఈ పోరు ఆరంభంలో వీయ్ యీ నుంచి అతడు గట్టిపోటీ ఎదుర్కొన్నాడు. కానీ నెమ్మదిగా పుంజుకున్న అర్జున్.. గేమ్‌ను డ్రా దిశగా నడిపించాడు. సిందరోవ్-జోస్ ఎడూర్డో (మెక్సికో), సామ్ షాంక్‌లాండ్ (అమెరికా)-ఆండ్రీ ఇస్పింకో (ఫిన్లాండ్), నాదిర్‌బెక్ (ఉజ్బెకిస్థాన్)-అలెగ్జాండర్ డాన్‌చెంకో (జర్మనీ) మధ్య గేమ్‌లు సైతం డ్రా కావడంతో.. ఫలితం కోసం టైబ్రేకర్ ఆడనున్నారు.

ఆ బౌలర్ రెండు చేతులతో..


కౌశిక్ మైతీ

కోల్‌కతా: కోల్‌కతాలో మంగళవారం టీమ్ఇండియా నెట్స్‌లో ఓ వ్యక్తి అందరి దృష్టినీ ఆకర్షించాడు. కారణం అతడు రెండు చేతులతోనూ బౌలింగ్ చేయడమే. బెంగాల్ స్పిన్నర్ కౌశిక్ మైతీ చాలాసేపు భారత ఆటగాళ్లకు బంతులేశాడు. రెండో టెస్టులో దక్షిణాఫ్రికా ఆఫ్ స్పిన్నర్ హార్మర్, ఎడమచేతి వాటం స్పిన్నర్ కేశవ్ మహరాజ్‌ల నుంచి ముప్పును సమర్థంగా ఎదుర్కోవాలనుకుంటున్న టీమ్ఇండియా ప్రాక్టీస్ కోసం మైతీని పిలిచింది. అతడు రెండు పాత్రలనూ నిర్వర్తించాడు. ఎడమచేయి, కుడిచేయితో బౌలింగ్ చేశాడు. ఎడమచేతి వాటం బ్యాటర్లకు ఆఫ్‌బ్రేక్స్, కుడిచేతి వాటం బ్యాటర్లకు లెఫ్టార్మ్ స్పిన్ వేశాడు. 26 ఏళ్ల కౌశిక్.. ముస్తాక్ అలీ టోర్నమెంట్లో బెంగాల్‌కు ప్రాతినిధ్యం వహించాడు. "టీమ్ఇండియా నెట్స్‌లో బౌలింగ్ చేయడం నాకిదే తొలిసారి. ఐపీఎల్ సందర్భంగా ఈడెన్ గార్డెన్స్‌లో వివిధ ఫ్రాంఛైజీల నెట్స్‌లో బౌలింగ్ చేశా. ఈ రోజు నేను సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్, జడేజా, పడిక్కల్‌కు ఆఫ్‌బ్రేక్స్ వేశా. ధ్రువ్ జురెల్‌కు ఎడమచేతి వాటం స్పిన్ వేశా" అని కౌశిక్ చెప్పాడు.

స్పిన్.. స్పిన్

కోల్‌కతా: రెండో టెస్టులో దక్షిణాఫ్రికాను ఓడించాలంటే..? స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కోవాలి. టీమ్ఇండియా అనుసరిస్తున్న ప్రణాళిక ఇదే. రెండో టెస్టుకు సిద్ధమవుతున్న భారత జట్టు స్పిన్‌పైనే ఎక్కువ దృష్టిపెట్టింది. సుదర్శన్, ధ్రువ్ జురెల్‌లు ఒక్క ప్యాడ్ మాత్రమే కట్టుకుని స్పిన్నర్లను ఎదుర్కొన్నారు. కోచ్ గంభీర్.. ప్రాక్టీస్‌ను పర్యవేక్షించాడు. సుదర్శన్‌కు తొలి టెస్టులో చోటు దక్కని సంగతి తెలిసిందే. రెండో టెస్టులో కూడా అతడికి తుది జట్టు స్థానం లభిస్తుందన్న గ్యారెంటీ లేదు. సుదర్శన్ సాధన సందర్భంగా పేసర్ల బౌలింగ్‌లో ఆత్మవిశ్వాసంతో కనపడలేదు. ఆకాశ్‌దీప్ బౌలింగ్‌లో అనేకసార్లు బంతి అతడి బ్యాట్ అంచును తాకుతూ వెళ్లింది. నెట్ బౌలర్లు కూడా మూమెంట్‌తో అతణ్ని ఇబ్బందిపెట్టారు. గంభీర్, బ్యాటింగ్ కోచ్ సితాంశు.. సుదర్శన్‌తో చాలాసేపు మాట్లాడారు. ఐచ్ఛిక సెషన్‌కు ఆరుగురు ఆటగాళ్లు మాత్రమే హాజరయ్యారు. జడేజా నెట్స్‌లో అందరికన్నా ఎక్కువసేపు బ్యాటింగ్ చేశాడు.

గువాహటి వెళ్లనున్న గిల్: మెడ గాయంతో బాధపడుతున్న టీమ్ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. చివరిదైన రెండో టెస్టులో ఆడే అవకాశాలు తక్కువే. కానీ అతడు జట్టుతో పాటు గువాహటి వెళ్లనున్నాడని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఒకవేళ అతడు గువాహటికి వెళ్లకపోతే.. బెంగళూరులోని సీఓఈకి వెళ్తాడని పేర్కొన్నాయి. మరోవైపు గిల్ గాయం నేపథ్యంలో తిరిగి పిలుపందుకున్న ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి మంగళవారం కోల్‌కతాలో జట్టుతో చేరాడు. భారత్, దక్షిణాఫ్రికా రెండో టెస్టు ఈ నెల 22న మొదలవుతుంది.

ఎఫ్ఐహెచ్ ఉత్తమ అంపైర్‌గా రఘు


రఘు

లుసానె: భారత హాకీ అంపైర్ రఘు ప్రసాద్. ఎఫ్ఐహెచ్ ఉత్తమ పురుష అంపైర్ (2025) అవార్డుకు ఎంపికయ్యాడు. రఘు తన కెరీర్‌లో మొత్తం 198 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో విధులు నిర్వర్తించాడు. 33 మ్యాచ్‌లకు వీడియో అంపైర్‌గా పనిచేశాడు. రఘు అత్యున్నత ప్రమాణాలతో విధులు నిర్వర్తించాడని ఎఫ్ఐహెచ్ పేర్కొంది. "2003లో అరంగేట్రం నుంచి రఘు అన్ని ఖండాల్లో పనిచేశాడు. ఎఫ్ఐహెచ్ ప్రపంచకప్‌లు, ఒలింపిక్స్ సహా అన్ని మేజర్ టోర్నమెంట్లలో విధులు నిర్వర్తించాడు. రఘు తన నమ్రత, ప్రొఫెషనలిజంతో హాకీ వర్గాల నుంచి ఎంతో గౌరవం పొందాడు'' అని చెప్పింది. అర్జెంటీనాకు చెందిన ఇరీన్ ప్రెసెన్క్కి 'ఫీమేల్ అంపైర్ ఆఫ్ ద ఇయర్'గా ఎంపికైంది.

సాత్విక్ జోడీ శుభారంభం


సాత్విక్, చిరాగ్

సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 500 టోర్నీలో భారత స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి శుభారంభం చేశారు. మంగళవారం పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో ఈ జంట 25-23, 21-16తో చాంగ్ చి- లీ వీ (చైనీస్ తైపీ) ద్వయంపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టింది. వరుసగా హాంకాంగ్ ఓపెన్, చైనా మాస్టర్స్‌లో ఫైనల్ చేరుకుని జోరు మీదున్న సాత్విక్ జోడీ.. 48 నిమిషాల్లో చైనీస్ తైపీ జంటను చిత్తుచేసింది. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్- ట్రీసా జాలీ జోడీకి చుక్కెదురైంది. తొలి రౌండ్లో గాయత్రి జంట 10-21, 14-21తో ఫెబ్రియానా కుసుమ- మెలీసా పుస్పితసరి (ఇండోనేసియా)ల చేతిలో పరాజయంపాలైంది.

భారత్, బంగ్లా సిరీస్ వాయిదా

దిల్లీ: భారత్, బంగ్లాదేశ్ మహిళల జట్ల మధ్య జరగాల్సిన పరిమిత ఓవర్ల సిరీస్‌ను బీసీసీఐ వాయిదా వేసింది. ఐసీసీ భవిష్యత్ పర్యటనల కార్యక్రమంలో భాగంగా వచ్చే నెలలో కోల్‌కతా, కటక్‌లలో.. మూడేసి వన్డేలు, టీ20లలో భారత్, బంగ్లా తలపడాల్సి ఉంది. వాయిదా కారణాలు బహిరంగంగా వెల్లడించనప్పటికీ ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు ఉద్రిక్తంగా ఉండటంతోనే బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఐసీసీ వన్డే ప్రపంచకప్ గెలిచిన తర్వాత భారత్‌కు ఇదే తొలి సిరీస్ అయ్యేది. "డిసెంబరులో ప్రత్యామ్నాయ సిరీస్ ఏర్పాటుకు ప్రయత్నిస్తాం. బంగ్లాతో సిరీస్‌కు మాకు అనుమతి లభించలేదు'' అని బీసీసీఐ వర్గాలు చెప్పాయి. సోమవారం మాజీ ప్రధాన మంత్రి షేక్ హసీనాకు బంగ్లా అంతర్జాతీయ నేర ట్రైబ్యునల్ (ఐసీటీ) మరణశిక్ష విధించింది. దేశం విడిచి పారిపోయి భారత్‌లో నివసిస్తున్న హసీనాను తమకు అప్పగించాలంటూ బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం డిమాండ్ చేస్తుండటంతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు మరింత సున్నితంగా తయారయ్యాయి. తాజా పరిణామాల నేపథ్యంలో కూడా భారత్‌తో సిరీస్ పట్ల బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) ఆశాభావంతో ఉంది. ''సిరీస్ రద్దుకు సంబంధించి బీసీసీఐ నుంచి లేఖ వచ్చింది. కొత్త తేదీలు లేదా వివరాల కోసం ఇప్పుడు వేచి చూస్తున్నాం'' అని బీసీబీ పేర్కొంది.

అతికకు పోల్


అతిక

అబుదాబి: యువ రేసర్ అతిక మీర్ మరోసారి మెరిసింది. ఆర్ఎంసీ యూఏఈ రెండో రౌండ్ కార్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఈ పదకొండేళ్ల అమ్మాయి పోల్ పొజిషన్ సాధించింది. ఆక్సెల్ జీపీకి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ భారత బాలిక.. క్వాలిఫయింగ్‌లో 60.686 సెకన్లలో రేసు పూర్తి చేసి పోల్ చేజిక్కించుకుంది. తర్వాత హీట్ రేసులో ఆమె అగ్రస్థానంలో నిలిచింది. ప్రి ఫైనల్ రేసులో అతిక నడుపుతున్న కారు.. మరో కారును ఢీకొనడంతో ఆమెకు గాయమైంది. దీంతో ఆమె రేసు నుంచి వైదొలిగింది. అతిక గత వారం సీవోటీఎఫ్ఏ సిరీస్‌లో పోల్ పొజిషన్ సాధించడమే కాక.. పోడియంపైనా నిలిచింది.

శివ్ రయ్.. రయ్..

రేసింగ్.. ఈ పేరు చెప్పగానే వందల కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లే కార్లే గుర్తొస్తాయి! ఆ రేసులు చూడ్డానికి ఎంతో రోమాంచితంగా ఉంటాయి.. కానీ పోటీ పడాలంటేనే ఎంతో ధైర్యం కావాలి. ప్రమాదాలను ఎదుర్కొనే స్థైర్యం ఉండాలి. సవాల్‌తో కూడిన ఈ ఆటలో రయ్‌మంటూ దూసుకొచ్చాడు తెలుగు కుర్రాడు తుమ్మల శివ్. ఎఫ్ఐఏ ర్యాంకింగ్స్‌లో మైక్రో మ్యాక్స్ కేటగిరిలో జాతీయ నంబర్‌వన్ రేసర్‌గా నిలిచిన తొమ్మిదేళ్ల శివ్.. ప్రపంచ స్థాయిలో సత్తా చాటే దిశగా పయనిస్తున్నాడు.

ఈనాడు క్రీడావిభాగం


శివ్

హైదరాబాద్‌లోని గచ్చిబౌలికి చెందిన శివ్ అనుకోకుండా మోటర్ స్పోర్ట్స్‌లోకి వచ్చాడు. కరోనా సమయంలో లాక్‌డౌన్‌లో తల్లిదండ్రులు శివ్‌కు వీడియో గేమ్ స్టిమ్యులేటర్ కొనివ్వడంతో రేసులపై ఆసక్తి పెంచుకున్నాడు. తండ్రి శ్రీరామ్, తల్లి సృజన ప్రోత్సాహంతో ముందుకెళ్లిన శివ్.. మొదట హైదరాబాద్‌లో కార్టింగ్ సాధన చేశాడు. చక్కని బ్యాలెన్స్‌కు తోడు వేగంతో తొలి రోజే ఎక్కువ ల్యాప్‌లు పూర్తి చేసి ఆశ్చర్యపరిచాడు. రేసింగ్‌లో రాణించగల సత్తా ఉందని అర్థం కావడంతో అతడిని నిరుడు బెంగళూరులో పెరిగ్రిన్ రేసింగ్ అకాడమీలో చేర్చారు. ఏడుసార్లు భారత కార్టింగ్ ఛాంపియన్ అమేయా వాలవాల్కర్ శిక్షణలో శివ్ డ్రైవింగ్‌లో రాటుదేలాడు. శిక్షణ కోసం వారానికి రెండు రోజులు హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న అతడు రోజుకు 10 సెషన్ల పాటు ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఈ కఠోర సాధన వల్ల త్వరగానే ఫలితం కనిపించింది.

ఉత్తమ డ్రైవర్‌గా..: బరిలో దిగిన తొలి ఏడాదిలోనే శివ్ సత్తా చాటాడు. 2024లో జరిగిన ఎంఆర్ఎఫ్ సీవో-ఎఫ్ఎంఎస్‌సీఐ జాతీయ కార్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో అదరగొట్టాడు. కొయంబత్తూర్, బెంగళూరు, చెన్నై వేదికలుగా అయిదు రౌండ్ల పాటు సాగిన ఈ ఛాంపియన్‌షిప్‌లో మైక్రో మ్యాక్స్ కేటగిరి (8-12 సంవత్సరాలు)లో ఉత్తమ వర్ధమాన డ్రైవర్‌గా ఎంపికయ్యాడు. దుబాయ్ కార్ డ్రోమ్ ఐఏఎంఈ కప్‌లో శివ్ నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ ఏడాది అతడి ప్రదర్శన మరింత మెరుగైంది. బెంగళూరు, కొయంబత్తూర్‌లలో 3 రౌండ్ల పాటు సాగిన మికో మెరిటస్ జాతీయ ఛాంపియన్‌షిప్‌లో మైక్రో మ్యాక్స్‌లో విజేతగా నిలిచిన అతడు. . మికో ఎఫ్ఎంఎస్‌సీఐ కార్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. సకీర్ రొటాక్స్ మ్యాక్స్ ఛాలెంజ్‌లోనూ పోడియంపై (మూడో స్థానం) నిలిచాడు. ఎఫ్ఐఏ ర్యాంకింగ్స్‌లో మైక్రో మ్యాక్స్ కేటగిరిలో ప్రస్తుతం నంబర్‌వన్‌గా ఉన్న శివ్.. స్ట్రైట్ డ్రైవింగ్‌లో 110 కి.మీ.. మలుపుల్లో 94 కి.మీ తగ్గకుండా దూసుకెళ్తున్నాడు.

2024లో ప్రమాదం ఎదురైనా..: రేసింగ్ మొదలుపెట్టిన తొలి ఏడాది శివ్ చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఒకవైపు హైదరాబాద్‌లోని ఆగాఖాన్ అకాడమీలో చదువుతూనే మరోవైపు ఆటను కొనసాగించాడు. బెంగళూరులో జరిగిన మికో మెరిటస్ కప్‌లో శివ్ ప్రమాదానికి గురయ్యాడు. అతడి కారు వేరే రేసర్ కారును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. కానీ పెద్ద గాయాలు కాకుండా బయటపడ్డాడు. ఈ ప్రమాదం జరిగినా శివ్ ధైర్యం కోల్పోలేదు. రేసింగ్‌ను కొనసాగించాడు. బ్రిటన్ రేసర్ లాండో నోరిస్‌ను ఆరాధించే ఈ కుర్రాడు భవిష్యత్‌లో ఫార్ములావన్ స్థాయికి ఎదగాలనే సంకల్పంతో ఉన్నాడు. వచ్చే ఏడాది మిని మ్యాక్స్‌లో పోటీపడి సత్తా చాటాలని భావిస్తున్నాడు. ఈ కేటగిరిలో సత్తా చాటి జాతీయ ఛాంపియన్ అయితే రొటాక్స్ మ్యాక్స్ ఛాలెంజ్ ప్రపంచ గ్రాండ్ ఫైనల్స్‌కు వెళ్లే అవకాశం ఉంటుంది. అంతకుముందు ఈ డిసెంబర్‌లో జరిగే ఛాంపియన్స్ ఆఫ్ ద ఫ్యూచర్ రేసులోనూ పోటీపడి రాణించాలని శివ్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నాడు.

"చిన్నప్పటి నుంచి శివ్ రేసింగ్‌పై అమితాసక్తిని ప్రదర్శించాడు. అందుకే కష్టమైనా అతడిని బెంగళూరుకు పంపి శిక్షణ ఇప్పిస్తున్నాం. నాలుగో తరగతి చదువుతూనే ప్రతి శని, ఆదివారాల్లో బెంగళూరులోని పెరిగ్రిన్ అకాడమీకి వెళ్తున్నాడు. వచ్చే ఏడాది మినీ మ్యాక్స్‌లో జాతీయ ఛాంపియన్‌గా నిలవడం ద్వారా.. ప్రపంచ గ్రాండ్ ఫైనల్స్‌కు వెళ్లాలని అతడు లక్ష్యంగా పెట్టుకున్నాడు"
– సృజన, శివ్ తల్లి

ఢాకాలో భారత ఆర్చర్ల అవస్థలు

కోల్‌కతా: ఆసియా ఛాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన భారత క్రీడాకారులు తిరుగు ప్రయాణంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శనివారం ఢాకా నుంచి దిల్లీకి రావాల్సిన విమానం రద్దవడంతో భారత ఆర్చర్లు అవస్థల పాలయ్యారు. ఢాకాలో ఎలాంటి భద్రత లేకుండానే నాసిరకం వసతి సదుపాయాల మధ్య రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపారు. పదే పదే విమానం ఆలస్యమవడంతో ఇద్దరు మైనర్లు సహా 11 మంది భారత ఆర్చర్లు సుమారు 10 గంటల పాటు ఢాకా విమానాశ్రయంలోనే గడిపారు. వీరిలో ఏడుగురు మహిళలు ఉన్నారు. అభిషేక్ వర్మ, వెన్నం జ్యోతి సురేఖ, బొమ్మదేవర ధీరజ్‌తో సహా భారత ఆర్చర్లు శనివారం రాత్రి ఢాకా విమానాశ్రయం చేరుకున్నారు. రాత్రి 9.30 గంటలకు విమానం బయల్దేరాల్సి ఉండగా.. బోర్డింగ్ పూర్తయిన తర్వాత సాంకేతిక లోపం తలెత్తిందని, టేకాఫ్ సాధ్యంకాదంటూ ప్రయాణికులకు సిబ్బంది సమాచారమిచ్చారు. క్రీడాకారులంతా రాత్రి 2 గంటల వరకు టెర్మినల్ లోపలే ఉన్నారు. ప్రత్యామ్నాయ విమానాన్ని ఏర్పాటు చేయడం సాధ్యంకాదని చెప్పడంతో విమానాశ్రయం బయటకు వచ్చిన భారత ఆర్చర్ల కష్టాలు రెట్టింపయ్యాయి. కిటికీలు లేని స్థానిక బస్సులో ఎక్కించి దాదాపు అరగంట దూరంలోని తాత్కాలిక వసతి గృహానికి తీసుకెళ్లారు. "అతిథి గృహం పేరుతో ఇచ్చిన ధర్మసత్రం చాలా దయనీయంగా ఉంది. ఒకే గదిలో ఆరు బెడ్‌లు వేశారు. ఒకేఒక్క బాత్‌రూమ్ ఉండగా అది దుస్థితిలో ఉంది. అక్కడ ఎవరూ స్నానం చేస్తారని అనుకోను. మర్నాడు ఉదయం 11 గంటలకు విమానం ఉందని చెప్పినా.. విమానాశ్రయంలోనే ఉండేవాళ్లం. కాని సిబ్బంది ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ఆదివారం ఉదయం 7 గంటలకు విమానాశ్రయం చేరుకున్నాం. దిల్లీకి ఆలస్యంగా చేరుకోవడంతో కనెక్టింగ్ విమానాన్ని అందుకోలేకపోయాం. ఢాకాలో ఇంత జరుగుతున్నా మమ్మల్ని ఎవరూ పట్టించుకోలేదు. బయట అల్లర్లు జరుగుతున్నప్పుడు స్థానిక బస్సులో ఎలా ఎక్కిస్తారు? ఆ బస్సుపై ఏదైనా దాడి జరిగుంటే ముగ్గురు అమ్మాయిల పరిస్థితి ఎలా ఉండేది? ఎవరు బాధ్యత వహించేవారు?'' అని అభిషేక్‌వర్మ ఆవేదన వ్యక్తంచేశాడు.

అడ్వాణీకి షాక్


అడ్వాణీ

మస్కట్: వరల్డ్‌కప్ ఆఫ్ స్నూకర్‌లో మూడుసార్లు ప్రపంచ ఛాంపియన్ పంకజ్ అడ్వాణీకి షాక్ తగిలింది. మంగళవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో అతడు 0-4తో పాకిస్థాన్‌కు చెందిన అస్జాద్ ఇక్బాల్ చేతిలో ఓడిపోయాడు. మరో భారత ఆటగాడు ఆదిత్య మెహతా ప్రిక్వార్టర్స్‌లో 2-4తో చాంగ్ యు కియు (హాంకాంగ్) చేతిలో పరాజయంపాలయ్యాడు.

ఓటమి అంచుల్లో హైదరాబాద్

జమ్ము: రంజీ ట్రోఫీలో జమ్ముకశ్మీర్‌తో ఎలైట్ గ్రూపు-డి మ్యాచ్‌లో హైదరాబాద్ ఓటమి అంచుల్లో ఉంది. భారీ లక్ష్యాన్ని ఛేదించలేక బ్యాటర్లు చేతులెత్తేయడంతో హైదరాబాద్ పీకల్లోతు కష్టాల్లో చిక్కుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 275/4తో మంగళవారం ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జమ్ముకశ్మీర్ 422 పరుగులకు ఆలౌటైంది. అబ్దుల్ సమద్ (125) శతకంతో చెలరేగగా.. కన్హయ్య వధవాన్ (95) త్రుటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. వీరిద్దరు కలిసి అయిదో వికెట్‌కు 198 పరుగులు జోడించి జట్టుకు భారీ స్కోరు అందించారు. హైదరాబాద్ బౌలర్లలో తనయ్ త్యాగరాజన్ (4/87), రక్షణ్‌రెడ్డి (3/86), కార్తికేయ (2/98), పున్నయ్య (1/61) సఫలమయ్యారు. 472 పరుగుల లక్ష్య ఛేదనలో హైదరాబాద్ తడబడింది. అబిద్ ముస్తాక్ (4/56), సాహిల్ లోత్రా (2/28) విజృంభించడంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లకు 169 పరుగులు చేసింది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (47; 81 బంతుల్లో 7×4), కెప్టెన్ రాహుల్ సింగ్ (30; 40 బంతుల్లో 3×4, 1×6), అనికేత్‌రెడ్డి (35 బ్యాటింగ్; 51 బంతుల్లో 5×4) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు సాధించారు. బుధవారం మ్యాచ్‌కు చివరి రోజు. విజయానికి హైదరాబాద్ 303 పరుగులు, జమ్ముకశ్మీర్ మూడు వికెట్ల దూరంలో ఉన్నాయి.

సెమీఫైనల్లో భారత్-ఎ
ఒమన్‌పై విజయం


హర్ష్ దూబె

దోహా: రైజింగ్ స్టార్స్ ఆసియాకప్‌లో భారత్-ఎ జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. గ్రూప్-బిలో తన ఆఖరి మ్యాచ్‌లో ఆ జట్టు మంగళవారం 6 వికెట్ల తేడాతో ఒమన్‌పై విజయం సాధించింది. భారత్-ఎ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు మొదట ఒమన్ 7 వికెట్లకు 135 పరుగులే చేయగలిగింది. వసీమ్ అలీ (54; 45 బంతుల్లో 5×4, 1×6) టాప్ స్కోరర్. గుర్జన్‌ప్రీత్ సింగ్, సుయాశ్ శర్మ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. హర్ష్ దూబె (53 నాటౌట్; 44 బంతుల్లో 7×4, 1×6) మెరవడంతో లక్ష్యాన్ని భారత్-ఎ 17.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. నమన్ ధీర్ (30) రాణించాడు. మూడు మ్యాచ్‌ల్లో రెండు గెలిచిన భారత జట్టు.. గ్రూపులో రెండో స్థానంతో ముందంజ వేసింది. ఆ జట్టు శుక్రవారం జరిగే సెమీఫైనల్లో గ్రూప్-ఎ టాపర్‌తో తలపడుతుంది.

అభిషేక్ డబుల్ సెంచరీ..
ఆంధ్ర 567/6 డిక్లేర్డ్


అభిషేక్

జంషెడ్‌పూర్: ఆంధ్ర ఓపెనర్ అభిషేక్‌రెడ్డి (247; 348 బంతుల్లో 20×4, 2×6) అదరగొట్టాడు. ఝార్ఖండ్‌తో రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూపు-ఎ మ్యాచ్‌లో డబుల్ సెంచరీతో సత్తా చాటాడు. ఓవర్‌నైట్ స్కోరు 224/2తో మంగళవారం ఉదయం ఆట కొనసాగించిన ఆంధ్ర 567/6 స్కోరు వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అభిషేక్, కరణ్ షిండే (94; 129 బంతుల్లో 7×4) అయిదో వికెట్‌కు 208 పరుగులు జోడించి జట్టు స్కోరును 500 దాటించారు. ఆంధ్రకు 239 పరుగుల ఆధిక్యం లభించింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఝార్ఖండ్ రెండో ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లకు 34 పరుగులు సాధించింది. బుధవారం మ్యాచ్‌కు ఆఖరి రోజు కాగా.. ఇన్నింగ్స్ ఓటమి నుంచి తప్పించుకోవాలంటే ఝార్ఖండ్ మరో 205 పరుగులు చేయాలి.

పాకిస్థాన్ బోణీ

రావల్పిండి: ముక్కోణపు టీ20 సిరీస్‌లో ఆతిథ్య పాకిస్థాన్ బోణీ కొట్టింది. మంగళవారం ఆ జట్టు 5 వికెట్ల తేడాతో జింబాబ్వేను ఓడించింది. మొదట జింబాబ్వే 8 వికెట్లకు 147 పరుగులు చేసింది. బ్రయాన్ బెన్నెట్ (49), సికందర్ రజా (34 నాటౌట్), మరుమని (30) రాణించారు. నవాజ్ (2/22) సత్తా చాటాడు. ఫకార్ జమాన్ (44), ఉస్మాన్ ఖాన్ (37 నాటౌట్), నవాజ్ (21 నాటౌట్) రాణించడంతో లక్ష్యాన్ని పాక్ 19.2 ఓవర్లలో 5 వికెట్లే కోల్పోయి అందుకుంది. పాక్ ఒక దశలో 115/5తో కష్టాల్లో పడినా.. ఉస్మాన్, నవాజ్ నిలిచి జట్టును గెలిపించారు. ఈ టోర్నీలో మూడో జట్టు శ్రీలంక.

బంగ్లాదేశ్ చేతిలో భారత్ ఓటమి

ఢాకా: ఏఎఫ్‌సీ ఆసియాకప్ క్వాలిఫయర్స్‌లో మంగళవారం జరిగిన గ్రూప్-సి మ్యాచ్‌లో భారత్ 0-1తో బంగ్లాదేశ్ చేతిలో ఓడిపోయింది. బంగ్లా తరఫున షేక్ మొర్సాలిన్ గోల్ కొట్టాడు. 2027 ఆసియాకప్‌లో చోటుకు ఈ రెండు జట్లు ఇంతకుముందే దూరమైన నేపథ్యంలో ఈ మ్యాచ్ నామమాత్రమే. నాలుగు జట్ల గ్రూపులో భారత్ అట్టడుగున కొనసాగుతోంది. ఆ జట్టు అయిదు మ్యాచ్‌ల నుంచి రెండు పాయింట్లు మాత్రమే సంపాదించింది. భారత జట్టు తన ఆఖరి మ్యాచ్‌లో.. 2026 మార్చిలో హాంకాంగ్‌తో తలపడుతుంది.

ఈనాడు

విజయవాడ 19-11-2025 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 99
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

మోస్ట్‌వాంటెడ్ మావోయిస్టు హిడ్మా ఎన్‌కౌంటర్



మద్వి హిడ్మా (పాత చిత్రం)

దళసభ్యుడి నుంచి దండకారణ్య దళపతిగా..!

పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కార్యకలాపాలకు ఆయువుపట్టుగా హిడ్మా

గెరిల్లా యుద్ధవ్యూహాల్లో అపార అనుభవం

మావోయిస్టు చరిత్రలో అతిపెద్ద చింతల్నార్‌తోపాటు అనేక దాడులకు నేతృత్వం 6లో

- ఆయన భార్య మడకం రాజే, మరో నలుగురు కూడా
- మారేడుమిల్లి అడవుల్లో తుపాకుల మోత
- పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తుండగా తారసపడ్డ హిడ్మా బృందం
- ఘటనా స్థలం నుంచి పారిపోయిన మరో 19 మంది మావోయిస్టులు
- వారి కోసం ముమ్మరంగా గాలిస్తున్న భద్రతా బలగాలు
- మృతులంతా ఛత్తీస్‌గఢ్ వాసులే • అక్కడ నిర్బంధం పెరగటంతో ఏపీ వైపు రాక
- వారి కదలికలపై నిఘా పెట్టిన ఏపీ పోలీసులు

ఎదురుకాల్పుల్లో మొత్తం ఆరుగురు మావోయిస్టుల మృతి



మృతి చెందిన మద్వి హిడ్మా, ఆయన భార్య మడకం రాజే

ఈనాడు-రాజమహేంద్రవరం, అమరావతి, ఈనాడు డిజిటల్ - పాడేరు, న్యూస్‌టుడే-రంపచోడవరం: మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. ఆ పార్టీ అగ్రనేత, గెరిల్లా ఆపరేషన్లలో ఆరితేరిన కేంద్ర కమిటీ సభ్యుడు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి, మోస్ట్‌వాంటెడ్ మద్వి హిడ్మా (51) భద్రత బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో హతమయ్యారు. హిడ్మాతో పాటు ఆయన భార్య, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు మడకం రాజే, పీఎల్‌జీఏ ఒకటో నంబర్ కంపెనీలోని వివిధ ప్లటూన్లకు కమాండర్లుగా బాధ్యతలు నిర్వహిస్తున్న లక్మల్ ఎలియాస్ చైతు, కమ్లూ ఎలియాస్ కమలేష్, మల్లా ఎలియాస్ మల్లాలు, దేవేలు ప్రాణాలు కోల్పోయారు. వీరంతా హిడ్మా రక్షణ దళంలో కీలక సభ్యులు. వీరంతా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాకు చెందినవారే. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లికి 5 కిలోమీటర్ల దూరంలోని నెల్లూరు గ్రామ అటవీ ప్రాంతంలో మంగళవారం ఉదయం 6.30-7 గంటల మధ్య ఈ ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో మొత్తం ఆరుగురు మావోయిస్టులు మృతిచెందగా మరో 19 మంది తప్పించుకున్నారు. వీరి కోసం భద్రత బలగాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ నిఘా విభాగాధిపతి మహేష్‌చంద్ర లడ్డా, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్‌లు మంగళవారం ఉదయం రంపచోడవరంలో (మిగతా 6లో)



హిడ్మాపై రూ.కోట్లలో రివార్డ్.. భార్యపై రూ.50 లక్షలు 6లో

ఉలిక్కిపడ్డ విజయవాడ.. ఏలూరు, కాకినాడల్లో అలజడి

పక్కా సమాచారంతో వివిధచోట్ల ఏపీ పోలీసుల భారీ ఆపరేషన్

అదుపులో 50 మంది మావోయిస్టులు

- పట్టుబడినవారిలో అగ్రనేత?
- మిగిలినవారంతా దేవ్‌జీ రక్షణ బృందం, హిడ్మా బెటాలియన్‌లో పనిచేసేవారే
- ఆపరేషన్ కగార్‌తో దండకారణ్యం కకావికలం
- తలదాచుకునేందుకే మైదాన ప్రాంతంలోకి రాక 6లో



విజయవాడలో మావోయిస్టులను అదుపులోకి తీసుకున్న అనంతరం భవనంలో సోదాలు చేస్తున్న భద్రతా బలగాలు

అక్రమాస్తుల కేసులో రేపు సీబీఐ కోర్టుకు జగన్

ఆరేళ్ల తర్వాత వ్యక్తిగతంగా కోర్టు ముందుకు



ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ అక్రమాస్తుల కేసులో హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టుకు గురువారం హాజరు కానున్నారు. ఇప్పుడు కూడా వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని జగన్ కోరగా సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరవడం లేదని, ఈ కేసుల్లో డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున ఆయన ప్రత్యక్షంగా హాజరవ్వాలని సీబీఐ తెలిపింది. దీంతో ఈ నెల 21లోగా వ్యక్తిగతంగా హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకరోజు ముందే ఆయన కోర్టుకు హాజరయ్యేందుకు సిద్ధమయ్యారు. గత నెల ఆయన కోర్టు అనుమతితో ఐరోపా (మిగతా 2లో)

పరకామణి కేసు.. సాక్షులకు భద్రత కల్పించండి

నిందితుడు రవికుమార్‌కు కూడా..

సీఐడీ డీజీకి హైకోర్టు ఆదేశం

సతీష్‌కుమార్ అసహజ మరణం దిగ్భ్రాంతికి గురిచేసిందని వ్యాఖ్య 2లో

డిసెంబరు 30 నుంచి పది రోజులు వైకుంఠద్వార దర్శనాలు

మొదటి మూడు రోజులు ఈ-డిప్‌లో సర్వదర్శనం టోకెన్ల జారీ

తితిదే ధర్మకర్తల మండలి సమావేశంలో తీర్మానం 3లో

శబరిమలకు పోటెత్తిన భక్తులు

తొలి రెండు రోజుల్లోనే 2 లక్షల మంది • క్యూలైన్లో మహిళ మృతి

పథనంథిట్ట: మండల-మకరవిలక్కు పూజ నేపథ్యంలో కేరళలోని శబరిమల అయ్యప్ప క్షేత్రానికి భక్తులు పోటెత్తుతున్నారు. తొలి రెండు రోజుల్లో(సోమవారం, మంగళవారం)నే దాదాపు రెండు లక్షల మందికి పైగా భక్తులు శబరిమలకు విచ్చేశారు. దీంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. పంబ నుంచి సన్నిధానం మార్గంలోనూ విపరీత రద్దీ నెలకొంది. దర్శనం క్యూలైన్లో కుప్పకూలిపోయి ఓ మహిళ(58) మరణించారు. భక్తుల సంఖ్య చాలా ఎక్కువగా ఉండటంతో.. ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు(టీడీబీ) సిబ్బంది, పోలీసులకు రద్దీ నియంత్రణ తలకు మించిన భారంగా మారింది. ఆలయ ప్రాంగణంలో ఇంత భారీ స్థాయిలో జనసమూహాన్ని తాను ఎప్పుడూ చూడలేదని టీడీబీ అధ్యక్షుడు కె.జయకుమార్ తెలిపారు. బహుశా ఆలయ చరిత్రలోనే ఇదే అత్యధిక రద్దీ అనే వాదనలు వినిపిస్తున్నాయి. "కొంతమంది క్యూలైన్లను తప్పించుకుని వస్తున్నట్లు కనిపిస్తోంది. దీన్ని కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రద్దీ నియంత్రణ కోసం నీలక్కల్, ఇతర ప్రదేశాల్లో భక్తులు ముందుకు కదలకుండా తాత్కాలికంగా ఆంక్షలు విధించాం. నీలక్కల్‌లో ఏడు అదనపు స్పాట్ బుకింగ్ కౌంటర్లను ఏర్పాటు చేస్తాం. శబరిమల ప్రవేశాన్ని రోజుకు లక్ష మందికి, స్పాట్ బుకింగ్‌లను రోజుకు 20 వేల మందికి (మిగతా 2లో)



శబరిమల ఆలయానికి మంగళవారం భారీగా తరలివచ్చిన భక్తులు



సత్యసాయి బంగారు విగ్రహం

9.2 కిలోల బంగారంతో సత్యసాయి విగ్రహం

- పుట్టపర్తి రథోత్సవంలో ఊరేగింపు
- వైభవంగా బాబా శత జయంత్యుత్సవాలు ప్రారంభం
- నేడు పాల్గొననున్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు

ఈనాడు, పుట్టపర్తి: శ్రీసత్యసాయి జిల్లాలోని అంతర్జాతీయ ఆధ్యాత్మిక పట్టణం పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో సత్యసాయి బాబా శత జయంత్యుత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద మంత్రోచ్చారణలు, వేలమంది భక్తుల సాయి నామస్మరణల నడుమ వెండి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. 9.2 కిలోల బంగారంతో సిద్ధం చేసిన సత్యసాయి ఉత్సవ విగ్రహాన్ని 31.8 అడుగుల ఎత్తయిన వెండి రథంలో ప్రతిష్ఠించి పట్టణ వీధుల్లో ఊరేగించారు. రథం తయారీలో 180 కిలోల వెండిని, పూతగా కిలో బంగారాన్ని వినియోగించారు. మంగళవారం ఉదయం వేదపఠనంతో కార్యక్రమాలు (మిగతా 2లో)

ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో 32 పేజీల బుక్‌లెట్

- ప్రథమ సంవత్సరంలో ప్రశ్నపత్రాల మోడల్ మార్పుతో పేజీల పెంపు
- వృక్ష, జంతుశాస్త్రాలకు వేర్వేరుగా 24 పేజీల సమాధాన పత్రాలు
- సైన్సు సబ్జెక్టుల్లో 29 మార్కులకే ఉత్తీర్ణత

ఈనాడు - అమరావతి


ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో మొదటి సంవత్సరం విద్యార్థులకు 32 పేజీల సమాధాన పత్రాల బుక్‌లెట్ ఇవ్వనున్నారు. ఈ ఏడాది ఫస్టియర్‌లో జాతీయ విద్య పరిశోధన, శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్టీ) సిలబస్‌ను అమలుచేయడంతో పాటు ప్రశ్నపత్రాలను మార్చారు. తొలిసారి ఒకమార్కు ప్రశ్నలను ప్రవేశపెట్టారు. ఫలితంగా ప్రశ్నల సంఖ్య పెరిగింది. గణితంలో గతంలో 150 మార్కులకు రెండు పేపర్లు ఉండగా.. ఈసారి వంద మార్కులకు ఒకటే పేపర్‌ను తీసుకొచ్చారు. భౌతిక, రసాయనశాస్త్రాల సబ్జెక్టుల్లో 85 మార్కులకు పరీక్ష ఉంటుంది. దీంతో సమాధానాల బుక్‌లెట్ పేజీలను పెంచారు. ఇప్పటివరకు 24 పేజీల బుక్‌లెట్ ఉండగా.. ఇకనుంచి 32 పేజీలది ఇస్తారు. గణితం, భౌతిక, రసాయనశాస్త్రాలు, చరిత్ర, ఆర్థికశాస్త్రం, రాజనీతి శాస్త్రం, కామర్స్‌లకు 32 పేజీల బుక్‌లెట్ ఉంటుంది. జీవశాస్త్రంలో.. వృక్షశాస్త్రానికి 24 పేజీలు, జంతుశాస్త్రానికి 24 పేజీల చొప్పున రెండు బుక్‌లెట్‌లిస్తారు. ప్రశ్నపత్రంలో ఏ, బీ సెక్షన్లుగా విడిగా వృక్ష, జంతుశాస్త్రాల ప్రశ్నలుంటాయి. విద్యార్థులు జవాబులను విడివిడిగా బుక్‌లెట్‌లలో రాయాలి. మిగతా సబ్జెక్టులకు గతంలో మాదిరిగానే 24 పేజీల బుక్‌లెట్ ఇస్తారు.

భౌతిక, రసాయన, జీవశాస్త్రం సబ్జెక్టులకు మొదటి ఏడాదిలో 85 మార్కులకు రాత పరీక్ష ఉంటుంది. ఉత్తీర్ణతకు 35% లెక్కన 29.75 మార్కులు రావాల్సి ఉండగా.. దీన్ని 29కి తగ్గించారు.

- ద్వితీయ సంవత్సరంలో 85 మార్కులకు 30 మార్కులు తెచ్చుకోవాలనే నిబంధన పెట్టారు.
- రెండు సంవత్సరాలకు కలిపి 35% కింద 59.5 మార్కులు సాధించాల్సి ఉండగా.. (మిగతా 2లో)

వైకాపా అధికార ప్రతినిధి కారుమూరి వెంకటరెడ్డి అరెస్ట్ 12లో

ఇదీ సంగతి!



ఏరోస్పేస్ గ్రోత్ కారిడార్‌గా శ్రీసత్యసాయి జిల్లా

- విమానాశ్రయానికి దగ్గరగా ఉండటం, స్థలం లభ్యత, ప్రభుత్వ విధానాలు అనుకూలతలు
- ఆ ప్రాంతం బెంగళూరుకు దీటుగా అభివృద్ధి చెందుతుంది
- 'ఈనాడు'తో జేకే మైనీ సంస్థ ఎండీ గౌతమ్ మైనీ వెల్లడి



ఈనాడు - అమరావతి

దేశ వైమానిక పరిశ్రమల రంగానికి కేంద్రంగా ఉన్న బెంగళూరులో స్థలం కొరత, వ్యయాలు భారీగా పెరిగిపోవడం, రద్దీ లాంటి కారణాలతో విస్తరణ కష్టంగా మారిందని, ఇప్పుడు పెద్ద పరిశ్రమలన్నీ దానికి సమీపంలోని శ్రీసత్యసాయి జిల్లాపై దృష్టిపెడుతున్నాయని రేమండ్ గ్రూప్‌నకు చెందిన జేకే మైనీ ప్రెసిషన్ టెక్నాలజీ లిమిటెడ్ ఎండీ గౌతమ్ మైనీ తెలిపారు. మరో 10-15 ఏళ్లలో ఆ ప్రాంతం బెంగళూరుకు దీటుగా ఏరోస్పేస్ గ్రోత్ కారిడార్‌గా అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు. రేమండ్ గ్రూప్ శ్రీసత్యసాయి జిల్లా టేకులోడు వద్ద ఏరోస్పేస్ పరికరాల తయారీ కర్మాగారం, అనంతపురం జిల్లా గుడిపల్లిలో వాహనాల విడిభాగాల తయారీ కేంద్రం, రాప్తాడులో అపెరల్ పార్క్ ఏర్పాటుకు ఇటీవల విశాఖలో పెట్టుబడిదారుల సదస్సులో శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన 'ఈనాడు'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ మూడు పరిశ్రమలపై రేమండ్ గ్రూప్ సుమారు రూ.1,200 కోట్ల పెట్టుబడి పెడుతోంది.

బెంగళూరులో హెచ్ఏఎల్ ఉండటంతో ప్రపంచంలోని అగ్రశ్రేణి వైమానిక కంపెనీలన్నీ అక్కడ కార్యకలాపాలు ప్రారంభించాయి. 60% పరిశ్రమ అక్కడే విస్తరించింది. ఇప్పుడు అక్కడ భారీ ఎత్తున విస్తరణకు వెళ్లలేని పరిస్థితులున్నాయి. అందువల్ల ఇప్పుడు మేం శ్రీ సత్యసాయి జిల్లాలో ఏరోస్పేస్ పరిశ్రమ ఏర్పాటుచేస్తున్న ప్రాంతం అత్యంత అనుకూలంగా (మిగతా 2లో)

9.2 కిలోల బంగారంతో సత్యసాయి విగ్రహం



వెండి రథంపై కొలువుదీరిన సత్యసాయి బంగారు విగ్రహం





ఆధ్యాత్మిక వెలుగులను పంచుతున్న సత్యసాయి వెండి రథం ★ రథోత్సవానికి హాజరైన భక్తజనం

(మొదటి పేజీ తరువాయి)

మొదటగా, విశ్వశాంతిని కాంక్షిస్తూ మహా సమాధి వద్ద 1,100 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతం ఆచరించాయి. సాయికుల్వంత్ మందిరం నుంచి సత్యసాయి, వేణుగోపాలస్వామి, సీతారామ, హనుమాన్ ఉత్సవ విగ్రహాలను.. సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, వేద పండితులు తీసుకురాగా జిల్లెళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ ఉత్సవాల్లో భాగంగా ఏటా వేణుగోపాలస్వామి రథోత్సవం నిర్వహించేవారు. ఈ ఏడాది కొత్తగా సత్యసాయి రథోత్సవాన్ని ప్రారంభించారు. దేశ, విదేశాల నుంచి వచ్చిన భక్తులు సత్యసాయి దర్శనంతో పులకించారు. రథోత్సవంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత, సత్యకుమార్, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీశ్ కుమార్, సినీనటుడు మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు. మంగళవారం రాత్రి సత్యసాయి బాబా తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

నేడు పుట్టపర్తికి ప్రధాని మోదీ

ప్రధాని మోదీ బుధవారం శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో పర్యటించనున్నారు. సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో ఆయన పాల్గొంటారు. ఉదయం 9.45కు మోదీ పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. 10 గంటలకు రోడ్డు మార్గంలో ప్రశాంతి నిలయానికి వెళ్లి సత్యసాయి మహాసమాధిని దర్శించుకుని నివాళులర్పిస్తారు. 10.30కు హిల్‌వ్యూ స్టేడియంలో జరిగే ప్రపంచ మహిళా దినోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తారు. బాబా జీవితం, బోధనలు, సేవల స్మారకార్థంగా రూపొందించిన రూ.100 నాణెం, నాలుగు తపాలా బిళ్లలను ఆవిష్కరిస్తారు. మధ్యాహ్నం 12.20 గంటలకు హిల్‌వ్యూ స్టేడియం నుంచి రోడ్డు మార్గాన పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుని, ప్రత్యేక విమానంలో కోయంబత్తూరు బయలుదేరతారు. అక్కడ జరిగే దక్షిణ భారత సేంద్రియ వ్యవసాయ సదస్సులో ప్రధాని పాల్గొంటారని అధికారులు తెలిపారు.

పుట్టపర్తి విచ్చేసిన సీఎం చంద్రబాబు

సత్యసాయి శత జయంత్యుత్సవం, ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో పుట్టపర్తికి పలువురు ప్రముఖులు చేరుకున్నారు. సీఎం చంద్రబాబు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ, విద్యాశాఖ మంత్రి లోకేశ్, క్రికెటర్ సచిన్ తెందూల్కర్, సినీనటి ఐశ్వర్య రాయ్ తదితరులు ఇప్పటికే పుట్టపర్తి చేరుకున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అర్ధరాత్రి పుట్టపర్తి వచ్చారు. ప్రధాని పర్యటన దృష్ట్యా అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా దగ్గరుండి బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు.



సచిన్ తెందూల్కర్‌తో మాట్లాడుతున్న మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్



శత జయంత్యుత్సవాలకు హిల్‌వ్యూ స్టేడియంలో సిద్ధమవుతున్న వేదికలు

ఉత్సుకతతో ఎదురుచూస్తున్నా: మోదీ

సత్యసాయి శత జయంత్యుత్సవంలో ఏపీలోని సోదరీ, సోదరులతో కలిసి పాల్గొనడానికి ఎంతో ఉత్సుకతతో ఎదురుచూస్తున్నానని ప్రధాని మోదీ పేర్కొన్నారు. సమాజసేవ, ఆధ్యాత్మికత మేల్కొలుపునకు సత్యసాయి చేసిన ప్రయత్నాలు తరతరాలకూ మార్గదర్శకంగా ఉంటాయన్నారు. సత్యసాయితో మాట్లాడటానికి, ఆయన నుంచి నేర్చుకోవడానికి తనకు పలుమార్లు అవకాశం లభించిందని సంతోషం వ్యక్తంచేశారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేస్తూ నాటి ఫొటోలను జతపరిచారు.



సత్యసాయితో నాడు గుజరాత్ ముఖ్యమంత్రి హోదాలో మోదీ

పర్యావరణ అనుమతులపై నిషేధం తీర్పు ఉపసంహరణ

- 2:1 మెజారిటీతో త్రిసభ్య ధర్మాసనం నిర్ణయం
- త్వరలో మరో ధర్మాసనం ముందుకు వ్యాజ్యం

దిల్లీ: పర్యావరణ చట్ట నిబంధనలను ఉల్లంఘిస్తూ చేపట్టిన ప్రాజెక్టులకు వెనుకటి తేదీతో అనుమతులు ఇవ్వడాన్ని నిషేధిస్తూ గతంలో తాను వెలువరించిన 'వనశక్తి' తీర్పును సుప్రీంకోర్టు మంగళవారం ఉపసంహరించుకుంది. ఈ తీర్పు ఉపసంహరణకు ఇద్దరు న్యాయమూర్తులు మద్దతు తెలుపగా మరో న్యాయమూర్తి తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో 2:1 మెజారిటీతో నిర్ణయాన్ని వెలువరించినట్లైంది. వెనుకటి తేదీతో అనుమతులివ్వడాన్ని నిషేధిస్తూ మే 16న వెలువడిన 'వనశక్తి' తీర్పును సమీక్షించాలని, దానిలో మార్పులు చేయాలని కోరుతూ 40కి పైగా అభ్యర్థనలు దాఖలు కాగా విచారణ జరిపిన త్రిసభ్య ధర్మాసనంలోని జడ్జీలు... ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లు విడివిడిగా తమ అభిప్రాయాలను వెల్లడించారు. జస్టిస్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌లు...'వనశక్తి తీర్పు' ఉపసంహరణను గట్టిగా సమర్థించారు. జస్టిస్ ఉజ్జల్ భుయాన్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. వెనుకటి తేదీతో పర్యావరణ అనుమతులు మంజూరు ఇవ్వడం అనే భావన సంబంధిత చట్టంలో లేదని, అది చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. దేశ రాజధాని దిల్లీ ఎదుర్కొంటున్న తీవ్ర కాలుష్య సమస్యను ఆయన గుర్తు చేశారు. 'వనశక్తి తీర్పు' వెలువరించిన ధర్మాసనంలోనూ జస్టిస్ ఉజ్జల్ భుయాన్ సభ్యుడిగా ఉన్నారు. 'వనశక్తి' తీర్పును వెనక్కి తీసుకోకపోతే... రూ.20వేల కోట్ల ప్రజాధనంతో చేపట్టిన ప్రాజెక్టులను కూల్చివేయాల్సివస్తుందని సీజేఐ జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. పర్యావరణ అనుమతుల విషయంలో గతంలో ద్విసభ్య ధర్మాసనాలు ఇచ్చిన తీర్పులను ప్రస్తుతం వెనక్కి తీసుకుంటున్న తీర్పునిచ్చిన ధర్మాసనం పరిగణనలోకి తీసుకోలేదని ఆక్షేపించారు. వెనకటి తేదీలతో ప్రాజెక్టులకు అనుమతించిన కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులపై పునర్విచారణ జరిపే బాధ్యతను మరో ధర్మాసనానికి అప్పగించనున్నట్లు తెలిపారు. తాజా తీర్పుతో 2017లో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్, 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండం చెల్లుబాటులోకి వస్తాయి.

వనశక్తి తీర్పులో ఏముంది?

ఈ ఏడాది మే 16న వనశక్తి తీర్పును జస్టిస్ ఎ.ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం వెలువరించింది. వెనుకటి తేదీతో అనుమతులు ఇవ్వరాదని పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖను ధర్మాసనం స్పష్టం చేస్తూ కేంద్ర నోటిఫికేషన్ (2017), 2021 ఆఫీస్ మెమోరాండం అమలును నిలిపివేసింది. ఆ తర్వాత జస్టిస్ ఎ.ఎస్.ఓకా పదవీ విరమణ చేశారు. వనశక్తి తీర్పును సమీక్షించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై తీర్పును సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం అక్టోబరు 9న రిజర్వు చేసింది.

■ వనశక్తి తీర్పు ఉపసంహరణ నిర్ణయంపై కాంగ్రెస్ పార్టీ అసంతృప్తి వ్యక్తం చేసింది. భారీ జరిమానాలు విధిస్తూ వెనుకటి తేదీతో ప్రాజెక్టులకు అనుమతులివ్వడం సమస్యకు పరిష్కారం కాదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అభిప్రాయపడ్డారు.

ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో 32 పేజీల బుక్‌లెట్

(మొదటి పేజీ తరువాయి)

59 మార్కులతో ఉత్తీర్ణత నిర్ణయించారు. ఈ అరమార్కును సర్దుబాటు చేసి, రెండో ఏడాదిలో ప్రాక్టికల్స్ 30 మార్కులకు ఉత్తీర్ణత మార్కులను 10.5 నుంచి 11కు పెంచారు.

■ మొదటి ఏడాదిలో కొన్ని సబ్జెక్టుల్లో 30% మార్కులొచ్చినా ఉత్తీర్ణత. మొత్తమ్మీద 35% రావాలి. ఏదైనా ఒక సబ్జెక్టులో అత్యధిక మార్కులు వచ్చి, మిగతా వాటిల్లో 30% చొప్పున వచ్చినా ఉత్తీర్ణులైనట్లే పరిగణిస్తారు. ■ జాగ్రఫీ పరీక్షను గతంలోలాగే 75 మార్కులకు నిర్వహించి, 85 మార్కులకు లెక్కిస్తారు. మొదటి ఏడాది 15, రెండో ఏడాది 15 కలిపి ద్వితీయ సంవత్సరంలో 30 మార్కులకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ■ ఒక మార్కు, రెండు మార్కుల ప్రశ్నలకు ఛాయిస్ ఉండదు. ■ వృక్షశాస్త్రం 43, జంతుశాస్త్రం 42 మార్కులకు ఉంటాయి. ■ గ్రూపు ఐదు సబ్జెక్టులు కాకుండా ఆరో సబ్జెక్టుగా ఎంపిక చేసుకున్న దానిలో ఉత్తీర్ణత తప్పనిసరి కాదు. ఆరో సబ్జెక్టులో ఫెయిల్ అయినా ఐదు సబ్జెక్టుల మార్కులతో మెమో ఇస్తారు. ఒకవేళ ఉత్తీర్ణులైతే వేరుగా ప్రత్యేక మార్కుల మెమో ఇస్తారు.

పరీక్షలు రాయనున్న 10.40 లక్షల మంది

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు ఈసారి 10.40 లక్షల మంది పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. వీరిలో 5.35 లక్షల మంది ప్రథమ, 5.05 లక్షల మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులున్నారు. ద్వితీయ సంవత్సరం ప్రశ్నాపత్రాలు, జవాబుల బుక్‌లెట్లో మార్పుండదు. పాత విధానాన్నే కొనసాగిస్తారు. 2026-27 విద్యాసంవత్సరం నుంచి సెకండియర్‌లో ఎన్‌సీఈఆర్టీ సిలబస్ అమల్లోకి వస్తుంది. అప్పుడు రెండో ఏడాది ప్రశ్నపత్రాల్లోనూ మార్పులు చేస్తారు.

దినచర్యను బట్టి ఆరోగ్యం..



మనం ఎదుర్కొనే అనారోగ్య సమస్యల్లో 90 శాతాన్ని దినచర్య ద్వారా దూరం చేసుకోవచ్చు. ఆ దినచర్య ఎలా ఉండాలంటే..● వారంలో మూడు నాలుగు రోజులు దారుఢ్య శిక్షణ ● రోజూ 10 వేల అడుగుల నడక ● ధ్యానం ● పోషకాలతో కూడిన ఆహారం ● ఒకే సమయానికి నిద్రపోవడం, మేల్కొనడం ● శరీరానికి ఉదయపు సూర్యరశ్మి తగిలేలా చూసుకోవడం ●3 లీటర్ల నీటిని తాగడం ● 25-35 మి.గ్రా. ఫైబర్ తీసుకోవడం ● 12-14 గంటల పాటు ఆహార విరామం ● అతిగా శుద్ధిచేసిన ఆహారాన్ని మితం చేసుకోవడం.

– శాయాజీరావ్ గైక్వాడ్, వైద్యుడు

శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో సీఎం పర్యటన నేడు

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబు బుధవారం శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో పర్యటించనున్నారు. ఉదయం పుట్టపర్తి విమానాశ్రయంలో ప్రధాని మోదీకి సీఎం స్వాగతం పలుకుతారు. ప్రధానితో కలిసి సత్యసాయి శత జయంతి వేడుకలకు హాజరవుతారు. ఉదయం 10 గంటలకు సాయికుల్వంత్ హాల్లో సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటారు. సత్యసాయి హిల్‌వ్యూ స్టేడియంలో జరిగే ఉత్సవాలకు ప్రధానితో పాటు హాజరవుతారు. అనంతరం ప్రధానికి వీడ్కోలు పలికి, మధ్యాహ్నం 1.15 గంటలకు వైఎస్సార్ కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రికి చంద్రబాబు చేరుకుంటారు. గ్రోమోర్ ఎరువుల కేంద్రాన్ని సందర్శించి, రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడే ప్రజావేదిక నుంచి అన్నదాతా సుఖీభవ-పీఎం కిసాన్ రెండో విడత నిధుల్ని విడుదల చేస్తారు. అనంతరం పార్టీ కేడర్‌తో సమావేశమవుతారు.



విమానాశ్రయంలో సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మంత్రులు అనగాని, సవిత, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

సీఎం చంద్రబాబు ఇంట కార్తిక పూజలు

ఈనాడు, అమరావతి: కార్తిక మాసం సందర్భంగా సోమవారం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దంపతులు హైదరాబాద్‌లోని నివాసంలో ప్రత్యేక పూజలు చేశారు. రుద్రాభిషేకం నిర్వహించారు. పూజలో నారా, నందమూరి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. పూజలకు సంబంధించిన ఫొటోలను మంత్రి లోకేశ్, ఆయన సతీమణి బ్రాహ్మణి మంగళవారం 'ఎక్స్'లో పంచుకున్నారు. 'రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని వేడుకున్నాం. ప్రతి ఒక్కరి జీవితంలో శాంతి, సుఖసంతోషాలు నెలకొనాలని మనస్ఫూర్తిగా కోరుకున్నాం' అని లోకేశ్ పేర్కొన్నారు. పరమశివుడి కరుణాకటాక్షాలు మా కుటుంబంపై సదా ఉండాలని ప్రార్థించినట్లు బ్రాహ్మణి పోస్టు చేశారు.

పరకామణి కేసు.. సాక్షులకు భద్రత కల్పించండి

- సీఐడీ డీజీకి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: తిరుమల శ్రీవారి పరకామణిలో చోరీ కేసు విషయంలో హైకోర్టు మంగళవారం కీలక ఉత్తర్వులిచ్చింది. చోరీ కేసులో ఫిర్యాదుదారుడు, పరకామణిలో సహాయ విజిలెన్స్ భద్రత అధికారి(ఏవీఎస్‌వో)గా పనిచేసిన సీఐ స్థాయి అధికారి వై.సతీష్‌కుమార్ తిరుపతిలో దర్యాప్తు అధికారి ముందు హాజరయ్యేందుకు వెళుతూ అసహజ రీతిలో మరణించడం న్యాయస్థానాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో కేసులో నిందితుడు సీవీ రవికుమార్, సాక్షులకు దర్యాప్తు పూర్తయ్యేవరకు పోలీసు భద్రత కల్పించాలని సీఐడీ డీజీని ఆదేశించింది. మరోవైపు సీఐడీ డీజీ పర్యవేక్షణలో దిగువస్థాయి అధికారులు కేసును దర్యాప్తు చేసేందుకు వెసులుబాటు ఇచ్చింది. నిందితుడు రవికుమార్, ఆయన కుటుంబసభ్యుల ఆస్తుల విషయంలో ఏసీబీ డీజీ ఆధ్వర్యంలో దిగువస్థాయి అధికారులు దర్యాప్తు చేసేందుకు అవకాశం కల్పించింది. దిగువస్థాయి సిబ్బంది దర్యాప్తు చేసేందుకు అనుమతి ఇవ్వాలంటూ సీఐడీ డీజీ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌పై సానుకూలంగా స్పందించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ మంగళవారం ఈ మేరకు కీలక ఉత్తర్వులిచ్చారు. తదుపరి విచారణను డిసెంబరు 2కు వాయిదా వేశారు.

■ పరకామణిలో చోరీ కేసును తితిదే బోర్డు, అధికారుల అనుమతి లేకుండా ఏవీఎస్‌వో సతీష్‌కుమార్.. నిందితుడు రవికుమార్‌తో కలిసి లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడం, దాని వెనుక జరిగిన పరిణామాలపై దర్యాప్తు చేయాలని సీఐడీ డీజీని ఆదేశిస్తూ గత నెల 27న హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. మరోవైపు చోరీకి పాల్పడిన రవికుమార్, ఆయన కుటుంబసభ్యులు కూడబెట్టిన స్థిర, చరాస్తులతో పాటు బ్యాంక్ ఖాతాలపై ఏసీబీ డీజీ ర్యాంక్ పోలీసు అధికారి దర్యాప్తు చేయాలని ఆదేశించింది. రిజిస్ట్రేషన్లు, ఇతర మార్గాల ద్వారా రవికుమార్, ఆయన కుటుంబసభ్యులు విక్రయించిన, ఇతరులకు కేటాయించిన ఆస్తులపై దర్యాప్తు చేయాలని స్పష్టంచేసింది. ఆ ఆస్తులను వారి ఆదాయానికి తగినట్లుగానే ఆర్జించారా? లేదా? అనే కోణంలో దర్యాప్తు చేయాలంది.

■ మంగళవారం ఈ వ్యాజ్యం విచారణకు రాగా అదనపు పీపీ పాణిని సోమయాజి వాదనలు వినిపిస్తూ.. సీఐడీ డీజీ, ఏసీబీ డీజీ స్థాయి అధికారులు కేసు దర్యాప్తు చేయాలని గతంలో జారీ చేసిన ఉత్తర్వులను సవరించాలని కోరుతూ అనుబంధ పిటిషన్ వేశామన్నారు. డీజీల పర్యవేక్షణలో దిగువస్థాయి అధికారులు దర్యాప్తు చేసేందుకు వెసులుబాటు కల్పించాలన్నారు. అందుకు న్యాయమూర్తి సానుకూలంగా స్పందిస్తూ ఉత్తర్వులిచ్చారు.

పరకామణిలో చోరీ కేసులో పోలీసులకు కొత్తగా ఫిర్యాదు

- లోతైన దర్యాప్తునకు తితిదే బోర్డు తీర్మానం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల పరకామణిలో చోరీ కేసులో లోతైన దర్యాప్తు చేయించి నిందితులపై క్రిమినల్ కేసులు పెట్టాలని తితిదే ధర్మకర్తల మండలి తీర్మానించింది. స్థానిక అన్నమయ్య భవనంలో మంగళవారం తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన బోర్డు సభ్యులు సమావేశమై పలు తీర్మానాలు చేశారు. అందులో ప్రధానంగా తిరుమలలోని పరకామణిలో రవికుమార్ 900 డాలర్లను దొంగతనం చేస్తే.. అతని నుంచి రూ.14.5 కోట్ల విలువైన స్థిరాస్తులను తితిదేకు ఎందుకు విరాళంగా ఇప్పించారన్న అంశం హైకోర్టు పరిశీలనలో ఉంది. ఈ కేసులో లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకున్న తితిదే మాజీ ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ ఇటీవల అనుమానాస్పదంగా మృతిచెందారు. ఈ ఘటన కేసు తీవ్రతను మరింత పెంచింది. గతంలో పరకామణిలో చోరీపై ఇచ్చిన ఫిర్యాదు కేవలం ఫిర్యాదుదారు కోణంలోనే నమోదైంది. సరైన విచారణ లేకుండానే అప్పటి తితిదే ధర్మకర్తల మండలి, అధికారులు త్వరగా లోక్ అదాలత్‌లో రాజీ చేయించారు. గతంలో ఈ కేసును త్వరగా మూసివేయడం వెనుక ఉన్న వ్యక్తుల వివరాలతోపాటు అటువంటి దొంగతనాలు పరకామణిలో గతంలో ఎన్ని జరిగాయి? ఎన్నింటిపై ఫిర్యాదులందాయి? ఏం చర్యలు తీసుకున్నారు? తదితర అంశాలపై కొత్తగా విచారణ చేయించాలని నిర్ణయించింది. ప్రస్తుతం జరుగుతున్న హైకోర్టు విచారణకు అదనంగా ఈ దర్యాప్తు జరగాలని భావించింది. ఇందులో భాగంగా పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని తిరుమలలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పాలకమండలి నిర్ణయించింది. తితిదే పవిత్రత, భక్తుల మనోభావాల రక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తితిదే బోర్డు సభ్యులు, అధికారులు తెలిపారు.

క్వాంటమ్ వ్యాలీలో సీఓఈ ఏర్పాటుకు ఎంవోయూ

ఈనాడు, అమరావతి: టెలికాం శాఖలోని పరిశోధన, అభివృద్ధి కేంద్రమైన సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ (సి-డాట్) అమరావతి క్వాంటమ్ వ్యాలీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రైవసీ ఎన్‌హ్యాన్స్‌మెంట్ టెక్నాలజీలతో పాటు క్వాంటమ్ కమ్యూనికేషన్, సెక్యూరిటీ సొల్యూషన్‌ల కోసం సీ-డాట్ పని చేస్తుందని ఓ ప్రకటనలో పేర్కొంది.

అక్రమాస్తుల కేసులో రేపు సీబీఐ కోర్టుకు జగన్

(మొదటి పేజీ తరువాయి)

పర్యటనకు వెళ్లారు. ఆ పర్యటన ముగియగానే ప్రత్యక్షంగా హాజరవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. కానీ, ఆయన కోర్టుకు వెళ్లకుండా, వ్యక్తిగత హాజరు మినహాయింపు కోరారు. సీబీఐ అభ్యంతరం చెప్పడంతో ఇప్పుడు కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అక్రమాస్తుల కేసులో 2013 సెప్టెంబరు నుంచి జగన్ బెయిల్‌పై ఉన్నారు.

శబరిమలకు పోటెత్తిన భక్తులు

(మొదటి పేజీ తరువాయి)

పరిమితం చేస్తాం. త్వరలోనే పరిస్థితులు సాధారణ స్థితికి వస్తాయి'' అని వెల్లడించారు. మరోవైపు.. భక్తుల కోసం దేవస్థానం బోర్డు అధికారులు అరకొర ఏర్పాట్లు చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్యూలైన్లలో గంటల తరబడి నిలబడినా కనీసం నీళ్లు అందించడం లేదనే ఫిర్యాదులూ వస్తున్నాయి. ఇదిలాఉంటే.. లైన్‌లో వేచి ఉన్న భక్తుల నీటి అవసరాలు తీర్చేందుకు 200 మంది అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఆలయ బోర్డు అధ్యక్షుడు జయకుమార్ పేర్కొన్నారు.

ఏరోస్పేస్ గ్రోత్ కారిడార్‌గా శ్రీసత్యసాయి జిల్లా

(మొదటి పేజీ తరువాయి)

కనిపించింది. బెంగళూరు విమానాశ్రయం నుంచి గంటన్నర ప్రయాణ దూరంలో ఉండటం, తక్కువ ధరలో, ఎక్కువ భూములు అందుబాటులో ఉండటం, రాష్ట్రప్రభుత్వం నుంచి అందుతున్న సహకారం, ఇస్తున్న ప్రోత్సాహకాలతో త్వరలో ఈ ప్రాంతంలో బెంగళూరును తలపించేలా ఏరోస్పేస్ కారిడార్ అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

ఈ రంగంలో అభివృద్ధికి ఆకాశమే హద్దు

ఏరోస్పేస్ రంగం అత్యంత వేగంగా విస్తరిస్తోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా డిమాండ్‌కు తగ్గట్టు ఉత్పత్తి లేదు. 'చైనా ప్లస్' పాలసీలో భాగంగా అగ్రశ్రేణి కంపెనీలు ఇతర దేశాలవైపు చూస్తున్నాయి. భారత్‌కు ఇది మంచి అవకాశం. మన దేశం ఇక వినియోగదారుగా మిగిలిపోదు. సాంకేతికంగా చాలా బలంగా ఉన్నాం. ప్రపంచానికి నాణ్యమైన ఉత్పత్తుల్ని అందించగలం. ఇక్కడ వేగం చాలా ముఖ్యం. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏరోస్పేస్ రంగంలో ఒక్కసారిగా ఉత్పత్తి పెంచేయడం సాధ్యం కాదు. ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుమతులు పొందేందుకు రెండేళ్లు పడుతోంది. ప్రతి విడిభాగం తయారీకీ అనుమతులు తీసుకోవాలి. ఈ ఎకోసిస్టమ్‌ను వేగవంతం చేయడంపై ప్రభుత్వాలు దృష్టిపెట్టాలి.

రోజుకో కొత్త భాగం తయారుచేస్తున్నాం

విమానాల ఇంజిన్ల విడిభాగాల తయారీలో మాకు 21 ఏళ్ల అనుభవం ఉంది. బెంగళూరులో మాకు 16 యూనిట్లు ఉన్నాయి. ప్రస్తుతం 800కి పైగా విడి భాగాలను ఎగుమతి చేస్తున్నాం. మా కంపెనీలో రోజూ ఒక కొత్త భాగాన్ని అభివృద్ధి చేస్తున్నాం. విస్తరణకు ఇది సరైన సమయమని భావించి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చాం.

మరిన్ని పరిశ్రమలు వస్తాయి

శ్రీసత్యసాయి జిల్లాలో ఏర్పాటుచేస్తున్న మొదటి ఏరోస్పేస్ పరిశ్రమ మాదే. ఆ రంగంలోని మిగతా పెద్ద కంపెనీలన్నీ క్రమంగా అక్కడికి వచ్చేందుకు అవసరమైన ఎకోసిస్టమ్, మౌలిక వసతులు త్వరలోనే అభివృద్ధి చెందుతాయి. ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం ఏరోస్పేస్ వాల్యూ చైన్ తీసుకువస్తాం. వైమానిక యంత్రాల విడిభాగాల తయారీతో పాటు అసెంబ్లింగ్, సబ్ అసెంబ్లింగ్ చేస్తాం. జేకే మైనీ గ్లోబల్ ఏరోస్పేస్ లిమిటెడ్, జేకే మైనీ ప్రెసిషన్ టెక్నాలజీ లిమిటెడ్ పరిశ్రమలు పక్కపక్కనే ఏర్పాటుచేస్తున్నాం. వివిధ రంగాలకు అవసరమైన హై ప్రెసిషన్ మెషీన్లనూ అక్కడ రూపొందిస్తాం.

2027 చివరినాటికి ఉత్పత్తి ప్రారంభిస్తాం

మేం ఏర్పాటుచేయబోయే ఏరోస్పేస్ పరిశ్రమలో 2027 సంవత్సరం చివరినాటికి ఉత్పత్తి ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఆ లక్ష్యానికి కట్టుబడి ఉన్నాం. ఆటోమోటివ్, ఏరోస్పేస్ పరిశ్రమల్లో ప్రత్యక్షంగా 4వేల మందికి ఉపాధి కల్పిస్తాం. ఏరోస్పేస్ రంగానికి చాలా భారీ ఎకో సిస్టమ్ కావాలి. గేజ్‌మేకర్స్, ఫిక్చర్ మేకర్స్, ప్యాకేజింగ్, టూల్స్, కన్జ్యూమబుల్స్, ఆయిల్స్, మెయింటెనెన్స్ ఇలా చాలా కావాలి. వాటిని మా రిజిస్టర్డ్ వెండర్స్‌కు సబ్‌కాంట్రాక్ట్‌కు ఇస్తాం. మా ఫ్యాక్టరీకి అనుబంధంగా హీట్ ట్రీట్‌మెంట్, క్యాస్టింగ్, ఫోర్జింగ్ వంటి ఎంఎస్ఎంఈ యూనిట్‌ల ఏర్పాటుకు విస్తృత అవకాశాలుంటాయి. పరోక్షంగా వేలమందికి ఉపాధి లభిస్తుంది. మాకు అవసరమైన నిపుణులకు సొంతంగా శిక్షణ ఇస్తున్నాం. దాన్ని ఆంధ్రప్రదేశ్ యూనిట్‌కూ విస్తరిస్తాం.

గ్రహం అనుగ్రహం

19–11–2025 బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; శరదృతువు, కార్తిక మాసం, బహుళపక్షం
చతుర్దశి: ఉ. 8-29 తదుపరి అమావాస్య
స్వాతి: ఉ. 7-50 తదుపరి విశాఖ
వర్జ్యం: మ. 2-03 నుంచి 3-49 వరకు
అమృత ఘడియలు: రా. 12-40 నుంచి 2-26 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-23 నుంచి 12-07 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.6.10; సూర్యాస్తమయం: సా.5.21

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	17.0	27.0
శ్రీకాకుళం	18.0	29.0
కర్నూలు	19.0	32.2
రాజమహేంద్రవరం	19.0	36.0
విజయవాడ	19.8	31.2
విశాఖపట్నం	20.2	30.2
అనంతపురం	20.2	31.0
తిరుపతి	21.0	23.2
నెల్లూరు	22.1	24.9
నరసాపురం	22.2	33.3

బయటకు పంపిస్తే బతకనిస్తారా?

- కుమార్తెను భయంతో రెండేళ్లుగా ఇంట్లోనే ఉంచిన తల్లి
- అధికారుల చొరవతో విముక్తి

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఆ బాలిక ఆడుతూపాడుతూ హాయిగా 9వ తరగతి వరకూ చదివింది. పది.. ఆ తర్వాతి తరగతులు చదివేందుకు ఉత్సాహంగా ఉంది. కుమార్తె ఎదుగుతున్న కొద్దీ బాలిక తల్లికి భయం పట్టుకుంది. బిడ్డను బయటకు పంపిస్తే ఈ సమాజం ఏమైనా చేస్తుందేమోననే ఆందోళనకు గురైంది. నాటి నుంచి ఇంట్లో నుంచి కదలనివ్వలేదు. నువ్వు బయటకు వెళ్తే ఎవరైనా ఏదైనా చేస్తారని కుమార్తెకూ భయం నూరిపోసింది. తండ్రి లేకపోవడం... తల్లికి ఎదురు చెప్పలేకపోవడం... తనూ భయపడటంతో బాలిక రెండేళ్లుగా ఇంట్లోనే మగ్గిపోవాల్సి వచ్చింది. చివరికి అధికారుల చొరవతో బంధ విముక్తురాలైంది. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ఈ ఉదంతం చోటుచేసుకుంది.. పట్టణంలోని చక్రపాణివీధికి చెందిన భాగ్యలక్ష్మికి ఒడిశా కటక్‌వాసి నరసింహరాజుతో 2007లో వివాహమైంది. కాన్పునకు ఇచ్ఛాపురం వచ్చిన భాగ్యలక్ష్మి ఇక్కడే ఉండిపోయింది. భర్త పదేళ్ల కిందట మృతిచెందడంతో కుమార్తె మౌనిక(17)తో కలిసి ఉంటోంది. మౌనిక ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతోంది. రజస్వలయ్యాక మౌనికను తల్లి చదువు మాన్పించింది. ఈ విషయమై ఇరుగుపొరుగువారు ప్రశ్నిస్తే.. భాగ్యలక్ష్మి వారిపై విరుచుకుపడేది. దీంతో వారు పట్టించుకోవడం మానేశారు. తర్వాత కుమార్తెను ఇంట్లో నుంచి బయటకు రానిచ్చేది కాదు. ఇంటికి విద్యుత్తు సరఫరా కాకుండా మెయిన్ స్విచ్‌ను ఆపేసింది. తల్లీకుమార్తె చీకటిలోనే ఉండేవారు. పనిపై బయటకు వెళ్లాల్సి వస్తే మౌనికను లోపలే ఉంచి తల్లి తాళం వేసేది.



మౌనికను ఇంటి నుంచి బయటకు తీసుకొస్తున్న రెవెన్యూ, ఐసీడీఎస్, పోలీసు సిబ్బంది, న్యాయాధికారి పరేష్‌కుమార్ తదితరులు

ఇలా వెలుగులోకి...: ఇంట్లో ఇద్దరు ఉండగా... తల్లి ఒక్కరే బయటకు వెళ్లి వస్తుండటంతో స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తకు అనుమానం వచ్చింది. ఆమె ఐసీడీఎస్ పీవో రాజేశ్వరికి ఫిర్యాదు చేశారు. రాజేశ్వరి ఇచ్ఛాపురం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి పి.పరేష్‌కుమార్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. మండల తహసీల్దారు ఎన్.వెంకటరావు, ఎంఈవో కె.అప్పారావు, పోలీసులతో కలిసి పరేష్‌కుమార్ బాధితురాలి ఇంటికి వెళ్లారు. భాగ్యలక్ష్మికి నచ్చజెప్పి.. మౌనికను బయటకు తీసుకొచ్చారు. ఇద్దరినీ న్యాయస్థానానికి తీసుకెళ్లారు. బాలికకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా చూస్తామని... అన్నివిధాలా ఆదుకుంటామని చెప్పి ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న భాగ్యలక్ష్మిని విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మౌనికను శ్రీకాకుళం బాలల సంరక్షణ కేంద్రానికి తీసుకెళ్లారు.

ఏక్‌నిరంజన్.. పైరసీ కింగ్‌పిన్!

- 'ఐబొమ్మ' రవి కేసు దర్యాప్తులో కీలక అంశాలు



ఈనాడు, హైదరాబాద్: 'ఏమీ లేనివాణ్ని.. ఎవ్వరితోనూ సంబంధాల్లేవు. బంధాలు, బంధుత్వాలకు దూరంగా ఉన్నా. చావుకు భయపడని వాడు దేనికీ భయపడడు' అంటూ మూడు నెలల క్రితం పోలీసులకు సవాల్ విసిరిన 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమంది రవి ఎలియాస్ ప్రహ్లాద్‌కుమార్ ప్రస్తుతం ఒంటరిగానే ఉంటూ కేవలం డబ్బు సంపాదనే లక్ష్యంగా బతుకుతున్నాడు. క్రిమినల్ మైండ్‌తో మాస్టర్‌మైండ్‌గా ఎదిగిన ఇతడి గురించి రిమాండ్ రిపోర్టు, దర్యాప్తులో కీలక అంశాలు పొందుపరిచారు. ఏక్‌నిరంజన్‌గా మారిన ఇమంది రవి పైరసీ కింగ్‌పిన్‌గా ఎదిగిన తీరుపై వివరాలివీ..

ప్రహ్లాద్‌కుమార్ పేరుతో పాన్‌కార్డు..

ఏపీలోని విశాఖపట్నానికి చెందిన బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి చిన్న అప్పారావు కుమారుడు రవి. ప్రేమ వివాహం విఫలం కావడంతో కూకట్‌పల్లిలో ఒంటరిగానే ఉంటున్నాడు. తాను హైదరాబాద్‌లో నెలకొల్పిన ఐటీ కంపెనీతో నెలకు రూ.లక్ష ఆదాయం వచ్చేది. పైరసీ సినిమాలతో నెలకు రూ.11 లక్షలు వస్తుండడంతో ఐటీ కంపెనీ మూసివేశాడు. వన్ఎక్స్ బెట్, వన్ విన్ బెట్టింగ్ యాప్స్ నుంచి భారీగా ప్రకటనలు తెచ్చుకున్నాడు. ఆరేళ్లలో రూ.కోట్లు కూడబెట్టాడు. దేశ, విదేశాల్లో ఆస్తులు కొనుగోలు చేశాడు. ప్రహ్లాద్‌కుమార్ పేరుతో పాన్‌కార్డు సంపాదించాడు. దాని ద్వారానే బ్యాంకు ఖాతాలు, ఆన్‌లైన్‌లో విదేశాల నుంచి క్రిప్టో, బిట్‌కాయిన్ రూపంలో నగదు లావాదేవీలు నిర్వహిస్తూ తానెవరో తెలియకుండా జాగ్రత్త పడ్డాడు. భారత పౌరసత్వం రద్దు చేసుకొని రూ.80 లక్షలు చెల్లించి కరేబియన్ దీవుల్లోని సెయింట్ కిట్స్ అండ్ నేవిస్ పౌరసత్వం తీసుకున్నాడు. తన వ్యాపార భాగస్వాములు కరేబియన్ దీవుల్లో ఉండటంతో అక్కడే పౌరసత్వం తీసుకున్నట్టు పోలీసులకు చెప్పాడు. ఒకే ప్రాంతంలో ఉంటే పట్టుబడే అవకాశం ఉందనే భయంతో రవి తరచూ వేర్వేరు చోట్లకు తిరుగుతుండేవాడు. యూరప్ దేశాలంటే ఇష్టపడే అతడు 2 నెలలకో దేశం చుట్టొచ్చేవాడు. అతడి వద్ద లభించిన పాస్‌పోర్టు ఆధారంగా ఇప్పటి వరకు 10-11 దేశాలకు వెళ్లొచ్చినట్టు గుర్తించారు. ఆయా దేశాల్లోని బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించాడు. ఐబొమ్మపై పోలీసులు కేసు నమోదు చేసినట్టు తెలుసుకొని.. సెప్టెంబరు 3న విదేశాలకు వెళ్లాడు. ఫ్రాన్స్‌లో 2 నెలలు ఉన్నాక.. ఈ నెల 14న ఉదయం కూకట్‌పల్లిలోని సొంతింటికి చేరి పోలీసుల వలకు చిక్కాడు.

బాత్రూమ్‌లో ల్యాప్‌టాప్ దాచి..

డీసీపీ కవిత, ఇన్‌స్పెక్టర్లు నరేశ్, మధుసూదన్‌రావు బృందం నిందితుడి ఇంటి వద్దకెళ్లారు. తలుపులు తెరవమని ఎంతగా పిలిచినా స్పందన కరవైంది. సుమారు 2 గంటలపాటు ఇంటి వద్దే ఎదురు చూసిన పోలీసులు చివరగా గట్టిగా తలుపులపై కొట్టడంతో రవి బయటకు వచ్చాడు. ఇంట్లో ల్యాప్‌టాప్‌లు, హార్డ్‌డిస్కులు మూట గట్టి ఉండటాన్ని పోలీసులు గమనించారు. పారిపోయేందుకు పథకం వేసినట్టు గుర్తించారు. బాత్రూమ్‌లో ల్యాప్‌టాప్, అల్మారాలో సెల్‌ఫోన్ గుర్తించారు. 35 బ్యాంకు ఖాతాల్లో లభించిన ఆధారాలతో రూ.20 కోట్లు సంపాదించినట్టు పోలీసులు అంచనాకు వచ్చారు.



బాలుడు అనురాగ్ సందీప్‌తో డా.సురేశ్ పానుగంటి, డా.సురేశ్, డా.విశ్వేశ్వరన్ బాలసుబ్రమణియన్, డా.ప్రశాంత్‌రెడ్డి, డా.రఘోత్తంరెడ్డి, డా.పంక్తి శేత్, డా.రమ్యారెడ్డి, బాలుడి తండ్రి సతీశ్‌కుమార్, తల్లి సుమలత తదితరులు

12 ఏళ్ల బాలుడికి ఊపిరితిత్తుల మార్పిడి

- లోబార్ పద్ధతిలో విజయవంతంగా శస్త్రచికిత్స
- యశోద ఆసుపత్రి వైద్యుల వెల్లడి

హైదరాబాద్, న్యూస్‌టుడే: పొరపాటున విషపూరితమైన కలుపు మందు తాగిన బాలుడికి అత్యంత అరుదైన లోబార్ పద్ధతిలో విజయవంతంగా ఊపిరితిత్తుల మార్పిడి చేసినట్లు యశోద హాస్పిటల్ వైద్యులు తెలిపారు. వైద్యులు డా.సురేశ్ పానుగంటి, డా.ప్రశాంత్‌రెడ్డి, డా.విశ్వేశ్వరన్ బాలసుబ్రమణియన్, డా.చేతన్‌రావు, డా.పంక్తి శేత్ తదితరులు మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో మీడియాకు వివరాలు వెల్లడించారు. 'పెద్దపల్లి జిల్లా ఓదెల గ్రామానికి చెందిన రైతు సతీశ్‌కుమార్, సుమలత దంపతుల 12 ఏళ్ల కుమారుడు అనురాగ్ సందీప్ ఆరో తరగతి చదువుతున్నాడు. మార్చి 15న ఆడుకుంటున్న క్రమంలో డబ్బాలోని కలుపు మందు అతడి నోటిలోకి చేరి ప్రాణాపాయస్థితికి చేరుకున్నాడు. ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలు సహా పలు అవయవాలు పనిచేయడం మానేశాయి. క్రిటికల్ కేర్ వైద్య బృందం పర్యవేక్షణలో అందించిన చికిత్సతో అతడి కాలేయం, మూత్రపిండాలు క్రమంగా సాధారణ స్థాయికి చేరాయి. రెండు వారాలపాటు ఎక్మో సపోర్టు పొందినా మార్పు లేకపోవడంతో ఊపిరితిత్తుల మార్పిడి చేయాలని నిర్ణయించాం. జీవన్‌దాన్ చొరవతో బ్రెయిన్ డెడ్ అయిన రోగి నుంచి సేకరించిన ఊపిరితిత్తులను... 12 ఏళ్ల బాలుడికి సరిపోయేలా అదనపు భాగాన్ని తొలగించి ట్రాన్స్‌ప్లాంట్ చేశాం. కోలుకోవటంతో తాజాగా డిశ్చార్జ్ చేశాం' అని వైద్యులు వివరించారు. సమావేశంలో డా.రమ్యారెడ్డి, డా.కేఆర్ బాలసుబ్రమణియన్, డా.మంజునాథ్ పాల్గొన్నారు.

బాలికలను బాగా చూసుకుంటామని..

వ్యభిచారం చేయించారు!

దంపతులకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: తల్లి లేని ఇద్దరు బాలికలను మభ్యపెట్టి.. బాగా చూసుకుంటామని నమ్మించి.. వారితో వ్యభిచారం చేయించిన భార్యాభర్తలకు పోక్సో న్యాయస్థానం పదేళ్ల కఠిన కారాగార వాసం, రూ.23 వేల జరిమానా విధించింది. విజయవాడలో 2011లో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండే ఒక మహిళకు ముగ్గురు ఆడపిల్లలు. పెద్ద కుమార్తెకు వివాహమైంది. తల్లి చనిపోవడంతో మిగిలిన ఇద్దరు ఆడ పిల్లలు (17, 16) అమ్మమ్మ వద్ద పెరిగారు. కొన్నాళ్లకు ఆమె కూడా పెంచలేనంటంతో.. అక్కాచెల్లెళ్లు ఆటోనగర్‌లో ఒక ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఈ క్రమంలో అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన షేక్ జమాల్ బీ, కమల్ బాషా దంపతులు వారికి 2016లో పరిచయమయ్యారు. ఇద్దరినీ బాగా చూసుకుంటామని నమ్మించారు. తర్వాత బలవంతంగా వ్యభిచారంలోకి దింపారు. అక్కాచెల్లెళ్లు తప్పించుకునేందుకు ప్రయత్నించగా.. వారిని గదిలో బంధించారు. చిన్న అమ్మాయిని హైదరాబాద్‌కు తీసుకువెళ్లి అక్కడ వ్యభిచారం చేయించారు. ఈ క్రమంలో 2017 అక్టోబరు 14న అక్క తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. భార్యాభర్తలను అరెస్టు చేసి, బాలికలను కాపాడారు. ఈ కేసులో భార్యభర్తలను 2017 అక్టోబరు 15న అరెస్టుచేశారు. తర్వాత నిందితులు బెయిల్‌పై బయటకు వచ్చారు. నిందితుడైన కమల్ బాషా గత ఏడాది మే 15న ఆత్మహత్య చేసుకున్నాడు. నిందితురాలిపై నేరం రుజువు కావడంతో పదేళ్ల కఠిన కారాగారం, రూ.23వేల జరిమానా విధిస్తూ పోక్సో న్యాయస్థానం న్యాయమూర్తి వేల్పుల భవాని మంగళవారం తీర్పు చెప్పారు. బాధిత బాలికలకు ఒక్కొక్కరికి రూ.2.5 లక్షల చొప్పున పరిహారం ఇచ్చేలా చూడాలని డిస్ట్రిక్ట్ లీగల్‌సెల్ అథారిటీని ఆదేశించారు.

డిసెంబరు 30 నుంచి 10 రోజులు వైకుంఠద్వార దర్శనాలు

- తితిదే ధర్మకర్తల మండలి సమావేశంలో తీర్మానం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయంలో డిసెంబరు 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు పదిరోజుల పాటు వైకుంఠద్వార దర్శనాలు కల్పించనున్నట్లు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక అన్నమయ్య భవనంలో తితిదే ధర్మకర్తల మండలి అత్యవసర సమావేశం ఛైర్మన్ అధ్యక్షతన జరిగింది. వైకుంఠద్వార దర్శనం టోకెన్ల జారీ విధానంతో పాటు వివిధ అంశాలపై సభ్యులు చర్చించి తీర్మానాలు చేశారు. అనంతరం ఛైర్మన్ బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడారు. "డిసెంబరు 30, 31, జనవరి ఒకటో తేదీన అంటే వైకుంఠ ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి రోజున ఆన్‌లైన్‌లో ఈ-డిప్ విధానంలో సర్వదర్శనం టోకెన్లు జారీచేస్తాం. ఈ మూడు రోజులు ఆన్‌లైన్ సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు మినహా మిగిలిన అన్ని దర్శనాలు రద్దుచేశాం. ఈ నెల 27 నుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకు భక్తులు వైకుంఠద్వార దర్శనం కోసం ఈ-డిప్ విధానంలో నమోదు చేసుకోవచ్చు. వారికి డిసెంబరు 2న డిప్ ద్వారా టోకెన్లు జారీచేస్తారు. డిప్‌లో టోకెన్ జారీ అయితే వన్ ప్లస్ 3 విధానంలో కుటుంబంలో నలుగురికి దర్శన భాగ్యం లభిస్తుంది. భక్తులు ఇందుకోసం తితిదే వెబ్‌సైట్, యాప్‌తోపాటు ఏపీ వాట్సప్ గవర్నెన్స్ ద్వారా నమోదు చేసుకుంటే పారదర్శకంగా టోకెన్లు జారీచేస్తాం. ఈ మూడు రోజులు దర్శన టోకెన్లు ఉన్నవారికే దర్శనం కల్పిస్తాం. నాలుగోరోజు అంటే జనవరి 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఎలాంటి టోకెన్లు లేని భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తాం" అని తెలిపారు. మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే..



మీడియాతో మాట్లాడుతున్న తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు. చిత్రంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్

- నాలుగో రోజు నుంచి రోజుకు 15 వేల చొప్పున ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300 టికెట్లను, వెయ్యి శ్రీవాణి దర్శనం టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తాం. స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా సిఫారసు లేఖలపై వీఐపీ బ్రేక్ దర్శనాలు, ఇతర ప్రివిలేజ్ దర్శనాలు, శ్రీవారి ఆలయంలో ఆర్జిత సేవలు రద్దుచేశాం.
- స్థానికుల కోసం జనవరి 6, 7, 8 తేదీల్లో రోజుకు ఐదు వేల చొప్పున ఆన్‌లైన్‌లో సర్వదర్శనం టోకెన్లు ఇస్తాం.

జోరుగా పన్నుల రాబడి

- ఏడాదికి అంచనా రూ.1,66,573 కోట్లు
- ఏడు నెలల్లో సగం వచ్చేసింది
- ఏపీ లెక్కలు విడుదల చేసిన కాగ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆశించిన పన్నుల రాబడిలో సగం మేర ఖజానాకు చేరింది. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తం మీద రాష్ట్ర పన్నుల రాబడి రూ.1,66,573.09 కోట్లుగా అంచనా వేశారు. అక్టోబరు నెలాఖరుకు రూ.82,983.17 కోట్లు వచ్చింది. ఏడు నెలల్లో సగం రాబడి సాధించింది. బడ్జెట్ అంచనాలతో పోలిస్తే జీఎస్టీ వసూళ్లలో 52.49%, అమ్మకపు పన్నులో 49.10%, కేంద్ర పన్నుల్లో వాటా 56% సాధించింది. మొత్తం మీద రాష్ట్ర రెవెన్యూ రాబడి రూ.91,638 కోట్లకు చేరింది. ఇది ఏడాది మొత్తం అంచనాల్లో 42.04%.

అప్పులు రూ.67,283.53 కోట్లు: ఈ ఆర్థిక సంవత్సరం మొత్తం మీద రూ.79,926.89 కోట్ల నికర అప్పు తీసుకుంటామని బడ్జెట్ అంచనాల్లో పేర్కొన్నారు. ఏడు నెలల్లో రూ.67,283.53 కోట్ల నికర రుణం కాగ్ లెక్కల్లో చూపించారు. ఇందులో రూ.37,178.69 కోట్ల నికర ప్రజా రుణం, మరో రూ.30,104.83 కోట్ల నికర ప్రజాఖాతా మొత్తాలు వినియోగించుకున్నట్లు వివరించారు. పన్నుల రాబడికి తోడు పన్నేతర రాబడి, కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్లు కలిపి మొత్తం రూ.91,638.98 కోట్ల రెవెన్యూ రాబడి ఈ ఏడు నెలల్లో సాధించారు. అప్పుల తదితర మూలధన వసూళ్లు కూడా కలిపి మీద ఏడు నెలల్లో రూ.1,58,960 కోట్లు ఖజానాకు చేరాయి. మరిన్ని వివరాలు https://epaper.eenadu.net లో

విశాఖ, విజయవాడల్లోనూ మెట్రోపై పరిశీలన: కేంద్ర మంత్రి

ఈనాడు, హైదరాబాద్: 'ఏపీలోని విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో కూడా మెట్రో నిర్మించాలనే డిమాండు ఉంది. పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం'. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మంగళవారం నైరుతి రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పట్టణాభివృద్ధి శాఖ మంత్రులు, అధికారుల ప్రాంతీయ సమావేశం జరిగింది. "పట్టణాల్లో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల మీద ఈ సమావేశంలో చర్చ జరిగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, గోవా, దాద్రానగర్ హవేలీ, డమన్ దీవ్ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వారు ఇందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. సమావేశం అనంతరం ఏపీ పురపాలక శాఖ మంత్రి నారాయణలతో కలిసి కేంద్ర మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "పట్టణాల్లో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల మీద సమావేశంలో చర్చ జరిగింది. ఏపీకి 1,050 ఎలక్ట్రిక్ బస్సులను మంజూరు చేశారు. వచ్చే నెల మొదటి వారంలో ఈ బస్సులు వచ్చే అవకాశాలు ఉన్నాయి' అని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు.

రూ.12,717 కోట్ల ట్రూఅప్ ప్రతిపాదన ఉపసంహరించాలి

- ఏపీఈఆర్‌సీ బహిరంగ విచారణలో ప్రజా సంఘాలు, విద్యుత్‌రంగ నిపుణుల డిమాండ్

ఈనాడు, అమరావతి: కర్నూలు(వెంకటరమణ కాలనీ), న్యూస్‌టుడే: విద్యుత్ వినియోగదారులపై రూ.12,717 కోట్ల ట్రూఅప్ భారాలు వేయాలన్న ప్రతిపాదన తిరస్కరించాలని ప్రజాసంఘాలు, విద్యుత్ నిపుణులు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ)ని కోరారు. నాలుగో నియంత్రిత ఐదేళ్లలో (2019-20 నుంచి 2023-24) వీలింగ్, రిటైల్ విద్యుత్ విక్రయాలకు విద్యుత్ సంస్థలు చేసిన ఖర్చు.. వినియోగదారుల నుంచి వసూలుచేసిన మొత్తానికి మధ్య వ్యత్యాసాన్ని ట్రూఅప్ కింద వసూలుకు అనుమతించాలని డిస్కంలు ఏపీఈఆర్‌సీలో పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై కర్నూలులోని ఏపీఈఆర్‌సీ కార్యాలయంలో కమిషన్ ఇన్‌ఛార్జి ఛైర్మన్ పీవీఆర్ రెడ్డి మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాబూరావు హాజరై, ట్రూఅప్ కింద డిస్కంలు చేసిన ప్రతిపాదన తిరస్కరించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ.. 'వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో రూ.32వేల కోట్లు ట్రూఅప్ భారాలు వేసింది. అదే బాటలో కూటమి ప్రభుత్వం వెళ్తోంది. ట్రూడౌన్ పేరుతో రూ.923 కోట్లు ప్రజలకు ఇచ్చి.. రూ.12,717 కోట్ల భారం వేయడం భావ్యమేనా? ఇప్పటికే రూ.15,485 కోట్ల అదనపు భారాలు ప్రజలు భరిస్తున్నారు' అని పేర్కొన్నారు. ఇంధన సర్దుబాటు ఛార్జీలు (ఎఫ్‌పీపీసీఏ) నిర్దేశించే విధానంలో లోపాలున్నాయని.. ఈ నేపథ్యంలో ఎఫ్‌పీపీసీఏ పూర్తిగా తొలగించాలని విద్యుత్‌రంగ నిపుణులు వేణుగోపాలరావు డిమాండ్‌చేశారు. విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక తరపున ఆంజనేయులు, సిమెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ తరపున గోపీనాథ్, ఫ్యాప్సీ తరపున వైదేహి, ఏపీ ఫెర్రో అల్లాయిస్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ తరపున విజయగోపాల్‌రెడ్డి వర్చువల్‌గా హాజరై ట్రూఅప్ ప్రతిపాదన ఉపసంహరించాలని కోరారు.

బోగస్ జాబ్‌కార్డులు 7.44 లక్షలు!

'ఉపాధి'లో అక్రమాలు ఈ-కేవైసీతో వెలుగులోకి

ఈనాడు, అమరావతి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలతో బోగస్ జాబ్‌కార్డులు వెలుగు చూస్తున్నాయి. ప్రతి శ్రామికుడికీ ఈ-కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్)ని తప్పనిసరి చేయడంతో మంచి ఫలితాలొస్తున్నాయి. ఉపాధి హామీ పథకానికి సంబంధించి కాకినాడ జిల్లాలో ఏడు నెలల్లో 72,872 బోగస్ జాబ్‌కార్డులను తొలగించారు. అన్నమయ్యలో 67,446, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరులో 53,444, ప్రకాశం జిల్లాలో 50,868 కార్డులను రద్దు చేశారు. మొత్తంగా 26 జిల్లాల్లో 7.44 లక్షల బోగస్ కార్డులను రద్దుపద్దులో చేర్చారు. రాష్ట్రవ్యాప్తంగా 1.10 కోట్ల మంది శ్రామికుల్లో ఇప్పటివరకు 87.10 లక్షల మంది ఈ-కేవైసీ చేయించుకున్నారు. మరో 18.52 లక్షల మంది ఆచూకీ లేదు. వీరందరి పేర్లమీద బోగస్ జాబ్ కార్డులు ఉన్నట్లు గుర్తించారు. మూడో కంటికి తెలియకుండా ఇప్పటివరకు వీరు, వీరి తరఫున ఇతరులు... పనులకు హాజరు కాకపోయినా 'ఉపాధి' పొందుతున్నారు. మరో 5 లక్షల మంది ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉంది. వైకాపా ప్రభుత్వంలో బోగస్‌లకు దొంగ మస్టర్లు వేయడం ద్వారా కోట్ల రూపాయలు తినేసినట్లు గుర్తించారు.


- గ్రామాల్లో పేద శ్రామికులకు ఉపాధి కల్పించాలన్నది పథకం ఉద్దేశం. కొందరు స్వార్థపరుల కారణంగా ఇది పక్కదారి పడుతోంది. బోగస్ జాబ్‌కార్డులతో నిధులను తమ జేబుల్లో వేసుకుంటున్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు... ఈ అక్రమాల్లో భాగస్వాములవుతున్నారు.

ఖరీఫ్‌లో 2.36 లక్షల టన్నుల ధాన్యం సేకరణ: మంత్రి నాదెండ్ల

ఈనాడు, అమరావతి: 'ఖరీఫ్ పంట కాలానికి 51 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం. ఇప్పటివరకు 33 వేల మంది రైతుల నుంచి మద్దతు ధరపై 2.36 లక్షల టన్నుల ధాన్యం సేకరించాం. ఇది గతేడాదితో పోలిస్తే 30% అదనం' అని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడలోని పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో ఎండీ ఢిల్లీరావుతో కలిసి మంత్రి విలేకరులతో మంగళవారం మాట్లాడారు. 'ధాన్యం అమ్మిన రైతులకు 24 గంటల్లోనే డబ్బు చెల్లిస్తున్నాం. రూ.560.48 కోట్లు ఖాతాల్లో జమ చేశాం' అని మనోహర్ తెలిపారు.

ఉదయం రైల్లో బెడ్‌రోలర్.. రాత్రి చోరీలు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: రైల్లో ఏసీ బోగీల్లో బెడ్ రోలర్‌గా పనిచేస్తూ రాత్రి సమయాల్లో ప్రయాణికుల సెల్‌ఫోన్లను దొంగిలిస్తున్న వ్యక్తిని విజయవాడ రైల్వే పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. అతడి వద్ద మొత్తం 23 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ రైల్వే డీఎస్పీ రత్నరాజు ఈ వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లా తెనాలి చినరావూరుకు చెందిన షేక్ కరీముల్లా(39) ధర్మవరం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైల్లో బెడ్‌రోలర్‌గా పని చేస్తుంటాడు. ఈ నెల 13న అనంతపురం, మచిలీపట్నం ప్రాంతాలకు చెందిన ఇద్దరు ప్రయాణికులు ధర్మవరం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణిస్తుండగా వారి మొబైల్ ఫోన్లు చోరీకి గురయ్యాయి. ప్రయాణికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసులు నమోదుచేశారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిందితుడితో పాటు అనంతపురం జిల్లాకు చెందిన ఆంథోనిని అరెస్టు చేశారు. వారిని విచారించగా 23 సెల్‌ఫోన్లు చోరీ చేసినట్లు తేలింది.



ఇలా 3 రెట్లు కొవ్వు కరుగుతుంది

నిరాహార స్థితిలో ఉన్నప్పుడు ఏ ద్రవపదార్థాన్నైనా కొద్ది మోతాదులో తాగితే శరీరంలో కొవ్వు మూడురెట్లు ఎక్కువగా కరుగుతుంది. ఎందుకంటే అలాంటి పరిస్థితిలో కొవ్వు నుంచి శరీరం నీటిని సంపాదించుకునేందుకు ప్రయత్నించడమే కారణం. ప్రతి గ్రాము కొవ్వు నుంచి ఓ గ్రాము నీరు లభిస్తుంది. ఫ్యాట్ లాస్‌కు ఇదో సులభమైన పద్ధతి.

– సామ హూలే, ఫిట్‌నెస్ ట్రైనర్

సర్వీసులో ఉన్న సైనికులకు

భూకేటాయింపు చట్టవిరుద్ధం కాదు

- ఆ మాజీ సైనికుడి భూమిని నిషేధిత జాబితాలో ఎలా ఉంచుతారు
- తిరుపతి జిల్లా కలెక్టర్ యాంత్రికంగా ఉత్తర్వులు జారీచేశారు
- నిషేధిత జాబితా నుంచి ఆ భూమిని తొలగించాలని హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: సైనికులుగా సేవలు అందిస్తున్నవారికి 'మాజీ సైనికోద్యోగుల కోటా' కింద భూమిని కేటాయించడం చట్టవిరుద్ధం కాదని హైకోర్టు తేల్చి చెప్పింది. మాజీ సైనికులకే ఆ కోటా కింద భూమిని కేటాయించాలని, సర్వీసులో ఉన్నవారికి భూమి కేటాయించకూడదనే నిబంధన ఏమీ లేదని స్పష్టంచేసింది. ఆ భూములను వెనక్కి తీసుకోవడానికి వీల్లేదని స్పష్టంచేసింది. 'సాయుధ బలగాల్లో సేవలు అందించేవారిని ప్రోత్సహించేందుకు, వారి సేవలకు కృతజ్ఞతగా మాజీ సైనిక ఉద్యోగులకు భూములను ఎసైన్ చేస్తున్నారు. అలాంటి సదుద్దేశాన్ని నిబంధనలను కారణంగా చూపుతూ అధికారులు దెబ్బతీయడానికి వీల్లేదు' అని హైకోర్టు పేర్కొంది.

మరోవైపు పిటిషనర్‌కు కేటాయించిన 4.35 ఎకరాల 'తక అడవి'ని 'అడవి పోరంబోకు'గా పేర్కొంటూ ఆ భూమిని నిషేధిత జాబితా (సెక్షన్ 22ఏ) నుంచి తొలగించడానికి తిరుపతి కలెక్టర్ నిరాకరించడాన్ని తప్పుపట్టింది. మూడు నెలల్లో 22ఏ నుంచి ఆ భూములను తొలగించాలని కలెక్టర్‌ను ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు, జస్టిస్ సుభేందు సామంతతో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ తీర్పు ఇచ్చింది.

- 1983 నుంచి 2013 వరకు సైనికుడిగా చేసిన తిరుపతికి చెందిన వి.చెంచయ్యనాయుడికి తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం పగలి గ్రామ పరిధిలో మాజీ సైనికోద్యోగుల కోటా కింద 2009లో 4.35 ఎకరాలను కేటాయించారు. 2019లో ఆ భూమిని విక్రయించుకోవడానికి యత్నించగా 22ఏలో చేర్చారని తెలిసింది. దీంతో చెంచయ్యనాయుడు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి.. కలెక్టర్ ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే సీసీఎల్ఏ వద్ద అప్పీల్ చేసుకోవాలన్నారు. ఆ ఉత్తర్వులను సవాలుచేస్తూ చెంచయ్యనాయుడు ధర్మాసనం ముందు అప్పీల్ చేశారు.

అది అడవి పోరంబోకు కాదు

పిటిషనర్ తరఫున న్యాయవాది ఎమ్మార్కే చక్రవర్తి వాదనలు వినిపించారు. 'మాజీ సైనికులకు కేటాయించిన భూములను పదేళ్ల తర్వాత విక్రయించుకోవడానికి వీలుంది. పిటిషనర్‌కు కేటాయించిన భూమిని పదేళ్ల తర్వాత విక్రయించడానికి 2019లో ప్రయత్నించగా నిషేధిత జాబితాలో ఉన్నట్లు అధికారులు చెప్పారు. ఆ జాబితా నుంచి తొలగించాలని తిరుపతి జిల్లా కలెక్టర్‌ను కోరగా.. అది 'అడవి పోరంబోకు' భూమి అనే కారణంతో తొలగించడానికి నిరాకరించారు. వాస్తవానికి ఆ భూమి 'తక అడవి'. అటవీ భూమా? లేక పట్టానా అన్న సందిగ్ధత ఉన్నప్పుడు 'తక అడవిగా' పేర్కొంటారు. మరోవైపు పిటిషనర్ సర్వీసులో ఉండగా భూమి కేటాయించారనే కారణం చూపారు. సీసీఎల్ఏ జారీచేసిన సర్క్యులర్ ప్రకారం సర్వీసులో ఉన్న సైనికులు సైతం భూముల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అందువల్ల ఈ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించేలా ఆదేశాలు జారీచేయండి' అని కోరారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. తక అడవి.. అడవి పోరంబోకు మధ్య తేడా చూడకుండా తిరుపతి కలెక్టర్ యాంత్రికంగా ఉత్తర్వులు జారీచేశారని తప్పుపట్టింది. మూడు నెలల్లో ఈ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కలెక్టర్‌ను ఆదేశించింది.

ఈనాడు

దారుణ ప్రమాదం... దిగ్భ్రాంతికరం!

దారుణదంతాల గాయాల నుంచి కోలుకోవడం ఎవరికైనా సరే, అంత సులభం కాదు. అనునిత్యం కలిసి బతికేవారిని, అంతకు కొన్నిరోజుల ముందు వరకు తమతో నవ్వుతూ తుళ్లుతూ మాట్లాడినవారిని అనూహ్య విపత్తు ఏదో క్షణాల్లో కబళించి వేసిందంటే- గుండెలను కోసేసే ఆ వార్తను వినడానికి మించిన నరకమేదీ బాధితులకు ఉండదు. మొన్న సోమవారం ఉదయం కళ్లు తెరుస్తూనే ఇలాంటి భయంకర సమాచారం చెవినపడటంతో హైదరాబాద్‌లో అనేక కుటుంబాలు ఒక్కసారిగా తల్లడిల్లిపోయాయి. ఉమ్రా యాత్రకోసం సౌదీ అరేబియాకు వెళ్లిన భాగ్యనగర వాసుల్లో 45మంది సజీవ దహనం కావడానికి కారణమైన ప్రమాద దృశ్యాలు అందరిలో కంటతడి పెట్టిస్తున్నాయి. మక్కాలో పవిత్ర ప్రదేశాల సందర్శన, ప్రార్థనలు ముగించుకుని మదీనాకు బయలుదేరిన యాత్రికుల బస్సు కాసేపట్లో గమ్యస్థానానికి చేరుకోబోతుండగా ఘోరవిపత్తు సంభవించింది. పసిబిడ్డ నుంచి పండుముదుసలి వరకు పలువురిని పొట్టనపెట్టుకున్న ఈ దుర్ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన పద్దెనిమిది మంది బలైపోవడం- మాటలకందని మహావిషాదం! దేశం కాని దేశంలో విగతజీవులైన వారిని తలచుకుంటూ కుమిలిపోతున్న ఆ శోకతప్త కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా అండగా ఉండాలి!

రహదారి ప్రమాదాల్లో మరణాలను తగ్గించడంలో గత కొన్నేళ్లుగా సౌదీ అరేబియా గణనీయమైన ప్రగతిని కనబరుస్తోంది. 2016లో అక్కడ ప్రతి లక్ష జనాభాకు 29 మంది రోడ్డు దుర్ఘటనల్లో ప్రాణాలు కోల్పోతే- ఆ పై అయిదేళ్లలో అలాంటి అభాగ్యుల సంఖ్య 18కు దిగివచ్చింది. బహుముఖ వ్యూహంతో ఇంతటి సత్ఫలితాలను నమోదు చేసినప్పటికీ మిగిలిన సంపన్న దేశాలు అనేకంతో పోలిస్తే- సౌదీ రహదారులే మీదుమిక్కిలి నెత్తుటిమయం అవుతున్నాయని ఐరాస రెండేళ్ల క్రితం ఆందోళన వ్యక్తంచేసింది. ముఖ్యంగా తీర్థ యాత్రికుల రాకపోకలు చాలా ఎక్కువగా ఉండే మక్కా-మదీనా మార్గంలో గతంలో ప్రమాదాలెన్నో జరిగాయి. ఆ బాట వెంబడి వేగంగా పరుగులుదీసే ఇంధన ట్యాంకర్లూ భారీ పారిశ్రామిక రవాణా వాహనాలు యాత్రికుల బస్సులు ఢీకొని విషాదాలెన్నో సంభవించాయి. ఎడారి ప్రాంతం గుండా వెళ్లే ఆ హైవే వెడల్పుగా నిట్టనిలువుగా చాలా దూరం ఎలాంటి మలుపుల్లేకుండా ఉంటుంది. అది చోదకులను ఒకరకమైన నిస్సత్తువకు గురిచేస్తుంది. దానికితోడు యాత్రికుల బస్సుల్లో పాతవి ఎక్కువగా ఉండటం, వాటి కాంట్రాక్ట్ డ్రైవర్లు విశ్రాంతి లేకుండా డ్యూటీలు చేయడం తరహా కారణాలు దుర్ఘటనలకు కారణమవుతున్నాయి. హజ్, ఉమ్రా యాత్రికులకు సేవచేయడం, వారిని సురక్షితంగా స్వదేశాలకు తిరిగి పంపడం తాము అత్యంత గౌరవనీయమైనవిగా భావించే విధులని సౌదీ ఉద్ఘాటిస్తోంది. ఆ మాటను నిలబెట్టుకోవాలంటే- రహదారి భద్రతపై ఆ దేశం మరింతగా దృష్టిసారించాలి!

మక్కా, మదీనాల్లోని పవిత్ర స్థలాల సందర్శనకు 2004లో పలు దేశాల నుంచి 21.6 లక్షల మంది వెళ్లారు- 2024లో అలాంటి వారి సంఖ్య 1.85 కోట్లకు పెరిగింది. వారిలో 1.69 కోట్ల మంది ఉమ్రా యాత్రికులే. ఈ ఏడాది మొదటి మూడు నెలల్లోనే ఆ యాత్రకోసం 65 లక్షల మంది విదేశీయులు సౌదీకి వచ్చారు. 2030 నాటికి సంవత్సరానికి మూడు కోట్ల మంది హజ్, ఉమ్రా యాత్రికులకు ఆతిథ్యం ఇవ్వాలన్నది సౌదీ లక్ష్యం. దానికి తగినట్లుగా స్థానికంగా మౌలిక వసతులను విస్తరించడం కీలకం. ఏటా మన దేశం నుంచీ లక్షల మంది సౌదీకి పయనమవుతున్నారు. అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై భారతీయ యాత్రికులకు అవగాహన కల్పించడం, వారి బాగోగులను కనిపెట్టుకుని ఉండటం దేశీయ ప్రభుత్వాల బాధ్యత కూడా!

ఒక అడుగు ముందుకు వేయాలంటే అక్కడ ఉన్నదాన్ని జరిపి చోటుచేసుకోక తప్పదు. మార్పు లేకుండా ప్రగతి సాధ్యం కాదు. ఇవాళ మనం దేశానికి ఏమిస్తామో రేపు అదే తిరిగి మనకొస్తుందని యువత గుర్తుంచుకోవాలి.

– ఇందిరాగాంధీ



దౌత్య బంధానికి పరీక్ష!

భారత్, బంగ్లాదేశ్ సంబంధాల్లో మరోసారి ఉత్కంఠ నెలకొంది. బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా(78)కు ఆ దేశంలోని అంతర్జాతీయ నేర విచారణ ట్రైబ్యునల్ (ఐసీటీ) మరణశిక్ష విధించింది. ఇది ఉపఖండంలో దౌత్యపరమైన చిక్కు పరిస్థితులను సృష్టించింది. హసీనా ప్రస్తుతం ఇండియాలో రాజకీయ ఆశ్రయం పొందుతుండటంతో ఇరుదేశాల సంబంధాల తీరుతెన్నులూ మారవచ్చు.

హసీనాకు మరణ శిక్ష విధించడం బంగ్లాలో రాజకీయ ప్రకంపనలను సృష్టించింది. ఈ పరిణామం భారత్-బంగ్లా సంబంధాలపై ప్రతికూల ప్రభావాన్ని కనబరచనుంది. ఐసీటీ హసీనాతోపాటు మాజీ హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమాల్‌కూ మరణ శిక్ష విధించింది. గత జులైలో బంగ్లాలో విద్యార్థి ఉద్యమం సందర్భంగా వీరిద్దరూ దారుణ నేరాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై ఐసీటీ ఈ మరణ దండనలు ఖరారు చేసింది. బంగ్లా మాజీ పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్ చౌదరి అబ్దుల్లా అల్ మామున్‌కు అయిదేళ్ల జైలు శిక్ష విధించింది. మామున్ తన నేరాలను ఒప్పుకొని హసీనా, కమాల్‌లకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పడంతో ఐసీటీ ఆయనను తేలికపాటి శిక్షతో సరిపెట్టింది. రెండు నేరాభియోగాలపై హసీనాకు మరణ శిక్ష విధించింది. నిరుడు ఆగస్టు 5న ఢాకాలోని చంఖర్‌పుల్ ప్రాంతంలో ఆరుగురు నిరాయుధ నిరసన ప్రదర్శకులపై కాల్పులు జరిపి హతమార్చారనేది ఒక అభియోగం. అదే రోజు అషులియా ప్రాంతంలోనూ ఆరుగురు విద్యార్థి ప్రదర్శకులను హతమార్చారనేది మరో నేరారోపణ. ఇందులో ఐదుగురిని కాల్చిచంపిన తరవాత దహనం చేశారని, మరొకరిని సజీవ దహనం చేశారని ప్రాసిక్యూషన్ ఆరోపించింది.





తనకు ఐసీటీ మరణ శిక్ష విధించడం రాజకీయ దురుద్దేశంతో, పక్షపాత బుద్ధితో చేసిన పనేనని హసీనా విమర్శించారు. సరైన వేదికపై సరైన సాక్ష్యాలతో ముందుకొస్తే తాను విచారణకు సిద్ధమని ఆమె ఉద్ఘాటించారు. మాజీ హోంమంత్రి కమాల్‌కు ట్రైబ్యునల్ ఒకేసారి రెండు మరణ శిక్షలు విధించింది. ఆయనపై మొత్తం అయిదు నేరాభియోగాలు మోపారు. హత్యలను నివారించకుండా నేరాలకు ఒడిగట్టారంటూ ప్రాసిక్యూషన్ నేరారోపణలు చేసింది.

ఉద్రిక్తతల నడుమ 'ఆహ్వానం'!

హసీనా 2024 ఆగస్టులో పదవీచ్యుతురాలైనప్పటి నుంచి బంగ్లాదేశ్ రాజకీయ అనిశ్చితిలోకి జారిపోయింది. హసీనా నిరంకుశ పాలన సాగిస్తున్నారంటూ విద్యార్థులు ఉద్యమించారు. దానిలో రకరకాల వర్గాలు పాలుపంచుకోవడంతో ఉద్యమం హింసాత్మక మలుపు తిరిగి పలువురు మరణించారు. ఉద్యమ ఉద్ధృతి పెరిగి హసీనా ఒకటిన్నర దశాబ్దం పాలనకు తెరపడింది. ఫలితంగా నెలకొన్న రాజకీయ శూన్యత దేశంలో విభేదాలను ఎగదోసింది. హసీనా పదవీచ్యుతురాలైన తరవాత మహమ్మద్ యూనస్ తాత్కాలిక సారథిగా మధ్యంతర ప్రభుత్వం ఏర్పడింది. హసీనాకు భారత్ ఆశ్రయం కల్పించడంతో రెండు ప్రభుత్వాల మధ్య సంబంధాల్లో ఉద్రిక్తత నెలకొంది. హసీనా పదవీచ్యుతి తరవాత బంగ్లాదేశ్‌లో మత ఛాందస శక్తులు, ఉగ్రవాదుల హడావుడి పెరిగింది. హిందువులు, ఇతర మైనారిటీ వర్గాలపై దాడులు పెరిగాయి. ఈ అవాంఛనీయ ఘటనలపై భారత్ నిరసన, ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉంది. మరణశిక్ష పడినందువల్ల హసీనాను తమకు అప్పగించాలని భారత్‌ను కోరతామని యూనస్ ప్రభుత్వం ప్రకటించింది. భారత సర్కారుకు లేఖ రాస్తామని బంగ్లా న్యాయశాఖ సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ వెల్లడించారు. హసీనాకు ఆశ్రయం కల్పించడాన్ని బంగ్లాదేశ్, బంగ్లా ప్రజల పట్ల శత్రు వైఖరిగా పరిగణిస్తామన్నారు. హసీనాపై ఐసీటీ తీర్పును గమనించామని భారత ప్రభుత్వం తెలిపింది. 'బంగ్లాకు పొరుగు రాజ్యంగా భారత్ ఆ దేశ ప్రజల శ్రేయస్సుకు కట్టుబడి ఉంది. బంగ్లాదేశ్‌లో శాంతి సుస్థిరతలు, ప్రజాస్వామ్యం వర్ధిల్లాలని కోరుకుంటోంది' అని మన విదేశాంగ శాఖ ప్రకటించింది.

ఇలాంటి పరిస్థితుల్లో, దిల్లీలో జరుగుతున్న కొలంబో భద్రతా సదస్సు (సీఎస్‌సీ)కు రావాలంటూ బంగ్లా జాతీయ భద్రతా సలహాదారు ఖలీలుర్ రహమాన్‌ను భారత జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్ ఆహ్వానించడం పలు ఊహాగానాలకు దారితీస్తోంది. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగి, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తరవాతే ఆ దేశంతో మాటామంతీ జరుపుతామని భారత్ స్పష్టం చేస్తూ వస్తోంది. అందుకే హసీనా పదవీచ్యుతి తరవాత యూనస్ తాత్కాలిక ప్రభుత్వ ప్రతినిధులను, అధికారులను ఆహ్వానించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో తాజాగా రహమాన్‌కు ఆహ్వానం పంపడంపై సందేహాలు తలెత్తుతున్నాయి. సీఎస్‌సీ అనేది హిందూ మహాసముద్ర తీర దేశాలతో ఏర్పడిన భద్రతా సంఘం. మొదట్లో పరిశీలక హోదాలో ఉన్న బంగ్లాదేశ్ నిరుడు జులైలోనే ఇందులో చేరింది. సీఎస్‌సీ సభకు ఖలీలుర్‌ను ఆహ్వానించడం ద్వారా యూనస్ ప్రభుత్వంతో సన్నిహిత సంబంధాలను ఏర్పరచుకోవాలని ఇండియా భావిస్తుందేమోననే సందేహం తలెత్తినట్లు 'ఢాకా ట్రిబ్యూన్' పత్రిక వ్యాఖ్యానించింది. అయితే హసీనాపై తీర్పునకూ, ఖలీలుర్‌కు పంపిన ఆహ్వానానికీ సంబంధం లేదని భారత ప్రభుత్వ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. ప్రస్తుతం సీఎస్‌సీకి భారత్ నేతృత్వం వహిస్తుండటం వల్ల సభ్య దేశాలను ఆహ్వానించడం లాంఛనమేనని వివరించారు. ఇతర సభ్య దేశాల జాతీయ భద్రతా సలహాదారులను ఆహ్వానించినట్లే ఖలీలుర్‌నూ పిలిచినట్లు తెలుస్తోంది.

ఒప్పందం ఉన్నప్పటికీ...

ఏదిఏమైనా, హసీనాకు మరణ శిక్ష విధించడం, ఆమెను అప్పగించాలంటూ బంగ్లా కోరడం రెండు దేశాల సంబంధాలను ప్రభావితం చేయకమానదు. నేరస్థుల అప్పగింతకు భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య ఒప్పందం ఉన్నా- పదవీచ్యుతురాలైనప్పుడు హసీనా బంగ్లా ప్రధానమంత్రి పదవి నిర్వహిస్తున్నారన్న సంగతి మరవద్దు. ఆమె స్థానంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన వ్యక్తినే బంగ్లా ప్రభుత్వాధినేతగా భారత్ గుర్తిస్తుంది. ఈలోగా బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం హసీనా అప్పగింత కోసం ఇంటర్‌పోల్ వంటి అంతర్జాతీయ సంస్థలను ఆశ్రయించవచ్చు. భారత్‌పై దాడులు చేసిన ఉగ్రవాదుల అప్పగింతకు దిల్లీ చాలాకాలంగా విజ్ఞప్తి చేస్తున్నా అంతర్జాతీయ సంస్థలు ఏమీ చేయలేకపోతున్నాయి. హసీనా అప్పగింత వ్యవహారం ఇంతకన్నా భిన్నంగా ఉండకపోవచ్చు. బంగ్లా పార్లమెంటు ఎన్నికలు అనుకున్న ప్రకారం వచ్చే ఏడాది జరిగి ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడే వరకు భారత్ వేచిచూసే అవకాశం ఉంది.

– అరుణీం భుయాన్

అనగనగా ఓ పేదింటి కుర్రాడు. తోడుగా ఒంటరి తల్లి. చదువుకోవడం, చిరు వ్యాపారంలో అమ్మకి సాయం చేయడం... ఇదే అతని దినచర్య. వచ్చిన ఆ కొద్ది మొత్తాన్నీ ఇద్దరూ కలిసి లెక్కలేసుకుని మురిసిపోయేవారు. రోజువారీ ఖర్చులకు కొంత, చదువుకి, ఆసుపత్రికీ అంటూ మరికొంత విడివిడిగా దాచుకునేవారు. కాలం గడిచేకొద్దీ కుర్రాడు పెద్దవాడయ్యాడు. అమ్మకి వయసు మళ్లింది. హుషారుగా పని చేయలేకపోయేది. ఏళ్ల తరబడి నిర్విరామ శ్రమకు శరీరమూ హూనమై ఆసుపత్రి పాలైంది. 'అమ్మ ఇక కష్టపడలేదు' అని అర్థమైందా కొడుక్కి. ఇన్నేళ్లు కష్టపడ్డ అమ్మను బాగా చూసుకోవాల్సిన బాధ్యత తనదే అనుకుని ఉద్యోగ వేటలో పడ్డాడు. పెద్ద ఇల్లు, కారు, ఇంటి చుట్టూ తోట... అన్నీ సమకూర్చి, అమ్మని ఆనందంగా ఉంచడమే లక్ష్యం అనుకున్నాడు.

మొదలు మర్చిపోవద్దు



కోరుకున్నట్టుగానే ఉద్యోగం వచ్చింది. మంచి జీతం రావడంతో చకచకా అన్ని సౌకర్యాలూ అమర్చాడు. మంచి పనిమంతుడిగా పేరు రావడంతో ఆఫీసులో బాధ్యతలు పెరిగాయి. ఎంత బిజీ అయిపోయాడంటే... అమ్మతో కాసేపు కూర్చుని నాలుగు మాటలు కూడా మాట్లాడలేనంత. ఒకదాని తరవాత ఒకటిగా లక్ష్యాలు ఉండేవి. వాటిని నెరవేర్చడానికి పరుగు పెడుతూ ఉండేవాడు. కెరీర్ అన్నాక తప్పదు కదా అనుకునేవాడు. తీరా వెనక్కి తిరిగి చూసుకునే రోజు వచ్చేసరికి అతణ్ని ఒంటరిగా వదిలి అమ్మ వెళ్లిపోయింది. ఆమె మంచం పక్కన కూర్చుంటే గతమంతా రీల్‌లా అతడి కళ్లముందు తిరిగింది. కోరుకున్నట్టుగానే బాగా సంపాదించాడు, అమ్మకి కావాల్సినవన్నీ అమర్చాడు. కానీ వాటిలో ఒకటి మాత్రం వదిలేశాడు. కష్టాలను కలిసి పంచుకున్నట్లే సుఖాలనూ అమ్మతో పంచుకోవాలని తన ప్రణాళికలో రాసుకున్నది ఆచరణలో పెట్టడం మర్చిపోయాడు. అమ్మతో కలిసి ఆ ఆనందాన్ని పొందలేకపోయానన్న దిగులు అతణ్ని కమ్మేసింది. సోషల్‌మీడియాలో బాగా షేర్ అవుతున్న ఓ కార్టూన్ రీల్ సారాంశమిది.

దాదాపుగా అందరి జీవితాలూ మొదలయ్యేది ఇలాగేనేమో! ఉద్యోగం వచ్చాక ఎన్నో చేయాలనుకుంటాం. కానీ ఒకసారి కెరీర్ పరుగు మొదలైతే అంచెలంచెలుగా టార్గెట్లు, సాధించాల్సిన విజయాలే కనిపిస్తాయి. ఈ క్రమంలో మన ఇష్టాలు, అభిరుచులు, సరదాలు ఎటు పోయాయో కూడా తెలియదు. కాబట్టే, చాలాసార్లు 'గర్వం తలకెక్కింది' అని అయినవారితోనే అనిపించుకుంటాం.


ఉద్యోగం అన్నాక అంకితభావంతో పనిచేయాలి. ఆ పని సంతృప్తినివ్వాలి. ఒక విజయం సాధించగానే దాంతో పనైపోయినట్లు నెక్స్ట్ లెవెల్‌కి వెళ్లిపోతున్నామే కానీ సాధించిన విజయాన్ని ఆనందంగా మార్చుకోవడం మర్చిపోతున్నాం. గెలుపును మనసారా ఆస్వాదించినప్పుడు కదా ఆ విజయానికి సార్థకత. అందుకే లక్ష్యాలను రాసి పెట్టుకున్నట్లే ఈసారి దాన్ని ఆస్వాదించాలనుకునే తీరునీ రాసి పెట్టుకుందాం. ఇవన్నీ మనం మొదలుపెట్టిన స్థానాన్నే కాదు, అప్పటి మన మనస్థితి, నిజమైన ఆనందాలు, వాటికివ్వాల్సిన ప్రాధాన్యం లాంటి వాటన్నిటినీ గుర్తుచేస్తుంటాయి. అప్పుడే మనల్ని మనం కోల్పోకుండా ఉంటాం మరి!

– అనూష నీరుకొండ

మానవాళికి మార్గదర్శి

'భిక్షువులారా! దయార్ద్ర హృదయులై చరించి తరించండి. మంచిని తెలియచేసే ఈ ధర్మాన్ని ప్రజలందరి హితం కోసం, సుఖం కోసం ప్రేమతో ప్రచారం చేయండి. మీలో ఏ ఇద్దరూ ఒకే దిశలో వెళ్లరాదు. ఊరూరా ఈ పరమధర్మాన్ని తెలియచేయండి. అలా చేసేటప్పుడు గ్రామస్థులకు మీరు భారం కాకండి. పువ్వుల రంగూ, వాసన చెడిపోకుండా వాటిలోని మకరందాన్ని తాగి అవి ఫలించేలా చేసే తుమ్మెదల్లాగ ఉండాలి మీరు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ కలిగించకుండా భిక్ష మాత్రం స్వీకరించి వారికి మంచిని తెలియజెప్పాలి' అని బోధించిన బౌద్ధ ధర్మ మూలపురుషుడు సిద్ధార్థుడు.

సిద్ధార్థుడు పుట్టినప్పుడు అతడి జాతకాన్ని అసితరుషి పరీక్షించాడు. పిల్లాడు అయితే మహా చక్రవర్తి అవుతాడు, లేదా సకల ప్రాణులకు ఆనందాన్ని పంచిపెడుతూ అందరి సుఖాలకు కారణభూతుడయ్యే ధర్మమూర్తిగా మారతాడని చెప్పాడు. ఆయన చెప్పినట్టే సిద్ధార్థుడు ధర్మమూర్తిగా కీర్తినందుకొన్నాడు. తనకు చిన్నతనం నుంచీ జీవహింస సరిపడేది కాదు. అయినా సంప్రదాయం ప్రకారం ధనుర్విద్య నేర్చాడు. వివాహమైంది. కొడుకు పుట్టాడు. ఒక రోజు పురవీధుల్లో సంచరిస్తున్న సిద్ధార్థుడికి ఓ వృద్ధుడు, ఒక రోగి, ఓ శవయాత్ర కంటపడగా చూసి విచలితుడయ్యాడు. ఆ వెంటనే ప్రశాంత వదనంతో సంచరిస్తున్న ఓ సన్యాసి కూడా కనిపించాడు. ఈ దృశ్యాలే సిద్ధార్థుడికి దిశానిర్దేశం చేశాయి. భార్యాబిడ్డల్ని వదిలేసి సన్యాసి జీవితంలోకి పయనమయ్యాడు. ఆలార కాలామా అనే గురువు దగ్గర ధ్యానసాధనను ఒంటబట్టించుకున్నాడు. గయకు సమీపంలో ఓ బోధి వృక్షం కింద ధ్యాన నిమగ్నుడయ్యాడు. సుదీర్ఘ ధ్యానానంతరం జ్ఞానోదయం పొందాడు. సిద్ధార్థుడు బుద్ధుడయ్యాడు. అసూయాద్వేషాలను విడనాడి ధర్మమార్గంలో జీవనం సాగించమని ప్రజలకు హితవు చెప్పాడు.



అంతర్యామి

కాలగమనంలో బుద్ధుడు పరమోన్నత బోధకుడై అష్టాంగ మార్గాన్ని తెలియచేశాడు. వాటిని అనుసరిస్తే నిర్వాణం సిద్ధిస్తుందని బోధించాడు. క్రమంగా నేపాల్, చైనా, జపాన్, శ్రీలంక వంటి పలు దేశాలకు బౌద్ధం విస్తరించింది. అశోకుడు, కనిష్కుడు, హర్షుడు మొదలైన చక్రవర్తులు బుద్ధుడి బాటలో నడిచారు. అశ్వఘోషుడు, నాగార్జునుడు, వసుబంధుడు తదితర మేధావులు బౌద్ధాన్ని అనుసరిస్తూ అనేక ఆరామాలు ఏర్పాటు చేశారు.

కృష్ణానదీ తీరాన ఆచార్య నాగార్జునుడు విశ్వవిద్యాలయం ఏర్పాటుచేశాడు. తక్షశిల, నలందాల్లోనూ ప్రపంచ ప్రసిద్ధి చెందిన విశ్వవిద్యాలయాలు వెలిశాయి. అమరావతి, నాగార్జునకొండ, ఉండవల్లి తదితర ప్రాంతాల్లో బౌద్ధారామాల శిథిలాలు నేటికీ దర్శనమిస్తాయి. తెలుగునేలకు బౌద్ధంతో ఉన్న అనుబంధానికి ప్రతీకగా హైదరాబాద్‌లో బుద్ధుడి ఏకశిలా విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. పక్కనే ఉన్న పార్కుకు లుంబినీవనం అన్న పేరు పెట్టారు. ప్రాచీన బౌద్ధక్షేత్రంగా ఏపీ రాజధాని ప్రాంతం అమరావతి ఖ్యాతి జగద్విఖ్యాతం. ఆధ్యాత్మిక మార్గదర్శిగా, తత్వవేత్తగా, సామాజిక సంస్కర్తగా కొన్ని శతాబ్దాలుగా మానవాళి ఆలోచనలను సానుకూలంగా ప్రభావితం చేస్తున్న మహనీయుడు గౌతమబుద్ధుడు. ఆయన ప్రబోధాలను గుర్తుచేసే చారిత్రక ప్రదేశాలను రక్షించుకోవడం అందరి విధి.

– యం.సి.శివశంకరశాస్త్రి

చేజేతులా ప్రాణాలు తీసుకుని...


మన దేశంలో 2023లో 1.71 లక్షల మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. వారిలో 18-30 ఏళ్లలోపువారే ఎక్కువ. 18 ఏళ్ల లోపు వారిలో అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువగా బలవన్మరణాలకు పాల్పడ్డారు. రకరకాల కారణాలతో యువత చేజేతులా ప్రాణాలు తీసుకుంటుండటం ఆందోళన కలిగిస్తోంది. 2023లో వయసుల వారీగా ఆత్మహత్యలకు ఒడిగట్టిన పురుషులు, స్త్రీల సంఖ్య...

వయసు	పురుషులు	మహిళలు
60 ఏళ్లకు పైన	12,107	3,680
45, అంతకు పైన 60 లోపు	26,591	6,352
30, అంతకు పైన 45 లోపు	43,059	12,665
18, దానికి పైన 30 లోపు	38,012	18,128
పద్దెనిమిదేళ్ల లోపు	4,961	5,823

(ఆధారం: ఎన్‌సీఆర్‌బీ నివేదిక)

ఆకలి కోరల్లోకి...

సాయుధ ఘర్షణలు, కల్లోల పరిస్థితులు, వాతావరణ మార్పుల వల్ల చాలా దేశాల్లో ఆహార అభద్రత పెరుగుతోంది. 2023తో పోలిస్తే 2024లో అది మరింత అధికమైంది. నిరుడు ఆయా దేశాల్లో అదనంగా ఎంతమంది తీవ్రమైన ఆహార అభద్రతలోకి జారిపోయారంటే (లక్షల్లో)...



(ఆధారం: ఫుడ్ సెక్యూరిటీ ఇన్ఫర్మేషన్ నెట్‌వర్క్ గణాంకాలు-2025)

ఆ పురాతన మొక్కల్లో ఏముంది?

ప్రపంచవ్యాప్తంగా మానవాళి ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యల్లో ఆహార భద్రత అత్యంత ముఖ్యమైంది. కరవు కాటకాలు, వాతావరణ మార్పులు ముఖ్యంగా లానినో, ఎల్‌నినో ప్రభావాలు, భూతాపం వంటి సమస్యలతో పాటు ఇతరత్రా స్థానిక కారణాలు తోడవుతుండటంతో పంటల దిగుబడి తగ్గిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో అధిక దిగుబడులు సాధించే దిశగా తాజా పరిశోధనలు సరికొత్త ఆశలను రేకెత్తిస్తున్నాయి.



వృక్ష శాస్త్ర పరంగా 'మార్కాంషియా పాలిమార్ఫా'గా పిలిచే ఒక రకం జాతి మొక్కలపై శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. ఇవి సుమారు 50 కోట్ల సంవత్సరాల నుంచి భూమి మీద నివసిస్తున్న ఆదిమ లక్షణాలు కలిగిన పురాతన నేల మొక్కలు. వృక్ష వర్గీకరణ శాస్త్రపరంగా 'బ్రయో ఫైటా' విభాగానికి చెందిన ఈ తొలితరం మొక్కలకు నీటిలోనూ, నేలపైనా పెరిగే సామర్థ్యం ఉంది. అందుకని, ఉభయచర మొక్కలుగా ప్రసిద్ధి పొందాయి. చూడటానికి వీటి ఆకులు కాలేయాన్ని పోలి ఉండటంతో 'లివర్ వర్ట్'లనీ పిలుస్తారు. ఈ మొక్కలపై లోతుగా పరిశోధనలు చేసినప్పుడు కణ జీవ పరంగా ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. ప్రఖ్యాత వైజ్ఞానిక పత్రిక 'నేచర్ కెమికల్ బయాలజీ'లో ఆ పరిశోధన ఫలితాలు ప్రచురితమయ్యాయి.

కీలకం... డెల్లా ప్రోటీన్!

కొన్ని కోట్ల సంవత్సరాల నుంచి భూమిపై ఉండే వాతావరణానికి తగినట్లుగా జీవించడానికి మొదటితరం నేల మొక్కలకు కావాల్సిన అనుకూలతలను వాటిలోని 'డెల్లా' ప్రోటీన్ కల్పిస్తుంది. సాధారణంగా ఈ ప్రోటీన్ కణ విభజన రేటును తగ్గించడం ద్వారా మొక్కల పెరుగుదలను నిరోధిస్తుంది. ప్రతికూల పరిస్థితుల్లో మొక్కల్లో మరుగుజ్జతనాన్ని ప్రేరేపించి క్రమంగా దిగుబడి పెరగడానికి కారణమవుతుంది. ఈ కోణంలో శాస్త్రవేత్తలు పరిశోధనలు జరిపారు. అయితే ఉభయచర మొక్కల్లో పరిశీలించినప్పుడు డెల్లా ప్రోటీన్ లేకపోవడం వారిని ఆశ్చర్యానికి గురిచేసింది. దీనికి కారణం పెరుగుదల నిరోధక డెల్లా గ్రాహకాలైన జీఐడీ1 లేకపోవడమేనని పరిశోధకులు గుర్తించారు. పుష్పించే మొక్కల్లో డెల్లా ప్రోటీన్ ఒక ప్రత్యేక యంత్రాంగం ద్వారా తొలగింపునకు గురవుతుంది. పెరుగుదలను ప్రోత్సహించే జిబ్బరెల్లికామ్లం మోతాదు ఎక్కువైనప్పుడు డెల్లా ప్రోటీన్ విడుదలై పెరుగుదలను నిరోధిస్తుంది. అప్పుడు తిరిగి ఒక ప్రత్యేక యంత్రాంగం ద్వారా డెల్లా ప్రోటీన్ తొలగింపునకు గురై, మొక్కలో మళ్లీ పెరుగుదల ప్రారంభమవుతుంది. ఈ యంత్రాంగంలో భాగంగా జిబ్బరెల్లికామ్లం, జీఐడీ1, డెల్లా ప్రోటీన్ ఒక త్రయంగా ఏర్పడతాయి. జిబ్బరెల్లికామ్లం పెరుగుదలను ప్రేరేపించగా, డెల్లా ప్రోటీన్ పెరుగుదలను నిరోధిస్తుంది. అయితే, ఆ ప్రోటీన్ గ్రాహకాలు లేని ఉభయచర మొక్కల్లో డెల్లా ఎలా నిర్వీర్యం అవుతుందనే గుట్టు శాస్త్రవేత్తల పరిశోధనలతో వెలుగులోకి వచ్చింది. మార్కాంషియా పాలిమార్ఫా మొక్కల్లో ఉండే ఎంపీవీఐహెచ్ అనే ఎంజైమ్ ఐఎన్ఎస్‌పీ8 అనే వార్తాహర సంకేతం విడుదలను ప్రోత్సహిస్తుంది. ఈ సంకేతం డెల్లా ప్రోటీన్‌తో అనుసంధానమై దాన్ని నిర్వీర్యం చేసి తద్వారా పెరుగుదలను తిరిగి ప్రోత్సహిస్తుంది. ఈ రకంగా పుష్పించే మొక్కలు, ఉభయచర మొక్కల్లో రెండు రకాల యంత్రాంగాల వల్ల డెల్లా ప్రోటీన్ నియంత్రణ జరుగుతుందనీ, తద్వారా దిగుబడి కూడా పెరుగుతుందని తెలుసుకున్నారు. డెల్లాను పూర్తిగా తొలగించడం వల్ల వచ్చే దుష్ప్రభావాలను తగ్గించి పంటల దిగుబడిని పెంచేందుకు శాస్త్రవేత్తలు యోచిస్తున్నారు.

అధిక దిగుబడుల కోసం...

హరిత విప్లవం తొలినాళ్లలో అభివృద్ధి చేసిన పొట్టి రకాల వంగడాల్లో డెల్లా ప్రోటీన్ నిష్క్రియగా మారడం వల్లే పంటల దిగుబడి పెరిగినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ క్రమంలో డెల్లా ప్రోటీన్ నియంత్రణ యంత్రాంగాల పరిజ్ఞానాన్ని అధిక దిగుబడులనిచ్చే పంటల అభివృద్ధి కోసం వినియోగించవచ్చని తేలింది. భవిష్యత్తులో జన్యు ఇంజినీరింగ్ ప్రక్రియను ఉపయోగించి డెల్లా ప్రోటీన్ పనితీరును నియంత్రించడం ద్వారా అధిక దిగుబడి ఇచ్చే పంటలను డిజైన్ చేసే దిశగా శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. ఆహార భద్రత సాధనలో ఇదొక ఆశావహ పరిస్థితిగా భావించవచ్చు.

–డాక్టర్ ఎలగొండ నరసింహమూర్తి, వృక్షశాస్త్ర నిపుణులు

ఆట కాదు.. ధైర్యం!

హాయ్! బుజ్జీ!!

హాయ్.. నేస్తాలు! ఎన్ని ఆటలు అయినా ఆడతాం కానీ కరాటే, జిమ్నాస్టిక్స్ అంటే మాత్రం కాస్త వెనకడుగు వేస్తాం. వాటిని కష్టపడి నేర్చుకోవాలి మరి! అలా అందులోనూ నైపుణ్యం సాధిస్తే.. శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా ధైర్యంగా ఉండొచ్చు అంటోందీ నేస్తం..!

అన్నమయ్య జిల్లా టి.సుండుపల్లి గ్రామానికి చెందిన కూరపాటి మౌక్తిక ఆరో తరగతి చదువుతోంది. అమ్మానాన్నలు.. సాయిలత, రంగనాథం సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఆరేళ్ల వయసు నుంచే జిమ్నాస్టిక్స్ నేర్చుకోవడం మొదలుపెట్టింది మౌక్తిక. తను చిన్నప్పటి నుంచే ఆటలు బాగా ఆడేది. సాధన చేసి ఏరోబిక్, ఆర్టిస్టిక్ రెండు రకాల జిమ్నాస్టిక్స్‌లోనూ



రాణిస్తోంది. మొన్న ఆగస్టులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వ్యక్తిగత విభాగంలో కాంస్యం, ట్రియో విభాగంలో బంగారు పతకం గెలుచుకుంది. అంతేకాకుండా 2024లో జమ్మూలో జరిగిన ఏరోబిక్స్ జాతీయ ఛాంపియన్‌షిప్‌లో ట్రియో విభాగంలో ఎంపికై.. ఏడో స్థానంలో నిలిచింది. అదే సంవత్సరంలో షిరిడీలో జరిగిన జాతీయస్థాయి సీబీఎస్ఈ జిమ్నాస్టిక్స్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో అండర్-11 విభాగంలో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. అలాగే కర్ణాటక ప్రభుత్వం నిర్వహించిన మినీ ఒలింపిక్స్ 2024లోనూ మౌక్తిక ఏరోబిక్స్ ట్రియో విభాగంలో కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. అలా ఇప్పటి వరకు జిల్లాస్థాయిలో పది, రాష్ట్రస్థాయిలో నాలుగు, జాతీయస్థాయిలో రెండు పతకాలు సాధించింది. రోజుకు 5-6 గంటలు ప్రాక్టీస్ చేస్తుందట. అలా కష్టపడటం వల్లే గెలవగలుగుతున్నానని చెబుతోంది. జిమ్నాస్టిక్స్‌తో పాటు పెయింటింగ్ వేయడం, క్రాఫ్టింగ్, వంట చేయడం అంటే తనకు చాలా ఇష్టమట. ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్‌లో ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే తన లక్ష్యమంటోంది మౌక్తిక.


– ఊటుకూరి నందిని

నేనెవర్ని?

1. నాలుగు అక్షరాల పదాన్ని నేను. 'అత్త'లో ఉంటాను కానీ 'చెత్త'లో లేను. 'నువ్వు'లో ఉంటాను కానీ 'నవ్వు'లో లేను. 'మనం'లో ఉంటాను కానీ 'జనం'లో లేను. 'గతి'లో ఉంటాను కానీ 'గమ్యం'లో లేను. నేనెవర్ని?
2. నేనో మూడు అక్షరాల పదాన్ని. 'విల్లు'లో ఉంటాను కానీ 'హల్లు'లో లేను. 'జడ'లో ఉంటాను కానీ 'మెడ'లో లేను. 'గాయం'లో ఉంటాను కానీ 'గాలం'లో లేను. నేనెవరినో తెలిసిందా?

జవాబు: 1.అనుమతి 2.విజయం

అపారమైన ప్రేమ, నిస్వార్థ సేవ



భగవాన్ శ్రీ సత్యసాయి బాబా

శతాబ్ది ఉత్సవాల సంరంభం

గౌరవనీయ ప్రధాన మంత్రి


శ్రీ నరేంద్ర మోడీ గారిచే

స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్ విడుదల మరియు ప్రత్యేక ప్రసంగం

విశిష్ఠ అతిథి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

గౌ. శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు



నవంబర్ 19, 2025

ఉదయం 10:30 గం. లకు

హిల్ వ్యూ స్టేడియం

పుట్టపర్తి

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి
జన్మభూమి మరియు కర్మభూమి.

DD Newsలో
ప్రత్యక్షప్రసారం



శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్

ప్రశాంతి నిలయం, పుట్టపర్తి, శ్రీ సత్యసాయి జిల్లా, ఆంధ్రప్రదేశ్, భారతదేశం.

ఉలిక్కిపడ్డ విజయవాడ.. ఏలూరు, కాకినాడల్లో అలజడి



ఏలూరులో మావోయిస్టులు ఉన్న భవనాన్ని చుట్టుముట్టిన పోలీసులు

ఈనాడు- అమరావతి, ఏలూరు, కాకినాడ, న్యూస్‌టుడే- పెనమలూరు: ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలో బలగాల ముమ్మర కూంబింగ్, విస్తృత దాడులతో కకావికలమైన మావోయిస్టులు మైదాన ప్రాంతాలకు వచ్చి తలదాచుకుంటున్నారు. వారిలో కొందరు విజయవాడ, ఏలూరు, కాకినాడ సహా వివిధ ప్రాంతాల్లో ఉంటున్నారనే పక్కా సమాచారంతో ఏపీ పోలీసులు కొన్నిరోజులుగా నిఘా పెట్టారు. మంగళవారం ఏకకాలంలో దాడులు చేసి, 50 మందిని అదుపులోకి తీసుకున్నారు. కృష్ణా జిల్లా కానూరులో 27 మంది, గన్నవరంలో ఒకరు, విజయవాడ రామవరప్పాడులో నలుగురు, ఏలూరులో మూడు ప్రాంతాల్లో 15 మంది, కాకినాడలో ఇద్దరు, అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లిలో ఒకరు పోలీసుల వలలో చిక్కారు. దీంతో విజయవాడ, ఏలూరు, కాకినాడల్లో సంచలనం రేకెత్తింది. రామవరప్పాడులో చిక్కిన నలుగురిలో ఒకరు మావోయిస్టు అగ్రనేత అని సమాచారం. అయితే పోలీసులు దీన్ని ధ్రువీకరించడం లేదు. ఆయనతోపాటు రామవరప్పాడులో పట్టుబడినవారు అక్కడే మూడు నెలలుగా నివాసం ఉంటున్నట్లు సమాచారం. పట్టుబడిన వారిలో మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ రక్షణ బృందంలోని వారు 9 మంది ఉన్నారు. మిగిలిన వారంతా హిడ్మా ఆధ్వర్యంలో నడిచే ఒకటో బెటాలియన్‌లో పని చేస్తున్నట్లు పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. వీరంతా ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు చెందిన వారు అని గుర్తించారు. విజయవాడలో పట్టుబడిన వారి నుంచి తుపాకులు, విప్లవ సాహిత్యం, పేలుడు పదార్థాలు, బుల్లెట్లు, ఇతర సామగ్రిని భారీ ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ ప్రాంతంలో దొరికిన డైరీలోని సమాచారం ఆధారంగానే ఈ 50 మందిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఆటోనగర్‌లోని మూడంతస్తుల భవనంపై డ్రోన్ ఎగరేసి

విజయవాడ నగర శివారు కృష్ణా జిల్లా కొత్త ఆటోనగర్ రోడ్ నంబర్ 5లోని భవనం మూడో అంతస్తులో అధిక సంఖ్యలో మావోయిస్టులు ఉన్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో మంగళవారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో 200 మందితో కూడిన ఆక్టోపస్, పోలీసుల బృందాలు భవనాన్ని చుట్టుముట్టాయి. తొలుత డ్రోన్ ఎగరేసి, లోపల ఎంతమంది ఉన్నారో తెలుసుకునేందుకు ప్రయత్నించారు. అక్కడి నుంచి ఎలాంటి కదలికలు లేకపోవడంతో ఆక్టోపస్ బృందం ఒక్కసారిగా లోపలికి చొచ్చుకెళ్లింది. మావోయిస్టులకు ఎదురుదాడి చేసే అవకాశం ఇవ్వకుండా ఆ భవనంలో ఉన్న 27 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో 21 మంది మహిళలు, ఆరుగురు పురుషులున్నారు. రామవరప్పాడులోని మూడు ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఏకకాలంలో దాడులు చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.

హైవే పనులకు వచ్చామన్న మావోయిస్టులు

కానూరు కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు అద్దెకు తీసుకున్న ఇల్లు ఆర్కిటెక్ట్, బిల్డింగ్ ప్లానర్‌గా పనిచేసే విశాఖపట్నానికి చెందిన అప్పలస్వామి నాయుడిదిగా గుర్తించారు. గోదాము, కార్యాలయ అవసరాలకు అద్దెకిచ్చేందుకు నిర్మించిన ఈ భవనాన్ని మావోయిస్టులకు అద్దెకు ఇప్పించడంలో ఆ పార్టీ సానుభూతిపరురాలైన సుశీల సాయం చేసింది. జాతీయ రహదారి పనుల్లో కూలికి వచ్చామని చెప్పి వారు ఈ నెల 1న అద్దెకు దిగారు. కాపలాదారుతోనే అద్దె మాట్లాడారు. 15 రోజులుగా ఉంటున్నా ఎవరూ బయటకు వచ్చేవారు కాదని, పై అంతస్తులో తిరుగుతుండేవారని చెబుతున్నారు. ఒకరు మాత్రం బయటకు వచ్చి అల్పాహారం, టీతోపాటు సమీపంలోని హోటల్ నుంచి పెద్ద క్యారేజీలో భోజనం తీసుకెళ్లేవారు. సుశీల సాయంతోనే ఈ భవనాన్ని పోలీసులు గుర్తించగలిగారు. భవనం కాపలాదారుణ్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

ఏలూరులో 15 రోజుల ఆపరేషన్

ఏలూరులో మావోయిస్టులు ఆశ్రయం పొందుతున్నారని 15 రోజుల కిందటే అక్కడి పోలీసు అధికారులకు సమాచారం అందింది. నిఘా పెట్టి, వారు మినీ బైపాస్ సమీపంలోని గ్రీన్‌సిటీ ప్రాంతంలో ఉంటున్నారని గుర్తించారు. తొలుత నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 15 మంది ఉన్నట్లు తెలియడంతో పట్టుబడినవారి ద్వారా మిగిలిన వారిని పిలిపించారు. రోజూ ఒకరిద్దరు చొప్పున వస్తుండగా.. అలా మొత్తం 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారంతో ఆపరేషన్ పూర్తయింది. పట్టుబడిన వారిలో నలుగురు మహిళలు, 11 మంది పురుషులు.

లుంగీ, తలపాగాతో పోలీసులు..

గ్రీన్‌సిటీ ప్రాంతంలో తలదాచుకుంటున్న మావోయిస్టులపై 15 రోజులుగా నిఘా పెట్టిన పోలీసులు వారికి ఎలాంటి అనుమానం రాకుండా పకడ్బందీగా వ్యవహరించారు. ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ రంగంలోకి దిగారు. డ్రోన్లతో జల్లెడ పట్టించారు. భవనంలోని వారికిగానీ చుట్టుపక్కల వారికి గానీ ఎలాంటి అనుమానం కలగకుండా పోలీసులు లుంగీ, పంచె, తలపాగాలు ధరించి సామాన్య వ్యక్తుల్లా తిరిగారు. ఎస్పీ కూడా టీషర్టు, జీన్స్‌తో సంచరించేవారు. మావోయిస్టులు ప్రతిఘటిస్తే ఎదుర్కొనేందుకు.. మాసిపోయిన సంచుల్లో ఆయుధాలు పెట్టుకుని తిరిగేవారు. ఎస్పీ సహా పోలీసులంతా అక్కడికి వెళ్లి వచ్చేందుకు కేవలం ప్రైవేటు వాహనాలనే వినియోగించారు. పట్టుబడిన వారిని ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గోండు తెగ గిరిజనులుగా గుర్తించారు. వారిని విచారించటానికి పోలీసులు ఆ భాష తెలిసిన వారిని పిలిపిస్తున్నారు. మావోయిస్టు సానుభూతిపరుల ద్వారా వీరు ఏలూరుకు చేరినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఒడిశా నుంచి ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వచ్చామని, ఎక్కువ అద్దె ఇస్తామని చెప్పి అద్దెకు దిగారు.

కాకినాడ జిల్లాలో ఇద్దరు..

కాకినాడ జిల్లాలో సామర్లకోట మండలం కొప్పవరం సమీపంలో ఇద్దరు మహిళా మావోయిస్టుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని రహస్య ప్రాంతానికి తీసుకువెళ్లి విచారణ చేపట్టారు. ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం మండలాల సరిహద్దు అటవీ ప్రాంతాల నుంచి రాకపోకలపైనా పోలీసులు నిఘా పెట్టారు. హోటళ్లు, లాడ్జిల్లో గాలిస్తున్నారు.



విజయవాడలోని కానూరు కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు తలదాచుకున్న భవనం నుంచి స్వాధీనం చేసుకున్న సామగ్రిని తరలిస్తున్న భద్రతా బలగాలు



విజయవాడలో మావోయిస్టులు తలదాచుకున్న భవనం వైపు రాకపోకలు నిషేధించిన పోలీసులు

ఏలూరులో మావోయిస్టులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



ఏలూరులో పట్టుబడింది వీరే..

ఏలూరులో పట్టుబడిన 15 మంది మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌వారే. వారి నుంచి రూ.2 లక్షల నగదుతోపాటు విప్లవ సాహిత్యాన్ని స్వాధీనపర్చుకున్నారు. ఆ రాష్ట్రంలో పలు పోలీస్‌స్టేషన్లలో వారిపై కేసులున్నాయి.

1. కాశ్యప్ భీమా ఎలియాస్ యోగేశ్ (25)
2. సోడే లచ్చు ఎలియాస్ గోపాల్ (40)
3. దూది అద్మ ఎలియాస్ మల్లేశ్ (25)
4. పొడియం ఆనంద్ ఎలియాస్ దన్ను (29)
5. మడకం లక్ష్మణ్ ఎలియాస్ కోస (25)
6. సోడే లక్మా ఎలియాస్ భీమా (35)
7. బాదిశ రాజు (17)
8. మడకం వాగ (24)
9. వెట్టి వెంకట్ (35)
10. మాధవి జోగా (32)
11. మాధవి సునీత (27)
12. తాటి కమల (23)
13. గంగి లక్ష్మి (21)
14. కుంజుం బుజ్జి (20)
15 కుంజుం నందిని (20)

■ వీరిలో లచ్చు, లక్మాలను కీలక నేతలుగా గుర్తించారు.

ఐదు జిల్లాల్లో ప్రత్యేక ఆపరేషన్లు

– విద్యాసాగర్‌నాయుడు, ఎస్పీ, కృష్ణా జిల్లా



డీజీపీ హెచ్‌కే గుప్తా ఆధ్వర్యంలో ఐదు జిల్లాల్లో ప్రత్యేక ఆపరేషన్లు జరిగాయి. కానూరు ఆటోనగర్‌లో 27 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నాం. వారు షెల్టర్ కోసం ఛత్తీస్‌గఢ్ నుంచి వివిధ మార్గాల ద్వారా ఇక్కడికి వచ్చారు. ఆటోనగర్‌లో చాలా మంది ఇతర రాష్ట్రాల కార్మికులు పని చేస్తుంటారు. అక్కడైతే తమను ఎవరూ గుర్తించరని తలదాచుకున్నారు. దాని వెనుక ఏదో ప్రణాళిక ఉందని అనుమానిస్తున్నాం. కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్‌జీకి చెందిన వ్యక్తిగత భద్రతా సిబ్బంది తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నాం. విచారించిన తర్వాత బుధవారం వివరాలు వెల్లడిస్తాం.

అమిత్‌షా డెడ్‌లైన్‌కు 12 రోజుల ముందే..

హిడ్మా ఎన్‌కౌంటర్

దిల్లీ: చాలాకాలంగా భద్రతా బలగాలకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కొరకరాని కొయ్యగా ఉన్న హిడ్మాను పట్టుకోవడంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల అధికారులకు స్పష్టమైన డెడ్‌లైన్ విధించినట్లు సమాచారం. నవంబరు 30లోగా హిడ్మాను పట్టుకోవాలని కేంద్ర బలగాలను ఆయన ఆదేశించినట్లు తెలిసింది. ఈ క్రమంలో హిడ్మా లక్ష్యంగా సెర్చ్ ఆపరేషన్ నిర్వహించిన బలగాలు ఆ డెడ్‌లైన్‌కు 12 రోజుల ముందే హిడ్మాను ఎన్‌కౌంటర్ చేశాయి.

ఉద్యమాన్ని వ్యతిరేకిస్తున్న గిరిజనులు: ఎస్పీ బర్దార్

న్యూస్‌టుడే–రంపచోడవరం: దాదాపు 15 ఏళ్లుగా గిరిజన ప్రాంతాల్లో అనేక సంక్షేమ, అభివృద్ధి పనులు చేస్తున్న కారణంగా గిరిజనుల్లో మార్పు వస్తోందని, వారంతా అభివృద్ధిని కోరుకుంటున్నారని అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ తెలిపారు. అటవీ ప్రాంతంలోని గిరిజన గ్రామాలను షెల్టర్ జోన్లుగా ఏర్పాటు చేసుకోవాలని మావోయిస్టులు భావిస్తున్నా, స్థానికుల నుంచి సహకారం లభించడం లేదని చెప్పారు. పోలీసులు నిత్యం ఆయా ప్రాంత ప్రజలతో మమేకమవడం వల్ల మావోయిస్టుల కదలికలపై పక్కా సమాచారం వస్తోందని వివరించారు.

దేవ్‌జీని వెంటనే కోర్టులో హాజరుపరచాలి

సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ డిమాండ్

ఈనాడు, అమరావతి: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ పోలీసులు అదుపులో ఉన్నట్లు తమకు సమాచారం ఉందని, ఆయన్ను వెంటనే కోర్టులో హాజరుపరచాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. అతనితో పాటు వివిధ కేంద్రాల్లో పోలీసులు అదుపులోకి తీసుకున్న మరో 50 మందిని న్యాయస్థానంలో హాజరుపరచాలని ఓ ప్రకటనలో కోరింది.

ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలి: సీపీఐ

ఈనాడు, అమరావతి: హిడ్మా ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 'మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకుడు హిడ్మా, అతని భార్య సహా ఆరుగురు మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేయడం దుర్మార్గం. ప్రభుత్వం చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాల్సింది పోయి ఎన్‌కౌంటర్ల పేరుతో ప్రాణాలు తీయడాన్ని ఖండిస్తున్నాం' అని పేర్కొన్నారు.

ఎన్‌కౌంటర్‌పై సమగ్ర విచారణ జరపాల్సిందే

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: మారేడుమిల్లిలో జరిగిన మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై సమగ్ర విచారణ జరపాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో మాట్లాడారు. మావోయిస్టు నాయకుడు హిడ్మాతో పాటు పలువురు సభ్యులను చిత్రహింసలకు గురిచేసి చంపారని ఆరోపించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అదుపులోకి తీసుకున్న మావోయిస్టులను వెంటనే కోర్టులో హాజరుపరచాలని కోరారు. సంఘం నాయకులు టి.ఆంజనేయులు, అరసవల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోస్ట్‌వాంటెడ్ మావోయిస్టు హిడ్మా ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు.

తలదాచుకునేందుకు వచ్చి.. భద్రతా బలగాలకు చిక్కి

ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలు ముమ్మరంగా ఆపరేషన్లు చేస్తుండటం, అన్నివైపుల నుంచి నిర్బంధం పెరగటంతో.. హిడ్మా, అతని బృందం షెల్టర్ జోన్ కోసం గత కొద్ది రోజులుగా ఛత్తీస్‌గఢ్-ఒడిశా-ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో తిరుగుతున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. మారేడుమిల్లి సమీపంలోని నెల్లూరు అటవీ ప్రాంతంలో ఈ బృందం మాటు వేసినట్లు సమాచారం అందుకున్న భద్రతా బలగాలు సోమవారం రాత్రి నుంచే కూంబింగ్ మొదలుపెట్టాయి. మంగళవారం ఉదయం 6.30 గంటల సమయంలో హిడ్మా బృందం భద్రత బలగాలకు తారసపడటంతో ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. దాదాపు అరగంటపాటు తుపాకుల మోత మోగింది. ఈ కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. మరో 19 మంది వరకూ పారిపోయారు. మృతుల ఫొటోలను తీసుకున్న భద్రతా బలగాలు.. గతంలో లొంగిపోయిన మావోయిస్టులకు ఆ చిత్రాలను పంపించి వారిని హిడ్మా, అతని భార్యగా గుర్తించారు.

భారీగా ఆయుధాలు, ఎలక్ట్రికల్ డిటోనేటర్లు స్వాధీనం

ఘటనా స్థలం నుంచి మావోయిస్టులకు సంబంధించిన ఏకే 47 రైఫిళ్లు-2, పిస్టల్-1, రివాల్వర్-1, సింగిల్ బోర్ వెపన్-1, ఏకే 47 రౌండ్స్-28, పిస్టల్ రౌండ్స్- 5, ఎలక్ట్రికల్ డిటోనేటర్లు, నాన్ ఎలక్ట్రికల్ డిటోనేటర్లు, ఫ్యూజ్ వైరు, ఎలక్ట్రికల్ వైర్ బండిల్, కిట్ బ్యాగ్‌లు-7 భద్రత బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. వీటితోపాటు దొరికిన కీలకపత్రాలను పోలీసులు విశ్లేషిస్తున్నారు. ఎదురుకాల్పుల్లో మృతిచెందిన మావోయిస్టుల మృతదేహాలను రంపచోడవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారి కుటుంబసభ్యులకు సమాచారం చేరవేశారు.



మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ ప్రాంతం నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలను పరిశీలిస్తున్న ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ మహేష్‌చంద్ర లడ్హా, ఉన్నతాధికారులు

ఆ 50 మంది కలిసే వచ్చారా?

రాష్ట్రంలో 50 మందిని మావోయిస్టులను ఆయా జిల్లాల పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వీరంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారే. కూలీల ముసుగులో భవనాలను అద్దెకు తీసుకుని ఆయా ప్రాంతాల్లో తలదాచుకుంటున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. అరెస్టయినవారిలో 9 మంది మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ రక్షణదళంలోని సభ్యులు కాగా మిగతా వారంతా సౌత్ బస్తర్ డివిజనల్ కమిటీ సభ్యులు. వీరంతా హిడ్మా బృందంలో కీలకంగా వ్యవహరించారు. వీరంతా త్వరలో హిడ్మాను కలిసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు భద్రత బలగాలు అనుమానిస్తున్నాయి. ఎవరి ఆదేశాల మేరకు వీరు ఏపీలోకి వచ్చారు? ఇక్కడ వారికి అవసరమైన ఏర్పాట్లు ఎవరు చేశారు? వీరు హిడ్మాను ఎక్కడ కలవాలని ప్రణాళికలు వేశారు? తదితర అంశాలపై నిఘావర్గాలు వారిని ప్రశ్నిస్తున్నాయి.

మృతి చెందిన మావోయిస్టులు

1. మద్వి హిడ్మా- స్వస్థలం పువ్వర్తి గ్రామం, సుక్మా జిల్లా, ఛత్తీస్‌గఢ్
కేంద్ర కమిటీ సభ్యుడు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి, పీఎల్‌జీఏ ఒకటో బెటాలియన్ కమాండెంట్.

2. మడకం రాజే- వీరాపురం గ్రామం, సుక్మా జిల్లా, ఛత్తీస్‌గఢ్
హిడ్మా భార్య. ఎంవోపీవోఎస్ టీమ్ కమాండర్, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు.

3. లక్మల్ ఎలియాస్ చైతు- ఎడిసెమెట్ట, ఛత్తీస్‌గఢ్
మొదటి కంపెనీ మూడో ప్లటూన్ కమాండర్, ఏ, బీ, సీ సెక్షన్లు.

4. కమ్లు ఎలియాస్ కమలేష్- కమలూరు, బైరంగఢ్, ఛత్తీస్‌గఢ్
మొదటి కంపెనీ రెండో ప్లటూన్ కమాండర్, ఏ సెక్షన్.

5. మల్లా ఎలియాస్ మల్లాలు- పామేడు ప్రాంతం, ఛత్తీస్‌గఢ్
మొదటి కంపెనీ మూడో ప్లటూన్ కమాండర్, బీ సెక్షన్.

6. దేవే- కిష్టారం ప్రాంతం, ఛత్తీస్‌గఢ్
హెడ్‌క్వార్టర్స్ కంపెనీ గార్డ్.



దేవే, మల్లా ఎలియాస్ మల్లాలు, లక్మల్ ఎలియాస్ చైతు , కమ్లూ ఎలియాస్ కమలేష్

దళసభ్యుడి నుంచి దండకారణ్య దళపతిగా..

పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కార్యకలాపాలకు ఆయువుపట్టుగా హిడ్మా

ఈనాడు, హైదరాబాద్- న్యూస్‌టుడే, చర్ల: మావోయిస్టు పార్టీలో మడావి హిడ్మా(51) 36 ఏళ్ల ప్రస్థానం ఆద్యంతం సంచలనాలకు కేంద్రబిందువుగా నిలిచింది. దళసభ్యుడిగా చేరి.. దండకారణ్య దళపతిగా ఎదగడం వెనక ఆయన చేసిన భారీ ఆపరేషన్లు కీలకంగా నిలిచాయి. గెరిల్లా వార్‌ఫేర్‌లో అనుభవం పొందడమే కాకుండా సాయుధ పోలీసు బలగాలపై భారీ దాడులు చేయడంలో హిడ్మా మాస్టర్‌మైండ్‌గా ఎదిగారు. మావోయిస్టు పార్టీ తరఫున దాడులు చేసే పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) బెటాలియన్ కమాండర్‌గా ఉంటూ అనేక దాడులకు పాల్పడ్డారు. ముఖ్యంగా అంబుష్ దాడుల్లో సిద్ధహస్తుడిగా ముద్రపడిన హిడ్మాకు అనేక దాడుల్లో ప్రమేయమున్నట్లు చెబుతారు. వీటిల్లో 250 మందికిపైగా జవాన్లు మృతిచెందారు. మావోయిస్టు చరిత్రలో అతిపెద్ద దాడిగా పేర్కొనే చింతల్నార్ దాడికి మావోయిస్టు పార్టీ సెంట్రల్ మిలిటరీ కమిషన్(సీఎంసీ) అప్పటి చీఫ్ కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ వ్యూహరచన చేయగా హిడ్మా క్షేత్రస్థాయిలో కేడర్‌ను నడిపించారు. మావోయిస్టులకు వ్యతిరేకంగా సల్వాజుడుంను సృష్టించిన మహేంద్రకర్మను 2013లో జీరంఘాటి ప్రాంతంలో ప్రాణాలతో పట్టుకొని అత్యంత పాశవికంగా చంపేసిన ఉదంతంలోనూ అతని పేరు బలంగా వినిపించింది. ఈ దాడిలో మహేంద్రకర్మతో సహా 29 మందిని మావోయిస్టులు హత్య చేశారు. ఇలాంటి భారీ దాడులకు క్షేత్రస్థాయిలో నేతృత్వం వహించడం ద్వారా మావోయిస్టు పార్టీలో హిడ్మా చిన్న వయసులోనే కేంద్ర కమిటీలో స్థానం సంపాదించారు. మరోవైపు ఎన్ఐఏ(జాతీయ దర్యాప్తు సంస్థ)కు మోస్ట్ వాంటెడ్‌గా మారారు.



హిడ్మా తాజాచిత్రం



హిడ్మా స్వగ్రామంలోని అతని నివాసంలో పోలీసు అధికారులు

రామన్న శిష్యరికంలో ఆయుధ శిక్షణ

■ 1974లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా పూవర్తి గ్రామంలోని మురియా తెగలో హిడ్మా జన్మించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి వరకు చదివి మానేశారు.

■ ఆ సమయంలో దక్షిణ బస్తర్‌లో పీపుల్స్ వార్ గ్రూప్ ప్రభావం ఎక్కువగా ఉండటంతో తన 15వ ఏటనే ఆ పార్టీలో చేరారు.

■ హిందీ, గోండి, తెలుగు, కోయ, మురియా, బెంగాలీ భాషల్లో పట్టు సాధించారు.

■ 1996లో పామేడు రేంజ్ కమిటీలో పార్టీ సభ్యుడిగా పనిచేశారు. రెండేళ్ల అనంతరం ఏరియా కమిటీ సభ్యుడయ్యారు. ఆర్నెల్లపాటు ప్లటూన్ 2 కమాండర్ అర్జున్ నేతృత్వంలో పని చేశారు. 1998 ఆగస్టులో లోతువాగు అంబుష్ సందర్భంగా అతని కాలికి గాయమైంది.

■ కోలుకున్న అనంతరం బాసగూడ దళంలో చేరి అప్పటి దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ(డీకేఎస్‌జడ్‌సీ) సభ్యుడు రామన్న దగ్గర ఆయుధాల మరమ్మతులో శిక్షణ పొందారు.

■ 2002లో డివిజనల్ కమిటీ సభ్యుడిగా నియమితులు కావడంతో కుంట ఏరియా కమిటీకి కార్యదర్శిగా వ్యవహరించారు. 2005లో కాయ్-2, ప్లటూన్-1 కమాండర్‌గా పనిచేశారు. 2007లో కాయ్-3 ఏర్పాటు కావడంతో దానికి కమాండర్‌గా నియమితులయ్యారు.

■ 2009లో పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ బెటాలియన్ కమాండర్‌గా ఎదిగి చాలాకాలం పనిచేశారు. 2014లో డీకేఎస్‌జడ్‌సీ సభ్యుడిగా నియమితులయ్యారు.

■ ప్రస్తుతం డీకేఎస్‌జడ్‌సీ కార్యదర్శిగా ఉంటూ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు.

హిడ్మా నేతృత్వంలో ముఖ్యమైన దాడులు

▼ 2007లో సీఆర్పీఎఫ్ రాణిబొద్లి క్యాంపుపై దాడిలో 16 మంది సీఆర్పీఎఫ్ జవాన్లతోపాటు 39 మంది ఎస్పీవోల మృతి

▼ 2010లో దంతేవాడ జిల్లాలోని సీఆర్పీఎఫ్ చింతల్నార్ క్యాంపుపై దాడిలో 76 మంది జవాన్ల మృత్యువాత

▼ 2010లో సింగవరం ఐఈడీ పేలుడులో 20 మంది జవాన్ల వీరమరణం

▼ 2013లో జీరంలోయ ఊచకోతలో కాంగ్రెస్ నాయకులు నందకుమార్ పటేల్, మహేంద్రకర్మ, విద్యాచరణ్ శుక్లాతో సహా 29 మంది హత్య

▼ 2014లో సుక్మా జిల్లా తహక్వారాలో జరిపిన దాడిలో 16 మంది జవాన్ల మృతి

▼ 2017లో బుర్కపాల్(సుక్మా జిల్లా)లో జరిపిన దాడిలో 25 మంది బలి

▼ 2020లో చింతగుఫ(సుక్మా) దాడిలో 17 మంది దుర్మరణం

▼ 2021లో టేకులగూడలో జరిపిన మెరుపు దాడిలో 22 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు అమరులయ్యారు

రాత్రిపూట స్టెల్త్ దాడుల్లో ప్రావీణ్యం

మావోయిస్టు పార్టీలో హిడ్మా క్రమశిక్షణతో కలిగిన జీవనాన్ని గడిపినట్లు చెబుతారు. రోజూ తెల్లవారుజామున 4 గంటలకే నిద్ర లేచి బెటాలియన్‌తో పరేడ్ నిర్వహించిన అనంతరం దినచర్యను ప్రారంభించేవారు. మధుమేహంతో బాధపడుతున్న హిడ్మా రొట్టెలు ఎక్కువగా తినేవారని.. మాంస ప్రియుడని చెబుతారు. దక్షిణబస్తర్‌లో అతనికి పట్టు ఉండటంతో చాలాసార్లు పోలీసుల దాడుల నుంచి తప్పించుకున్నారు. ప్రతిసారీ క్షణాల్లో మాయమయ్యేవారు. ఆటోమేటిక్ రైఫిల్స్, ఐఈడీ సాంకేతికతలో నైపుణ్యం కలిగిన హిడ్మా.. రాత్రిపూట పర్వత ప్రాంతాల్లో స్టెల్త్ దాడుల్లో ప్రావీణ్యం కలిగినట్లు చెబుతారు. ఈ కారణంగానే పలు సీఆర్పీఎఫ్ క్యాంపులపై అర్ధరాత్రి దాటాక దాడులు నిర్వహించారు.

విజయవాడలో షెల్టర్ జోన్!

ఈనాడు, అమరావతి: పరిపాలనా కేంద్రంగా సాగుతున్న విజయవాడను మావోయిస్టులు షెల్టర్‌జోన్‌గా చేసుకోవడం.. పెద్దసంఖ్యలో ఇక్కడి పరిసర ప్రాంతాల్లో తలదాచుకోవడం కలకలం సృష్టించింది. ఎవరి దృష్టీ ఉండదని ఆటోనగర్‌లో 27 మంది ఒకే భవనంలో ఆయుధాలతో ఉన్నారు. విజయవాడలోని ఆటోనగర్, కానూరులోని కొత్త ఆటోనగర్‌లు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారాయి. ఇక్కడ కర్మాగారాల్లో ఉత్తరాది నుంచి వేలమంది కార్మికులు వచ్చి పనిచేస్తుంటారు. ఈ ప్రాంతంపై పోలీసుల నిఘా లేకపోవడం, గస్తీ లోపించడం అరాచక శక్తులకు మరింత ఊతమిస్తోంది.

నిఘా శూన్యం...

విజయవాడ ఆటోనగర్ విస్తరణలో భాగంగా 32 ఎకరాలలో కానూరులో కొత్త ఆటోనగర్ ఏర్పాటైంది. ఇందులో 150 పరిశ్రమలతోపాటు 350 వరకు సర్వీస్ యూనిట్లు వచ్చాయి. వీటిల్లో పనిచేసేందుకు బిహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, యూపీల నుంచి కార్మికులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. రాత్రయిందంటే ఇక్కడ గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లు హల్‌చల్ చేస్తుంటాయి. అయితే రాత్రిళ్లు పోలీసుల గస్తీ నామమాత్రమే.

ఎస్ఐబీకి సమీపంలోనే...

మావోయిస్టుల కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచే ఎస్ఐబీ (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో) కార్యాలయానికి సమీపంలోనే మావోయిస్టులు షెల్టర్ పొందిన భవనం ఉంది. ఎస్ఐబీకి చెందిన సిబ్బంది నిత్యం మావోయిస్టుల కదలికలపై సమాచారం సేకరిస్తుంటారు. వారి సానుభూతిపరులపై కూడా నిత్యం నిఘా పెడుతుంటారు. ఈ కార్యాలయానికి 3.5 కి.మీ. దూరంలోనే మావోయిస్టులు షెల్టర్ తీసుకోవడం చర్చనీయాంశమైంది. ఇదేమార్గంలో మంత్రి పార్థసారథి క్యాంపు కార్యాలయం కూడా ఉంది. సమీపంలోనే భాజపా ఎమ్మెల్యే సుజనాచౌదరి నివాసం ఉంది. మచిలీపట్నంలోని ఎస్పీ బంగ్లాలో మరమ్మతులు జరుగుతుండటంతో. ఈ ప్రాంతానికి 500 మీటర్ల దూరంలోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తన బంధువుల ఇంట్లో తాత్కాలికంగా ఉంటున్నారు.

హిడ్మాపై రూ.కోట్లలో రివార్డ్ భార్యపై రూ.50 లక్షలు

చింతూరు, న్యూస్‌టుడే: మోస్ట్‌వాంటెడ్ జాబితాలో ఉన్న హిడ్మాను పట్టుకునేందుకు వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్ల మొత్తాన్ని రివార్డుగా ప్రకటించాయి. ఆయన భార్య రాజేపై రూ.50 లక్షల రివార్డు ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో సుక్మా జిల్లా పూవర్తి గ్రామానికి చెందిన హిడ్మాకు దండకారణ్యంపై తిరుగులేని పట్టు ఉంది. బాల్యంలోనే మావోయిస్టు పార్టీలో చేరి కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎదిగారు. గెరిల్లా దాడుల్లో కీలకంగా వ్యవహరిస్తూ వచ్చారు. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు నిర్వహించిన అనేక దాడులకు ప్రత్యక్షంగా నాయకత్వం వహించి అనేకమంది పోలీసుల మరణానికి కారణమయ్యారు.

■ ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రప్రభుత్వం రెండు నెలల నుంచి కూంబింగ్ నిర్వహిస్తోంది. తనను లక్ష్యంగా చేసుకుని బచావో పేరుతో ఈ ఏడాది ఏప్రిల్‌లో కర్రెగుట్టను బలగాలు చుట్టుముట్టినా వారి కళ్లుగప్పి అక్కడి నుంచి హిడ్మా తప్పించుకున్నారు. తెలంగాణలో జరిగిన ఆపరేషన్‌లోనూ తప్పించుకోగలిగారు. ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి వారం క్రితం హిడ్మా తల్లిని కలిశారు. జనజీవన స్రవంతిలో కలవాలని ఆమెతో సందేశాన్ని పంపించారు. ఇది జరిగిన వారం వ్యవధిలోనే ఎదురుకాల్పుల్లో ఆయన ప్రాణాలు కోల్పోయారు.

నగరంలో అలజడి

32 మంది మావోయిస్టుల అరెస్టు


కానూరు కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టిన పోలీసులు

పెనమలూరు, కానూరు న్యూస్‌టుడే

నగర శివారు ప్రాంతాలు తెలతెలవారుతూనే ఒక్కసారిగా ఉలికిపాటుకు గురయ్యాయి. కానూరు కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు ఆశ్రయం పొందారనే సమాచారం సంచలనం రేపింది. మంగళవారం ఉదయం ఆక్టోపస్, బాంబ్ స్క్వాడ్, క్లూస్‌టీం, భారీ ఎత్తున పోలీసు, కేంద్ర ప్రభుత్వ బలగాలు.. ఆ పారిశ్రామికవాడలోకి ప్రవేశించడం, 27 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకోవడం కలకలం రేపింది. వీరితో పాటు రామవరప్పాడు, ఎనికేపాడు ప్రాంతాల్లో మూడు చోట్ల నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరంతా మూడు నెలల నుంచి ఇళ్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. వారిలో ఓ అగ్రనేత కూడా ఉన్నట్లు తెలిసింది. గన్నవరంలో చికిత్స చేయించుకునేందుకు వచ్చి మరొక మావోయిస్టు దొరికిపోయాడు.


మీడియాను నిలువరించిన పోలీసులు

సమాచారం, కదలికలు బయటకు పొక్కకుండా..

కొత్త ఆటోనగర్‌లో పట్టుబడ్డ మావోయిస్టులు స్థానికంగానే ఉంటున్నా ఏ మాత్రం సమాచారం, కదలికలు బయటకు పొక్కకపోవడంపై స్థానికంగా భయాందోళనలు వ్యక్తమవడంతో పాటు పెద్ద చర్చనీయాంశంగా మారింది. మావోయిస్టులు ఐదో నంబరు రహదారిలోని ఓ భవనంలో మకాం వేయగా.. వారంతా ఒకేసారి అందులోకి ప్రవేశించలేదని తెలుస్తోంది. అలా వస్తే స్థానికులకు అనుమానం వస్తుందని, సమాచారం పోలీసులకు చేరుతుందనే అనుమానంతో రోజుకు ఇద్దరు, ముగ్గురు, నలుగురైదుగురు చొప్పున ప్రవేశించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ప్రాంతంలో అందరూ కార్మికులు ఉండటం, వారంతా ఉదయం వచ్చి రాత్రి సమయంలో తిరిగి వెళ్లిపోయే వారు కావడంతో.. రాత్రి 7 నుంచి మరుసటి రోజు ఉదయం 9 గంటల వరకు జనసంచారం అంతగా ఉండదు. దీంతో భవనంలోకి మావోయిస్టుల చేరిక సులువైందంటున్నారు. భవనం యజమాని విదేశాల్లో ఉంటారని గుర్తించారు. నిర్వహణ, పర్యవేక్షణంతా కాపలాదారుగా ఉన్న వ్యక్తి చూస్తుంటారని తెలుస్తోంది. మావోయిస్టులు తాత్కాలికంగా ఆశ్రయం పొందారా లేక ఏదైనా లక్ష్యంతో ఇక్కడకొచ్చారా అన్న దిశగా విచారణ సాగుతోంది.

గతంలో రాకెట్ లాంచర్లు స్వాధీనం

వాస్తవానికి కానూరు ఆటోనగర్‌లో మావోయిస్టుల కదలికలు కొన్నేళ్ల క్రితమే వెలుగులోకి వచ్చాయి. గతంలో మావోయిస్టులకు చెందిన వందల కొద్దీ రాకెట్ లాంచర్లు ఓ ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో పట్టుబడటాన్ని స్థానికులు గుర్తుచేసుకుంటున్నారు.


మావోయిస్టులు ఉన్న భవనం వద్దకు చేరుకున్న క్లూస్ టీం



తనిఖీలకు వచ్చిన డాగ్ స్క్వాడ్

అద్వికా కేసులో ఆదిత్య కస్టడీ కోసం పిటిషన్

ఈనాడు - అమరావతి: అద్విక కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు ఆదిత్యను మరో విడత కస్టడీకి కోరుతూ మంగళవారం పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. విచారణ నిమిత్తం ఈనెల 20కి వాయిదా పడింది. తొలి విడత కస్టడీలో ఆదిత్యతోపాటు, అతని భార్య, బాలకృష్ణలను పోలీసులు ప్రశ్నించారు. అయినా లెక్కలు చూపని సొమ్ముకు సంబంధించి వివరాలు వెల్లడించలేదు.

గతి తప్పిన వేగం.. గాలిలో ప్రాణం!

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, నందిగామ



విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై నందిగామ సమీపంలో అనాసాగరం దగ్గర వేగంగా దూసుకొచ్చిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో ఢీకొట్టింది. ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. బస్సు హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం వెళ్తుండగా ప్రమాదం జరిగింది.

గతంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు పెనుగంచిప్రోలు మండలం ముక్త్యాల సమీపంలో వేగంగా వంతెన ఎక్కే క్రమంలో ప్రమాదానికి గురైంది. 11 మంది ప్రయాణికులు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. చాలా మంది గాయాలపాలయ్యారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అతివేగంతో.. ఇటీవల కర్నూలు జిల్లాలో 19 మంది సజీవ దహనమయ్యారు. ఈ ఘటనతో రాష్ట్రమంతా ఉలిక్కిపడినా ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల తీరు మారడం లేదు. దూకుడు తగ్గించడం ప్రయత్నం చేయడం లేదు. మంగళవారం నందిగామ పరిధిలో జరిగిన ప్రమాదం వారి నిర్లక్ష్యాన్ని మరోమారు నిరూపించింది.


నందిగామ: అనాసాగరం వద్ద సోమవారం అర్ధరాత్రి లారీని ఢీకొని ధ్వంసమైన ట్రావెల్స్ బస్సు

ప్రైవేటు ట్రావెల్స్ వాహన దూకుడుకు పడని కళ్లెం

ఉమ్మడి జిల్లాలో మూడు ప్రధాన ఎన్‌హెచ్‌లలో ఈ ఏడాది ప్రమాద గణాంకాలు భయపెడుతున్నాయి. మొత్తం 479 ప్రమాదాలు జరిగితే 199 మంది మృత్యువాతపడ్డారు. 440 మంది గాయాల బారిన పడ్డారు. ప్రైవేటు ట్రావెల్ బస్సుల్లో అధిక వేగంతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్టీసీ బస్సుల్లో స్పీడ్‌లాక్ సిస్టం ఉంటుంది. 70 కిమీ వేగం దాటి వెళ్లే అవకాశం ఉండదు. ప్రైవేటు బస్సుల్లో ఈ నిబంధన లేకపోవడంతో రాత్రుళ్లు గంటకు 120 కిమీ వేగంగా అద్దాలలో నడిపేస్తున్నారు. ఆరు గంటల ప్రయాణం 4 గంటల్లో ముగిస్తున్నారు. బస్సుపైనా, లగేజీ కౌంటర్‌లో పరిమితికి మించి బరువున్న పార్సిళ్లు, సామగ్రి రవాణా చేయడం నిబంధనలకు విరుద్ధమైనా గుట్టుగా సాగిపోతోంది. ఈ అధిక బరువు సైతం వేగంలో బస్సు నియంత్రణకు రాకుండా చేస్తోంది. విజయవాడ కేంద్రంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు, ఇతర రాష్ట్రాలకు నిత్యం 500పైగా బస్సులు తిప్పుతున్నారు. రవాణా శాఖ అధికారులు తనిఖీలు గాలికొదిలిన ఈ ఫలితమే ఈ రహ"దారుణా"లనేది సుస్పష్టం.

20న పవిత్ర సంగమం వద్ద కోటి దీపోత్సవం

కొండపల్లి, న్యూస్‌టుడే : దసరా శరన్నవరాత్రులు విజయవంతమైన నేపథ్యంలో ఈ నెల 20న గురువారం పవిత్ర సంగమం వద్ద కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నామని పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు మంగళవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద పది రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. వరదలు వచ్చినా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగాయని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో సంగమం వద్ద మండలంలోని గ్రామాల మహిళలతో పాటు పురపాలిక, నగరంలోని మహిళలు దీపోత్సవంలో పాల్గొనే అవకాశం కల్పించామన్నారు. సంగమం వద్ద అన్ని ఏర్పాట్లను పురపాలిక నిర్వహిస్తుండగా దీపోత్సవానికి కావాల్సిన అన్ని వస్తువులను మహిళలే స్వయంగా సమకూర్చుకోవాలన్నారు.

అన్నదాతా.. ఖుషీభవ!

✧ నేటి నుంచి పీఎం, కిసాన్, సుఖీభవ సొమ్ము జమ

ఈనాడు, అమరావతి: అన్నదాతా... సుఖీభవ రెండో విడత, పీఎం కిసాన్ సొమ్ము జమ చేసేందుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. బుధవారం నుంచి సొమ్ము జమ చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఒక్కో రైతుకు అన్నదాతా సుఖీభవ నుంచి రూ.5 వేలు, పీఎం కిసాన్ రూ.2 వేలు చొప్పున జమ చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో 2,52,485 మంది రైతుల ఖాతాలకు రూ.168.23 కోట్లు బదిలీ చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్న వేళ.. ఈ సొమ్ము ఉపయుక్తంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ✦ ఎన్టీఆర్ జిల్లాలో సుఖీభవ కింద రూ.59.31 కోట్లు, పీఎం కిసాన్ నుంచి రూ.20.40 కోట్ల చొప్పున రూ.79.72 కోట్లు జమవుతుంది. ✦ కృష్ణా జిల్లాలో సుఖీభవ కింద రూ.66.93 కోట్లు.. పీఎం కిసాన్ కింద రూ.21.56 కోట్ల చొప్పున రూ.88.49 కోట్లు ఇవ్వనున్నారు. ✦ అత్యధికంగా కృష్ణాలో పామర్రుకు రూ.19.56 కోట్లు, ఎన్టీఆర్‌లో నందిగామకు రూ.20.40 కోట్లు జమకానున్నాయి.

లబ్ధి: (రూ.కోట్లలో)

నియోజకవర్గం	సుఖీభవ రైతులు	సుఖీభవ లబ్ధి	పీఎం కిసాన్ రైతులు	పీఎం కిసాన్ లబ్ధి	మొత్తం లబ్ధి
తిరువూరు	33,658	16.83	28,623	5.72	22.55
విజయవాడ వెస్ట్	–	–	22	0.0044	0.0044
విజయవాడ సెంట్రల్	–	–	108	0.0216	0.0216
విజయవాడ ఈస్ట్	–	–	32	0.0064	0.0064
మైలవరం	30,241	15.12	23,933	4.79	19.91
నందిగామ	30,216	15.11	26,560	5.31	20.42
జగ్గయ్యపేట	24,514	12.26	22,737	4.55	16.80

వదిలేస్తే ఎలా.. సరిచేస్తే పోలా?!



"ప్రజల చేతిలో ప్రభుత్వం" అని దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో వాట్సప్ గవర్నెన్స్‌ని తీసుకొచ్చారు. ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ కార్యాలయాలలో వీటిపై అవగాహన కల్పిస్తూ క్యూఆర్ కోడ్ స్కానర్‌లను ఏర్పాటుచేశారు. ఒకసారి స్కాన్‌చేసి.. చాట్ చేస్తే చాలు 300పైగా సేవలు ఫోన్‌లోనే పొందవచ్చు. విజయవాడ జీజీహెచ్‌లో ఓపీ కౌంటర్‌కు వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండేలా.. అవగాహన కోసం ఏర్పాటుచేసిన ఈ వాట్సప్ గవర్నెన్స్ క్యూఆర్ కోడ్ చిరిగిపోయినా పట్టించుకునే వారేలేరు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ చిత్రాలతో ఏర్పాటుచేసిన ఈబోర్డు నిరుపయోగంగా ఇలా చిరిగి కనిపిస్తున్నా పట్టించుకోకపోతే ఎలా..?

– ఈనాడు, అమరావతి

పీజీ మెడికల్ యాజమాన్య సీట్లకు దరఖాస్తులు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం: 2025- 26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని ప్రైవేటు, మైనారిటీ వైద్య కళాశాలల్లో అందుబాటులో ఉన్న పీజీ మెడికల్ డిగ్రీ/డిప్లొమా యాజమాన్య కోటా సీట్ల ప్రవేశానికి విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. నీట్ పీజీ అర్హత, ఈ ఏడాది జులై 31 లోపు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన అభ్యర్థులు 23న మధ్యాహ్నం 3 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెప్పారు. అపరాధ రుసుము రూ.10వేలతో 24న ఉదయం 11 నుంచి 26న ఉదయం 11 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జనరల్/ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 50 పర్సంటైల్ (276 మార్కులు కటాఫ్ మార్కులు), జనరల్- పీడబ్ల్యూబీడీ వారు 45 పర్సంటైల్ (255 కటాఫ్ మార్కులు), ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ కేటగిరీ అభ్యర్థులు 40 పర్సంటైల్ (235 కటాఫ్ మార్కులు) ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సందేహాలుంటే 89787-80501, సాంకేతిక సమస్యలుంటే 90007-80707 నివృతి చేసుకోవచ్చని, యాజమాన్య కోటాలో 777 పీజీ మెడికల్ సీట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

సైకిల్ ఇష్టమే.. సవారీ కష్టమే

★ విజయవాడ, మచిలీపట్నం అత్యంత అనుకూలం
★ ఒక్క ట్రాక్ కూడా లేక తొక్కేందుకు వెనుకడుగు



సైకిల్ తొక్కేందుకు అత్యంత అనువైన నగరాలు.. విజయవాడ, మచిలీపట్నం. రెండు నగరాల్లో ఎక్కడా ఎత్తుపల్లాలు, కొండలు, గుట్టల మీదుగా రహదారులు లేవు. నగరం ఆ చివరి నుంచి ఈ చివరికి హాయిగా సైకిల్ తొక్కుకుంటూ వెళ్లిపోవచ్చు. కానీ రెండు నగరాల్లోనూ కనీసం ఒక్కటంటే ఒక్క సైకిల్ ట్రాక్ కూడా లేదు. అందుకే నగరవాసులు సైకిల్ తొక్కాలని ఉండి.. కొనుగోలు చేస్తున్నా.. రహదారులపైకి ధైర్యంగా వచ్చే పరిస్థితి లేదు. ఎటు నుంచి ఏ వాహనం మీదకు దూసుకొస్తుందో తెలియదు.

15 ఏళ్ల కిందటే..

విజయవాడ మున్సిపల్ కమిషనర్‌గా రవిబాబు ఉన్న సమయంలో బెంజిసర్కిల్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకూ ఓ సైకిల్ ట్రాక్‌ను 15 ఏళ్ల కిందట ఏర్పాటు చేశారు. ఉచితంగా కొన్ని సైకిళ్లను ఉంచారు. ప్రతి శనివారం సైక్లింగ్‌ను ఉదయాన్నే నిర్వహించారు. జనంలోనూ స్పందన విపరీతంగా వచ్చింది. కమిషనర్ బదిలీపై వెళ్లడంతో తర్వాత అధికారులు పట్టించుకోక ట్రాక్ గాలిలో కలిసిపోయింది. తర్వాత బీఆర్‌టీఎస్ రహదారిపైనా ట్రాక్‌కు ప్రణాళికలు సిద్ధం చేసినా అమలు జరగలేదు.

గంట చాలు..

విజయవాడ, మచిలీపట్నం.. వైశాల్యంలో రెండూ చిన్న నగరాలే. ఆ చివరి నుంచి ఈ చివరికి.. సైకిల్‌పై సరిగ్గా గంటలోపే వెళ్లిపోయేంత దూరంలోనే అన్ని ప్రాంతాలూ ఉన్నాయి. సైకిల్ వినియోగం వల్ల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణతో పాటు డబ్బులు ఆదా అవుతాయి. అందుకే పాఠశాలలు, కార్యాలయాల్లో కచ్చితంగా సైకిల్‌ను ప్రోత్సహించాలంటూ చాలాకాలంగా విజయవాడ బైసైకిల్ అసోసియేషన్ సహా పలు సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

ఆరోగ్య ప్రయోజనం

ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా సైకిల్‌ను కొనుగోలు చేయండి. రోజూ కనీసం గంటసేపు సైకిల్ తొక్కడం వల్ల శారీరకంగా ఎంతో ప్రయోజనం' అంటూ ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం(ఎస్‌పీఎఫ్) విజయవాడ రీజియన్‌కు కమాండెంట్‌గా పనిచేసిన కె.ఎన్.రావు.. పదేళ్ల కిందటే ఓ ఉద్యమంలా సైకిల్ గురించి నగరంలో ప్రచారం చేశారు. అప్పట్లో ఎస్‌పీఎఫ్ సిబ్బందికి 3వేల సైకిళ్లను కొనుగోలు చేసి ఇచ్చారు. దీనివల్ల అనూహ్యంగా సిబ్బంది వైద్య ఖర్చుల బిల్లు ఏడాదికి రూ.20 లక్షలకు పైగా తగ్గిందని స్వయంగా కె.ఎన్.రావు ప్రకటించారు. సైకిల్ తొక్కడం వల్ల కలిగే ప్రయోజనాలకు ఇదో ప్రత్యక్ష నిదర్శనం.

- ఈనాడు, అమరావతి

ఒక్క క్లిక్‌తో..

విద్యుత్తు బిల్లుల చెల్లింపు!

✷ గ్రూప్ పేమెంట్ ఫీచర్‌తో వెసులుబాటు
✷ అందుబాటులోకి తెచ్చిన సీపీడీసీఎల్...

'ఉద్యోగరీత్యా రవి విజయవాడలో స్థిరపడ్డాడు. తల్లిదండ్రులు గుంటూరు జిల్లాలో ఉంటారు. వారి ఇంటి కరెంటు బిల్లు ప్రతి నెలా రవి చెల్లిస్తుంటాడు. గత నెలలో తాను ఉంటున్న విజయవాడలో ఇంటి బిల్లు చెల్లించాడు. ఊళ్లోని బిల్లును చెల్లించడం మర్చిపోయాడు. గడువు తేదీ దాటాక గుర్తురావడంతో.. ఆ తర్వాత జరిమానాతో చెల్లించాల్సి వచ్చింది.'

తాజాగా తెచ్చిన కొత్త ఫీచర్‌తో ఈ సమస్యలకు సీపీడీసీఎల్ చెక్ పెట్టింది. ఒకటి కంటే ఎక్కువ సర్వీసుల బిల్లులు చెల్లించే వారికి ఇది ఉపకరించనుంది. దీనిని ఇటీవల డిస్కమ్‌లోని ఐటీ విభాగం ప్రవేశపెట్టింది. ఈ ఫీచర్‌ను ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల విద్యుత్తు వినియోగదారులు వాడుకోవచ్చు. ఇందుకు apcpdcl.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఈ సేవను సద్వినియోగం చేసుకోవచ్చు.

☆ ముందుగా వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలి. హోమ్ పేజీలో కనిపించే 'గ్రూప్ సర్వీసెస్ పేమెంట్' ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. తర్వాత మొబైల్ నంబరు నమోదు చేస్తే.. ఓటీపీ వస్తుంది. దీంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఆపై లాగిన్ అనే టాబ్‌పై క్లిక్ చేయాలి.

ఒకేసారి.. 20



☆ తర్వాత వచ్చే ఎడిట్ స్క్రీన్‌లో కనెక్షన్... 13 అంకెల సర్వీసు నెంబరు, మెయిల్ ఐడీ నమోదు చేయాలి. గరిష్ఠంగా 20 సర్వీసులు నమోదు చేసుకోవచ్చు. ఎక్కువుంటే.. సీపీడీసీఎల్‌కు మెయిల్‌లో విన్నవించాలి.

☆ సర్వీసు నంబర్లు నమోదు చేశాక.. ఒకేచోట వాటి సమాచారమంతా కనిపిస్తుంది. వినియోగదారు పేరు, బిల్లు తేదీ, గడువు తేదీ, డిస్‌కనెక్షన్ గడువు, కనెక్షన్ కేటగిరీ వస్తాయి. సర్వీసు నెంబర్లను సెలెక్ట్ చేసుకుంటే.. వాటి బిల్లు కింద కనిపిస్తుంది. pay the- group bill అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.

☆ తర్వాత పేమెంట్ గేట్‌వేలోకి వెళ్లాక.. బిల్లును క్రెడిట్, డెబిట్ కార్డులు, వ్యాలెట్, క్యూఆర్, యూపీఐ, గూగుల్ పే ద్వారా చెల్లించే వీలుంది. ఇలా ఒక్క క్లిక్‌తో చెల్లించవచ్చు.

ఈనాడు, అమరావతి

దిమ్మెకో లెక్క.. దశదిశా పక్కా!

కలెక్టరేట్ ఆవరణలో ఈ దిమ్మెకు.. ప్రత్యేక స్థానం ఉంది. 1910లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం జరిపిన దేశవ్యాప్త గ్రేట్ ట్రిగ్నోమెట్రికల్ భూసర్వేకు గుర్తుగా 'ప్రామాణిక బెంచ్ మార్క్' పేరుతో దీనిని నిర్మించారు. ఇది... భూమి ఉపరితలంపై స్థిర బిందువులు, సముద్ర మట్టం ఎత్తులను కచ్చితంగా తెలపటానికి ఉపకరిస్తుంది. దీని ఆధారంగా భూమి కొలతలు, పర్వతాలు, గుట్టల ఎత్తులను కొలిచేవారు. కచ్చితమైన మ్యాపింగ్, సర్వేయింగ్ నిర్ధారణకు ఇది ముఖ్య రిఫరెన్స్ పాయింట్. ఇదేతరుణంలో జియోస్పేషియల్ డైరెక్టరేట్, హైదరాబాద్ వారు.. జియోస్పేషియల్ డేటా సమగ్రతకు సంకల్పించారు.. వీటి పరిరక్షణ బాధ్యత చేపట్టి... ఆవశ్యకత తెలిసేలా బోర్డులను పెట్టారు. - ఈనాడు, అమరావతి



పది విద్యార్థులూ.. వివరాలు సరిచేసుకోవాలి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : మార్చి 2026లో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల వివరాలు యుడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో ఉన్నాయని, పాఠశాల రికార్డు ప్రకారం వాటిని విద్యార్థుల తల్లిదండ్రులు సరి చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు తెలిపారు. తర్వాత తప్పులు లేకుండా ప్రధానోపాధ్యాయుడు ఆ వివరాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. విద్యార్థి వివరాలు తప్పుగా నమోదై ఉంటే ఆధార్, అపార్ ఐడీ, యు డైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో తప్పులు ఉంటే సరి చేసుకోవడానికి పాఠశాల విద్యాశాఖ కమిషనర్ అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ఇప్పుడే జాగ్రత్తగా నమోదు చేయాలని, ఇప్పుడు సరి చేసుకోకపోతే పదో తరగతి ధ్రువపత్రాల్లో ఆ వివరాలే వస్తాయని తెలిపారు.

ఆమోదించాలంటే.. చేయి తడపాల్సిందే



✦ ఆదాయానికి గండి కొడుతున్న కొందరు వైకాపా సభ్యులు
✦ దుకాణాల లీజులు పొడిగించేందుకు ససేమిరా

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

నగరపాలక సంస్థ స్థాయీ సంఘం అవినీతి కూపంగా మారింది. కొందరు వైకాపా సభ్యులు కాసులు తీసుకోనిదే దుకాణాల లీజులు, అద్దె పెంపు ప్రతిపాదనలు ఆమోదించడం లేదు. ఫలితంగా వివిధ ప్రతిపాదనలు ఒకటికి రెండుసార్లు వాయిదా పడుతున్నాయి.

✦ కార్పొరేషన్‌కు చెందిన 61 సముదాయాల్లో 3,540 దుకాణాలు ఉన్నాయి. పలు దుకాణాల లీజుకాలం ముగిసిపోగా, అద్దె పెంచి తిరిగి 3 ఏళ్లకు పొడిగించాల్సి ఉంటుంది. అదనపు ఆదాయం సమకూరే ప్రతిపాదనలైనందున ఆమోదించాలని అధికారులు కోరినా, పలు సాకులతో వాయిదాలు వేస్తున్నారు. ఛైర్‌పర్సన్ హోదాలో మేయర్ అధ్యక్షతన నిర్వహించే సమావేశాల్లో ఆదాయానికి గండికొట్టే నిర్ణయాలపై విపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి.

✦ కొందరు స్థాయీ సంఘ సభ్యులను వ్యాపారులు కలిసి ఎంతోకొంత ముట్టజెప్పాల్సి వస్తోంది. నిరాకరించిన పక్షంలో లీజుల పొడిగింపు, అద్దెల పెంపు ప్రతిపాదనలు వాయిదాలు వేస్తున్నారు. చట్టప్రకారం 1-2 సమావేశాల్లోనే ప్రతిపాదనలు ఆమోదించాలి. కొన్నిసార్లు మేయర్ చెప్పినా.. వినడం లేదు.

నాలుగు నెలలుగా నిలిచిన ఆదాయం

వారి తీరుతో కార్పొరేషన్ అదనపు ఆదాయానికి గండిపడుతోంది. లీజు, అద్దె పెంచని కారణంగా 216 దుకాణాలపై దాదాపు 4 నెలలుగా అదనపు ఆదాయం రాలేదు. వీటిపై సగటున రూ.1.46 కోట్ల అద్దెల కింద రావాల్సి ఉండగా, 33 1/3 శాతం పెంపుతో అదనంగా రూ.48.81 లక్షలు వస్తుంది. కానీ సభ్యుల వైఖరితో అదనపు ఆదాయానికి గండి పడుతోంది.

ఇవీ ఉదాహరణలు..

✪ హోల్‌సేల్ ఫ్లవర్ మార్కెట్లో 78 దుకాణాలు, జక్కంపూడి కాలనీ కాంప్లెక్సు 5 దుకాణాల లీజు కాలం ముగిసింది. తిరిగి పొడిగింపు, 33 1/3 శాతం అద్దె పెంపు ప్రతిపాదన సెప్టెంబరు 19న స్థాయీ సంఘం ముందు ప్రతిపాదన ఉంచగా వాయిదా వేశారు. అక్టోబరు 23న తిరిగి ప్రవేశపెట్టినా మళ్లీ వాయిదా వేశారు.

✪ బ్రహ్మానందరెడ్డి కాంప్లెక్సులోని 18 దుకాణాలు, దర్శిపేట వెజిటబుల్ మార్కెట్ 16 దుకాణాలు, ఇందిరాగాంధీ మున్సిపల్ కాంప్లెక్సు 10, డ్వాక్రా బజార్, ఏఐఆర్ కాలనీ కాంప్లెక్సు 3 పటమట వీఎంసీ కాంప్లెక్సు, బొబ్బా వెంకటేశ్వరరావు షాపింగ్ కాంప్లెక్సుల 4 దుకాణాలు, దర్శిపేట చేపల మార్కెట్ 53 దుకాణాల లీజు పొడిగింపు, అద్దె పెంపు రెండుసార్లు వాయిదా వేశారు.

✪ గరిమెళ్ల సత్యనారాయణ కాంప్లెక్సు 7 దుకాణాలు, సీవీఆర్ కాంప్లెక్సు 26 దుకాణాల లీజు, అద్దె పెంపు ప్రతిపాదనలను వాయిదా వేసి సభ్యులు తమ వైఖరి చాటుకున్నారు.

స్వర్ణమయం.. చేసేదెప్పుడో..

పూర్తికాని దుర్గగుడి స్వర్ణ తాపడం పనులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే



రాష్ట్రంలో రెండో అతిపెద్ద దేవాలయమైన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం స్వర్ణతాపడం పనులు రెండు దశాబ్దాలుగా నిలిచిపోయాయి. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత రాజధాని నగరంలో దుర్గగుడి కీలకంగా మారింది. కూటమి ప్రభుత్వం దుర్గగుడి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసింది. గడిచిన వైకాపా పాలనలో అమరావతి రాజధానితో పాటు దుర్గగుడి అభివృద్ధి సైతం ఆటకెక్కింది. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత శాశ్వత ప్రాతిపదికన దేవస్థానం అభివృద్ధి చేయడంపై దృష్టిపెట్టింది. స్వర్ణ తాపడం పనులు పూర్తి చేయాలన్న లక్ష్యాన్ని నిర్ణయించింది.

- తిరుమల తరహాలో దాతలు ఇచ్చిన విరాళాలతోపాటు దేవస్థానం వద్ద ఇప్పటి వరకు ఉన్న బంగారాన్ని కూడా దీనికి వినియోగించాలని నిర్ణయించారు. 20 ఏళ్ల కిందట దుర్గగుడి ప్రధాన ఆలయం విమాన గోపురానికి 80 కిలోల బంగారాన్ని దేవస్థానం అధికారులు వినియోగించారు. అయితే తరువాత వచ్చిన అధికారులు స్వర్ణతాపడం నిమిత్తం వచ్చిన బంగారంతోపాటు హుండీల్లో వేసిన చిన్న బంగారపు వస్తువులు, హారాలు, కిరీటాలు, అభయ హస్తాలు వంటివి భద్రతా సమస్యలను దృష్టిలో ఉంచుకొని 92 కిలోలను కరిగించి గోల్డు బాండ్లుగా మార్చారు. ప్రస్తుతం దేవస్థానం వద్ద పరిమితంగా ఉన్న బంగారంతో పాటు దాతల సహకారంతో మల్లేశ్వరాలయం స్వర్ణ తాపడం చేసేందుకు 15 కిలోలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.
- నానోటెక్నాలజీ సహకారంతో ఆలయ విమాన గోపురం తాపడం పనులను వీలైనంత తక్కువ బంగారంతో పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. గతంలో దేవస్థానం అధికారులు బంగారు తాపడం పనులు పూర్తి చేయడానికి వెనకంజ వేయడంతో ఆ పనిని తిరిదే చేపట్టి విమాన గోపురం వరకు పూర్తి చేశారు.

పాలకమండలి సమావేశంలో చర్చ

ఈనెల 7న నిర్వహించిన దుర్గగుడి పాలకమండలి సమావేశంలో దేవస్థానం అధికారులతోపాటు పాలకమండలి సభ్యులు కూడా దుర్గమ్మ ఆలయ ప్రధాన గోపురంతోపాటు మల్లేశ్వరాలయాన్ని కూడా స్వర్ణ తాపడం చేయాల్సిన అంశంపై చర్చించారు. పలువురు దాతలు సైతం రాజధాని నగరంలో ప్రధానమైన దుర్గామల్లేశ్వర స్వామి ఆలయం స్వర్ణకాంతులతో విరాజిల్లాలని ముందుకు వస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ తెలిపారు. దేవాదాయ శాఖ, పాలకమండలి సమన్వయంతో స్వర్ణతాపడం పనులను ప్రభుత్వ ప్రతిష్ఠ పెంచేలా పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

భవానీలు సంతృప్తి చెందేలా అమ్మవారి దర్శనం

దీక్షల విరమణకు ఆరు లక్షల మంది వస్తారని అంచనా



సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, ఈఓ శీనానాయక్ తదితరులు

పాయకాపురం, న్యూస్‌టుడే : భవానీ దీక్షల విరమణకు వచ్చే భక్తులు.. సంతృప్తి చెందేలా అమ్మవారి దర్శనభాగ్యం కల్పించాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. డిసెంబరు 11 నుంచి 15వ తేదీ వరకు ఇంద్రకీలాద్రిపై దీక్షల విరమణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ క్రమంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు ఈవో శీనానాయక్, సీపీ రాజశేఖరబాబు హాజరై మాట్లాడారు. గతేడాది విరమణ దీక్షకు 3.20 లక్షల మంది భక్తులు వచ్చారని.. ఈ ఏడాది ఆరు లక్షల మంది వస్తారని అంచనాగా తెలిపారు. 36 సెక్టార్లను ఏర్పాటు చేశారు. హోల్డింగ్ పాయింట్‌లు, కేశ ఖండనశాలలు, స్నాన ఘాట్‌లు, గిరిప్రదక్షిణ, క్యూలైన్‌లు, ఇరుముడుల సమర్పణ, హోమగుండం, లడ్డూ విక్రయ కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉచిత భోజన కేంద్రాలు పెంచాలని పేర్కొన్నారు. సుమారు పది వేల మంది భక్తులు కలశ జ్యోతులు సమర్పిస్తారని, తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. క్యూలైన్‌లో షామియానాలు, కాలిబాట తివాచీలు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటుపై సూచనలు చేశారు.

సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా.. నగరంలో 300లకు పైగా సీసీ కెమెరాలు, అలాగే డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తామని అధికారులు తెలిపారు. క్లాక్ రూమ్‌ల సంఖ్య పెంపు, 14 లడ్డూల విక్రయ కేంద్రాలు, 850 మంది నాయీ బ్రాహ్మణులతో 24 గంటలు కేశఖండన కేంద్రం సేవలు కొనసాగేలా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. 15 లక్షల మంచి నీటి బాటిళ్లు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. జేసీ ఎస్.ఇలక్కియా, ఏడీసీపీ జి.రామకృష్ణ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ ఈఈలు జి.కోటేశ్వరరావు, పి.రాంబాబు, సహాయ ఇంజినీర్లు, పర్యవేక్షకులు, వైద్య ఆరోగ్యశాఖ, అగ్నిమాపకశాఖ అధికారులు పాల్గొన్నారు.

పునరుద్ధరణ పనుల్లో ప్రాధాన్యం ఇవ్వండి

సూర్యారావుపేట: ఉమ్మడి కృష్ణా జిల్లాలో చేపట్టిన వరద నష్ట నివారణ, పునరుద్ధరణ పనుల టెండర్లలో చిన్న, మధ్య తరహా కాంట్రాక్టర్లకు అవకాశం ఇవ్వాలని స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (సబ్కా) జిల్లా ప్రతినిధులు కోరారు. మంగళవారం జలవనరుల శాఖ కార్యాలయంలో కృష్ణాడెల్టా చీఫ్ ఇంజినీర్ రాంబాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉమ్మడి జిల్లాలో రూ.30కోట్ల విలువైన పనుల టెండర్లను ప్యాకేజీలుగా కాకుండా.. విడివిడిగా పిలవాలని విజ్ఞప్తి చేశారు. చిన్న చిన్న పనులకు టెండర్లను డివిజన్ స్థాయిలోనే ఖరారు చేయాలని, పారదర్శకంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. సబ్కా కృష్ణా అధ్యక్షుడు మండవ సాయి, కోశాధికారి వెంకటేశ్వరరాజు, సంయుక్త కార్యదర్శి భూపతిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు వీరంకి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అతివేగం.. ఆపై నిర్లక్ష్యం

లారీని ఢీకొన్న ప్రైవేట్ బస్సు ● ప్రాణాలతో బయటపడ్డ ప్రయాణికులు

నందిగామ, న్యూస్‌టుడే



ప్రమాదం ధాటికి నుజ్జయిన సీట్లు



దెబ్బతిన్న లారీ

వరుసగా ప్రైవేట్ బస్సులు ప్రమాదాలకు గురవుతున్నా డ్రైవర్లల్లో మార్పు రావటం లేదు. ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెట్టి అతివేగంగా, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే కె.కావేరీ ట్రావెల్స్ బస్సు నందిగామ మండలం అనాసాగరం వద్ద లారీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో నలుగురికి తీవ్రగాయాలు కాగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. అదృష్టం వల్ల ప్రాణాలతో బయటపడ్డారు.

★ విజయవాడ వైపు వెళ్తున్న లారీని అనాసాగరం ఫ్లై ఓవర్‌పై ఓవర్ టేక్ చేసేందుకు బస్సు డ్రైవర్ ప్రయత్నిస్తుండగా లారీని ఢీకొట్టింది. ఓవర్‌టేక్ చేసేందుకు హైవేపై తగినంత స్థలం లేక పక్కన రోడ్డు మధ్యలో డివైడర్ ఉండటంతో బస్సు డ్రైవర్ లారీని ఢీ కొట్టుకుంటూ ముందుకెళ్లి బ్రేకులు వేశాడు. అదే డివైడర్‌ను ఢీకొట్టి ఉంటే బస్సు పల్టీ కొడితే ప్రమాద తీవ్ర ఎక్కువై ప్రాణహాని జరిగేది.

నలుగురికి తీవ్రగాయాలు



నందిగామ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

బస్సులో ప్రయాణిస్తున్న ఎనిమిది మందికి గాయాలు కాగా వీరిలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి 35 మందితో బయలుదేరగా అనాసాగరం వద్దకు వచ్చే సరికి 25 మంది ఉన్నారు. ప్రమాదంతో ప్రయాణికులంతా వణికిపోయారు. కాపాడాలంటూ కేకలు వేశారు.

బస్సు సామర్థ్యం సరిగానే ఉంది

ప్రమాదానికి గురైన ప్రైవేట్ బస్సును నందిగామ ప్రాంతీయ రవాణా శాఖ అధికారిణి పద్మావతి, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ పూర్ణిమ పరిశీలించారు. బస్సు నడిపే కండీషన్ బాగానే ఉందని నిర్ధారించారు. బస్సు బ్రేక్‌లు, రిజిస్ట్రేషన్ పత్రాలు సరిగా ఉన్నట్లు గుర్తించారు. హైవేపై తగినంత స్థలం లేకపోయినా లారీని ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించడం వల్లే ప్రమాదం జరిగిందని ఎంవీఐ పూర్ణిమ తెలిపారు.

పెండింగ్ రైల్వే సమస్యలపై చర్చ



సోనాకియాకు జ్ఞాపిక అందజేస్తున్న ఎంపీ చిన్ని

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని పెండింగ్‌లోని రైల్వే సమస్యలు పరిష్కారించాలని డీఆర్ఎం మోహిత్ సోనాకియాను ఎంపీ కేశినేని శివనాథ్ కోరారు. డీఆర్ఎంగా మోహిత్ సోనాకియా బాధ్యతలు చేపట్టిన తర్వాత మంగళవారం మొదటి సారి కలిసిన ఎంపీ చిన్ని ఆయనకు అభినందనలు తెలిపి కొండపల్లి బొమ్మ బహూకరించారు. ఈ సందర్భంగా విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు, కొండపల్లి రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారాల విస్తరణ పనులతో పాటు లెవల్ క్రాసింగ్ గేట్ల అంశంపై చర్చించారు. వాంబే కాలనీ మధురానగర్ మధ్య ఎల్.హెచ్.ఎస్. నిర్మాణం త్వరగా చేపట్టాలని కోరారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్య నివారించేందుకు ప్రజల రాకపోకల ఇబ్బందులు తొలగించేందుకు కె.ఎల్.రావు బ్రిడ్జ్ (ఎర్రకట్ట) వద్ద ఆర్.ఓ.బి. ఆర్.యు.బిల నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చిన లెవెల్ క్రాసింగ్ నంబర్లు 316, 147, 148, 8 నిర్మాణానికి టెండర్లు త్వరగా పిలిచి ప్రాజెక్ట్‌లను పట్టాలెక్కించాలని కోరారు. ఎంపీ అభ్యర్థనలపై డీఆర్ఎం మోహిత్ సోనాకియా సానుకూలంగా స్పందించారు. డీసీఎం కమలాకర్ పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధిలో జిల్లాను ఆదర్శంగా నిలుపుదాం

పాయకాపురం, న్యూస్‌టుడే : స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్ఫూర్తితో పారిశ్రామిక అభివృద్ధిలో జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దుదామని కలెక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశంలో కలెక్టర్ అధికారులతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక అనుమతులు, ప్రోత్సాహకాలు, పథకాల అమలుపై దాదాపు రూ.69 వేల కోట్లతో 190 ఎంవోయూలు కుదిరాయని తెలిపారు. ప్రభుత్వం అన్ని కోణాల్లో పెట్టుబడిదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలిపారు. స్వర్ణాంధ్ర సాకారంలో పారిశ్రామిక అభివృద్ధి కీలకమని చెప్పారు. ఇటీవల విజయవాడ సెంట్రల్, మైలవరం, నియోజవర్గాలలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సులతో పాటు జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన చేసినట్లు వివరించారు. వివిధ అనుమతులకు సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి నవంబరు 17 వరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా 6037 దరఖాస్తులు రాగా, 5,949 దరఖాస్తులు పరిష్కారమయ్యాయని తెలిపారు. మిగిలిన వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు, డీపీవో పి.లావణ్యకుమారి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, లీడ్ బ్యాంకు మేనేజర్ కె.ప్రియాంక, పీసీబీ ఈఈ పి.శ్రీనివాసరావు, ఏపీఐఐసీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రమే లక్ష్యం



ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే రామ్మోహన్, నగేశ్ తదితరులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : రాష్ట్రం, దేశాన్ని మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చాలనేది ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, దివ్యాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. నషాముక్త భారత్ అభియాన్ కార్యక్రమం ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలోని [illegible] ఆడిటోరియంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ [illegible] ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. [illegible] మత్తు పదార్థాల [illegible] గంజాయి [illegible] రాల్లో మాదక ద్రవ్యాలను గుర్తించి.. వాటిని సరఫరా చేసే వారికి కఠిన శిక్షలు [illegible] చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఏ దేశానికైనా తిరుగులేని సంపద యువత అని, [illegible] మాదక ద్రవ్యాల బారిన పడకుండా నషాముక్త భారత్ అభియాన్ ద్వారా ఎన్నో అవగాహన కార్యక్రమాలు చేపట్టిందన్నారు. యువతను రక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. ఈగల్ [illegible] మాట్లాడుతూ గంజాయి పండించడం పూర్తిగా అరికట్టామని, దీని ఫలితంగా నేడు జీరో కల్టివేషన్ రాష్ట్రంగా రాష్ట్రం నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో డిసేబుల్డ్ అండ్ సీనియర్ సిటిజన్ [illegible] పాల్గొన్నారు. అనంతరం మంత్రి విద్యార్థులతో ఆంధ్ర రాష్ట్రాన్ని మాదక ద్రవ్య రహితంగా మార్చడానికి దృఢమైన సంకల్పం తీసుకుంటున్నామని ప్రతిజ్ఞ చేయించారు.

'డాక్టర్స్ అసోసియేషన్‌కు గుర్తింపు ఏది?'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్‌లో అతిపెద్ద సంఘంగా ఉన్న తమకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలని గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి. శ్రీనివాస్ కోరారు. మంగళవారం ఆయన విజయవాడ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. గుర్తింపు కోసం ప్రభుత్వానికి ఎన్ని సార్లు వినతి పత్రాలు సమర్పించినా.. ఎలాంటి స్పందన లేదన్నారు. బకాయిలు చెల్లించాలని కోరారు. డాక్టర్లకు ఆర్థిక బకాయిలు ఆపవద్దని సుప్రీం కోర్టు సూచించిన విషయాన్ని గుర్తు చేశారు. 1800 మంది వరకు తమ సంఘంలో సభ్యులు ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు డాక్టర్ బాబ్జి శ్యామ్‌కుమార్, జ్వలిత, పి.అనిల్‌కుమార్, సరళ, పర్వీన్, గిరీష్‌బాబు, స్వర్ణ, స్వరూప్‌కాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కమిషనరేట్‌లో ఆరోగ్య సురక్ష



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విజయశేఖర్

విజయవాడ నేరవార్తలు: ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌లో ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. అత్యవసర సమయాల్లో చేయాల్సిన ప్రథమ చికిత్సపై పోలీస్ సిబ్బందికి వైద్య నిపుణులు వివరించారు. ఎక్కడైనా ప్రమాదాలు జరిగినప్పుడు అందరి కంటే ముందుగా చేరుకునేది పోలీసులు అని, అందుకే ప్రథమ చికిత్సపై అవగాహన ఉండాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ డాక్టర్ కోలా విజయశేఖర్.. చికిత్స ఎలా చేయాలి? సీపీఆర్ విధానం, అధిక రక్తస్రావం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అడ్మిన్ డీసీపీ కె.జి.వి.సరిత, ఏఆర్ ఏడీసీపీ కె.కోటేశ్వరరావు, ఏఆర్ ఏసీపీ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 650 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

పాస్టర్లంతా ఐక్యంగా ఉండాలి



ఫెలోషిప్ లోగో ఆవిష్కరిస్తున్న జయప్రకాష్, థామస్, ఇన్నయ్య, శ్రీనివాసరావు తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: రాష్ట్రంలో పాస్టర్లంతా ఐక్యంగా ఉండాలని ఏపీ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ వ్యవస్థాపక అధ్యక్షుడు బిషప్ గంజికుంట జయప్రకాష్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని పాస్టర్లందరూ కలిసి యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్‌గా ఏర్పడగా, మంగళవారం రాత్రి విజయవాడలోని కందుకూరి కల్యాణ మండపంలో దీన్ని ప్రారంభించారు. దీనికి రాజమహేంద్రవరం 'దహించు అగ్ని' మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు థామస్ ముఖ్య అతిథిగా పాల్గొని దైవసందేశం అందించారు. ఫెలోషిప్ అధ్యక్షుడు జయప్రకాష్ మాట్లాడుతూ.. ఈ ఫెలోషిప్ రాష్ట్రంలోని అన్ని మండలాల్లో ఉండే స్థానిక ఫెలోషిప్‌లతో కలిసి పనిచేస్తుందన్నారు. విశిష్ట అతిథి ఫాదర్ బెల్లంకొండ ఇన్నయ్య మాట్లాడుతూ.. అర్హత కలిగిన పాస్టర్లకు ఇచ్చే మ్యారేజ్ లైసెన్స్ విషయంలో దళారీల వ్యవస్థ లేకుండా ఉచితంగా అందించేందుకు ఫెలోషిప్ కృషి చేస్తుందన్నారు. మంచి పాలన సాగించేలా సీఎం చంద్రబాబు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయాలని పాస్టర్లకు సూచించారు. పాస్టర్లందరికీ ఫెలోషిప్ నుంచి పూర్తి సహకారం ఉంటుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రకాష్ తెలిపారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వడ్లమూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పాస్టర్లపై దాడులు జరిగినప్పుడు ఫెలోషిప్ వెంటనే స్పందిస్తుందన్నారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు పి.సుందరరావు, పి.నతానియేల్, కార్యదర్శి ఎ.యెహోషువ, కోశాధికారి కె.మోజెస్, ముఖ్య సలహాదారుడు ఎ.మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

'హిడ్మా ఎన్‌కౌంటర్‌పై సీబీఐ విచారణ చేపట్టాల్సిందే'

విజయవాడ (సూర్యారావుపేట), న్యూస్‌టుడే : దేశవ్యాప్తంగా మతం ముసుగులో ఒక పథకం ప్రకారం మారణహోమం జరుగుతున్నా.. మోదీ ప్రభుత్వం మౌనం ప్రదర్శించడం దారుణమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ మండిపడ్డారు. దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులను ఖండిస్తూ దేశవ్యాప్త నిరసనల్లో భాగంగా మంగళవారం సాయంత్రం విజయవాడలోని అంబేడ్కర్ స్మృతివనంవద్ద సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కె.రామకృష్ణ మాట్లాడుతూ.. దేశంలో దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని, మైనార్టీలను చిన్న చూపు చూడడం సరికాదన్నారు. దాడులకు పాల్పడుతున్న మతోన్మాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడుస్తున్నా.. అణగారిన వర్గాలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జనగణనలో కులగణన చేపట్టి ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కగర్ పేరుతో అమాయక గిరిజనులను కాల్చివేస్తున్నారని మండిపడ్డారు. ఆంధ్రా, తెలంగాణ సరిహద్దుల్లో జరిగిన హిడ్మా ఎన్‌కౌంటర్‌పై సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. విజయవాడలో పట్టుబడిన మావోయిస్టులను వెంటనే న్యాయస్థానంలో హాజరుపరచాలని కోరారు. దేశంలో పెరిగిపోతున్న ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ రాబోయే రోజుల్లో అన్ని విపక్షాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జల్లి విల్సన్, దోనేపూడి శంకర్, పెనుమత్స దుర్గాభవానీ, పంచదార్ల దుర్గాంబ, లంకా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కె.రామకృష్ణ. పక్కన కోటేశ్వరరావు, విల్సన్, శంకర్ తదితరులు

కమీషన్ ఇస్తామని కన్సల్టెన్సీకి టోకరా..

పటమట, న్యూస్‌టుడే : కమీషన్ ఎక్కువ ఇస్తామంటూ ఏకంగా కన్సల్టెన్సీకే రూ.30 లక్షలు టోకరా పెట్టాడు ఘరానా మోసగాడు. దీనిపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం. పటమటకు చెందిన శరత్‌చంద్ర, శ్రీలక్ష్మి దంపతులు గ్లోబల్ అడ్వాంటేజ్ అనే ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నారు. విదేశాల్లో ఉన్నత చదువులు చదవాలనుకునే విద్యార్థులకు వీసా ప్రాసెస్‌తో పాటు రుణాలు ఇప్పిస్తుంటారు. దానికి కొంత మొత్తంలో కమీషన్ తీసుకుంటారు. ఈ క్రమంలో వారికి సమీప బంధువైన బోడ్డుపల్లి అభినందన్ వారి వద్దకు వచ్చి తాను పని చేస్తున్న బ్యాంకు నుంచి రుణాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. తనకు తెలిసిన ఇద్దరి ద్వారా విద్యార్థులను విదేశాలకు పంపితే విద్యార్థులు చెల్లించే ఫీజులో 5 శాతం ఇస్తామని నమ్మబలికాడు. దీంతో పలువురి విద్యార్థులకు సంబంధించి ముందస్తుగా రూ.30 లక్షలను అభినందన్ తెలిపిన ఖాతాలకు వారు పంపారు. నెల తర్వాత విదేశాల్లోని విద్యార్థులు తమ ఫీజులు చెల్లించలేదని శ్రీలక్ష్మికి తెలిపారు. దీంతో అభినందన్‌ను అడుగగా తనకు సంబంధం లేదని అతను చెప్పాడు. విద్యార్థులు ఒత్తిడి చేయగా శరత్‌చంద్ర దంపతులు ఆ నగదు చెల్లించారు. దీనిపై శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు అభినందన్‌తో పాటు మరో ఇద్దరిపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు.

విశ్వ ఆయుర్వేద పరిషత్ నూతన కార్యవర్గం ఎన్నిక

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ విశ్వ ఆయుర్వేద పరిషత్ విజయవాడ విభాగ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు డాక్టర్ నల్లు ధరణికుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ శివకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డాక్టర్ ప్రశాంత్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు చెప్పారు. ఆయుర్వేద వైద్యులు, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

చెవిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటేష్ నాయుడులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా పడింది. విజయవాడలోని ఏసీబీ కోర్టులో మంగళవారం విచారణకు వచ్చింది. వీటిని తదుపరి విచారణ నిమిత్తం ఈనెల 21కి న్యాయాధికారి వాయిదా వేశారు. జైలులో వసతులు కల్పించాలని చెవిరెడ్డి పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని సిట్‌ను ఆదేశిస్తూ.. బుధవారానికి కోర్టు వాయిదా పడింది. ఇదే కారాగారంలో రిమాండ్‌లో ఉన్న బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణలు మంగళవారం బెయిల్ పిటిషన్లు వేశారు. ఇవి నోటీసుల కోసం వాయిదా పడ్డాయి.

అసభ్యకర పోస్టుల కేసులో విజయ్‌భాస్కర్‌రెడ్డి కస్టడీ పిటిషన్...

ఈనాడు డిజిటల్ - మచిలీపట్నం: సామాజిక మాధ్యమాల్లో మహిళలు, కూటమి నేతలు, న్యాయమూర్తులే లక్ష్యంగా అసభ్య పోస్టులు పెట్టి జైల్లో ఉన్న మాలపాటి విజయ్‌భాస్కర్‌రెడ్డిని వారం రోజులు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్, నిందితుడి బెయిల్ పిటిషన్ బుధవారానికి వాయిదా పడ్డాయి. విజయ్‌భాస్కర్‌రెడ్డిని అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన క్రమంలో పోలీసులతో దురుసుగా వ్యవహరించిన కేసులో నిందితుడిని అరెస్టు చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేశారు. డిసెంబరు 2లోగా నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచాలని న్యాయాధికారి ఆదేశాలు ఇచ్చారు. నిందితుడు నెల్లూరు కేంద్రకారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. పోలీసులపై దాడి చేసిన కేసులో అరెస్టయి రిమాండ్‌లో ఉన్న విజయ్‌భాస్కర్‌రెడ్డి సోదరుడు ఓబుల్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ పూర్తయింది. ఈ నెల 24న దీనిపై కోర్టు తీర్పు వెలువరించనుంది.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

ఉపకరణాల నిర్ధారణ శిబిరం నేడు

మైలవరం : సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని దివ్యాంగులకు కావాల్సిన ఉచిత ఉపకరణాల కోసం ఈ నెల 19న స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్ధారణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు సమన్వయ కర్త ఎం.రజనికుమారి తెలిపారు. నియోజకవర్గంలో 18 సంవత్సరాల లోపు వయసు ఉండి, సదరం ధ్రువపత్రం కలిగిన విద్యార్థులు వారి పాఠశాలల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. శిబిరానికి వచ్చే విద్యార్థులు, తల్లిదండ్రులకు భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

✤ స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహ భవన నిర్మాణ పనులకు ఈ నెల 19న ఉదయం 10 గంటలకు మైలవరం శాసన సభ్యుడు వసంత కృష్ణప్రసాద్ శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన కార్యాలయ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 3 కోట్ల వ్యయంతో భవనాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు.

92 మందికి ఉచిత నేత్ర పరీక్షలు

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని గోసవీడులో మంగళవారం తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి కొత్తా రజనీకాంత్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. బాపులపాడు మండలం చిన్నఅవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల వైద్యులు సాహిత, సంజన పాల్గొని 92 మందికి కంటి పరీక్షలు చేశారు. ఏడుగురిని శస్త్రచికిత్సకు ఎంపిక చేసి ప్రత్యేక బస్సులో ఆసుపత్రికి తీసుకెళ్లారు. అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. తెదేపా నాయకులు కె.వెంకటేశ్వర్లు, జి.మంగయ్య తదితరులు పాల్గొన్నారు.



గోసవీడులో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



తిరువూరులోని 8వ వార్డు కాలువల నుంచి తీసిన బురద, వ్యర్థాలను తన ఇంటి ముందు నిల్వ ఉన్నాయని స్థానికుడైన రామకిశోర్ ‘ఈనాడు’ మేమున్నాం..మీకు తోడుగా ద్వారా చేసిన ఫిర్యాదుపై మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులను పంపించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. ✤ స్థానిక ఒకటో వార్డులోని డ్రెయిన్లలో పూడిక పేరుకుందని స్థానికురాలైన అప్సరీబేగం ‘మేమున్నాం.. మీకు తోడుగా’ ద్వారా చేసిన ఫిర్యాదుపై మున్సిపల్ శానిటరీ అధికారి స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులను పంపించి కాలువల్లో పూడిక తీయించారు. సమస్య పరిష్కరించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

సాగర్ జలాల సరఫరా పరిశీలన

గంపలగూడెం: ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కొప్పలబంధం 72వ నియంత్రిక నుంచి మధిర బ్రాంచి కెనాల్‌కు మంగళవారం 620 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదలైనట్లు ఏఈఈలు మహేష్ బాబు, సునీత నాగలక్ష్మి తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 332 క్యూసెక్కులు చేరగా, దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం- 20, ఊటుకూరు- 1కి 40, పెదకొమిర- 25, మధిర- 30, నిదానపురం- 40 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. మధిర మేజర్ కాల్వకు సరఫరా చేసిన జలాలను ఏఈలతో పాటు నీటి సంఘం అధ్యక్షుడు అచ్చంరాజు తదితరులు పరిశీలించారు.

పరిధి విస్తారం.. పర్యవేక్షణ పరిమితం

కొండపల్లి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

★ కొండపల్లి శివారు పారిశ్రామికవాడ వద్ద గత నెల 10న గ్రామ నగరకు చెందిన ఓ వివాహిత హత్యకు గురైంది. మరుసటి రోజు ఉదయం స్థానికులు భయాందోళనకు గురై పోలీసులకు సమాచారం ఇచ్చారు.

★ నవంబర్ 6న ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయనపాడు బాట్ పాట్ వద్ద ఇబ్రహీంపట్నానికి చెందిన మహిళ బలవన్మరణం చెందారు. హత్య, ఆత్మహత్య అనే సందేహాలు సైతం అప్పట్లో వ్యక్తమయ్యాయి.

★ ఇబ్రహీంపట్నం సహాయమాత పాఠశాల సమీపం లోని పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

★ గుంటుపల్లి శివారు మామిడి చెట్ల వద్ద ఇతర రాష్ట్రానికి చెందిన వ్యక్తి బలవన్మరణం చెందాడని స్థానికులు గుర్తించి పోలీసులకు తెలిపారు.

ఇటువంటి సంఘటనలకు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ శివారు ప్రాంతాలు వేదికగా మారాయి. గత ఆరు నెలల్లో బలవన్మరణాలు- 8, అనుమానాస్పద మృతి కేసులు- 10 వరకూ నమోదు కావడం స్థానికుల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఇది ముమ్మాటికీ నిఘా వైఫల్యామేనని ప్రజలు ఆరోపిస్తున్నారు.



ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్

నిఘా పెట్టడం కష్టం

స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి విస్తారంగా ఉండటంతో ఆయా ప్రాంతాల్లో నిఘా పోలీసులకు కష్టంగా మారింది. కంచికచర్ల మండలం పరిటాల శివారుతో పాటు జాతీయ రహదారులు, కొండపల్లి పారిశ్రామికవాడ, విజయవాడ రూరల్ శివారు రాయనపాడు, పైడూరుపాడుతో పాటు కృష్ణానదీ తీరం స్టేషన్ పరిధిలోనే ఉండటంతో పరిమితమైన సిబ్బందితో పర్యవేక్షణ అసాధ్యంగా మారింది.

వివాదాలకు కొరతే లేదు..

కొండపల్లి పురపాలక సంఘం, మండలంలోని గ్రామాలు స్టేషన్ పరిధిలోనే ఉన్నాయి. పురపాలికలో పూర్తిగా నగర వాతావరణం నెలకొనగా ఇతర చోట్ల గ్రామీణ వాతావరణం ఉంటుంది. పురపాలికలో నిత్యం ఏదో వివాదం స్టేషన్‌కు రావడం సాధారణం. దీంతో పాటు భూములకు అనుసంధానంగా ఉన్న వివాదాలకు కొరతే లేదు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడమే పోలీసులకు, ట్రాఫిక్ సిబ్బందికి పెద్ద సవాలు అని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో శివారు ప్రాంతాల పర్యవేక్షణ సిబ్బందికి, అధికారులకు కత్తిమీద సాముగా మారింది. వీటన్నింటికి మించి నగరంలో ఏ కార్యక్రమం జరిగినా స్థానిక సిబ్బంది మొత్తం అక్కడ విధుల్లో ఉంటారు.

సిబ్బంది గస్తీలోనే..

శివారు ప్రాంతాల వరకూ మొబైల్ బృందాలు గస్తీ కాస్తూనే ఉన్నారు. రెండు వాహనాల్లో ఎస్సైలు, ఆరు ద్విచక్ర వాహనాలపై 12 మంది సిబ్బంది గస్తీకి వెళ్తున్నారు. వీరికి తోడు జాతీయ రహదారులపైన నేషనల్ హైవే వెహికల్ వస్తోంది. **- సీఐ చంద్రశేఖర్**

ఉత్సాహంగా వక్తృత్వ పోటీలు



విజేతలతో ప్రిన్సిపల్ రఘునాథ్, ఉపాధ్యాయులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : స్థానిక శ్రీశ్రీనివాస హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు ‘ఈనాడు’ ఆధ్వర్యంలో ‘విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్’ ప్రభావం అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో 8, 9, 10 తరగతుల వారు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు. బి.జస్విక్ రెడ్డి(7వ తరగతి), ఎం.వాత్సల్య(9వ తరగతి), కె.ఉదయ్ చరణ్(7వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు శ్రీశ్రీ విద్యాసంస్థల డైరెక్టర్ ఎన్.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ ఎం.రఘునాథ్ బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు ఎ.రాజరమేష్, ఎస్.మన్మధరావు, జి.సాయి ప్రసన్న, ఎస్కే. అతియా సుల్తానా, వి.నీలిమ, జి.అంజమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వం ఇచ్చిన మంజూరు చేసిన నిధులతో నియోజకవర్గ పరిధిలోని ఆర్‌అండ్‌బీ రహదారుల అభివృద్ధి, మరమ్మతుల పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు ఆ శాఖ అధికారులను కోరారు. మంగళవారం తిరువూరులోని తన కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అభివృద్ధి చేయాల్సిన రహదారుల గురించి చర్చించారు. ఆర్‌అండ్‌బీ ఈఈ ఎం.సిద్ధయ్య, డీఈఈ ఎం.రాజుకుమారి, ఏఈఈలు ఓ.అద్భాయిరావు, గాయత్రి పాల్గొన్నారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : అన్నదాత సుఖీభవ రెండో విడత, పీఎం కిసాన్ యోజన 21వ విడత నిధులు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్న సందర్భంగా బుధవారం గంపలగూడెం వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద నిర్వహించే నియోజకవర్గ స్థాయి కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు పాల్గొంటారని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి.

54,174 మంది రైతులకు లబ్ధి

ఇబ్రహీంపట్నం (గ్రామీణం), న్యూస్‌టుడే : మైలవరం వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని 54,174 మంది రైతులకు రెండో విడత పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా ఈ నెల 19, 91 కోట్లను ప్రభుత్వం బుధవారం జమ చేయనున్నట్లు సహాయ సంచాలకుడు శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలంలోని మూలపాడులో జరిగే ఈ కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పాల్గొననున్నారు.

మారెమ్మ తల్లి దేవస్థాన కమిటీ ప్రమాణ స్వీకారం

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండలంలోని పుట్రేల మారెమ్మ తల్లి దేవస్థానం ఛైర్మన్‌గా తెల్ల శ్రీనివాసరావు, పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. దేవస్థానం ఈవో దుర్గాప్రసాద్, గన్నవరం గ్రూప్ దేవస్థానాల అధికారి ఆమోదం ప్రకారం కార్యక్రమం నిర్వహించారు. తెదేపా యువ నాయకుడు, ఎన్నారై వల్లభనేని గిరిబాబు, గొట్టిటి సుబ్రహ్మణ్యం(బుడ్డయ్య), రాయల సుబ్బారావు పాల్గొన్నారు.



ప్రమాణం చేస్తున్న ఛైర్మన్ శ్రీనివాసరావు, పాలక మండలి సభ్యులు

వనసమారాధన జరుపుకోవడం మన సంప్రదాయం

జి.కొండూరు, న్యూస్‌టుడే : కార్తిక మాసంలో వనసమారాధన జరుపుకోవడం మన సంప్రదాయమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం ఆధ్వర్యంలో చెవుటూరు మామిడితోటలో నిర్వహించిన వనసమారాధనకు ఆయన హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



చెవుటూరు : ప్రత్యేక పూజలో మాధవ్, శ్రీరాం తదితరులు

మైలవరం, న్యూస్‌టుడే : కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మైలవరంలోని ర.భ.కార్యాలయ అధికారులు, సిబ్బంది మంగళవారం భోజన విరామ సమయంలో స్థానిక తోటల్లో వన భోజనాలు నిర్వహించారు. ర.భ.ఈఈ ఎం.సిద్ధయ్య, డీఈ అప్పారావు, అధికారులు జి.శ్రీకాంత్, కేఎస్ సుకుమార్, అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



గంపలగూడెం: దీపాల వద్ద భక్తులు



మైలవరం మండలం వెల్వడంలో..



గొల్లపూడి శివాలయంలో..



కొత్తపల్లిలో..

వైభవంగా కార్తిక దీపోత్సవం

కార్తిక మాసం సందర్భంగా మంగళవారం తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లోని శివాలయాల్లో భక్తులు దీపోత్సవాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఎ.కొండూరు మండలం రామచంద్రాపురంలో తెదేపా నాయకుల ఆధ్వర్యంలో జరిగిన దీపోత్సవంలో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, బృందం**

ఘనంగా పడిపూజ

జి.కొండూరు, న్యూస్‌టుడే : స్థానిక పార్వతీ సమేత అమృత లింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అయ్యప్ప స్వామి భక్తులు పడిపూజ నిర్వహించారు. గురుస్వాముల ఆధ్వర్యంలో మండలంలోని అయ్యప్పలు భక్తి గీతాలు ఆలపిస్తు ఇందులో పాల్గొన్నారు.



భజన చేస్తు భక్తి గీతాలు ఆలపిస్తున్న స్వాములు

మురుగు పోయేదెలా.. వాసన తొలగేదెలా!



స్థానిక టమాట మార్కెట్ సమీపంలోని కాలువలో మురుగు నిలిచి దుర్గంధంతో అపరిశుభ్రంగా తయారైంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కాలువ పల్లంగా ఉండి మురుగు పారే అవకాశం లేకపోవడంతో నీరంతా అక్కడే నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని ఆవేదన చెందుతున్నారు. మరో పక్క చుట్టు పక్కల వారందరూ చెత్త చెదారం ఆ ప్రదేశంలో పడేస్తున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

దారంతా గోతులు.. నిత్యం అవస్థలు

రెడ్డిగూడెం గ్రామంలోని ఎన్నెస్పీ నూజివీడు బ్రాంచి కాల్వ దగ్గర నుంచి తూర్పు వైపు ఉన్న పంట పొలాలు, మామిడి తోటలకు వెళ్లే డొంక రోడ్డు గోతులమయంగా మారడంతో అన్నదాతలు ఇక్కట్లు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ రహదారి బురదమయంగా తయారైంది. రహదారికి ఇరువైపుల పెరిగిన పిచ్చిపొదల మధ్య రాకపోకలు సాగించాలంటే అవస్థలు పడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. మామిడి తోటల్లో వ్యవసాయ పనులు, ఎరువులు ట్రాక్టర్లలో తరలించేందుకు ఇబ్బంది పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. గతంలో పెద్ద వాగు వైపు నుంచి వెళ్లేందుకు కొంతమేర అవకాశం ఉండేది. భారీ వర్షాలకు వాగు కోతకు గురై అటు వైపు వెళ్లలేక పోతున్నామని కర్షకులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి ఈ రహదారి అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. **– రెడ్డిగూడెం, న్యూస్‌టుడే**



రెడ్డిగూడెం : అధ్వానంగా మామిడి తోటలకు వెళ్లే డొంక రోడ్డు

నిర్వహణ నీదా.. నాదా?

మండల పరిధి గణపవరంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ అధికార పార్టీలో వర్గపోరాటానికి దారి తీసింది. ఆయాగా పని చేస్తున్న మహిళకే భోజన ఏజెన్సీ ఎలా అప్పగిస్తారంటూ మొదలైన రగడ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసే వరకు వెళ్లింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తుండగా 125 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరికి మధ్యాహ్న భోజన పథకానికి వంట ఏజెన్సీగా ఉన్న మహిళ ఈ ఏడాది మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యురాలే అప్పటి నుంచి అదే పాఠశాలలో ఆయాగా విధులు నిర్వర్తిస్తుండగా, ఈ ఏడాది వంట బాధ్యతలూ అప్పగించారు. దాంతో ఒకే మహిళకు రెండు బాధ్యతలు ఇవ్వడంపై గ్రామంలోని పలువురు నాయకులు ప్రశ్నిస్తూ మార్చాలని డిమాండ్ చేశారు. తనకు బిల్లులు బకాయిలు ఉన్నాయని, వాటిని ఇస్తే ఏజెన్సీ వదిలేస్తానని ఆమె చెప్పగా అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో బాధ్యతల మార్పు విషయంలో మండల అధికారి సరిగా వ్యవహరించడం లేదంటూ గత వారం విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల విభాగంలో నాయకులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంఈవో ఎల్.బాలును సంప్రదించగా, విషయం ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. **- న్యూస్‌టుడే, మైలవరం**



జడ్పీ ఉన్నత పాఠశాల, గణపవరం

‘నాలుగేళ్లుగా గౌరవ వేతనం ఇవ్వడం లేదు’



వేదికపై శ్రీలక్ష్మి, శామ్యూల్, సరస్వతి, రాజకుమారి

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండల పరిషత్ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఎంపీటీసీ సభ్యులు సత్వరమే పూర్తి చేయాలని ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి కోరారు. గతంలో ఎంపీటీసీలకు తమ గ్రామాల్లో అభివృద్ధికి రూ.1.40 కోట్లు మంజూరు చేయగా ఇంకా పూర్తిగా పనులు చేపట్టలేదన్నారు. తాజాగా మరో రూ.1.20 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. పీఆర్ ఏఈ పూర్ణచంద్రరావు నుంచి అంచనా, తీర్మానం ప్రతులను తీసుకుని పనులు ప్రారంభించాలని సూచించారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శ్రీలక్ష్మి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. అనుముల్లంక ఎంపీటీసీ సభ్యురాలు గౌరసాని కమల మాట్లాడుతూ తమ గ్రామానికి కేటాయించిన రూ.13 లక్షలతో పనులు చేపట్టేందుకు గ్రామ పంచాయతీ నుంచి తీర్మానం ఇవ్వడం లేదన్నారు. దీనిపై ఎంపీడీవో టి.సరస్వతి స్పందించి పంచాయతీ తీర్మానం ఇచ్చేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కార్యదర్శి మాణిక్యాలరావును ఆదేశించారు. తహసీల్దార్ వి.రాజకుమారి, ఏవో వి.హరీష్ కుమార్, ఎంఈవో నరసింహారావు, డిస్కం ఏఈ సీహెచ్.శ్రీనివాసరావు, గృహ నిర్మాణ సంస్థ ఏఈ స్వర్గం కిషోర్ పలు అంశాలపై మాట్లాడారు. సమావేశంలో పాల్గొన్న ఎంపీటీసీలు తమకు నాలుగేళ్లుగా గౌరవ వేతనం ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. మరికొన్ని నెలల్లో పదవీ కాలం పూర్తవుతున్న నేపథ్యంలో తమ వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. జడ్పీటీసీ సభ్యుడు కె.శామ్యూల్, సీడీపీవో పి.కృష్ణకుమారి, ఎన్నెస్పీ ఏఈ సునీత నాగలక్ష్మి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ మోసాలపై అప్రమత్తత అవసరం

మైలవరం, న్యూస్‌టుడే : కొత్త పుంతలు తొక్కుతున్న మోసాల్లో డిజిటల్ అరెస్టు ఒకటని, అసలు అటువంటిదే లేదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సీఐ డి.చంద్రశేఖర్ సూచించారు. కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం స్థానికంగా ఉన్న బ్యాంకుల్లో సైబర్ నేరాలపై అవగాహన నిర్వహించారు. ఆయా బ్యాంకుల్లో సిబ్బందికి, వినియోగదారులకు పలు అంశాలను వివరించారు. డిజిటల్ అరెస్టు, ఆన్‌లైన్ మోసాలు, ఇతర సైబర్ నేరాలు జరుగుతున్న తీరును తెలిపారు.



మైలవరం : బ్యాంకులో సూచనలు ఇస్తున్న సీఐ చంద్రశేఖర్

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : పట్టణంలోని అన్ని ప్రధాన బ్యాంకుల్లో తిరువూరు పోలీసులు అవగాహన కల్పించారు. ఇందులో ఎస్సై సత్యనారాయణ మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్న నేపథ్యంలో మోసగాళ్లు వినియోగదారులను లక్ష్యంగా చేసుకుంటుండంతో జాగ్రత్తలు అత్యవసరమని స్పష్టం చేశారు.

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండల పరిధిలోని వాణిజ్య, సహకార, గ్రామీణ బ్యాంకుల అధికారులు, ఖాతాదారులకు స్థానిక ఎస్సై జి.మహాలక్ష్మణుడు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఏదైనా మోసం జరిగినట్లు గుర్తిస్తే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరు మండలం మల్లేల వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరువూరు- నూజివీడు రోడ్డుపై వెళ్తున్న కారు మల్లేల వద్ద పొలంలో నుంచి రహదారిపైకి వస్తున్న ట్రాక్టరును బలంగా ఢీ కొట్టింది. ఆ వెనుకే వస్తున్న మరో కారు దీన్ని ఢీకొంది. స్థానికులు గమనించి పోలీసులకు, 108కు సమాచారం అందించారు. కారులో ఉన్న నలుగురు తెలంగాణ రాష్ట్రం చిన్నమ్మగూడెంకి చెందిన వారు కాగా వీరిలో పెద్ద బసవయ్య(80) అనే వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన ముగ్గురికి గాయాలు అవ్వడంతో తిరువూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పెద్ద బసవయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

✤ **ఆటో ఢీకొని లారీ చోదకుడు..**

ఇబ్రహీంపట్నం, ఇబ్రహీంపట్నం (గ్రామీణం), న్యూస్‌టుడే : జాతీయ రహదారి జూపూడి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ చోదకుడు మృతి చెందాడు. సిమెంట్‌ లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ గఫూర్(47) మంగళవారం జగ్గయ్యపేటలోని సిమెంట్ కంపెనీ నుంచి లోడుతో చెన్నైకి బయలుదేరారు. మార్గం మధ్యలో జూపూడి వద్ద లారీ నిలిపి రోడ్డు పక్కన ఆయిల్ కొనుగోలు చేశారు. తిరిగి లారీ వద్దకు వస్తుండగా రహదారి దాటుతుండగా విజయవాడ వైపు వస్తున్న ఆటో ఆతడిని ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ అతనిని చికిత్స నిమిత్తం సమీపంలోని నిఘా ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ఆలయాల్లో అమ్మవారి సూత్రాల చోరీ

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక వైకుంఠధామం వెనుక ఉన్న శ్రీదేవరకొండ అమ్మవారు, పాండురంగ స్వామి దేవాలయాల్లో చోరీ జరిగింది. ఆలయాల్లోకి చొరబడిన దొంగలు, అమ్మవారి విగ్రహాల మెడలోని బంగారు సూత్రాలను దొంగిలించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మంగళవారం ఉదయం ఆలయానికి వచ్చిన వారికి తలుపులు తెరచి ఉండటంతో, గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


దాడికి పాల్పడిన ఇద్దరు నిందితుల అరెస్టు

గంపలగూడెం, తిరువూరు టౌన్ : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో హత్యాయత్నం కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఆర్థిక లావాదేవీల విషయంలో పెనుగొలను గ్రామానికి చెందిన హేమంత్ రెడ్డిపై ఆదే గ్రామానికి చెందిన డి.రాంరెడ్డి, సాంబశివరావు ఇటీవల దాడికి పాల్పడగా గాయపడిన హేమంత్ రెడ్డి తిరువూరు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారు.

కరాటేలో ప్రతిభ

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని శ్రీనివాస జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మల్లవల్లి లక్ష్మీప్రసన్న తెలంగాణ రాష్ట్రం మేడ్చల్‌లో ఈ నెల 16న నిర్వహించిన కరాటే అండర్- 18 విభాగంలో బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా ఆ కళాశాల డైరెక్టర్ పూర్ణచంద్రరెడ్డి, అధ్యాపకులు వెంకటేశ్వరరావు, హరిబాబు, వేణుబాబు, సిబ్బంది ఆమెను శుభాకాంక్షలు తెలిపారు.





ఈనాడు బిజినెస్

సెన్సెక్స్ @ 1,07,000 పాయింట్లు!

2026 డిసెంబరుకు చేరొచ్చు: మోర్గాన్ స్టాన్లీ అంచనా



దేశీయ స్టాక్ మార్కెట్ల భవిష్యత్తు అంచనాలను ప్రముఖ బ్రోకరేజీ సంస్థ మోర్గాన్ స్టాన్లీ విశ్లేషకులు పెంచారు. బుల్ మార్కెట్ పరిస్థితుల్లో.. 2026 డిసెంబరుకు సెన్సెక్స్ 1,07,000 పాయింట్లకు చేరొచ్చని అంచనా వేశారు. ప్రస్తుత స్థాయులతో పోలిస్తే ఇది 26% అధికం. బుల్ మార్కెట్‌లో 2026 జూన్‌కు సెన్సెక్స్ 1,00,000 పాయింట్లకు చేరొచ్చని మోర్గాన్ స్టాన్లీ ఇంతకుముందు అంచనా వేసింది. 1994 తర్వాత, ఈ ఏడాదిలో ఇతర వర్ధమాన మార్కెట్లతో పోలిస్తే, మన మార్కెట్ అధ్వాన పనితీరును నమోదుచేసింది. షేర్లు అధిక విలువల నుంచి అర్థవంతంగా దిద్దుబాటుకు గురయ్యాయని, ఇకపై ఇది ఆగొచ్చని మోర్గాన్ స్టాన్లీ వెల్లడించింది.

✦ రాబోయే నెలల్లో భారత్ సానుకూల వృద్ధి నమోదుచేయడానికి సిద్ధంగా ఉందని, మన మార్కెట్ల రేటింగ్ మార్చేందుకు ఇది సమయమని సంస్థ విశ్లేషకులు ఇటీవలి నివేదికలో తెలిపారు. 2026 డిసెంబరుకు బేస్ కేస్‌లో సెన్సెక్స్ 95,000 స్థాయికి చేరొచ్చని, ఇందుకు 50% అవకాశం ఉందన్నారు.

రిలయన్స్ 'పెట్ ఆహారం' వ్యాగీస్

దేశంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న పెంపుడు జంతువుల ఆహార ఉత్పత్తుల రంగంలోకి రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ రిలయన్స్ కన్జ్యూమర్ ప్రోడక్ట్స్ లిమిటెడ్ (ఆర్‌సీపీఎల్) అడుగు పెట్టబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ విభాగంలోని సంస్థల ఉత్పత్తుల ధరలతో పోలిస్తే 20-50% తక్కువకే తన ఉత్పత్తులు అందించాలని అనుకుంటోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. వ్యాగీస్ బ్రాండ్‌పై ఈ ఉత్పత్తులు తీసుకొస్తామని డిస్ట్రిబ్యూటర్లకు కంపెనీ సమాచారం ఇచ్చినట్లు ఆర్‌సీపీఎల్ అధికారి తెలిపారు.

డబ్ల్యూకామర్స్ సారథ్యంలో ఆన్‌లైన్ స్టోర్లు

ఈనాడు, హైదరాబాద్: పెట్టుబడితో పని లేకుండా ఆన్‌లైన్ స్టోర్లు నిర్వహించేందుకు అండగా నిలుస్తున్నట్లు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న రిటెయిల్ టెక్నాలజీ సేవల సంస్థ డబ్ల్యూకామర్స్ తెలిపింది. ఈ వ్యాపార విధానంలో పెట్టుబడులు అవసరం లేదని, సరకు నిల్వ చేయాల్సిన పనిలేదని పేర్కొంది. తమ వద్ద నమోదైన వారి పేరిట, ఆన్‌లైన్ స్టోరును క్రియేట్ చేస్తామని, ఈ లింక్/క్యూఆర్ కోడ్‌ను సోషల్ మీడియా వేదికల్లో పోస్ట్ చేస్తే సరిపోతుందని వివరించింది. వాటిద్వారా ఆర్డరు పెట్టిన వారికి, వస్తువుల డెలివరీని డబ్ల్యూకామర్స్ నిర్వహిస్తుంది. విక్రేతకు లాభంలో వాటా పంచుతామని డబ్ల్యూకామర్స్ వ్యవస్థాపకుడు ఎస్.శ్రీధర్ వివరించారు..

కోడి గుడ్లు

19న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	625
వరంగల్	627
విజయవాడ	650
తూ/ప గోదావరి	630
విశాఖపట్నం	615
చిత్తూరు	663

ప్రాట్ అండ్ విట్నీ కెనడాతో ఆజాద్ ఇంజినీరింగ్ ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: విమానాలు, రక్షణ ఉత్పత్తులకు కీలక ఇంజినీరింగ్ విడిభాగాలు అందించే ఆజాద్ ఇంజినీరింగ్, కెనడాలోని ప్రాట్ అండ్ విట్నీ కార్ప్‌తో వ్యాపార ఒప్పందం కుదుర్చుకుంది. సుదీర్ఘకాలం పాటు కలిసి పనిచేయడం, ఏరోస్పేస్ రంగంలో ఆజాద్ ఇంజినీరింగ్ ఉత్పత్తి సామర్థ్యాలను పెంపొందించడం ఈ ఒప్పందంలోని ప్రధానాంశాలు. అంతిమంగా విమాన ఇంజిన్ విడిభాగాలను ఆజాద్ ఇంజినీరింగ్ తయారు చేసి, ప్రాట్ అండ్ విట్నీకి అందిస్తుంది.

2030కి జీసీసీల్లో 13 లక్షల కొత్త ఉద్యోగాలు

- ఎన్ఎల్‌బీ నివేదిక
- కొత్త ఏఐ హబ్‌ల్లో విశాఖపట్నం



ఈనాడు, హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ)తో ఉద్యోగాలు పోతాయనే భయాందోళనలు అంతటా ఉండగా.. అంతర్జాతీయ సంస్థలు మన దేశంలో నెలకొల్పిన 1,800కు పైగా గ్లోబల్ కేపబులిటీ కేంద్రా (జీసీసీ)ల్లో ఏఐ నిపుణులకే అధిక ప్రాధాన్యం లభిస్తోందని మానవ వనరుల సంస్థ ఎన్ఎల్‌బీ సర్వీసెస్ తాజా నివేదిక వెల్లడించింది. వీటిల్లో జీసీసీల్లో 21.6 లక్షల మంది నిపుణులు పనిచేస్తున్నారు. వచ్చే 12 నెలల్లో వీరి సంఖ్య 11% పెరిగి 24 లక్షలకు చేరుతుందని.. 2030 కల్లా 34.6 లక్షలకు చేరుతుందని అంచనా వేసింది. అంటే ఇప్పటినుంచి కొత్తగా 13 లక్షల మంది నిపుణులకు జీసీసీలు స్థానం కల్పిస్తాయన్నమాట. 2025లో మొత్తం 85-95 జీసీసీలు దేశీయంగా ఏర్పాటు కావొచ్చని, ఇందులో 60 వరకు కొత్తవి కాగా, మిగిలినవి ప్రస్తుత కంపెనీల విస్తరణలో భాగంగా ఏర్పాటయ్యేవని నివేదిక తెలిపింది. 'ఏఐ సామర్థ్యాలను శాశ్వత ఎంటర్‌ప్రైజ్ విలువగా మార్చాలంటే, బాధ్యతాయుత ఏఐ వినియోగం అవసరం. ఏఐ మానవ నైపుణ్యాలను భర్తీ చేయదు. వారి నైపుణ్యాల సామర్థ్యాన్ని పెంచుతుంద'ని ఎన్ఎల్‌బీ సర్వీసెస్ సీఈఓ సచిన్ అలుగ్ పేర్కొన్నారు.

ఇదీ కారణం: కృత్రిమ మేధ (ఏఐ), జెనరేటివ్ ఏఐ నైపుణ్యాల వల్ల జీసీసీలు అంతర్జాతీయ సంస్థల వ్యూహాత్మక కార్యకలాపాలకు కేంద్రాలయ్యాయి. ఏఐ-ఇంజినీరింగ్, అనలిటిక్స్, కాంప్లయెన్స్ హబ్‌లను ఏకీకృతం చేయగలుగుతున్నారు. భారతీయుల ఏఐ నైపుణ్యం, ఆవిష్కరణల్లో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది. ప్రస్తుతం భారత స్కోరు 2.8గా ఉంది. అమెరికా 2.2, జర్మనీ 1.9 కంటే ఇది ఎక్కువ.

వ్యయాలు భారీగా తగ్గనున్నాయ్: 2030 నాటికి 39% జీసీసీ ఉద్యోగులు (13.5 లక్షలు) రెండు, మూడో శ్రేణి నగరాల్లో పనిచేస్తారు. ఇందువల్ల నిపుణుల ఖర్చు 20-35%, ఆఫీస్ నిర్వహణ వ్యయం 30-50%, ఉద్యోగుల వలసలు 10-12% తగ్గుతాయని నివేదిక అంచనా వేసింది. విశాఖపట్నం, కోయంబత్తూర్, అహ్మదాబాద్, భువనేశ్వర్ తదితర నగరాలు కొత్త ఏఐ హబ్‌లుగా మారనున్నాయి.

జనవరి నుంచి కొత్త జీసీసీలు ఇలా

- ❖ హైదరాబాద్ 41
- ❖ బెంగళూరు 30
- ❖ చెన్నై 5
- ❖ పుణె 5
- ❖ దిల్లీ/ఎన్‌సీఆర్ 3
- ❖ అహ్మదాబాద్ 2
- ❖ ముంబయి 2

జీసీసీల్లో ఈ నైపుణ్యాలకు కొత్త ఉద్యోగాలు

- ❖ సైబర్ సెక్యూరిటీ
- ❖ ఏఐ గవర్నెన్స్ ఆర్కిటెక్టులు
- ❖ ప్రాంప్ట్ ఇంజినీర్లు
- ❖ జెన్‌ఏఐ ప్రోడక్ట్ ఓనర్లు
- ❖ ఏఐ పాలసీ, రిస్క్ స్ట్రాటజిస్టులు

ఇవి అంతరిస్తాయి

ఏఐ వల్ల కొన్ని ఉద్యోగాలు కనుమరుగయ్యే అవకాశం ఉంది.

- ❖ ఎల్1 ఐటీ సపోర్ట్ టెక్నీషియన్
- ❖ లెగసీ అప్లికేషన్ డెవలపర్
- ❖ మాన్యువల్ క్యూఏ టెస్టర్

మధ్య స్థాయి టెక్ ఉద్యోగాల్లో 27%, జూనియర్ టెక్ ఉద్యోగాల్లో 25% మార్పులు రావొచ్చు

హైదరాబాద్‌లో ఈ ఏడాది 41 జీసీసీలు

ఐటీ రాజధానిగా పేరున్న బెంగళూరుకు, జీసీసీల విషయంలో హైదరాబాద్ నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. హైదరాబాద్‌లో 360 జీసీసీలు, 3.10 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాయి. ఏఐ లీడర్‌షిప్ సంసిద్ధతలో 70% జీసీసీలు బలమైన వ్యూహంతో ఉన్నాయి. ఇది బెంగళూరులో 69%. ఫార్మా, హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ రంగాల్లోని జీసీసీలకు హైదరాబాద్ కీలకంగా మారుతోంది. జెన్‌ఏఐ నైపుణ్యాలు, ఆటోమేషన్ పెట్టుబడుల్లోనూ హైదరాబాద్ ప్రముఖ స్థానంలో నిలిచినట్లు నివేదిక వెల్లడించింది. 'ఖర్చు తక్కువగా ఉండటం, అధిక సంఖ్యలో నిపుణుల లభ్యత, మెరుగైన మౌలిక వసతులు' ఇక్కడి ప్రధాన ఆకర్షణలు. ఈ ఏడాదిలో బెంగళూరు (30)కు మించి హైదరాబాద్‌లో 41 కొత్త జీసీసీలు ఏర్పాటయ్యాయి.

సీక్వెంట్ సైంటిఫిక్‌లో వియాష్ విలీనం

- తుది ఉత్తర్వులు జారీ చేసిన ఎన్‌సీఎల్‌టీ
- కార్యకలాపాల ఏకీకరణపై యాజమాన్యం దృష్టి

ఈనాడు, హైదరాబాద్: జంతు ఔషధాల విభాగానికి చెందిన సీక్వెంట్ సైంటిఫిక్‌లో.. బల్క్ ఔషధాలు, ఏపీఐ (యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రేడియంట్స్) ఉత్పత్తి చేసే యాష్ లైఫ్‌సైన్సెస్ విలీనానికి మార్గం సుగమమైంది. ఈ సంస్థల విలీనానికి ఎన్‌సీఎల్‌టీ మంగళవారం ఆమోదం తెలిపింది. దీంతో ఇరు సంస్థల విలీన ప్రక్రియ దాదాపు పూర్తయినట్లే. ఈ సంస్థల వ్యాపార కార్యకలాపాల ఏకీకరణపై యాజమాన్యం దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

ఆదాయాల పరంగా: ఆదాయాల పరంగా సీక్వెంట్ సైంటిఫిక్ కంటే, వియాష్ లైఫ్‌సైన్సెస్ ఆకర్షణీయంగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఏకీకృత ఖాతాల ప్రకారం సీక్వెంట్ సైంటిఫిక్ టర్నోవర్ రూ.424 కోట్లు కాగా, పన్ను తర్వాత లాభం రూ.19.6 కోట్లుగా ఉంది. 2024-25 ఇదేకాలంతో పోలిస్తే టర్నోవర్ 15%, లాభం 3 రెట్లకు పైగా పెరిగింది. వియాష్ లైఫ్‌సైన్సెస్ టర్నోవర్ రూ.428 కోట్లు కాగా, పన్ను తర్వాత లాభం రూ.53.3 కోట్లుగా ఉంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంతో పోలిస్తే టర్నోవర్ 18% పెరిగింది. రెండు సంస్థలను కలిపి చూస్తే, సెప్టెంబరు త్రైమాసికంలో రూ.852 కోట్ల టర్నోవర్, రూ.189 కోట్ల ఎబిటా నమోదయ్యాయి. ఎబిటా మార్జిన్ 22.2%. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 6 నెలలకు, ఈ రెండు సంస్థలు కలిపి రూ.1,646 కోట్ల టర్నోవర్ నమోదు చేశాయి. పన్ను తర్వాత లాభం రూ.109 కోట్లుగా ఉంది.

ఏడాది వ్యవధిలో: సీక్వెంట్ సైంటిఫిక్‌లో వియాష్ లైఫ్‌సైన్సెస్ విలీనాన్ని గత ఏడాది సెప్టెంబరులో ప్రకటించారు. కొంతకాలంగా వ్యాపార కార్యకలాపాల్లో ఏకీకరణ కోసం యాజమాన్యం కృషి చేస్తోంది. పరిశోధన-అభివృద్ధి, ఉత్పత్తి, విక్రయ కార్యకలాపాలకు సంబంధించి కొంత ప్రగతి సాధించినట్లు సీక్వెంట్ సైంటిఫిక్ యాజమాన్యం ఇటీవల పేర్కొంది. రెండు సంస్థలకు ఉన్న బలాలు, బలహీనతలను విశ్లేషించి, దానికి అనుగుణంగా నూతన కార్యాచరణ సిద్ధం చేస్తున్నందున, సానుకూల ఫలితాలు కనిపిస్తున్నాయని వియాష్ లైఫ్‌సైన్సెస్ సీఈఓ హరిబాబు బోడేపూడి పేర్కొన్నారు. విలీనం తర్వాత కొత్త ఆదాయ మార్గాలను గుర్తించి, సత్వర వృద్ధి సాధిస్తామని ఆయన తెలిపారు. వియాష్ లైఫ్‌సైన్సెస్ ఇటీవల సీడీఎంఓ (కాంట్రాక్టు అభివృద్ధి, ఉత్పత్తి సేవలు) విభాగంపై దృష్టి సారించింది. ఈ విభాగంలో కొన్ని కొత్త కాంట్రాక్టులు లభించే అవకాశం ఉందని తెలిసింది.

✦ మంగళవారం బీఎస్ఈలో సీక్వెంట్ సైంటిఫిక్ షేరు 7.05% పెరిగి, రూ.247.65 వద్ద స్థిరపడింది.

ఎలీ లిల్లీ అల్జీమర్స్ మందుకు అనుమతి

ఈనాడు, హైదరాబాద్: మనదేశంలో అల్జీమర్స్ వ్యాధి చికిత్సలో వినియోగించే మందుకు, ఔషధ నియంత్రణ మండలి అయిన సీడీఎస్‌సీఓ (సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్) నుంచి బహుళ జాతి ఫార్మా కంపెనీ ఎలీ లిల్లీ అనుమతి సంపాదించింది. డోననెమాబ్ (350 ఎంజీ/ 20 ఎంఎల్) ఔషధానికి అనుమతి లభించినట్లు ఎలీ లిల్లీ అధ్యక్షుడు విన్సెలో టకర్ వివరించారు. అల్జీమర్స్ వ్యాధి ప్రారంభ దశలో ఉన్న వారికి ఈ మందును ప్రతి 4 వారాలకు ఒకసారి ఐవీ (ఇంట్రావీనస్) ఇంజెక్షన్ ద్వారా ఇస్తారు. అల్జీమర్స్ వ్యాధి ప్రపంచ వ్యాప్తంగా అతిపెద్ద సమస్య. మనదేశంలో ఈ వ్యాధిని గుర్తించి, చికిత్స అందించడం తక్కువగా ఉంది. 2030 నాటికి మనదేశంలో 80 లక్షల మంది బాధితులు ఉంటారని అంచనా.

కృత్రిమ మేధను గుడ్డిగా నమ్మకండి

హెచ్చరించిన గూగుల్ సీఈఓ పిచాయ్



కృత్రిమ మేధ (ఏఐ) చెప్పే ప్రతి విషయాన్ని 'గుడ్డిగా నమ్మొద్దు' అని వినియోగదారులను గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ హెచ్చరించారు. ఏఐ పెట్టుబడులపై అప్రమత్తంగా ఉండాలని, ఈ బుడగా పేలితే, ప్రభావం పడకుండా ఎవరూ ఉండరని కంపెనీలకు సూచించారు. ఏఐ మోడళ్లలోనూ లోపాలు తలెత్తే అవకాశం ఉందని.. అందువల్ల వినియోగదారులు ఇతర టూల్స్ కూడా వినియోగిస్తూ, సమతుల్యత పాటించాలని కోరారు.

గూగుల్ జెమినై 3 వచ్చేసింది: టెక్ దిగ్గజం గూగుల్ తమ సెర్చ్ ఇంజిన్‌పై కొత్త తరం కృత్రిమమేధ (ఏఐ) మోడల్ జెమినై 3ను మంగళవారం ఆవిష్కరించింది. అమెరికాలోని జెమినై ప్రో, అల్ట్రా ఖాతాదారులకు గూగుల్ కొత్త ఏఐ ఫీచర్లు అందుబాటులోకి వచ్చాయి. రాబోయే రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా ఇవి లభించనున్నాయి. జెమినై 3లో సెర్చింజిన్‌లోనే కొత్తగా 'థింకింగ్' ఫీచర్‌ను గూగుల్ ప్రవేశపెట్టింది. ప్రజల ఉత్పాదకతను ఇది పెంచుతుందని కంపెనీ విశ్వసిస్తోంది.

మోసాల కట్టడికి నేషనల్ ఫైనాన్షియల్ గ్రిడ్

ఏర్పాటు చేయాలన్న ఎస్‌బీఐ ఛైర్మన్ సీఎస్ శెట్టి



ముంబయి: మోసాలను నిరోధించేందుకు వ్యవస్థలోని అన్ని విభాగాలను అనుసంధానించే 'నేషనల్ ఫైనాన్షియల్ గ్రిడ్'ను ఏర్పాటు చేయాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఛైర్మన్ సి.శ్రీనివాసులు శెట్టి సూచించారు. ఈ గ్రిడ్‌లో క్రెడిట్ బ్యూరోలు, ఫ్రాడ్ రిజిస్ట్రీలు, ఇ-కేవైసీ సదుపాయాలు, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ ప్లాట్‌ఫామ్, అకౌంట్ అగ్రిగేటర్, ఇటీవల తీసుకొచ్చిన యునిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్ (యూఎల్‌ఐ) ఉండాలన్నారు. 'ఇందువల్ల మోసాల నిరోధానికి షేర్డ్ డిజిటల్ మౌలిక సదుపాయం అవుతుంది' అని సీఐఐ ఫైనాన్సింగ్ సమిట్‌లో శెట్టి వివరించారు. లాభాపేక్ష లేకుండా ఇండియన్ డిజిటల్ పేమెంట్ ఇంటెలిజెన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడానికి ఆర్థిక రంగ సంస్థలు ఇప్పటికే ముందుకు వచ్చాయని ఆయన వెల్లడించారు. చిన్న వ్యాపార సంస్థలు సులభంగా రుణాలు పొందేందుకు 'డిజిటల్ ట్విన్'ను ఏర్పాటు చేయాలన్నారు.

వాణిజ్య మెసేజ్‌లలో లింకులు ఉంటే ముందే చెప్పాలి

ట్రాయ్ ఆదేశాలు

మనకేదో కంపెనీ నుంచి మెసేజ్ వస్తుంది. అది తెరిస్తే అందులో యూఆర్ఎల్/వెబ్‌లింక్ ఉంటుంది. ఒక్కోసారి మోసగాళ్లు కూడా ఇలాంటివి పంపి, మన బ్యాంక్ ఖాతాను ఖాళీచేసే అవకాశం లేకపోలేదు. అందుకే టెలికాం నియంత్రణాధికార సంస్థ ట్రాయ్ కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. వ్యాపార సంబంధిత సమాచారాన్ని పంచుకునే ఎస్ఎంఎస్‌లలో యూఆర్ఎల్/అప్లికేషన్ డౌన్‌లోడ్ లింక్/ కాల్ బ్యాక్ నంబర్ వంటివి ఉంటే, వాటన్నిటినీ తప్పనిసరిగా 'ప్రీ-ట్యాగింగ్' చేయాలని ట్రాయ్ ఆదేశాలు జారీ చేసింది. రిజిస్టర్డ్ టెంప్లేట్స్‌ను దుర్వినియోగం చేయకుండా ఉండేందుకు ఈ చర్యలు చేపడుతున్నట్లు తెలిపింది. మోసగాళ్లు కూడా ప్రజలకు పంపే మెసేజ్‌లలో ప్రమాదకర లింకులు, కాల్‌బ్యాక్ నంబర్లు పెట్టి ఆర్థిక నేరాలు, సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని. . సమాచారం అపహరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు ట్రాయ్ వివరించింది. అందుకే వ్యాపార సమాచారానికి వినియోగించే ఎస్ఎంఎస్ కంటెంట్ టెంప్లేట్లలో ఉండే లింక్‌లు, నంబర్లను స్పష్టంగా మార్క్ చేయాలని అందరు యాక్సెస్ ప్రొవైడర్లకు ఆదేశాలు చేసింది.

జోహో అరట్టైలో ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్

మరిన్ని ఫీచర్లూ వస్తాయన్న శ్రీధర్ వెంబు

దిల్లీ: భారతీయ మెసేజింగ్ ప్లాట్‌ఫాం అరట్టైలో ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ మంగళవారం రాత్రి నుంచి అందుబాటులోకి వస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు శ్రీధర్ వెంబు పేర్కొన్నారు. మరిన్ని ఫీచర్లనూ ఇందులో జత చేసే పనులు జరుగుతున్నాయన్నారు. 'ప్లే స్టోర్/యాప్ స్టోర్‌లో అరట్టై యాప్‌ను అప్‌డేట్ చేసుకోండి. మీ కాంటాక్ట్స్‌కూ ఈ విషయం చెప్పండ'ని ఎక్స్‌లో వెంబు తెలిపారు. అరట్టై తాజా వెర్షన్ వాడే వారికే, ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్‌లో మెసేజ్‌లను పంపుకునేందుకు వీలుంటుందన్నారు. పాత చాట్ సెషన్‌ను 3 రోజుల వరకే కొనసాగించొచ్చని, ఆ తర్వాత తాజా వెర్షన్‌కు అప్‌గ్రేడ్ అవుతుందన్నారు. గ్రూప్‌చాట్‌లకు ఇంకా ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ తీసుకురాలేదని, వచ్చే కొద్ది వారాల్లో చేస్తామని హామీనిచ్చారు. 2 వారాల్లో చాట్స్‌కు బ్యాకప్ ఆప్షన్ కూడా తీసుకొస్తామన్నారు. వాట్సప్‌కు పోటీగా కొద్ది నెలల కిందట వచ్చిన అరట్టైని కేంద్ర మంత్రులూ వాడుతున్నామని పేర్కొనడంతో, అధిక స్థాయిలో సైన్‌అప్‌లు జరిగాయి.

వాణిజ్య ఒప్పందంపై మంచి వార్త వింటారు



కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

దిల్లీ: భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం న్యాయంగా, సమానంగా, సమతౌల్యంగా ఉంటే 'మీరు ఒక మంచి వార్త వింటార'ని వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. మన రైతులు, మత్స్యకారుల ప్రయోజనాలను ప్రభుత్వం పరిరక్షిస్తుందనీ స్పష్టం చేశారు. వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయని మంగళవారమిక్కడ జరిగిన 'ఇండో-యూఎస్ ఎకనమిక్ సమిట్'లో గోయల్ తెలిపారు. 'భారత్ తన ప్రజలు, వ్యాపారాల ప్రయోజనాలను రక్షించుకోవాలి. రైతులు, మత్స్యకారులు, చిన్న పరిశ్రమలకు ఇబ్బంది రాకుండా చూసుకోవాలి. ఈ విషయంలో సరైన పరిష్కారం లభించినపుడే, అది న్యాయమైన, సమానత్వ, సమతౌల్య ఒప్పందం అవుతుంద'ని మంత్రి వివరించారు. 'ఒక్కోసారి కుటుంబంలో కూడా గొడవలు వస్తుంటాయి. కాబట్టి ఇరు దేశాల మధ్య ఒప్పందం విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేద'ని అన్నారు. అమెరికాతో ఎల్‌పీజీ దిగుమతి ఒప్పందం ఏళ్ల పాటు ఉండొచ్చని సంకేతాలిచ్చారు.

త్వరలో ఒప్పందం: ట్రంప్ ప్రభుత్వాధికారి

న్యూయార్క్: భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం త్వరలోనే జరుగుతుందని ట్రంప్ ప్రభుత్వాధికారి ఒకరు పేర్కొన్నారు. 'అవును. ఒప్పందానికి చాలా దగ్గరలో ఉన్నాం' అని నేషనల్ ఎకనమిక్ కౌన్సిల్ డైరెక్టర్ కెవిన్ హాసెట్ పేర్కొన్నారు. 'రష్యాతో భారత సంబంధాల వల్ల సంక్లిష్ట పరిస్థితి అయితే వచ్చింది. అయినప్పటికీ మేం ఆశాభావంతోనే ఉన్నాం. ఎందుకంటే భారత్-అమెరికా మంచి స్నేహితులు. త్వరలోనే ఒప్పందం జరగొచ్చ'ని అన్నారు.

ఎఫ్‌డీఐ, ఎఫ్ఐఐలను ఆకర్షించేందుకు సమావేశాలు: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐ), విదేశీ సంస్థాగత పెట్టుబడుల(ఎఫ్ఐఐ)ను ఆకర్షించడం కోసం పలు వర్గాలతో గోయల్ సమావేశం నిర్వహించారు. మరింత వేగవంతంగా, సరళంగా, సమర్థంగా ఈ ప్రక్రియలను నిర్వర్తిస్తామన్నారు. పెట్టుబడులతో ఉద్యోగ సృష్టితో పాటు కొత్త సాంకేతికతలను తీసుకురావొచ్చని, పరిశోధన-అభివృద్ధికి ఊతం లభిస్తుందని, ఆవిష్కరణలకు వీలు కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ త్రిచక్ర వాహనాలకు 15 నిమిషాల్లోనే ఛార్జింగ్


కైనటిక్ గ్రీన్, ఎక్స్‌పొనెంట్ ఎనర్జీ భాగస్వామ్యం



దిల్లీ: విద్యుత్ వాహన తయారీదారు కైనటిక్ ఎనర్జీ అండ్ పవర్ సొల్యూషన్స్, ఎక్స్‌పొనెంట్ ఎనర్జీ మంగళవారం ఒక భాగస్వామ్యాన్ని ప్రకటించాయి. దీని కింద ఇ-రిక్షాలు, ఇ-కార్గో వాహనాలకు వేగవంత ఛార్జింగ్ సదుపాయాలను అందజేస్తాయి. ఎల్5, ఎల్3 విద్యుత్ త్రిచక్ర వాహన(ఇ3డబ్ల్యూ) విభాగానికి ఇరు కంపెనీలు కలిసి ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయాన్ని అందిస్తాయి. సఫర్ స్మార్ట్, సఫర్ శక్తి, సూపర్ డీఎక్స్ సహా కైనటిక్ గ్రీన్‌కు చెందిన ఎల్3 మోడళ్లకు 15 నిమిషాల్లోనే ఛార్జింగ్ చేసే సాంకేతికతను తీసుకొచ్చినట్లు కైనటిక్ గ్రీన్ వ్యవస్థాపకురాలు, సీఈఓ సులజ్జా ఫిరోదియా మోత్వానీ పేర్కొన్నారు. ప్రస్తుతానికి 4 నగరాల్లోని 160 స్టేషన్లలో ఈ సేవలందిస్తామని, 12 నెలల్లో ప్రధాన మెట్రోలు, రెండో, మూడో శ్రేణి పట్టణాలకూ విస్తరిస్తామని ఎక్స్‌పొనెంట్ ఎనర్జీ సీఈఓ అరుణ్ వినాయక్ తెలిపారు.

విద్యుత్తు కార్ల అమ్మకాల్లో 57% వృద్ధి

అగ్రస్థానంలో టాటా మోటార్స్



దిల్లీ: విద్యుత్ ప్రయాణికుల వాహనాల రిటెయిల్ విక్రయాలు అక్టోబరులో 57% వృద్ధితో 18,055కు చేరాయని పరిశ్రమ సంఘం ఫాడా తెలిపింది. గతేడాది ఇదే నెలలో 11,464 వాహనాలు అమ్ముడయ్యాయి. గత నెలలో టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ (టీఎంపీవీ) విక్రయాల్లో అగ్రగామిగా నిలిచింది. విద్యుత్తు ద్విచక్ర వాహనాలు గత నెలలో 1,43,887 అమ్ముడుపోయాయి. 2024 అక్టోబరులో అమ్ముడైన 1,40,225 వాహనాలతో పోలిస్తే ఇవి 3% అధికం. ఇ-త్రిచక్ర వాహనాల రిటెయిల్ అమ్మకాలు 5% పెరిగి 70,604కు చేరగా, విద్యుత్ వాణిజ్య వాహనాల అమ్మకాలు రెండింతలై 1767కు చేరాయి.

అక్టోబరు నెలలో అమ్మకాలు

కంపెనీ	వాహనాల సంఖ్య
టీఎంపీవీ	7,239
ఎంజీ ఇండియా	4,549
మహీంద్రా	3,911
కియా	656
బీవైడీ	570
బజాజ్ ఆటో	31,426
టీవీఎస్ మోటార్ కంపెనీ	29,515
ఏథర్ ఎనర్జీ	28,101
ఓలా ఎలక్ట్రిక్	16,036
హీరో మోటోకార్ప్	15,952
గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ	7,629

ఆరు రోజుల లాభాలకు విరామం

సెన్సెక్స్ ▼278 84673 | నిఫ్టీ ▼103 25910

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.728.82 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.6,156.83 కోట్లు



సూచీల ఆరు రోజుల వరుస లాభాలకు అడ్డుకట్ట పడింది. అంతర్జాతీయ మార్కెట్ల బలహీన ధోరణి వల్ల.. దేశీయంగానూ ఐటీ, లోహ, భారీ యంత్ర పరికరాల షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 1 పైసా నష్టపోయి 88.60 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 0.40 శాతం నష్టపోయి 63.94 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, షాంఘై, హాంకాంగ్ సూచీలు నష్టపోయాయి. ఐరోపా మార్కెట్లూ ఇదే ధోరణిలో ట్రేడవుతున్నాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.52 లక్షల కోట్లు తగ్గి, రూ.474.62 లక్షల కోట్ల (5.36 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 85,042.37 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,950.95) సానుకూలంగా ప్రారంభమైంది. 85,042.41 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకినా, తర్వాత లాభాల స్వీకరణతో 84,558.36 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 277.93 పాయింట్ల నష్టంతో 84,673.02 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 103.40 పాయింట్లు కోల్పోయి 25,910.05 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 26,029.85-25,876.50 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 23 నష్టపోయాయి. టెక్ మహీంద్రా 2.23%, ఇన్ఫోసిస్ 1.46%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.40%, బజాజ్ ఫైనాన్స్ 1.26%, ఎటర్నల్ 1.15%, ఎం అండ్ ఎం 1.05%, హెచ్‌యూఎల్ 0.93%, అదానీ పోర్ట్స్ 0.88%, బీఈఎల్ 0.86%, ట్రెంట్ 0.86% డీలాపడ్డాయి. భారతీ ఎయిర్‌టెల్ 1.78%, యాక్సిస్ బ్యాంక్ 1.27%, ఏషియన్ పెయింట్స్ 0.64% చొప్పున పెరిగాయి.

✦ రంగాల వారీ సూచీలకొస్తే స్థిరాస్తి 1.98%, బీఎస్ఈ ఫోకస్డ్ ఐటీ 1.16%, ఐటీ 1.15%, లోహ 1.07%, కమొడిటీస్ 0.95%, పారిశ్రామిక 0.93% మేర తగ్గాయి. యుటిలిటీస్ సూచీ ఒక్కటే లాభపడింది. బీఎస్ఈలో 1,401 షేర్లు సానుకూలంగా, 2,810 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి. 130 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.

రేపటి నుంచి ఇన్ఫోసిస్ షేర్ల బైబ్యాక్

ఇన్ఫోసిస్ రూ.18,000 కోట్ల విలువైన షేర్ల బైబ్యాక్ గురువారం (ఈనెల 20న) ప్రారంభం కానుంది. ఈ నెల 26 వరకు బైబ్యాక్ విండో తెరిచి ఉంటుందని నియంత్రణ సంస్థలకు ఇన్ఫీ సమాచారమిచ్చింది. రూ.5 ముఖ విలువ కలిగిన 10 కోట్ల పుల్లీ పెయిడప్ ఈక్విటీ షేర్లను (2.41% వాటాకు సమానం) బైబ్యాక్ చేయాలనే లక్ష్యాన్ని కంపెనీ నిర్దేశించుకుంది. ఒక్కో షేరును రూ.1,800తో కొనుగోలు చేయబోతోంది.

టెక్స్‌టైల్స్ పీఎల్ఐ పథకంలో 17 దరఖాస్తులకు ఆమోదం

టెక్స్‌టైల్స్ ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం కింద మూడో విడతలో 17 కొత్త దరఖాస్తులను ప్రభుత్వం ఆమోదించింది. ఇవి రూ.2,374 కోట్ల పెట్టుబడులు పెడతామని తెలిపాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా రూ.12,893 కోట్లకు పైగా విక్రయాలు, 22,646 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ తెలిపింది.

ఎయిర్‌టెల్ రేటింగ్ పెంచిన ఎస్ అండ్ పీ

భారతీ ఎయిర్‌టెల్ రేటింగ్‌ను 'బీబీబీ-' నుంచి 'బీబీబీ'కి మెరుగు పరుస్తున్నట్లు ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ తెలిపింది. వచ్చే 24 నెలల్లో కంపెనీ బలమైన వృద్ధి దిశగా అడుగులు వేసే అవకాశం ఉండటమే ఇందుకు కారణమంది.

ఐపీఓ సమాచారం

✦ **ఫిజిక్స్‌వాలా** షేరు అరంగేట్రంలో అదరగొట్టింది. ఇష్యూ ధర రూ.109తో పోలిస్తే, బీఎస్ఈలో 31.28% లాభంతో రూ.143.10 వద్ద నమోదైంది. ఒక దశలో 48.66% పెరిగి రూ.162.05 గరిష్ఠాన్ని తాకింది. చివరకు 42.39% లాభంతో రూ.155.20 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.44,382.43 కోట్లుగా నమోదైంది.

✦ ప్రెసిషన్ కాంపోనెంట్స్ తయారీ సంస్థ **మైల్‌స్టోన్ గేర్స్ లిమిటెడ్** ఐపీఓ ద్వారా రూ.1,100 కోట్లు సమీకరించేందుకు మార్కెట్ల నియంత్రణాధికార సంస్థ సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. తాజా షేర్ల జారీ ద్వారా రూ.800 కోట్లు సమీకరించనుండగా, ప్రమోటర్లు, వాటాదార్లు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో రూ.300 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నారు.

✦ **ఎమ్వీ ఫొటోవోల్టాయిక్ పవర్** షేరు ఇష్యూ ధర రూ.217 వద్దే, బీఎస్ఈలో నమోదైంది. ఇంట్రాడేలో రూ.227.80 వద్ద గరిష్ఠాన్ని తాకినా, చివరకు 0.94% లాభంతో రూ.219.05 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.15,165.82 కోట్లుగా నమోదైంది.

✦ **క్యాపిల్లరీ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్** ఐపీఓ ముగిసేసరికి 52.95 రెట్ల స్పందన లభించింది. రూ.877.5 కోట్ల ఐపీఓలో 83,83,430 షేర్లను కంపెనీ ఆఫర్ చేయగా, 44,38,95,325 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. సంస్థాగతేతర మదుపర్ల విభాగంలో 69.84 రెట్లు, అర్హత కలిగిన సంస్థాగత మదుపర్ల (క్యూఐబీ) విభాగంలో 57.27 రెట్లు, రిటెయిల్ మదుపర్ల విభాగంలో 15.82 రెట్ల స్పందన లభించింది.

సంక్షిప్తంగా

✦ మన దేశంలో విమాన నిర్వహణ సౌకర్యాల రూపకల్పన, నిర్మాణానికి సేవలు అందించడానికి **టాటా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ (టీపీఎల్), ఎయిర్‌క్రాఫ్ట్ సపోర్ట్ ఇండస్ట్రీస్ (ఏఎస్ఐ గ్లోబల్)** ఒప్పందంపై సంతకాలు చేశాయి.

✦ ఐరోపాలో తేలికపాటి, భారీ క్వాడ్రిసైకిల్స్ వాహనాల తయారీ సంస్థ లిజియర్ గ్రూప్ సూక్ష్మ కార్ల కోసం యూరో వి+ సర్టిఫైడ్ డీజిల్ ఇంజిన్లను సరఫరా చేసేందుకు **గ్రీవ్స్ కాటన్స్ లిమిటెడ్** ఒప్పందం కుదుర్చుకుంది.

✦ నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్‌హెచ్‌ఎస్) సరఫరా చైన్ అప్లికేషన్ అభివృద్ధి, మద్దతు, ప్రధాన వ్యాపార వ్యవస్థల నిర్వహణ, క్లౌడ్ మౌలిక సదుపాయాల కోసం 5 ఏళ్ల కాంట్రాక్ట్ లభించినట్లు **టీసీఎస్** వెల్లడించింది.

✦ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, విదేశీ చెల్లింపుల అగ్రిగేటర్‌గా కార్యకలాపాలు నిర్వహించేందుకు **పేయూ**కు ఆర్‌బీఐ అనుమతి లభించింది.

✦ జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ అండ్ ఆల్ఫా ఆల్టర్నేటివ్స్ నుంచి వద్రాజ్ ఎనర్జీని నిర్మా గ్రూప్‌నకు చెందిన సిమెంటు వ్యాపార సంస్థ **నువోకో విస్టాస్ కార్పొరేషన్** కొనుగోలు చేసింది. లావాదేవీ విలువ రూ.200 కోట్లు.

38 కిలోల బంగారం, 60 కిలోల వెండి దోపిడి

ఝార్ఖండ్‌లోని హజారీబాగ్ జిల్లా బర్హీ చౌక్‌లో జరిగిన భారీ దోపిడి కలకలం రేపింది. నగల దుకాణం వ్యాపారి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం 35 కిలోల బంగారం, 60 కిలోల వెండి, మూడు కిలోల బంగారు ఆభరణాలను దుండగులు దోచుకెళ్లారు. గత ఆదివారం రాత్రి దుకాణం మూసి బస్తాలను కారులో ఇంటికి తరలించే సమయంలో రెండు బైకులపై వచ్చిన నలుగురు దుండగులు కాల్పులు జరుపుతూ సిబ్బందిపై దాడి చేశారు. ఆ కాల్పుల శబ్దాలకు చుట్టుపక్కల జనం భయంతో పరుగులు తీశారు. పట్నా రోడ్డులోని 'జయ మాతా దీ జువెలర్స్' దుకాణం దగ్గర ఈ ఘటన జరిగింది. దోపిడీ అనంతరం దుండగులు పట్నా వైపు పారిపోయినట్లు దుకాణ యజమాని సురేంద్ర సోని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనా స్థలంలో పోలీసులు ఒక నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. హజారీబాగ్ ఎస్పీ ఏర్పాటుచేసిన సిట్ బృందాలు నిందితుల కోసం గాలిస్తున్నాయి.



నాగాలాండ్ అల్లం.. కొత్త వంగడం!



దిల్లీ: అధిక దిగుబడినివ్వడంతో పాటు వంటకాలకు మంచి రుచిని జోడించే 'సాస్-కెవు' అనే కొత్త అల్లం రకాన్ని నాగాలాండ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఇది రైతులు, ఆహార పరిశ్రమకు మెరుగైన ప్రత్యామ్నాయమవుతుందని భావిస్తున్నారు. ఈ వంగడాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని చింతపల్లి సహా దేశంలోని భిన్న ప్రాంతాల్లో విస్తృతంగా పరీక్షించారు. ఇది హెక్టారుకు 17.21 టన్నుల దిగుబడిని ఇస్తుందని పరిశోధకులు తెలిపారు. ప్రస్తుతమున్న ప్రామాణిక వంగడంతో పోలిస్తే ఇది 9 శాతం ఎక్కువ దిగుబడిని ఇచ్చిందన్నారు. దీని డ్రై రికవరీ రేటు 21.95 శాతంగా ఉందని వివరించారు. అందువల్ల అల్లాన్ని ఎండబెట్టాక అధిక దిగుబడిని కోరుకునే ప్రాసెసింగ్ సంస్థలకు ప్రయోజనం కలిగిస్తుందని తెలిపారు. భూమిలోపలి దీని కాండం మృదువుగా, పెద్దగా ఉంటుంది. లోపలి గుజ్జు నిమ్మపండు రంగులో ఉండి, తక్కువ పీచును కలిగి ఉంటుంది. అది పచ్చళ్లు, పానీయాలు, వంట, ఇతర ఉత్పత్తులకు అనువైందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, నాగాలాండ్, మిజోరం, పశ్చిమ బెంగాల్‌లో ఈ వంగడం విత్తనోత్పత్తి, వ్యవసాయ విక్రయాలకు ఆమోదం తెలుపుతూ కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది.

వన్యప్రాణుల వల్ల నష్టం కలిగినా పంట బీమా కింద పరిహారం

వరదల్లో మునిగిన వరికి కూడా..

దిల్లీ: వన్యప్రాణుల కారణంగా సంభవించే పంట నష్టానికి ఖరీఫ్ సీజన్ నుంచి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) కింద పరిహారం చెల్లించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. ఇంతవరకు ఇది బీమా పరిధిలోకి రాలేదు. తాజాగా నిబంధనల్ని సవరించినట్లు తెలిపింది. భారీ వర్షాలు, వరదల్లో మునిగిపోయిన వరిపంటను కూడా పరిహారం చెల్లించనున్నట్లు ప్రకటించింది. ఏనుగులు, అడవి పందులు, జింకలు, కోతులు తదితర వన్యప్రాణుల కారణంగా రైతులు పంట నష్టాన్ని ఎదుర్కొంటున్నారని కేంద్ర వ్యవసాయ శాఖ పేర్కొంది. వన్యప్రాణుల కారణంగా పంట నష్టం జరిగినప్పుడు ఆ విషయాన్ని రైతులు పంట బీమా యాప్ సాయంతో 72 గంటల్లో తెలియజేయాలని, నష్టాన్ని తెలియజేసే ఫొటోలను అప్‌లోడ్ చేయాలని వ్యవసాయ శాఖ పేర్కొంది. మునకకు గురైన వరిపంట నష్టాన్ని అంచనా వేయడం కష్టసాధ్యం కావడంతో 2018లో ఈ తరహా నష్టాన్ని పంట బీమా స్థానిక ఉత్పాతాల విభాగం నుంచి తొలగించారు. దీనిపై నిపుణుల కమిటీ సిఫార్సులను కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆమోదించి, సవరణల్ని అనుమతించారు. పంటలకు ఏయే వన్యప్రాణుల వల్ల ఎక్కడెక్కడ నష్టం వాటిల్లుతుందో ఆ జాబితాను రాష్ట్రాలు ప్రకటిస్తాయి.



వీటిపై సమయం వృథా వద్దు

1. మనపట్ల ఇతరులకు గల అభిప్రాయాలపై మథనపడుతూ.. 2. ఎదుటి వ్యక్తుల వ్యక్తిత్వాన్ని నిర్ధారిస్తూ.. 3. ప్రాముఖ్యం లేని పనులు చేస్తూ.. 4. గతాన్ని తలచుకుంటూ.. 5. వ్యర్థ వాదనలతో.. 6. ఎప్పటికీ జీవించే ఉంటామన్న రీతిలో ఆలోచిస్తూ..

– రియాన్, రచయిత

ప్రజాస్వామ్యం, ప్రతిపక్షాల ధ్వంసానికి
ఈసీ కుటిల పన్నాగం

- సర్‌పై కాంగ్రెస్ ధ్వజం
- డిసెంబరు మొదటి వారంలో భారీ నిరసన ర్యాలీకి నిర్ణయం



సమావేశంలో కె.సి.వేణుగోపాల్, ఖర్గే, రాహుల్‌గాంధీ

దిల్లీ: ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ద్వారా ప్రజాస్వామ్యాన్ని, ప్రతిపక్ష పార్టీలను ధ్వంసం చేసేందుకు ఎన్నికల సంఘం (ఈసీ) కుటిల పన్నాగం పన్నిందని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. దీనిపై డిసెంబరు మొదటి వారంలో దిల్లీలోని రాంలీలా మైదానంలో నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఓట్ల చోరీ అంటూ ఇప్పటికే ఈసీపై తీవ్ర ఆరోపణలు చేస్తున్న ఆ పార్టీ.. ఇప్పుడు 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో జరుగుతున్న సర్‌పై ఆందోళన వ్యక్తం చేసింది. కొంత మంది ఓటర్లను లక్ష్యంగా చేసుకుని వారిని తొలగించేందుకు సర్ ద్వారా ఈసీ కుట్ర చేస్తోందని, ఆ ప్రక్రియ భాజపా కనుసన్నల్లో జరగడం లేదని ఎన్నికల సంఘం నిరూపించుకోవాలని డిమాండు చేసింది. మంగళవారం దిల్లీలో 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన పార్టీ నేతలతో సర్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇందులో అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శులు, పార్టీ రాష్ట్ర శాఖల అధ్యక్షులు, కాంగ్రెస్ శాసనసభాపక్ష నేతలు, కార్యదర్శులు పాల్గొన్నారు. సమావేశానంతరం వివరాలను పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. ఓటర్ల జాబితా సమగ్రతను కాంగ్రెస్ పార్టీ రక్షిస్తుందని సమావేశానంతరం ఎక్స్‌లో ఖర్గే స్పష్టం చేశారు.

బహుముఖ పోరాటం

సర్ ప్రక్రియపై రాజకీయంగా, సంస్థాగతంగా, న్యాయపరంగా పోరాడతామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. 'స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించడం ఈసీ విధి. కానీ ఆ సంస్థ.. బాధ్యతను రాజకీయ పార్టీలపై వేసింది. ప్రక్రియను హడావుడిగా చేపట్టింది. అసలైన ఓటర్లను ఈసీ తొలగిస్తోంది' అని విమర్శించారు.

చిన్నారుల అపహరణలు ఆందోళనకరం

- దత్తత నిబంధనలు సడలిస్తే ఆ నేరాలు తగ్గుతాయి
- కేంద్రానికి సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ నాగరత్న సూచన

ఈనాడు, దిల్లీ: దేశంలో దత్తత చట్టం కఠినంగా ఉండటం వల్లే చిన్నారుల అపహరణ ఘటనలు అధికంగా ఉంటున్నాయని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి.నాగరత్న అభిప్రాయపడ్డారు. ఆ చట్ట నిబంధనలను సరళీకరించి దత్తత తీసుకునే మార్గాన్ని సులభతరం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. చిన్నారుల మిస్సింగ్, అపహరణ, అక్రమ రవాణా నియంత్రణపై 'గుడియా స్వయం సేవీ సంస్థాన్' అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై మంగళవారం జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఆర్.మహాదేవన్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా జస్టిస్ నాగరత్న.. పిల్లల అపహరణలపై ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ప్రతి 8 నిమిషాలకు ఒక చిన్నారి తప్పిపోతున్నట్లు పత్రికల్లో చదివానని తెలిపారు. దత్తత చట్టంలోని నిబంధనలు కఠినంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 'సంతానలేమితో బాధపడుతున్న తల్లిదండ్రులు నిస్పృహకు లోనుకాని విధంగా సత్వర దత్తతకు అవకాశం కల్పిస్తే చిన్నపిల్లలను చట్టబద్ధంగా స్వీకరిస్తారు. లేదంటే వాళ్లు చట్టవిరుద్ధమైన దత్తత వైపు మొగ్గుచూపుతారు' అని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు.

పేలుడు పదార్థాల తయారీ వీడియోలొద్దు

టీవీ ఛానళ్లకు కేంద్రం హెచ్చరిక

దిల్లీ: చట్టవిరుద్ధ కార్యకలాపాలను సమర్థించడం, వాటికి సహాయపడటం వంటి వాటికి సంబంధించిన దృశ్యాలను ప్రసారం చేయొద్దని దేశంలోని ప్రైవేటు టీవీ ఛానళ్లకు కేంద్ర సమాచార, ప్రసారశాఖ హెచ్చరిక జారీ చేసింది. 'ఎర్రకోట బాంబు పేలుడులో పాల్గొన్నారని భావిస్తున్న నిందితులు తమ చర్యలను సమర్థించుకుంటూ పెట్టిన వీడియోలను కొన్ని టీవీ ఛానళ్లు ప్రసారం చేయడం మా దృష్టికి వచ్చింది. పేలుడు పదార్థాలు ఎలా తయారుచేయాలన్నది తెలియజేసే వీడియోలను కొన్ని ఛానళ్లు ప్రసారం చేశాయని సమాచారం అందింది. అందుకే ఈ హెచ్చరికలు జారీ చేస్తున్నాం' అని కేంద్రం మంగళవారం స్పష్టంచేసింది. 'ఇటువంటి వీడియోలు హింసను ప్రోత్సహిస్తాయి. జాతీయ భద్రతను ప్రమాదంలో పడేస్తాయి. ఇటువంటి దృశ్యాలను ప్రసారం చేసేటప్పుడు సున్నితత్వాన్ని అర్థం చేసుకోవాలి. విచక్షణ పాటించాలి' అని కేంద్రం సూచించింది.

క్యూఎస్ సుస్థిర విద్యాసంస్థల్లో ఐఐటీలకు చోటు

దిల్లీ: క్యూఎస్ సుస్థిర విద్యా సంస్థల్లో దిల్లీ, బొంబాయి, ఖరగ్‌పూర్ ఐఐటీలకు చోటు దక్కింది. 2023లో ఏర్పాటు చేసిన ఈ విభాగంలో 2026 ఏడాదికిగానూ స్వీడన్‌లోని లండ్ యూనివర్సిటీ మొదటి స్థానంలో నిలిచింది. గత ఏడాది మొదటి స్థానంలో నిలిచిన టొరంటో యూనివర్సిటీ ఈసారి రెండో స్థానానికి పడిపోయింది. బ్రిటన్‌లోని యూసీఎల్ వర్సిటీ మూడో స్థానంలో నిలిచింది. మొత్తం 700 వర్సిటీలకు లండన్ కేంద్రంగా పని చేసే క్యూఎస్ సంస్థ ర్యాంకులను ఇచ్చింది. అందులో 103 భారత వర్సిటీలు స్థానం సంపాదించాయి. ఇందులో గత ఏడాదితో పోలిస్తే 32 విద్యా సంస్థలు ర్యాంకులను మెరుగుపరుచుకున్నాయి. 15 సంస్థలు నిరుటి స్థానాల్లోనే ఉన్నాయి. 30 సంస్థల ర్యాంకులు దిగజారాయి. భారత విద్యా సంస్థల్లో దిల్లీ మొదటి స్థానంలో నిలిచింది.

మోదీది 'ఎమోషనల్ మోడ్'

- ప్రధానిపై మళ్లీ శశిథరూర్ ప్రశంసలు



దిల్లీ, ఇంటర్నెట్‌డెస్క్: మోదీ సర్కారుకు అనుకూలంగా వ్యాఖ్యలుచేస్తూ సొంత పార్టీ నుంచి విమర్శలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ మరోసారి ప్రధాని మోదీపై ప్రశంసల వర్షం కురిపించారు. సోమవారం దిల్లీలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో మోదీ చేసిన ప్రసంగానికి కితాబిస్తూ మరుసటి రోజు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'అభివృద్ధి కోసం భారత్ ఎంత తపనపడాలో, బ్రిటిషు కాలం నాటి మనస్తత్వాన్ని ఎలా వీడాలో ప్రధాని మోదీ తన ప్రసంగంలో తెలిపారు. ప్రపంచానికి భారత్ కేవలం 'అభివృద్ధి చెందుతున్న మార్కెట్' మాత్రమే కాదని, 'అభివృద్ధి మోడల్' అని ప్రధాని అన్నారు. ఎప్పుడూ ఎలక్షన్ మోడ్‌లో ఉంటారని తనను అందరూ ఆరోపిస్తుంటారని మోదీ చెప్పారు. కానీ ఆయన ప్రజల సమస్యల విషయంలో ఎప్పుడూ ఎమోషనల్ మోడ్‌లో ఉంటారు' అని థరూర్ పోస్టులో కితాబిచ్చారు. ఆయన పోస్టుపై కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు.

ఆత్మాహుతి అంటే బలిదానం!

- నా గురించి వార్తలొస్తే మొబైల్‌ను నీటిలో పడేయండి
- కశ్మీర్‌లో ఉన్నప్పుడే చెప్పిన ఉమర్ నబీ
- ఈడీ సోదాలు.. అల్ ఫలా గ్రూపు ఛైర్మన్ అరెస్టు



ఉమర్ నబీ

దిల్లీ: ఎర్రకోట సమీపాన కారుబాంబుతో దాడికి పాల్పడి మారణహోమం సృష్టించిన డాక్టర్ ఉమర్ నబీ.. ఆత్మాహుతి దాడులకు ప్రేరేపించేలా రూపొందించిన వీడియో సందేశం దర్యాప్తు అధికారులకు లభ్యమైంది. ఆత్మాహుతికి పాల్పడటాన్ని బలిదానంగా పేర్కొన్నట్లు దానిలో ఉంది. నబీ సోదరుడు జహూర్ ఇలాహీని విచారించిన మీదట ఈ కీలక ఆధారం దొరికింది. అక్టోబరు 26 నుంచి 29 వరకు కశ్మీర్‌లో ఉన్న ఉమర్ నబీ తన మొబైల్ ఫోన్‌ను సోదరుడికి అప్పగించాడు. ఒకవేళ తన గురించి ఏమైనా వార్తలు వచ్చినట్లయితే ఆ ఫోన్ ఎవరికీ లభ్యం కాకుండా నీళ్లలోకి విసిరేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చాడు. ఆ ప్రకారం ఫోనును ఇలాహీ పడవేసి, పోలీసులు ప్రశ్నించినప్పుడు ఆ ప్రదేశాన్ని చూపించాడు. హ్యాండ్‌సెట్ దెబ్బతిన్నా, మొబైల్‌లోని కీలకమైన డేటాను ఫోరెన్సిక్ నిపుణులు బయటకు తీయగలిగారు. లోతైన విశ్లేషణ కోసం ఫోన్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) అధికారులకు అప్పగించారు. ఇలాహీని త్వరలో అరెస్టు చేయనున్నారు.

■ ఎర్రకోట పేలుడు కుట్రలో చురుకైన పాత్ర పోషించిన జాసిర్ బిలాల్‌ను దిల్లీలోని కోర్టు 10 రోజులపాటు ఎన్ఐఏ కస్టడీకి అప్పగించింది.


■ సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు తమ హోదాను వాడుకుంటున్నారనే అభియోగంతో ఓ ప్రభుత్వ వైద్యుడిని, ఆయన భార్యను కశ్మీర్ నిఘా విభాగ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

ఆర్థిక వ్యవహారాలపై ఆరా

ఉమర్ నబీ పనిచేసిన అల్ ఫలా విశ్వవిద్యాలయంతో సంబంధాలు ఉండటం, అక్కడి ఆర్థిక వ్యవహారాలపై అనుమానాలు వ్యక్తం కావడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం (పీఎంఎల్‌యే) నిబంధనల కింద అల్ ఫలా గ్రూపు ఛైర్మన్ జవాద్ అహ్మద్ సిద్దీకీని మంగళవారం రాత్రి అరెస్టు చేసింది. వర్సిటీ ట్రస్టీలు, ప్రమోటర్లకు సంబంధించిన 25 ప్రాంగణాల్లో తెల్లవారుజాము నుంచే సోదాలు ప్రారంభించింది. రూ.48 లక్షల నగదు స్వాధీనం చేసుకుంది.

ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా
ప్రపంచ దేశాలు సహించకూడదు

- ఎస్‌సీవో సదస్సులో జైశంకర్



పుతిన్‌తో మాస్కోలో సమావేశమైన జైశంకర్

మాస్కో: ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా.. ప్రపంచ దేశాలు సహించకూడదని భారత్ పేర్కొంది. దాన్ని ఎవరూ సమర్థించకూడదని సూచించింది. ఈ మేరకు రష్యాలోని మాస్కోలో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సమావేశంలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ మంగళవారం మాట్లాడారు. "ఉగ్రవాదం నుంచి మా ప్రజలను రక్షించుకోవడానికి భారత్‌కు హక్కుంది. అందుకు అనుగుణంగా ఇప్పటికే గట్టి చర్యలు తీసుకుంది. భవిష్యత్తులోనే తీసుకుంటుంది. గడిచిన సంవత్సరాల్లో ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదం అనే మూడు దుష్టశక్తుల ముప్పు ఎక్కువైంది. వీటిని ఎదుర్కోవడానికి ఎస్‌సీవో ఏర్పడిందన్న విషయాన్ని మనం ఎప్పటికీ మర్చిపోకూడదు" అని జైశంకర్ గుర్తు చేశారు. అలాగే మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా ఎస్‌సీవో మారాలని, విస్తృత ఎజెండాను రూపొందించాలని, అందుకు తగ్గట్లు సంస్కరణలు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. దీనికి భారత్ పూర్తిగా సహకరిస్తుందని జైశంకర్ పేర్కొన్నారు. మరోవైపు ప్రపంచ ఆర్థిక పరిస్థితి అస్థిరంగా ఉందని, దీని వల్ల సరఫరా, డిమాండ్‌లలో సంక్లిష్టతలు ఏర్పడ్డాయని, వీటిని తగ్గించే చర్యలు అత్యవసరమని చెప్పారు.

సౌదీ అరేబియాకు ఎఫ్-35ల అమ్మకం

- ఎంబీఎస్ పర్యటన వేళ ట్రంప్ కీలక నిర్ణయం



ట్రంప్‌తో మహమ్మద్ బిన్ సల్మాన్

వాషింగ్టన్: ప్రముఖ పాత్రికేయుడు జమాల్ ఖషోగ్గి హత్య పూర్వరంగంలో ఏర్పడిన ఉద్రిక్తతల అనంతరం అమెరికా-సౌదీ సంబంధాలు మళ్లీ బలపడుతున్నాయి. 2018 తర్వాత సౌదీ క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్(ఎంబీఎస్) మొదటిసారిగా శ్వేత సౌధానికి విచ్చేశారు. ఆయనకు ట్రంప్ అదిరిపోయేలా ఆతిథ్యం ఇచ్చారు. సౌదీ అరేబియాకు అత్యాధునిక ఎఫ్ 35 స్టెల్త్ ఫైటర్ జెట్ల విక్రయాన్ని ఆమోదిస్తున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టంచేశారు. విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా 'అవును. మేము ఎఫ్-35లు అమ్మబోతున్నాం' అన్నారు. సౌదీ-ఇజ్రాయెల్ సంబంధాలు సాధారణ స్థితికి రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అయితే యుద్ధ విమానాల అమ్మకంపై అమెరికా అధికారుల్లో కొంత ఆందోళన ఉంది. సౌదీ-చైనా సంబంధాలు ఇటీవల బలపడుతున్న నేపథ్యంలో ప్రపంచంలోనే అత్యాధునిక యుద్ధ విమాన సాంకేతికత చైనా చేతుల్లో పడే అవకాశముందని భావిస్తున్నారు.

ఎంబీఎస్-వాషింగ్టన్ సంబంధాలు మళ్లీ గాడిలో

జర్నలిస్ట్ జమాల్ ఖషోగ్గి హత్య వివాదం చాన్నాళ్లుగా అమెరికా-సౌదీల మధ్య అగ్గిరాజేస్తోంది. క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ చివరిసారి 2018లో వైట్‌హౌస్‌కు వచ్చినప్పుడు ఇదే అంశంపై వాడీవేడీ చర్చలూ జరిగాయి. ఖషోగ్గి హత్య ఆపరేషన్‌లో బిన్‌సల్మాన్ హస్తం ఉండొచ్చని అప్పట్లో అమెరికా నిఘా వర్గాలు అంచనావేశాయి. సౌదీ మాత్రం ఆ ఆరోపణలను కొట్టిపారేసింది. ఏడేళ్ల తర్వాత అలాంటి భావనలు తొలగిపోయాయని ట్రంప్ భావిస్తున్నారు.

రెండు గేమింగ్ సంస్థల కార్యాలయాల్లో ఈడీ సోదాలు

దిల్లీ: నగదు అక్రమ చలామణి (మనీ ల్యాండరింగ్) వ్యవహారంలో రెండు ఆన్‌లైన్ గేమింగ్ సంస్థల కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు చేసింది. విన్‌జో, గేమ్స్‌క్రాఫ్ట్ సంస్థలకు బెంగళూరు, దిల్లీ, గురుగ్రామ్‌లలో ఉన్న దాదాపు 11 కార్యాలయాలు, వాటి నిర్వాహకులు, సీఈవోలు, సీవోవోలు, సీఎఫ్‌వోల నివాసాల్లో బెంగళూరు జోన్ ఈడీ అధికారులు మంగళవారం ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సంస్థల యాప్‌లలో వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా ఆల్గరిథమ్‌లను మారుస్తున్నారని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్‌ఐఆర్ నమోదైంది. దాని ఆధారంగా ఈడీ ఏకకాలంలో దర్యాప్తు చేపట్టింది. కాగా, నగదుతో కూడిన ఆన్‌లైన్ గేమ్‌లపై కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిషేధం విధించిన విషయం తెలిసిందే.

కిడ్నీ దానంపై చర్చకు సిద్ధం

లాలూ కుమార్తె సవాల్



పట్నా: ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు తాను చెత్త కిడ్నీని దానం చేశానని ఆరోపిస్తున్న వారితో బహిరంగ చర్చకు సిద్ధమని ఆయన కుమార్తె రోహిణి ఆచార్య స్పష్టం చేశారు. ఆలా ఆరోపణలు చేసేవారు లాలూ పేరుతో తమ కిడ్నీలను దానం చేసి చూపాలని సవాల్ విసిరారు. 'లాలూ పేరుతో ఏదైనా చేయాలనుకునే వారు బూటకపు సానుభూతిని ఆపాలి. అటువంటి వారు దేశంలో కిడ్నీల మార్పిడి కోసం ఎదురుచూస్తున్న లక్షల మంది కోసం లాలూ పేరుతో కిడ్నీలను దానం చేయాలి' అని మంగళవారం ఆమె ఎక్స్‌లో పేర్కొన్నారు. తేజస్వీ అనుచరుడు సంజయ్ యాదవ్‌పై మరోసారి ఆరోపణలు చేశారు.

■ ఎన్నికల్లో ఆర్జేడీ పేలవ ప్రదర్శనకు, ప్రస్తుతం లాలూ కుటుంబంలో జరుగుతున్న ఘర్షణలకు పార్టీ నేత సంజయ్ యాదవే కారణమని వస్తున్న ఆరోపణలను ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఖండించారు. తనకున్న అత్యంత విశ్వసనీయ అనుచరుల్లో ఆయన ఒకరని.. పార్టీ ప్రచార వ్యూహాలను రూపొందించడం, అభ్యర్థులను ఖరారు చేయడం వంటి ఎన్నికల సన్నాహాల్లో కీలక పాత్ర పోషించారని స్పష్టం చేశారు.

పాన్ ఇండియా స్థాయిలో ఓట్ల చోరీ

బిహార్‌లో ఓటమికి నాదే బాధ్యత: ప్రశాంత్ కిశోర్



ఈటీవీ భారత్: ఓట్ల చోరీ పాన్ ఇండియా అంశమని, దానిపై జాతీయ పార్టీలు.. ఇతర పార్టీలతో చర్చలు జరపాలని ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ సూచించారు. అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పేలవ ఫలితాలకు తానే బాధ్యత తీసుకుంటానని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై పట్నాలో ఆయన మీడియాతో మాట్లాడారు. బిహార్ ప్రజలు ఏకపక్షంగా ఎన్డీయేకు అధికారం కట్టబెట్టారని వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు బాధ్యత ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ, నీతీశ్ కుమార్‌లపై ఉందని స్పష్టం చేశారు.

నా తల్లిదండ్రులను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు: తేజ్ ప్రతాప్



పట్నా: తన తల్లిదండ్రులు లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీదేవీలు శారీరక, మానసిక వేధింపులకు గురవుతున్నారని ఆయన పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ విషయంపై వెంటనే దర్యాప్తునకు ఆదేశించాల్సిందిగా ప్రధాన మంత్రి మోదీ, హోం మంత్రి అమిత్ షాలతోపాటు బిహార్ రాష్ట్ర ప్రభుత్వానికి 'ఎక్స్' వేదికగా విజ్ఞప్తి చేశారు. 'ముఖస్తుతి చేసేవారి కుట్రపూరిత రాజకీయాల వల్ల ఆర్జేడీని బలమైన పార్టీగా మార్చడానికి ఎన్నో ఏళ్లు కష్టపడిన వారిని విస్మరిస్తున్నారు. దురాశ, అహంకారంతో విర్రవీగుతున్న తేజస్వీ సహాయకులు నా తల్లిదండ్రులను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నట్లు తెలిసింది. నా తండ్రి ఇప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో వారు ఒత్తిడిని తట్టుకోలేరు. ఈ విషయంపై దర్యాప్తునకు ఆదేశించాలని అభ్యర్థిస్తున్నా' అని కోరారు. తన సోదరి రోహిణికి జరిగిన అవమానంపై తమ పార్టీ మౌనంగా ఉండబోదని తేజ్ ప్రతాప్ పేర్కొన్నారు.

నేనే పరిష్కరిస్తా: లాలూ

కుటుంబ కలహాలపై మొదటిసారిగా లాలూ ప్రసాద్ స్పందించారు. ఇది తమ కుటుంబ సమస్యని, తానే పరిష్కరిస్తానని స్పష్టం చేశారు.

స్పీకర్ పదవి ఎవరికి?

- తమకే కావాలంటున్న భాజపా, జేడీయూ
- బిహార్ మంత్రివర్గ కూర్పుపై చర్చలు

దిల్లీ, పట్నా: బిహార్‌లో 20వ తేదీన ఏర్పడబోయే కొత్త ప్రభుత్వంపై కసరత్తు సాగుతోంది. మంత్రివర్గ కూర్పుపై ఎన్డీయే కూటమిలో ప్రధాన పార్టీలైన భాజపా, జేడీయూ మధ్య చర్చలు జరుగుతున్నాయి. స్పీకర్ పదవి విషయంలో రెండు పార్టీలూ పట్టుదలగా ఉన్నాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మంగళవారం జేడీయూ నేతలు సంజయ్ ఝా, లలన్ సింగ్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా పాల్గొన్నారు. సుమారు 3 గంటలపాటు జరిగిన ఈ సమావేశానికి సంబంధించిన వివరాలు బయటకు రాలేదు. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం.. ప్రభుత్వ ఏర్పాటు సన్నద్ధత, మంత్రి పదవుల కేటాయింపు, అసెంబ్లీ స్పీకరు పోస్టుపై ఈ సమావేశంలో చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

■ ప్రస్తుత అసెంబ్లీలో స్పీకరుగా భాజపా నేత నంద కిశోర్ యాదవ్ వ్యవహరిస్తున్నారు. జేడీయూ నేత నరేంద్ర నారాయణ్ యాదవ్.. డిప్యూటీ స్పీకరుగా ఉన్నారు.

■ కొత్త అసెంబ్లీ స్పీకరు పదవికి పోటీలో జేడీయూ నేత విజయ్ చౌధరి, భాజపా నేత ప్రేమ్ కుమార్ పోటీలో ఉన్నారు.

సాంకేతికంగా అసాధ్యం

- ఆర్జేడీ ఆరోపణలను తోసిపుచ్చిన ఈసీ

పట్నా: ఈవీఎంలలో ముందుగానే 25,000 ఓట్లను లోడ్ చేశారని ఆర్జేడీ నేత జగదానంద్ సింగ్ చేసిన ఆరోపణలను ఎన్నికల సంఘం (ఈసీ) తోసిపుచ్చింది. ఇది సాంకేతికంగా అసాధ్యమని స్పష్టం చేసింది. పోలింగ్ సమయంలో ఆర్జేడీ ఏజెంట్లు తనిఖీ చేసి సంతకం చేశారని, దానికీ, ఆర్జేడీ నేత ఆరోపణకు పొంతన లేదని మంగళవారం ఒక ప్రకటనలో ఈసీ వెల్లడించింది. 'ఈవీఎంలకు వైఫై ఉండదు. బ్లూటూత్, ఇంటర్నెట్, ఇతర బయటి నెట్‌వర్క్‌లను అనుసంధానం చేయలేం. డిజిటల్ ట్యాంపరింగ్‌కు అవకాశం లేదు. పోలింగ్‌కు ముందు ప్రతి అభ్యర్థికి సున్నా ఓట్లు చూపిస్తుంది. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి నిర్ధారించుకుంటాం. ఆ తర్వాత మాక్ ఓట్లను తొలగించి మాక్ పోలింగ్ ధ్రువీకరణ పత్రంపై సంతకాలు తీసుకుంటాం' అని ఈసీ వివరించింది.



దేశ రాజధాని దిల్లీలో గాలి నాణ్యతను మెరుగుపర్చేందుకు సత్వరం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్ వద్ద మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న స్థానికులు



బాంబు బెదిరింపుల నేపథ్యంలో సాకేత్ కోర్టు నుంచి బయటకు వచ్చిన న్యాయవాదులు

దిల్లీలో పాఠశాలలు, కోర్టులకు బాంబు బెదిరింపులు

దిల్లీ: దేశరాజధాని దిల్లీలో పేలుడు ఘటన మరవకముందే మరోసారి బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపాయి. పలు కోర్టులు, విద్యాసంస్థలు లక్ష్యంగా కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఈ-మెయిల్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. వాటిలో రెండు సీఆర్‌పీఎఫ్ స్కూల్స్ ఉన్నాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు తనిఖీలు చేపట్టారు. మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో పటియాలా హౌస్ కోర్టు, సాకేత్ కోర్టులు, ద్వారక, ప్రశాంత్ విహార్‌లోని రెండు సీఆర్‌పీఎఫ్ పాఠశాలలకు బాంబు బెదిరింపులొచ్చాయి. ఇది టెర్రర్ మాడ్యుల్ నుంచి వచ్చినట్లుగా అధికారులు తెలిపారు. కోర్టు ప్రాంగణాలతో పాటు సీఆర్‌పీఎఫ్ పాఠశాలలను ఖాళీ చేయించారు. వెంటనే బాంబ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. కాగా.. బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో అది నకిలీ మెయిల్‌గా గుర్తించారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని అధికారులు తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాలపై ఎస్ఎస్‌సీ కొత్త మార్గదర్శకాలు

దిల్లీ: ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు హాజరయ్యే దివ్యాంగులు చూపించాల్సిన ధ్రువీకరణ పత్రాల నమూనాలను స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) తాజాగా నవీకరించింది. ఒకే వైకల్యం ఉన్న వారు ఫామ్-V, ఒకటి కంటే ఎక్కువ వైకల్యాలున్న వారు ఫామ్- VI పత్రాన్ని చూపించాల్సి ఉంటుందని స్పష్టంచేసింది. ఇదివరకు ఈ రెండింటితో పాటు ఫామ్- VII ఉండేది. అయితే ఇప్పటికే వచ్చిన పరీక్ష నోటిఫికేషన్‌లకు కొత్త విధానం లేదా పాత విధానాన్నీ అనుసరించవచ్చని పేర్కొంది.



ఉన్నతస్థాయికి ఎదగాలంటే..

మార్పడానికి అవకాశం లేని విషయాలను పక్కనపెట్టి మార్చగలిగే విషయాలపై దృష్టి సారిస్తే జీవితంలో ఉన్నతస్థాయికి ఎదిగేందుకు అవకాశం ఉంటుంది. మార్పలేని అంశాలను పరిశీలిస్తే.. 1. గతం 2. ఈ ప్రపంచం 3. ఇతరులు ఇక మార్పు తీసుకురాగలిగే విషయాలు..1. మీ వైఖరి 2. మీ ఊహలు 3. మీ నమ్మకాలు

– మార్క్ మాన్సన్, రచయిత



కారుమూరి వెంకటరెడ్డిని తాడిపత్రి కోర్టుకు తరలిస్తున్న పోలీసు అధికారులు

వైకాపా అధికార ప్రతినిధి కారుమూరి వెంకటరెడ్డి అరెస్ట్

హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న పోలీసులు

తాడిపత్రి, హైదరాబాద్ (మూసాపేట), న్యూస్‌టుడే: వైకాపా అధికార ప్రతినిధి కారుమూరి వెంకటరెడ్డిని అనంతపురం జిల్లా తాడిపత్రి రూరల్ పోలీసులు మంగళవారం హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. తిరుమల పరకామణిలో చోరీ కేసులో ఫిర్యాదుదారైన సీఐ సతీష్ కుమార్ హత్య విషయంలో వెంకటరెడ్డి పలు ఆరోపణలు చేశారు. సతీష్‌కుమార్ కేసు విచారణలో ఉండగానే వెంకటరెడ్డి ఓ టీవీ ఛానెల్‌లో మాట్లాడుతూ.. ఇది ప్రభుత్వ హత్యేనని చెప్పారు. దీనిపై సోమవారం తాడిపత్రి తెదేపా నాయకుడు ప్రసాద్‌నాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై తాడిపత్రి గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో హైదరాబాద్ మూసాపేట పరిధిలో గేటెడ్ సముదాయంలోని ఆయన ఫ్లాట్‌కు ఉదయం 7.30 గంటలకు నలుగురు పోలీసులు మఫ్టీలో వెళ్లారు. ఈ సమయంలో పోలీసులతో వెంకటరెడ్డి వాగ్వాదానికి దిగారు. పోలీసులను తోసేసి విధులకు ఆటంకం కలిగించారు. అతి కష్టం మీద అరెస్టు చేసి అనంతపురం తీసుకొచ్చి గుంతకల్లు డీఎస్పీ కార్యాలయంలో విచారించారు. అనంతరం తాడిపత్రికి తరలించి కోర్టులో హాజరుపరిచారు. అయితే తన భర్తను గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారంటూ వెంకటరెడ్డి భార్య హరిత హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



నీటి సంరక్షణలో అత్యుత్తమ కృషి చేసిన ప్రకాశం జిల్లాకు చెందిన పొదిలి రాజశేఖరరాజుకు అవార్డు ప్రదానం చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ★ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ★ కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్‌మీనా ★ అవార్డు స్వీకరిస్తున్న శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, డ్వామా పీడీ గంగాభవాని ★ అవార్డు స్వీకరిస్తున్న ప్రకాశం జిల్లా కలెక్టర్ పి.రాజబాబు

నీరున్నచోటే విలసిల్లిన నాగరికత

- జలసంరక్షణలో ప్రభుత్వాలు, ప్రజలు కలిసి అడుగేయాలి
- జాతీయ జల అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము
- ఆంధ్రప్రదేశ్‌కు 5 అవార్డులు

ఈనాడు, దిల్లీ: మానవ నాగరికత నీరున్న చోటే విలసిల్లిందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. మానవసమూహం అంతా నదీలోయలు, సముద్రతీరాలు, ఇతర జలవనరుల పరిసరాల్లోనే స్థిరపడటమే ఇందుకు నిదర్శనమని అభిప్రాయపడ్డారు. మంగళవారం ఇక్కడి విజ్ఞాన్‌భవన్‌లో నిర్వహించిన 6వ జాతీయ జల అవార్డుల ప్రదానోత్సవంలో విజేతలకు పురస్కారాలు అందజేసిన అనంతరం ఆమె మాట్లాడారు. 'మన సంప్రదాయంలో నదులు, సరస్సులు, ఇతర జలవనరులను పూజిస్తాం. వందేమాతర గీతంలో తొలి పదం సుజలాం అని ఉంటుంది. మానవ జీవితంలో నీటికున్న ప్రాధాన్యానికి అది అద్దం పడుతుంది. నీటిని సమర్థంగా ఉపయోగించుకోవడం ఇప్పుడు ప్రపంచ ప్రాధాన్యం. ప్రభుత్వాలు, ప్రజలు కలిసికట్టుగా పనిచేసి నీటి లభ్యతతోపాటు, భద్రతనూ పెంపొందించాలి. గత ఏడాది ప్రారంభించిన జల్‌సంచయ్- జన్‌భాగీదారీ కార్యక్రమం కింద 35 లక్షల భూగర్భ రీఛార్జి నిర్మాణాలు చేపట్టడం సంతోషకరం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్థానిక సంస్థల వరకు నీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. తక్కువ నీటితో ఎక్కువ ఉత్పత్తి సాధించేలా రైతులు, పరిశ్రమలు సరికొత్త విధానాలు అనుసరించాలి' అని పిలుపునిచ్చారు. జలసంరక్షణలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకొనేలా స్ఫూర్తినివ్వడానికి కేంద్ర ప్రభుత్వం ఏటా జాతీయ జల అవార్డులు అందిస్తోంది. ప్రభుత్వం వద్ద వనరులను సమీకృతం చేసి ప్రజా భాగస్వామ్యంతో భూగర్భజలాల కృత్రిమ రీఛార్జి కార్యక్రమాలు చేపట్టేలా ప్రోత్సహించడానికి ఈ సంవత్సరం నుంచి కొత్తగా జల్ సంచయ్- జన్‌భాగీదారీ అవార్డులు ప్రవేశపెట్టింది.

జాతీయ స్థాయిలో నంబర్ 1గా దుబ్బిగానిపల్లె

ఈ పురస్కారాల్లో ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం ఐదు అవార్డులు దక్కాయి.

★ అత్యధిక సంఖ్యలో నీటి సంరక్షణ పనులు చేపట్టిన నగరపాలక సంస్థల విభాగంలో రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ జాతీయస్థాయిలో 4వ స్థానంలో నిలిచింది. ఈ పురస్కారంతోపాటు రూ.2 కోట్ల నగదు బహుమతిని కార్పొరేషన్ కమిషనర్ రాహుల్‌మీనా అందుకున్నారు.

★ జిల్లాల విభాగంలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు 3వ కేటగిరీలో 12వ ర్యాంకు సొంతం చేసుకొంది. ఈ పురస్కారాన్ని, రూ.25 లక్షల నగదు బహుమతిని జిల్లా తరఫున కలెక్టర్ హిమాన్షు శుక్లా, డ్వామా పీడీ గంగాభవాని అందుకున్నారు.

★ గ్రామ పంచాయతీల విభాగంలో జాతీయస్థాయిలో మొదటి ర్యాంకుతోపాటు, రూ.2 లక్షల నగదు బహుమతిని అన్నమయ్య జిల్లా దుబ్బిగానిపల్లె దక్కించుకుంది. కలెక్టర్ నిశాంత్‌కుమార్ వీటిని స్వీకరించారు.

★ గ్రామ పంచాయతీల విభాగంలో జాతీయస్థాయిలో రెండో ర్యాంకుతోపాటు, రూ.1.5 లక్షల నగదు బహుమతిని ప్రకాశం జిల్లా మూరుగుమ్మి సొంతం చేసుకుంది. కలెక్టర్ పి.రాజబాబు అందుకున్నారు.

★ నీటిసంరక్షణలో అత్యుత్తమ కృషికి దక్షిణాదిలో తొలి స్థానంలో నిలిచిన ప్రకాశం జిల్లాకు చెందిన పొదిలి రాజశేఖరరాజు అవార్డుతో పాటు రూ. లక్ష నగదు బహుమతిని సొంతం చేసుకున్నారు.

హత్యను ఆత్మహత్య అని మభ్యపెట్టారు

- రైల్వే పోలీసుల వైఖరిపై బంధువుల ఆవేదన
- సతీష్‌కుమార్ కేసు దర్యాప్తు తీరుపై తీవ్ర అసంతృప్తి

ఈనాడు, కర్నూలు: పరకామణిలో చోరీ ఘటనకు సంబంధించిన కేసులో ఫిర్యాదుదారైన గుంతకల్లు రైల్వే సీఐ వై.సతీష్‌కుమార్ హత్య కేసులో రైల్వే పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై ఆయన బంధువులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై తొలుత ఫోన్ చేసినప్పుడే సతీష్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం ఇచ్చారని, అక్కడికి వెళ్లి మృతదేహాన్ని చూసిన తర్వాత కూడా ఆత్మహత్య చేసుకున్నారని తమను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మెదడు బయటకు వచ్చేలా తల పగలగొడితే.. అది ఆత్మహత్య అని ఎలా అంటారని ఆయన సోదరులు, బంధువులు ప్రశ్నిస్తున్నారు. "మేం పత్తికొండ నుంచి బయలుదేరిన తర్వాత మృతదేహం ఎక్కడుందని అడిగితే.. తాడిపత్రి ఆసుపత్రిలో ఉందని చెప్పారు. అక్కడకు వెళితే లేదన్నారు. ఇదేమని అడిగితే రైలుపట్టాల దగ్గరే ఉందని చెప్పారు. మళ్లీ తాడిపత్రి నుంచి కోమలి సమీపంలోని ఘటనా స్థలానికి వెళ్లాల్సి వచ్చింది. మాకు తప్పుడు సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఏమిటి" అని నిలదీశారు.

తలపై గాయాలు.. వీడని మిస్టరీ

రైలు నుంచి ప్రమాదవశాత్తు కిందపడిపోతే శరీరమంతా గాయాలు కావాలని, అందుకు భిన్నంగా సతీష్‌కుమార్ తల వెనక భాగంలో మాత్రం భారీ గాయమై, మెదడు బయటకు వచ్చేసిందని అతని బంధువులు వివరిస్తున్నారు. మృతదేహం పడి ఉన్నచోట రక్తపు మరకలున్న ఒక రాయి ఉందని.. అతని తలను పట్టుకుని ఆ రాయికి బలంగా మోది ఉంటారని పేర్కొంటున్నారు.

మొలతాడు ముక్కలు కనిపించాయి

సతీష్‌కుమార్ మొలతాడు ముక్కలు కూడా ఘటనా స్థలంలో కనిపించాయని, ప్రమాదవశాత్తు రైలు నుంచి కింద పడితే మొలతాడు ఎందుకు ముక్కలవుతుందని అతని బంధువులు ప్రశ్నిస్తున్నారు. తాజాగా కేసును రైల్వే పోలీస్‌స్టేషన్ నుంచి తాడిపత్రి పోలీస్‌స్టేషన్‌కు మార్చిన నేపథ్యంలో అయినా కేసులో ప్రగతి కనపడుతుందన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

తితిదేకు రూ.2 కోట్ల విరాళం



తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడికి విరాళం డీడీ అందిస్తున్న హెచ్‌సీఎల్ ఛైర్‌పర్సన్ రోష్ని నాడార్ కుటుంబం. చిత్రంలో వెంకయ్యచౌదరి తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే బర్డ్ ట్రస్టుకు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఛైర్‌పర్సన్ రోష్ని నాడార్ రూ.2 కోట్లు విరాళంగా అందించారు. దాత మంగళవారం శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడికి విరాళం డీడీ అందజేశారు. కార్యక్రమంలో తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి తదితరులు ఉన్నారు.

లారీని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

ఎనిమిది మందికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కె.కావేరి ట్రావెల్స్ బస్సు

నందిగామ, న్యూస్‌టుడే: హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి మరో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురైంది. అతి వేగంగా ఓవర్‌టేక్ చేస్తుండగా లారీని ఢీకొట్టడంతో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. కె.కావేరి ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి శ్రీకాకుళానికి 35 మందితో బయలుదేరింది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ సమీపంలోని అనాసాగరం వద్ద ఫ్లైఓవర్‌పైకి రాగానే విజయవాడ వైపు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో దాన్ని ఢీకొట్టుకుంటూ ముందుకెళ్లింది. ఈ ఘటనలో బస్సు ఎడమవైపు పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఆవైపు కూర్చున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన బేవర సతీష్‌కుమార్, సవరం డానియేల్, సవరం సంతోష్, సవరం నరేష్, గోడ సుగుణ, గుంటి మహేష్, ఒడిశా రాష్ట్రం రాజోలు జిల్లా జీర మండలానికి చెందిన మధురదాసు, మట్టా దాస్‌లకు గాయాలయ్యాయి. వీరిలో నలుగురికి తీవ్రగాయాలు కావడంతో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి, మిగతావారిని నందిగామ వైద్యశాలకు తరలించారు. నందిగామ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనంతపురంలో ఎయిర్ ట్యాక్సీల యూనిట్

ఎంవోయూ కుదుర్చుకున్న సై్క ఫ్యాక్టరీ

ఈనాడు, అమరావతి: అనంతపురంలో రూ.1,300 కోట్ల పెట్టుబడితో ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సై్క ఫ్యాక్టరీ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. దేశంలో మొదటి గిగా స్కేల్ క్లస్టర్ అభివృద్ధికి విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో సర్లా ఏవియేషన్, రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ మధ్య ఎంవోయూ కుదిరిందని పేర్కొంది. 'మొదటి దశలో అనంతపురం జిల్లా తిమ్మసముద్రం వద్ద రూ.330 కోట్ల పెట్టుబడితో 150 ఎకరాల్లో తయారీ, పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం. రెండో దశలో 350 ఎకరాలకు ప్రాజెక్టు పనులు విస్తరిస్తాం. 2027 నాటికి 180 మందికి ఉపాధి లభిస్తుంది. ఇందులో 1,000 ఎయిర్ ట్యాక్సీలు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం' అని పేర్కొంది.

EENADU Vol: 52, Issue: 99 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

వసుంధర

vasundhara@eenadu.in



ఇంటికి వెలుగు... మనసుకు హాయి!

ఇంట్లోనుంచి అనవసరమైన వస్తువుల్ని సామాన్లను తీసేయడమే డీక్లటరింగ్. ఇది ఇంట్లో స్థలాన్ని ఆదా చేయడమే కాదు, మానసిక ప్రశాంతతనీ ఇస్తోంది.

ఇంట్లో నిరుపయోగంగా ఉన్న పాత వస్తువుల్ని తీసేయడమంటే నిశ్చలమైన శక్తిని తొలగించినట్లు. ఇంట్లో ఉన్న ప్రతీ వస్తువు దాని పాత్రను పోషించాలి. అది రోజువారీగా ఉపయోగించేది లేదంటే ఫర్నిచర్, అలంకరణ వస్తువైనా కావొచ్చు. ఏదైనాగానీ రెండేళ్లపాటు వినియోగించకుండా ఉంటే, దాని అవసరం, ప్రయోజనం దాదాపు లేనట్టేనని భావించాలి. ఇంట్లో వృథా పెరిగే కొద్దీ ఇల్లంతా చిందరవందరగా కనిపిస్తుంది. దాంతో ఒత్తిడి, అసౌకర్యం కలిగిస్తాయి. ఇంట్లో పొందిగ్గా అమర్చిన వస్తువులు, ఖాళీ ప్రదేశం ఉంటే... గాలీ, వెలుతురూ ధారాళంగా వచ్చేందుకు వీలవుతుంది. అలాంటి వాతావరణం మనసుకు హాయినిచ్చి, ఆలోచనల్లో స్పష్టత తెస్తుంది. ఖాళీ ఏర్పడితే, మనకు అవసరమైన వాటిని అక్కడ అమర్చుకునే అవకాశం ఉంటుంది. పగిలిన వస్తువులు, తుప్పు పట్టిన పరికరాలు, పనిచేయని గ్యాడ్జెట్లు, వాడకుండా ఉంటోన్న దుస్తులు... వీటన్నింటినీ ఎప్పటికప్పుడు గమనించుకుంటూ పడేస్తుండాలి. అలా చేస్తే కొనేటప్పుడు ఎరుకతో ఉంటారు. 'కనిష్ఠ జీవనం' భావన కూడా దాదాపు ఇదే. దీంతో ఇంట్లో ప్రశాంతమైన వాతావరణం ఉంటుంది. మరో పండగ వరకూ వేచిచూడకుండా డీక్లటరింగ్ వెంటనే మొదలుపెట్టండి.

టీనేజర్ని కాదుగా!

మొటిమలు టీనేజర్లకు పెద్ద సమస్య. కానీ కొన్నిసార్లు 30 దాటాకా కూడా కొందరిలో కనిపిస్తుంటాయి. ఎందుకిలా అంటే...



నూనెలు ఎక్కువగా విడుదలవ్వడం, చర్మరంధ్రాలు మూసుకుపోవడం, బ్యాక్టీరియా చేరడం, ఇన్‌ఫ్లమేషన్... ఇలా మొటిమలు రావడానికి బోలెడు కారణాలు. టీనేజర్లలో అయితే హార్మోన్ల ప్రభావం వల్ల పలకరిస్తుంటాయి. వయసు పెరిగే కొద్దీ తగ్గుతాయి. ఆ తరవాతా వస్తోంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. నిజానికి పాతికేళ్లు దాటాక వచ్చే వాటిని అడల్ట్ యాక్నే అని అంటారు. హార్మోనుల్లో అసమతుల్యత, ఒత్తిడి, ఉపయోగించే చర్మ, కేశ ఉత్పత్తులు పడకపోవడం వంటివాటి వల్ల వీళ్లలో మొటిమలు వస్తుంటాయి. వీటిని అడ్డుకోవాలంటే ముందు వాడే ఉత్పత్తులను కొన్నిరోజులు పరీక్షించాలి. అలాగే కొన్ని జాగ్రత్తలూ తీసుకోవాలి. రసాయనాల్లేని మైల్డ్ క్లెన్సర్‌తో రోజుకు రెండుసార్లు తప్పక ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. గట్టిగా రుద్దడం, స్క్రబింగ్ వంటివి చేయకూడదు. ఆస్ట్రింజెంట్స్, మాస్కులను ఇలాంటప్పుడు వాడొద్దు. ఒత్తిడిని తగ్గించుకోవడం, మేకప్‌కి దూరంగా ఉండటం వంటివీ చేయాలి. ఇవన్నీ చేసినా సమస్య తగ్గకపోతే అప్పుడు నిపుణులను సంప్రదించాలి. శాల్సిలిక్‌యాసిడ్, రెటినాల్ వంటి క్రీములను సూచిస్తారు. అదే నెలసరి, హార్మోన్ల సంబంధిత సమస్యలుంటే క్రీములే సరిపోవు. తగిన చికిత్సా తీసుకోవాలి. కాబట్టి, మొటిమే కదా అని తేలిగ్గా తీసుకోవడానికి లేదు. తగ్గ కారణాన్ని తెలుసుకోవాలి, పరిష్కరించుకోవాలి.



పిల్లల ఆటకు ఆర్థిక దన్ను...

క్రికెట్, చదరంగం, ఒలింపిక్స్‌లో అమ్మాయిలు ట్రోఫీలూ, పతకాలూ తెస్తుండటంతో పిల్లలూ క్రీడలవైపు వెళ్లేందుకు మొగ్గుచూపుతున్నారు. ఒకప్పుడు మధ్యతరగతి కుటుంబాలు చదువు మాత్రమే తమ పిల్లల జీవితాల్ని మారుస్తుందని భావించేవి. ఈతరం తల్లిదండ్రులు మాత్రం ఆడపిల్లల్ని క్రీడల్లోనూ ప్రోత్సహిస్తున్నారు. అక్కడ రాణించాలంటే ఆర్థిక ప్రణాళికా అవసరమే.

- పిల్లలు వయసుతోపాటు క్రీడల కెరియర్‌లో ఒక్కో మెట్టు పైపైకి వెళ్తుంటారు. దీనికి సమాంతరంగా ఆర్థిక ప్రణాళికా ఉండాలి. గాయాలు, ప్రమాదాల్లాంటివి క్రీడాకారుల కెరియర్‌ను ఒక్క రోజులోనే మార్చేస్తాయి. కాబట్టి ఆరోగ్య, ప్రమాద బీమాలు ఉండాలి. వీటితో నాణ్యమైన చికిత్సను వేగవంతంగా అందించే సౌలభ్యం ఉంటుంది. ధైర్యంగా మళ్లీ మైదానంలో అడుగుపెట్టేలా చేస్తాయి.
- మ్యాచ్‌లు ఆడుతుంటే పారితోషికాలు, స్పాన్సర్‌షిప్‌లు, నగదు బహుమతులు వస్తుంటాయి. ఇంకా పైకి వెళ్తే కాంట్రాక్టులూ దక్కుతాయి. ఇవన్నీ రాణిస్తున్నప్పుడే! ఏదైనా కారణంవల్ల అనుకున్న ఫలితాలు రాకపోతే? ఆ సమయంలోనూ ఆట కొనసాగాలి. అందుకని 6నెలలపాటు శిక్షణ, ఆహారం, క్రీడా పరికరాలు కొనేందుకు అత్యవసర నిధి ఉండాలి. దీన్ని తల్లిదండ్రులు పిల్లల పేర లేదంటే తమ పేరున ఎఫ్‌డీ, లిక్విడ్ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టడం మంచిది. కావాల్సినప్పుడు నగదుగా మార్చుకోవచ్చు.
- డబ్బులు రాగానే బ్రాండెడ్ గ్యాడ్జెట్లు, కార్లవైపు మనసు మళ్లుతుంది. ఎందరో క్రీడాకారులు మొదట్లో ఒక వెలుగు వెలిగి, తర్వాత కనుమరుగైన ఉదాహరణలు ఉన్నాయి. కాబట్టి స్పాన్సర్‌షిప్, ఫీజులు వచ్చినప్పుడు వస్తువులు కొనేందుకే ఖర్చు చేయొద్దు. ప్రారంభంలో తల్లిదండ్రులు, ఆదాయం వచ్చాక క్రీడాకారిణులు... ఆదాయాన్ని మూడు భాగాలుగా విభజించాలి. అవి బీమా, అత్యవసర నిధి, పెట్టుబడులు... చివరగా జీవనశైలి ఖర్చులు.
- క్రీడాకారుల కెరియర్ వ్యవధి తక్కువ. కొన్ని రకాల ఆటల్లో 20ల్లోనే కెరియర్‌కు ముగింపు పలకాల్సి ఉంటుంది. 10-15 ఏళ్ల ఆదాయంతో వందేళ్ల జీవితానికి ప్రణాళిక వేసుకోవాలి. మొదటి నుంచీ ఆర్థిక క్రమశిక్షణ లేనిదే, ఇది సాధ్యం కాదు. దీనికోసం ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్, దీర్ఘకాలం కొనసాగే పథకాలను ఎంచుకోవాలి. స్థిరమైన పెట్టుబడులతోనే ఆర్థిక స్థిరత్వం వస్తుంది.
- క్రీడల్లో కొనసాగుతూనే సెకండ్ ఇన్నింగ్స్‌కు ప్రణాళిక వేసుకోండి. మీకైన అనుభవం, వ్యాపారం, శిక్షణ కేంద్రం ఏర్పాటు... ఏదైనా కావొచ్చు. చాలాముందుగానే దీన్ని గుర్తించి నైపుణ్యాలు మెరుగుపరుచుకుంటే, ఆర్థిక స్వతంత్రత వస్తుంది. అమ్మాయిలకు ఆర్థిక ప్రణాళిక మరింత కీలకం. అబ్బాయిలకంటే ముందే వీళ్ల పెళ్లి, కుటుంబ జీవితంలో అడుగుపెట్టాల్సి రావొచ్చు. క్రీడల తర్వాత రెండో కెరియర్ గురించి ఆలోచించాలి. లేకపోతే ఆర్థిక స్వేచ్ఛ ఉండదు.

– శిల్పా భాస్కర్ గోలె, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

బాస్‌తో స్నేహం... చిక్కులు తెస్తోంది!

? కొన్నాళ్ల కిందట బాస్‌గా ఒక మహిళ వచ్చారు. ఆమెతో స్నేహం ఏర్పడింది. మొదట్లో మావారు దీని గురించి హెచ్చరించినా పట్టించుకోలేదు. వారాంతాల్లో షాపింగ్‌కు వెళ్లడం, పిల్లలతో ఒకరింటికి మరొకరం వెళ్లి రావడంతో ఇద్దరిమధ్యా చనువు పెరిగింది. ఈ మధ్య ఆమె డెస్క్ దగ్గరకు వచ్చి గట్టిగా నవ్వుతూ మాట్లాడుతున్నారు. సహోద్యోగులు, సీనియర్లు నావైపు అదోలా చూస్తుంటే, ఇబ్బందికరంగా ఉంది. పనిమీద ఆమె క్యాబిన్‌కు వెళ్తే 'వీకెండ్‌లో బయటకు వెళ్దామా' అని అడుగుతున్నారు. ఆమెకు భర్త లేరు. తోడు కోసం నాతో స్నేహంగా ఉంటున్నారని తెలుస్తోంది. కానీ ఇది నాకు ఇంట్లో, ఉద్యోగంలో ఇబ్బందికరంగా ఉంది. ఏం చేయాలి? – ఓ సోదరి

డియర్ వసుంధర



కవితా గూడపాటి

ఈ పరిస్థితి మీ ఉద్యోగానికీ, వ్యక్తిగత శ్రేయస్సుకూ ప్రమాదకరం కాబట్టి, తక్షణ లక్ష్యం మీ బంధాన్ని వృత్తిపరమైన అంశానికి పరిమితం చేయడం. ఆమె మీపైన ఆధారపడటమనేది మీ ప్రమేయం లేకుండా జరగలేదని గమనించండి. కాబట్టి ఆమెమీద నింద మోపే ముందు మీ ప్రవర్తన గురించి ఆత్మపరిశీలన చేసుకోండి. ఇకపైన హద్దుల్ని కచ్చితంగా పాటించండి. మీ బంధం వృత్తిపరమైనదే తప్ప వ్యక్తిగతం కాదని స్పష్టం చేయండి. ఆమెతో ప్రాజెక్టు విషయాల్నే చర్చించండి. ఇలా చేయడంవల్ల ఉద్యోగ మర్యాద నుంచి బయటపడగలరు. ఆమె ఎప్పుడు బయటకు పిలిచినా మీకు వ్యక్తిగతమైన పనులున్నాయని చెప్పండి. ఇలా చేసినా మార్పు రాకుంటే, ఆఫీసు వెలుపల ఓసారి కలిసి ఆమెతో బయటకు రావడంవల్ల కుటుంబానికి సమయం కేటాయించలేకపోతున్నాను, పిల్లలు బాగా మిస్సవుతున్నారని అర్థమయ్యేలా చెప్పండి. ఆమె ఒక ప్రొఫెషనల్‌గా ఆలోచిస్తే మీ పరిస్థితిని అర్థం చేసుకోగలరు. అలా కాకుండా అధికారంతో మీపై ప్రతీకారాన్ని చూపిస్తే, దాన్నుంచి బయటపడటానికి హెచ్‌ఆర్ విభాగాన్ని ఆశ్రయించండి. తప్పుని ఆమెమీదకు నెట్టకుండా జరిగిన విషయం చెప్పండి. పరిస్థితిని సరిదిద్దడానికి మీరు నిజాయతీగా ప్రయత్నించినట్లు తెలియజేయండి. ఇకనైనా ఆఫీసులో తెలివిగా అడుగులు వేయండి.

బంగారం - వెండి



18న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కేజీ)
హైదరాబాద్	1,26,860	1,13,750	1,58,900
విజయవాడ	1,21,440	1,13,350	1,56,200
ప్రొద్దుటూరు	1,23,400	1,13,530	1,55,800
రాజమహేంద్రవరం	1,23,660	1,13,350	1,70,000
విశాఖపట్నం	1,23,200	1,13,350	1,60,000
తమిళనాడు	-----	1,14,000	1,70,000

ప్రణాళికలతో మెప్పించి...
ఏకగ్రీవంగా ఎన్నికై!


శివాని

బాగా చదువుకోవాలి. మంచి ఉద్యోగం సంపాదించాలి. నగరాల్లో స్థిరపడాలి. వెనకబడిన గ్రామాల్లో పుట్టి పెరిగిన ప్రతి అమ్మాయి కనే కలలే ఇవి. కానీ శివానీ రాణా ఆలోచనలు వీటన్నింటికీ అతీతం. అవే ఆమెను 21ఏళ్లకే ఆ గ్రామానికి సర్పంచ్‌ను చేశాయి.

వసతుల లేమి, ఉపాధి కొరత, వలసలు... ఏళ్ల తరబడి ధార్‌గావ్‌ను పట్టి పీడిస్తున్న సమస్యలు. ఉత్తరాఖండ్‌లోని తెహ్రీ జిల్లాలో ఉందీ గ్రామం. సమస్యల పరిష్కారం కోసం ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా... ఉపయోగం లేకపోయింది. దాంతో వలసలు నానాటికీ పెరుగుతూనే ఉన్నాయి. వాటిని నిర్మూలించి, గ్రామ ఉనికిని కాపాడుకోవాలన్న లక్ష్యం శివానిది. 'నేను పుట్టిపెరిగిన గ్రామం కళ్లముందే తుడిచిపెట్టుకుపోతుంటే చూస్తూ ఊరుకోలేకపోయా. చిన్నప్పట్నుంచి సామాజిక సేవ అంటే ఇష్టం నాకు. నాన్నతోపాటే సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేదాన్ని. ప్రస్తుతం హేమవతి నందన్ బహుగుణ గఢ్వాల్ సెంట్రల్ యూనివర్సిటీలో బీఎస్సీ చదువుతున్నా. గ్రామంలో సమస్యల పరిష్కారానికి నావంతు కృషి చేయాలని ఉండేది. అందుకే వీలున్నప్పుడల్లా వాటికోసం ఆలోచిస్తూ ఉండేదాన్ని. నా ఆలోచనల్ని అమలు చేసే అవకాశం కోసం ఎదురుచూస్తుండేదాన్ని. గతేడాది ఆ అవకాశం రానే వచ్చింది. సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. పోటీ చేయాలని నిర్ణయించుకున్నా' అనే శివాని ఈ విషయాన్ని తండ్రి విశాల్ సింగ్ రాణాకు చెప్పిందట. ఆయన దాన్ని గ్రామ పెద్దలకు తెలియజేశారు. 'వాళ్లతో జరిగిన సమావేశంలో గ్రామీణాభివృద్ధికి కావాల్సిన ప్రణాళికల్ని... అమలు తీరుని వివరించాను. వాళ్లకి నా ఆలోచనలు బాగా నచ్చాయి. సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని నిర్ణయించుకున్నారు' అనే శివాని ఎంపిక అంత సులువుగా జరగలేదు. నామినేషన్ వేసేనాటికి ఆమె వయసు ఎన్నికల వయో పరిమితి కన్నా మూడు నెలలు తక్కువ. గ్రామస్థుల నిర్ణయాన్ని ఎన్నికల అధికారులు కొట్టివేశారు. మళ్లీ ప్రక్రియను చేపట్టినా... ఒక్కరూ నామినేషన్ వేయడానికి ముందుకు రాలేదట. దాంతో మూడు నెలలు పూర్తయ్యాక ఇటీవల మళ్లీ ఆమె ఆ పదవికి నామినేషన్ వేసి గెలుపొందింది. 'గ్రామస్థులు నా మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము కానివ్వను. అందరికీ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. వలసల్ని తగ్గిస్తా. మిగిలిన చదువుని ఓపెన్ యూనివర్సిటీలో పూర్తిచేస్తా' అంటారు శివాని. వయసు, అనుభవం వంటి విషయాల్ని పరిగణనలోకి తీసుకోకుండా... అభివృద్ధి, మంచి ఆలోచనలకు పట్టం కట్టిన ఈ ఎన్నిక భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకం కదూ!

కొత్త చెప్పులు కరుస్తున్నాయా?



కొన్ని చిట్కాలు... పెద్ద సమస్యలకు కూడా చిటికెలో పరిష్కారం చూపిస్తాయి. అలాంటివాటిల్లో ఇవి కొన్ని...

- పార్టీకి వెళ్లే చివరి నిమిషంలో గోళ్లకు రంగు వేసుకోవాలన్న విషయం గుర్తొస్తుంది. అప్పుడే వేస్తే త్వరగా దుస్తులకు అంటుకుంటుంది. అసంపూర్తిగా చెరిగి గోళ్ల అందాన్నీ దెబ్బతీయొచ్చు. అలాకాకుండా ఉండాలంటే... ఓ గిన్నెలో ఐస్ క్యూబ్స్ వేసి అందులో వేళ్లను పెడితే సరి.
- కొత్త చెప్పుల్ని కొన్న వెంటనే వేసుకుంటే కరుస్తాయి. వేళ్లు, మడమల దగ్గర బొబ్బలూ వస్తాయి. ఇలా కాకుండా... అక్కడ డియోడరెంట్ స్టిక్‌తో రుద్దితే లూబ్రికెంట్‌లా పనిచేస్తుంది. గ్లిజరిన్ కూడా వాడొచ్చు. ఇవి గాయాలు కాకుండా చూస్తాయి.
- అర్జంటుగా ఫంక్షన్‌కి వెళ్లాలి... చీరకి అక్కడక్కడా ముడతలు కనిపిస్తున్నాయి. అలాగని ఐరన్ చేసే సమయం లేదు అనుకుంటే... హెయిర్ స్ట్రెయిటనర్ వాడి చూడండి. కుచ్చిళ్లు బాగా వస్తాయి.
- చీర మీద బ్లవుజు కాస్త వదులుగా ఉందనుకుంటే ట్రాన్స్‌పరెంట్ డబుల్‌సైడ్ టేప్‌ని అతికించండి. సౌకర్యంగా ఉంటుంది. జ్యుయెలరీ కదలకుండానూ దీన్ని వాడొచ్చు.
- డ్రెస్సుకున్న షో బటన్ ఊడి పడిపోయేలా ఉంది. గట్టిగా కుట్టేద్దామనుకుంటే సూదీదారం అందుబాటులో ఉండదు. అలాంటప్పుడు పారదర్శకంగా ఉండే నెయిల్‌పాలిష్‌ని దారంపై వేస్తే.. ఆ బటన్ ఊడిపడిపోకుండా ఉంటుంది.

పాడి రైతులకు అండగా ఉన్నందుకే అవార్డు!


అనురాధ

ఆమె ఫార్మసీ రంగంలో రాణించాలనుకున్నారు... కానీ, ఆర్థిక పరిస్థితులు... వెటర్నరీ వైపు నడిపించాయి. అయితేనేం, అందులోనూ అద్భుతాలు చేస్తున్నారు. ముఖ్యంగా పశువులకు కృత్రిమ గర్భధారణ పద్ధతులను చురుగ్గా అమలు చేస్తున్నందుకే నంద్యాల జిల్లా చింతకుంట జూనియర్ వెటర్నరీ అధికారిణి అనురాధను 'జాతీయ గోపాల రత్న అవార్డు' వరించింది. ఈ సందర్భంగా ఆమెను వసుంధర పలకరించింది.

నా స్వస్థలం నంద్యాల. నాన్న సుబ్బరాయుడు రజక వృత్తి చేస్తూ నన్ను చదివించారు. అమ్మ లక్ష్మీదేవి గృహిణి. ఇంటర్ బైపీసీ గ్రూపు తీసుకుని 75శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాను. తరవాత ఫార్మసీ కోర్సులో చేరాను. ఈ రంగంలో రాణించాలనేది నా లక్ష్యం. కానీ, కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో ఉద్యోగం చేయాలని నిర్ణయించుకున్నా. ఆ సమయంలో వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు పడ్డాయి. దీంతో ఫార్మసీని వదిలి ఆ పరీక్షకు సన్నద్ధమవ్వడం మొదలుపెట్టా. 2004వ సంవత్సరంలో నిర్వహించిన ఈ పరీక్ష కోసం 350 మంది పోటీపడ్డారు. ఎంపికైన ఆరుగురిలో నేనొకదాన్ని. శిక్షణ అనంతరం 2006లో బండి ఆత్మకూరులో తొలి పోస్టింగు. 2013లో లైవ్ స్టాక్ అసిస్టెంట్‌గా, 2019లో జూనియర్ పశువైద్య అధికారిణిగా పదోన్నతి పొందాను. తర్వాత కొన్నాళ్లు గోపవరంలో విధులు నిర్వర్తించా. ఆ సమయంలోనే దేశంలో పశుసంపదను పెంచడానికి కేంద్రం 'సెక్స్ సోర్టెడ్ సెమెన్ కృత్రిమ గర్భధారణ' (ట్రిపుల్ ఎస్ ఏఐ) విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇది పాడి రైతులకు ఆర్థికంగా మేలు చేస్తుందనే ఆలోచనతో పశువులకు పెద్ద ఎత్తున కృత్రిమ గర్భధారణలు చేయించా. దీనివల్ల 2024-25వ సంవత్సరంలో 345 వరకు మేలుజాతి పెయ్య దూడలు జన్మించాయి. ఆ కృషికే 'జాతీయ గోపాలరత్న అవార్డు'కు ఎంపికయ్యా. దేశం మొత్తమ్మీద అన్ని కేటగిరీలకు కలిపి మొత్తం 2,081 మంది పోటీపడగా మూడు కేటగిరీల్లో కేవలం 9మందికి అవార్డులను ఇవ్వనున్నారు. వారిలో నేను జాతీయ స్థాయిలో మూడో స్థానంలో నిలిచా. ఈ నెల 26వ తేదీన అవార్డుని అందుకోనున్నా.



కష్టపడి ఒప్పించా...

ట్రిపుల్ ఎస్ ఏఐ విధానానికి రైతులను ఒప్పించడం కొద్దికాలం కిందటి వరకూ కష్టంగానే ఉండేది. ఆ అధునాతన విధానంలో గేదెలకు కృత్రిమ గర్భధారణ చేయడానికి అయ్యే ఖర్చు ఎక్కువే. అయినా వెంటనే ఫలితం వస్తుందన్న గ్యారంటీ ఏమీ లేదు. ఈ నేపథ్యంలో రైతులపై ఒకింత ఆర్థికభారం పడుతుండడంతో వారు వెనకాడేవారు. అయినా సరే, ఓపిగ్గా వారికి నచ్చజెప్పేదాన్ని. క్రమంగా వారిలో మార్పు వచ్చింది. ఈ ప్రయత్నానికే ఈ ఏడాది స్వాతంత్ర్యదినోత్సవం రోజున నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగినిగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నా. రాష్ట్రస్థాయిలో అత్యధిక చూలు శాతం సాధించి 2023లో ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ చేతుల మీదుగా అవార్డునీ అందుకున్నా.

– బి.ఎస్.రామకృష్ణ, కర్నూలు

సన్నని సెగపై వండేయండి!

అందరికీ ఆరోగ్యస్పృహ పెరిగే సరికి... ఒకప్పుడు మన పూర్వీకులు వాడిన మట్టి పాత్రల వినియోగం మళ్లీ మొదలైంది. అయితే, దీని ప్రయోజనాలు, ఉపయోగించే విధానం తెలియకుండా కొనేస్తే ఫలితం శూన్యం. అందుకోసమే మీకీ చిట్కాలు.



- మట్టి పాత్రల్ని కట్టెల పొయ్యి మీదే కాదు, గ్యాస్ పొయ్యి మీద కూడా పెట్టి వండుకోవచ్చు. అయితే, ఇవి త్వరగా వేడెక్కుతాయి. ఒక్కసారిగా హీట్ అయితే భళ్లున పగిలిపోతాయి. ముందు నెమ్మదిగా కుండను చిన్న సెగ మీద ఉంచి మంటను పెంచుతూ ఉండాలి. ఆ తర్వాతే వంట ప్రారంభించాలి. పాత్ర వేడిగా ఉన్నప్పుడు చన్నీళ్లలో పెట్టకూడదు.
- ఒకవేళ కొత్త మట్టిపాత్రను వాడాలనుకుంటే ముందు సీజనింగ్ చేయాలి. అంటే... ఒక రోజంతా నీళ్లలో నానబెట్టి తడి పోయాక లోపల, బయట వంటనూనె రాసి ఆరనివ్వాలి. ఆ తర్వాతే దాన్ని వినియోగించాలి.
- ఈ పాత్రల్లో మాంసాహారం, పప్పులు వంటివాటిని కూడా వేగంగా ఉడికించొచ్చు. ఇందులోని ఆహారం కూడా చాలా సేపు వేడిగా ఉంటుంది. మళ్లీ మళ్లీ వేడి చేయాల్సిన అవసరం ఉండదు కాబట్టి పోషకాలనీ కోల్పోదు.
- మట్టి పాత్రల్లో వండేటప్పుడు వంటకు నూనె పెద్దగా అవసరం ఉండదు. దీనివల్ల ఒంట్లో కొవ్వు చేరదు. మట్టిపాత్రలు త్వరగా పగిలిపోతాయనే భయం అవసరం లేదు. వీటిని అమర్చే విషయంలో జాగ్రత్త తీసుకుంటే చాలాకాలం మన్నుతాయి.
- మట్టిలో బి12తో సహా అనేక విటమిన్లు, మెగ్నీషియం, కాల్షియం, ఫాస్ఫరస్... లాంటి ఖనిజాలు ఉంటాయి. ఇవన్నీ తినే ఆహారంలో చాలా తక్కువగా ఉంటాయి. శరీరానికి ఎంతో అవసరమైన ఇవి మట్టి పాత్రల నుంచి తగినంతగా అందుతాయి. పైగా సన్నని మంట మీద నెమ్మదిగా ఉడకడం వల్ల, పదే పదే వేడి చేయాల్సి అవసరం ఉండదు. దాంతో ఆయా కాయగూరల్లోని పోషకాలేవీ వృథా పోవు. పాత్ర నిండా ఆవిరి పరచుకుని, అందులోనే మగ్గుతాయి కాబట్టి ఆరోగ్యానికీ మంచిది. పైగా రుచీ ఎక్కువే.
- మట్టి పాత్రల్ని సబ్బుతో కడిగితే రసాయనాల్ని పీల్చుకునే ప్రమాదం ఉంది. బదులుగా బరకగా ఉండే ఇసుక, సున్నిపిండి, బూడిద, కుంకుడు రసం వంటివి వాడితే మేలు.

చిట్టి నేస్తాలతో... పనులు తేలిక!

కొన్ని వస్తువులు చూడటానికి చిన్నగా ఉన్నా... అవి అందించే ఉపయోగాలు మాత్రం బోలెడు. ఈ లెమన్ స్క్వీజర్, సలాడ్ కటర్స్ కూడా ఆ కోవకు చెందినవే. ఓసారి చూడండి.

స్మార్ట్ కిచెన్



ఎంత కావాలంటే అంతే...

నిమ్మకాయ కోస్తే... దాన్ని పూర్తిగా వాడాల్సిందే. లేదా వృథా అవుతుంది. అందుకే రసం మొత్తం పిండేసి ఐస్‌క్యూబ్స్‌గా తయారుచేసి వాడుకుంటారు కొందరు. రసం అంతా సీసాల్లోకి తీసిపెట్టుకుంటారు మరికొందరు. అలాకాకుండా, మనకు అవసరమైనప్పుడు తాజాగా నిమ్మరసాన్ని తీసుకుంటే భలే ఉంటుంది కదా. ఈ 'లెమన్ స్క్వీజర్' అందుకు సహకరిస్తుంది. నచ్చిన మేరకు రసాన్ని వాడి, మిగతాది స్క్వీజర్‌లోనే ఉంచేసి ఫ్రిజ్‌లో పెట్టేయొచ్చు. వినియోగించడమూ సులువే. ఓ ట్యూబ్‌లా ఉంటుందీ స్క్వీజర్. అడుగు భాగంలో పదునుగా చిన్నచిన్న పళ్లు ఉంటాయి. నిమ్మకాయ పైభాగాన్ని కట్ చేసి దానిపై ట్యూబ్‌ను గుచ్చాలి. నెమ్మదిగా చుట్టూ తిప్పుతూ కాయ లోపలికి ట్యూబ్‌ను చొప్పించాలి. రసం అంతా ట్యూబ్‌లోకి చేరుతుంది. పైన ఉండే మూతను తొలగించి... అవసరమైన మేర రసాన్ని వినియోగించుకుంటే సరి. మూత వేసేసి మిగిలినది దాచిపెట్టేయొచ్చు.



ఒక్కసారికే నాలుగు ముక్కలుగా...



సలాడ్లు, ఫ్రూట్ మిక్స్‌లకు పండ్లు కోసేటప్పుడు... ఒకే రకమైన ఆకృతిలో వస్తే ఎంత ఆకర్షణీయంగా ఉంటాయో కదా. పిల్లల్ని కూడా ఇట్టే ఆకట్టుకుంటాయి. కానీ మనం ఎంత శ్రమించినా ఒకే ఆకారంలో కట్ చేయడం కష్టం. పైగా, ద్రాక్ష, స్ట్రాబెర్రీ, ప్లమ్ వంటివి కట్ చేయాలంటే మరీ కష్టం. ఇలాంటి వాటికోసమే 'ఫ్రూట్ స్లైసర్' వచ్చింది. పైన గుండ్రంగా గ్రైజర్ ఇవ్వడానికి వీలుగా ఉంటుంది. అడుగున బ్లేడ్లు అమర్చి ఉంటాయి. మనం కట్ చేయాలనుకున్న పండుని దీనిలో పెట్టి... రెండింటిని అదిమి పెడితే చాలు. నాలుగు ముక్కలుగా పండ్లు కట్ అవుతాయి.



నచ్చిన ఆకారంలో...



పండ్లు, కూరగాయలతో చేసిన సలాడ్స్ పిల్లల్నీ పెద్దల్నీ ఆకర్షించాలంటే అలంకరణే ముఖ్యం. లేదంటే తినడానికి అంతగా ఆసక్తి చూపించరు. బాతులు, స్మైలీ, కార్టూన్స్, స్కూప్స్‌లా చేసి పెడితే తినడానికి ఇష్టపడతారు. అయితే 'అలా కట్ చేయడం అందరికీ సాధ్యం కాదు. దానికి చాలా నైపుణ్యాలు కావాల'ని వెనకడుగు వేస్తారు చాలామంది అమ్మలు. కానీ ఈ 'ఫోర్ ఇన్ వన్ స్కూప్ కటర్'తో అది సాధ్యమే. దీనిలో నాలుగు రకాల కటర్లు అందుబాటులో ఉన్నాయి. ఒకటి పండ్లను పువ్వు ఆకారంలో కట్ చేసేందుకు వీలుగా ఉంటుంది. మరొకటి పండ్లలోని గుజ్జుని స్కూప్స్‌లా వేరుచేస్తుంది. మిగిలిన గుజ్జు మొత్తం తీసి డొప్పల్ని వేరుచేయడానికి మూడో కటర్ ఉపయోగపడుతుంది. నాలుగో దాంతో జంతువులు, పక్షుల ఆకారాల్ని చెక్కవచ్చు. మీకూ నచ్చితే ప్రయత్నించేయండి.





యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్ అనగానే డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్‌లే గుర్తుకొస్తాయి. మొబైల్ ఫోన్ల విషయంలో వీటిని పెద్దగా పట్టించుకోరు. ఫోన్లకు వైరస్‌లేంటని ఆశ్చర్యపోతుంటారు. కానీ స్మార్ట్‌ఫోన్లకూ యాంటీవైరస్ రక్షణ అత్యావశ్యకమే! కొన్ని సామ్‌సంగ్ గెలాక్సీ ఫోన్ల మీద ల్యాండ్‌ఫాల్ అనే అధునాతన స్పైవేర్ దాడి చేసినట్టు ఇటీవల బయటపడటం కలకలం రేపింది మరి. ఇది ఏడాది నుంచీ ఫోన్లలోని వ్యక్తిగత సమాచారాన్ని కొల్లగొడుతూ వస్తున్నట్టు తేలటం మరింత ఆదోళనకరం. అదృష్టవశాత్తూ ఆ పరికరాల్లో స్పైవేర్ చొరబడటానికి దారితీస్తున్న లోపాన్ని సరిచేసినప్పటికీ మొబైల్ ఫోన్ల భద్రత మీద దృష్టిసారించాల్సిన తరుణం ఆసన్నమైందని ఇది సూచిస్తోంది.

ఆండ్రాయిడ్ ఫోన్లకూ వైరస్‌ల ఆపద

అప్పట్లో పెగాసస్ సాఫ్ట్‌వేర్ వ్యవహారం గుర్తుందా? ఇజ్రాయెల్‌కు చెందిన సైబర్‌ఆర్మ్ కంపెనీ ఎన్ఎస్ఓ రూపొందించిన దీన్ని అంతర్జాతీయ మానవ హక్కుల కార్యకర్తలు, పాత్రికేయుల మీద నిఘా పెట్టటానికి వాడుకున్నారనే కథనాలను చూసే ఉంటారు. తాజా ల్యాండ్‌ఫాల్ స్పైవేర్ కూడా దానికేమీ తీసిపోదని భావిస్తున్నారు. ఫోన్‌లోని ఫొటోలు, రహస్య పత్రాలు, టెక్స్ట్ మెసేజ్‌లు, ఫోన్ నంబర్లు.. ఒక్కటేంటి? అన్నిరకాల వ్యక్తిగత సమాచారాన్ని యాక్సెస్ చేసేలా దీన్ని తయారుచేశారు. ఇలాంటి స్పైవేర్లు చాలా అధునాతనమైనవి. ఫోన్ ఆపరేటింగ్ సిస్టమ్స్‌ను సృష్టించిన కంపెనీలూ ఇది అనూహ్యమని విస్తుపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పరికరంలో ఆటోమేటిక్ డౌన్‌లోడ్స్‌ను టర్న్ ఆఫ్ చేసుకోవటం, కొత్త ఓఎస్ సాఫ్ట్‌వేర్ విడుదలైనప్పుడు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవటంతో పాటు ఆండ్రాయిడ్ ఫోన్ల కోసం డిజైన్ చేసిన యాంటీవైరస్ యాప్స్‌ను వాడుకోవటం ఒక్కటే తక్షణ మార్గంగా కనిపిస్తోంది. అలాంటి కొన్ని విశ్వసనీయ యాప్స్ గురించి తెలుసుకుందామా.

బిట్‌డిఫెండర్ మొబైల్ సెక్యూరిటీ



ఒక్క సబ్‌స్క్రిప్షన్‌తోనే బిట్‌డిఫెండర్ సెక్యూరిటీ పలు భద్రత ఫీచర్లను అందిస్తుంది. యాంటీవైరస్ ప్రొటెక్షన్‌తో పాటు యాంటీ-థెఫ్ట్ రక్షణ కూడా లభిస్తుంది. ఏవీ టెస్ట్, ఏవీ కంపరేటివ్ పరీక్షల్లో అన్నింటికన్నా ముందు వరుసలో నిలిచింది. 99.9% ప్రొటెక్షన్ రేట్‌ను సొంతం చేసుకుంది. ఈ మొబైల్ సెక్యూరిటీ ప్లాన్‌తో క్రోమ్ బ్రౌజర్ ప్రొటెక్షన్, పూర్తిస్థాయి యాంటీ ఫిషింగ్ సిస్టమ్ స్కాన్ సదుపాయాలూ పొందొచ్చు. అనుమానిత లింకులు, పేజీల గురించి ముందే హెచ్చరిస్తుంది. మీ సిస్టమ్, వాడకం తీరును బట్టి భద్రత చర్యల కోసం తెలివైన సూచనలు ఇచ్చే ఆటోపైలట్ ఫీచర్ మరో ప్రత్యేకత. బిట్‌డిఫెండర్ యాప్ తేలికైంది, పరికరం వనరులను పెద్దగా వాడుకోదు. కాబట్టి ఫోన్ వేగం నెమ్మదిస్తుందన్న బెంగ ఉండదు. ఫోన్‌కు అనుసంధానమైన స్మార్ట్‌వాచ్ ఉన్నట్టయితే దీనిలోని ప్రైవసీ టూల్‌తో ఫోన్ ఎక్కడుందో కూడా గుర్తించొచ్చు. ఫోన్‌ను ఎక్కడైనా పెట్టి మరచిపోయినప్పుడిది బాగా ఉపయోగపడుతుంది. కాకపోతే క్లౌడ్ ఆధారిత స్కానింగ్ చేసేటప్పుడు అంతర్జాల కనెక్షన్ తప్పనిసరి.

ట్రెండ్ మైక్రో మొబైల్ సెక్యూరిటీ




కొత్త యాప్స్ డౌన్‌లోడ్, ఇన్‌స్టాల్ కావటానికి ముందే మాల్వేర్లను స్కాన్ చేయటమే కాదు.. వాటిని ఇతర యాప్స్ యాక్సెస్ చేయకుండా నిలువరించటం దీని ప్రత్యేకత. ఇది అడ్మిన్లకు, పేరెంట్స్‌కు బాగా ఉపయోగపడుతుంది. ఇందులో ఫేస్‌బుక్ కోసం బిల్టిన్‌గా ప్రైవసీ స్కానర్ కూడా ఉంటుంది. మీ ప్రొఫైల్ సెటింగ్స్‌లో సున్నితమైన వ్యక్తిగత సమాచారం ఉన్నట్టయితే హెచ్చరిస్తుంది. వెబ్ ప్రొటెక్షన్, యాంటీథెఫ్ట్, వై-ఫై చెకర్, సిస్టమ్ ట్యూనింగ్ సదుపాయాలు, పూర్తిస్థాయి పేరెంట్ కంట్రోల్స్ వంటి బోలెడు ఫీచర్లు ఈ యాప్‌లో ఉంటాయి. ఆన్‌లైన్ బ్యాంకింగ్, షాపింగ్ చేసేటప్పుడు పే గార్డ్ ఫీచర్ రక్షణగా నిలుస్తుంది. ఇది నూటికి నూరు శాతం ముప్పుల నుంచి రక్షణ కల్పిస్తున్నట్టు స్వతంత్ర టెస్టింగ్ ల్యాబ్స్ రేటింగ్ ఇచ్చాయి కూడా. ముందే చందా కట్టటం ఇష్టం లేనివారు వారం పాటు ఉచిత వర్షన్‌ను వాడుకునే సదుపాయమూ ఉంది. నచ్చితే పెయిడ్ సబ్‌స్క్రిప్షన్ తీసుకోవచ్చు.

ఏవీజీ యాంటీవైరస్ ఫ్రీ



ఇది మరో మంచి నాణ్యమైన యాంటీవైరస్ యాప్. ఉచితంగానే సమగ్రంగా రక్షణ కల్పిస్తుంది. నిజానికి ఇదీ అవాస్ట్ ఇంజిన్‌తోనే పనిచేస్తుంది. ఫోన్‌ను స్కాన్ చేసి, అదృశ్యంగా ఉన్న ముప్పులను గుర్తిస్తుంది. హానికరమైనవి ఉన్నట్టయితే దీనిలోని మాల్వేర్ ఫోర్స్ అన్‌ఇన్‌స్టాలర్ వాటిని తొలగించేస్తుంది. అవి ఎంతకాలంగా ఉన్నా సరే రిమూవ్ చేస్తుంది. కాబట్టి ప్రశాంతంగా ఉండొచ్చు. పెయిడ్ ప్రొ ఫీచర్లను 14 రోజులు ఉచితంగా పరీక్షించి చూసుకోవచ్చు కూడా. నచ్చితే ప్రొ వర్షన్‌కు మారొచ్చు. దీంతో మరిన్ని యాంటీ థెఫ్ట్ ఫీచర్లు లభిస్తాయి. ఉదాహరణకు- సిమ్ కార్డు మార్చితే ఫోన్ తనకు తానే లాక్ అవుతుంది, పెద్దగా అలారం మోగుతుంది. ఇక ఫొటో వాల్ట్ ఫీచరేమో ఫొటోలకు కాపలా కాస్తూ, సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా కాపాడుతుంది. కాల్స్‌ను బ్లాక్ చేయటానికి, సురక్షితం కాని వై-ఫై నెట్‌వర్క్‌లను క్లియర్ చేయటానికి ఇందులో ఫీచర్లు ఉన్నాయి. అనవసర ప్రాసెస్‌లను ఆపటం, బ్యాటరీని ఖర్చు చేసే సెటింగ్స్‌ను ఆఫ్ చేయటం, జంక్ ఫైళ్లను డిలీట్ చేయటం వంటి ఫీచర్లూ వాడుకోవచ్చు.

నోర్టన్ మొబైల్ సెక్యూరిటీ



హానికారక యాప్స్, మాల్వేర్లు, స్కామ్‌ల నుంచి కాపాడే పలు టూల్స్ కోసం చూసేవారు నోర్టన్ మొబైల్ సెక్యూరిటీ గురించి ఆలోచించొచ్చు. నోర్టన్ మొబైల్ ఇన్‌సైట్ పరిజ్ఞానం మీద ఆధారపడే ఇది ఏదైనా సమస్యగా మారకముందే అప్రమత్తం చేస్తుంది. ఉదాహరణకు- ఫోన్ ఆపరేటింగ్ సిస్టమ్‌లో ఏవైనా లోపాలుంటే హెచ్చరిస్తుంది. జాగ్రత్త పడటం కోసం సమయాన్ని ఇస్తుంది. సైబర్ నేరగాళ్లు లోపాలను దుర్వినియోగం చేయటానికి ముందే సమస్యను పరిష్కరిస్తుంది. గూగుల్ ప్లేస్టోర్‌లోని యాప్స్ మీద ఓ కన్నేసి ఉంచటం ద్వారా నిరంతరం కాపాడుతుంది. డౌన్‌లోడ్ కావటానికి ముందే యాప్స్‌ను స్కాన్ చేసి, విశ్వసనీయం కాని వాటిని తిరస్కరిస్తుంది. నోర్టన్ యాప్‌లోని యాంటీవైరస్ ఇంజిన్‌కు ఏవీ టెస్ట్ మంచి స్కోర్ ఇచ్చింది. ఇది యాప్స్, వెబ్‌సైట్లను స్కాన్ చేయటంతో పాటు స్పామ్ ఎస్ఎంఎస్‌లనూ ఫిల్టర్ చేస్తుంది. ఇలా ఫిషింగ్ దాడుల బారినపడకుండానూ కాపాడుతుంది. వై-ఫై సెక్యూరిటీ టూల్స్ ఉండటం వల్ల సురక్షితంగా బ్రౌజింగ్ చేసుకోవచ్చు. సెక్యూర్ కాని, దాడికి అనువుగా ఉండే హానికారక నెట్‌వర్క్‌కు అనుసంధానమైతే అప్రమత్తం చేస్తుంది. రహస్య సమాచారాన్ని ఎంటర్ చేయకుండా నిలువరిస్తుంది. ఇటీవల దీనికి స్కామ్‌లను గుర్తించే ఏఐ ఆధారిత చాట్‌బాట్ సైతం తోడైంది.

అవాస్ట్ మొబైల్ సెక్యూరిటీ



ఉచిత ఆండ్రాయిడ్ యాంటీవైరస్ యాప్స్ కోరుకునేవారికి మంచి ఎంపిక. కాకపోతే వాణిజ్య ప్రకటనలను భరించాల్సి ఉంటుంది. అయితేనేం ఫీచర్ల కొదవ లేదు. ముప్పులను త్వరగా గుర్తిస్తుంది. అప్పటికప్పుడు వైరస్‌లు, మాల్వేర్లను పట్టుకుంటుంది. ఏదైనా వైరస్ దాడి చేసినట్టు అనుమానిస్తే స్కాన్ బటన్ మీద తాకితే చాలు. మైక్రోఎస్‌డీ కార్డుతో సహా పరికరం మొత్తాన్ని జల్లెడ పట్టేస్తుంది. ఏదైనా ప్రమాదాన్ని గుర్తిస్తే అప్రమత్తం చేస్తుంది. ఏవీ టెస్ట్ విశ్లేషణల్లో వరుసగా మంచి స్కోర్లు సాధిస్తూ మేటిగా నిలిచింది. సురక్షితమైన సాఫ్ట్‌వేర్‌ను తప్పుడుగా అంచనా వేయటం గానీ, హానికర సాఫ్ట్‌వేర్‌ను మంచిదిగా భావించటం గానీ చేయదు. కొన్ని పెద్ద కంపెనీల యాప్‌లు సైతం ఇలాంటి సామర్థ్యాన్ని కనబరచలేకపోవటం గమనార్హం. విశ్వసనీయం కాని యాప్స్‌ను చిటికెలో గుర్తిస్తుంది. ఏదైనా ముప్పు పొంచి ఉంటే డౌన్‌లోడ్ చేసుకోవటానికి ముందే హెచ్చరిస్తుంది. ఒకవేళ పరికరంలో అప్పటికే అభద్ర యాప్స్ ఉన్నట్టయితే వాటిని కూడా తొలగిస్తుంది. ఇందులో యాంటీ థెఫ్ట్ సిస్టమ్ సైతం ఉంది. ఫోన్‌ను ఎవరైనా దొంగిలిస్తే దాన్ని రిమోట్‌గా ట్రాక్ చేయటానికి లేదా లాక్ చేయటానికిది ఉపయోగపడుతుంది. ఉచిత ప్లాన్ నుంచి అప్‌గ్రేడ్‌కు మారితే వీపీఎన్ సదుపాయాన్నీ పొందొచ్చు.

మెకాఫీ మొబైల్ సెక్యూరిటీ



యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్‌కు మెకాఫీ పెట్టింది పేరు. మెకాఫీ మొబైల్ సెక్యూరిటీ ఫర్ ఆండ్రాయిడ్ కూడా తక్కువదేమీ కాదు. ఉచిత వర్షన్‌లోనూ బోలెడన్ని ఫీచర్లు అందుబాటులో ఉంటాయి. యాప్స్ ఏవైనా రహస్య సమాచారాన్ని బయటకు పొక్కిస్తున్నాయా అని ఎప్పటికప్పుడు తనిఖీ చేయగలదు. అవసరమైతే వాటిని లాక్ చేస్తుంది కూడా. ఫోన్‌కు కనెక్ట్ అయిన వై-ఫై నెట్‌వర్క్ సురక్షితమైందో, కాదో స్కాన్ చేస్తుంది. అంతేకాదు, స్టోరేజీ క్లీనర్, మెమరీ, బ్యాటరీ బూస్టర్ వంటి ఫీచర్లూ ఉన్నాయి. కాకపోతే ఉచిత వర్షన్‌లో వాణిజ్య ప్రకటనలు కనిపిస్తుంటాయి. ఇవి వద్దనుకుంటే ప్రీమియం వర్షన్‌కు అప్‌గ్రేడ్ కావొచ్చు. దీంతో సేఫ్ వెబ్ ప్రొటెక్షన్ వంటి అదనపు ఫీచర్లూ వాడుకోవచ్చు.

ప్రభుత్వమూ సూచిస్తోంది

సైబర్ సెక్యూరిటీ స్వచ్ఛ కేంద్ర కార్యక్రమంలో భాగం కేంద్ర సమాచార, సాంకేతిక మంత్రిత్వ శాఖ సైతం పరికరాలను కాపాడే ప్రైవసీ యాప్స్ వాడాలని ప్రోత్సహిస్తోంది. వీటికి ఉద్దేశించిన సాఫ్ట్‌వేర్ జాబితాను 2017 నుంచి అప్‌గ్రేడ్ చేస్తూ వస్తోంది. గత జూన్‌లో భారతీయులకు ఉచితంగా అందుబాటులో ఉండే యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్లతో జాబితాను అప్‌డేట్ చేసింది. ఇందులో ఇస్కాన్ యాంటీవైరస్ (eScan Antivirus), ఎంకవచ్ 2 (MKavach 2) వంటివి ఉన్నాయి. వీటిని గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

గూగుల్ స్కాలర్‌లో పది లక్షల సార్లు

పరిశోధన పత్రాల్లో రుజువుల కోసం గత సిద్ధాంత వ్యాసాలను, పరిశోధకులను ఉటంకించటం, ఉదహరించటం మామూలే. ఇలా ఎవరి గురించైనా వందలు, వేల సార్లు ప్రస్తావిస్తేనే గొప్ప. అలాంటిది లక్షలాది సార్లు ఉటంకిస్తే? ప్రముఖ కంప్యూటర్ శాస్త్రవేత్త యాషువా బెంజియో అలాంటి ఘనతే సాధించారు. పరిశోధన పత్రాలకు నెలవైన గూగుల్ స్కాలర్‌లో ఆయన గురించి పది లక్షల సార్లకు పైగా ఉదహరించారు మరి. జీవించి ఉన్న పరిశోధకుల్లో ఇలాంటి ఘనత దక్కించుకున్న తొలి శాస్త్రవేత్తగా రికార్డులకు ఎక్కారు. కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో బెంజియో ఎనలేని ప్రభావాన్ని పట్టి చూపటమే కాదు.. దశాబ్దకాలంగా డీప్ లెర్నింగ్ పరిశోధనలో ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆసక్తికీ ఇది దర్పణం పడుతోంది. సైన్స్, పరిశ్రమలు, నిత్య జీవితాన్ని ఏఐ కొత్త మలుపు తిప్పుతోంది. ఇలాంటి సంధి దశలో బెంజియో చేసిన కృషే ముందుండి మార్గదర్శనం చేస్తోంది. ఏఐ పితామహుల్లో ఒకరిగా పేరొందిన ఆయన యూనివర్సిటీ డీ మాంట్రియల్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. జెఫ్రీ హింటన్, యన్ లెకున్‌తో కలిసి ఎవరూ పట్టించుకోని న్యూరల్ నెట్‌వర్క్స్‌ను ఆధునిక డీప్ లెర్నింగ్‌కు పునాదిగా మలచటంలో కీలక పాత్ర పోషించారు. ప్రస్తుత చాట్‌బాట్స్, అనువాద వ్యవస్థలు, మెడికల్ ఇమేజింగ్ టూల్స్, స్వయంచోదక వాహనాలను ఇదే నడిపిస్తుండటం గమనార్హం.



- బెంజియో మెక్‌గిల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తిచేసిన తర్వాత ఎంఐటీ, ఏటీఅండ్‌టీ బెల్ ల్యాబ్స్‌లో పరిశోధన ఆరంభించారు. అప్పట్లో న్యూరల్ నెట్‌వర్క్స్ పట్ల ఎవరూ ఆసక్తి చూపేవారు కాదు. నిధులు అందటమూ అంతంతే. అయినా కూడా బెంజియో పట్టు విడవలేదు. మనుషుల మాదిరిగా ప్రపంచాన్ని అర్థం చేసుకునే వ్యవస్థల నిర్మాణానికి డీప్, లేయర్డ్ మోడళ్లు కీలకమని గట్టిగా నమ్మారు.
- ఆయన విద్యార్థుల్లో ఒకరు 2014లో జెనరేటివ్ అడ్వర్సియల్ నెట్‌వర్క్స్ (గాన్స్) సృష్టించటంతో తొలిసారి బెంజియో గొప్పతనమేంటో ప్రపంచానికి తెలిసింది. ఏఐ జెనరేటెడ్ ఇమేజరీ, వీడియో సింథసిస్, క్రియేటివ్ మోడలింగ్‌లో ఇది కొత్త విప్లవాన్ని తీసుకొచ్చింది. ఈ పరిశోధన పత్రానికి బెంజియో సహ అధ్యయనకర్తగా వ్యవహరించారు. మెషిన్ లెర్నింగ్‌కు సంబంధించిన పరిశోధనలు, చరిత్రలో దీన్ని అతి ఎక్కువసార్లు ఉదహరించటం గొప్ప విషయం.
- డీప్ లెర్నింగ్‌పై ఆయన 2015లో చేసిన సమీక్షే ఆధునిక న్యూరల్ నెట్‌వర్క్స్‌కు సిద్ధాంతపరంగా, ఆచరణపరంగా పునాదులు వేసింది. ప్రపంచవ్యాప్తంగా పరిశోధకులకు ప్రామాణిక రిఫరెన్స్‌గా మారింది.
- రిప్రజెంటేషన్ లెర్నింగ్, ప్రాబబిలిస్టిక్ మోడల్స్, అటెన్షన్ మెకానిజమ్స్‌లో విప్లవాత్మక మార్పులకూ బెంజియో తోడ్పడ్డారు. చాట్‌జీపీటీ వంటి లార్జ్ లాంగ్వేజ్ మోడళ్లకు ఈ టెక్నాలజీయే ఆధారం. నేటి ఏఐ రంగాన్ని పరుగులు పెట్టిస్తున్న ఎన్నో ఆవిష్కరణలకు మూలం అలనాటి బెంజియో ఆలోచనలే. అవే ఇప్పుడు ప్రధాన స్రవంతిలోకి వస్తున్నాయి.
- బెంజియో కేవలం పరిశోధన పత్రాలతోనే ఆగిపోలేదు. మిలా అనే సంస్థనూ స్థాపించారు. ఇప్పుడది ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ పరిశోధన సంస్థల్లో ఒకటిగా ఎదిగింది. కెనడా జాతీయ ఏఐ వ్యూహాన్ని రూపొందించటంలోనూ ఆయన పాలు పంచుకున్నారు. ఏఐ ఎథిక్స్, భద్రత, గవర్నెన్స్ మీద జరుగుతున్న చర్చల్లోనూ బెంజియో ప్రముఖ వ్యక్తిగా మారారు.

యాపిల్ వాచ్‌లో పూర్తిస్థాయి వాట్సప్

యాపిల్ వాచ్‌లో వాట్సప్ వాడుతున్నారా? కేవలం ప్రివ్యూ నోటిఫికేషన్‌తోనే సరిపెట్టుకోవాల్సి వస్తోందని చింతిస్తున్నారా? ఇకపై అలాంటి బెంగ అవసరం లేదు. వాట్సప్ ఎట్టకేలకు ఇటీవలే సముచితమైన యాపిల్ వాచ్ యాప్‌ను విడుదల చేసింది మరి.



వాట్సప్ యాపిల్ వాచ్ యాప్‌తో మొత్తం మెసేజ్‌ను చదవొచ్చు, వాయిస్ నోట్స్ పంపించొచ్చు, ఎమోజీలతో స్పందించొచ్చు, చివరికి కాల్ అలర్ట్స్‌నూ చూడొచ్చు. నడుస్తున్నప్పుడు, వ్యాయామం చేస్తున్నప్పుడు, గదిలో ఎక్కడో ఫోన్‌ను ఛార్జింగ్‌కు పెట్టినప్పుడు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. యాపిల్ వాచ్ సిరీస్ 4, అంతకన్నా కొత్తవి (సెప్టెంబరు 2018 నుంచి తర్వాత మోడళ్లు).. వాచ్ఓఎస్ 10, ఆ తర్వాతి వాచ్‌లు.. ఐఓఎస్ 9.1, అంతకన్నా కొత్త ఐఫోన్ (వాచ్‌తో జతకట్టేవి) గలవారు దీన్ని వాడుకోవచ్చు. అలాగే ఐఫోన్‌లో వాట్సప్ తాజా వర్షన్ ఇన్‌స్టాల్ అయ్యుండాలి, బ్లూటూత్ ఆన్ చేసి ఉండాలి, పరికరాలు వాటి పరిధిలో ఉండాలి కూడా.

ఎలా ఇన్‌స్టాల్ చేసుకోవాలి?

యాప్ డౌన్‌లోడ్స్ అనుమతించినట్టయితే దానంతటదే యాపిల్ వాచ్‌లో ఇన్‌స్టాల్ అవుతుంది. అదే మాన్యువల్‌గానైతే..

- **యాపిల్ వాచ్‌లో**- డిజిటల్ క్రౌన్‌ను నొక్కి, యాప్ స్టోర్‌లోకి వెళ్లాలి. వాట్సప్‌ను వెతికి, ఇన్‌స్టాల్ బటన్ మీద తాకాలి.
- **ఐఫోన్‌లో**- వాచ్ యాప్‌ను ఓపెన్ చేసి మై వాచ్ ట్యాబ్ మీద తాకాలి. అవైలబుల్ యాప్స్‌లో వాట్సప్‌ను గుర్తించాలి. తర్వాత ఇన్‌స్టాల్ మీద తాకాలి.

ఏమేం చేసుకోవచ్చు?

- పెద్ద చాట్స్‌తో సహా పూర్తి మెసేజ్‌లు చదవొచ్చు.
- తక్షణం ఎమోజీల రూపంలో స్పందించొచ్చు.
- డిక్టేషన్, స్క్రిబుల్‌తో జవాబులు ఇవ్వచ్చు. అంతకుముందే రాసి ఉండే జవాబులనూ పంపించొచ్చు.
- వాచ్ మైక్‌తో వాయిస్ మెసేజ్‌లను రికార్డు చేయొచ్చు, పంపొచ్చు.
- పరిమిత సైజులో ఉండే ఫొటోలు, స్టికర్లు చూడొచ్చు.
- ఇన్‌కమింగ్ కాల్స్‌ను అందుకోవచ్చు, తిరస్కరించొచ్చు.
- ఇంతకుముందు కన్నా ఎక్కువ చాట్ హిస్టరీని యాక్సెస్ చేయొచ్చు.
- అన్ని మెసేజ్‌లూ ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్ట్ అయ్యుంటాయి.

ఇలా సెట్ చేసుకోవాలి

- ఐఫోన్‌లో- సెటింగ్స్ ద్వారా వాట్సప్‌లోకి వెళ్లి నోటిఫికేషన్స్ విభాగంలో అలో నోటిఫికేషన్స్ ఎనేబుల్ చేసుకోవాలి.
- ఐఫోన్‌లో ఇన్‌వాచ్ యాప్‌లో- నోటిఫికేషన్స్ ద్వారా మిర్రర్ ఐఫోన్ అలర్ట్స్‌లో వాట్సప్ బటన్‌ను ఆన్ చేసుకోవాలి.

గూగుల్ ఫొటోస్‌కు మరిన్ని ఏఐ సొబగులు

గూగుల్ ఫొటోస్‌లో ఇప్పటికే ఏఐ ఫీచర్లున్నాయి. మాటతోనే ఫొటోల ఎడిటింగ్, కొత్త శైలిలోకి మార్చుకోవటం, మెరుగుపరచుకోవటం, అవసరమైనవి వెతకటం వంటి వాటికివి తోడ్పడుతున్నాయి. తాజాగా దీనికి మరో ఆరు ఏఐ టూల్స్ కూడా తోడయ్యాయి. వీటిల్లో జెమినైకి చెందిన అధునాతన ఇమేజింగ్ మోడల్ నానో బనానా మీద ఆధారపడి పనిచేసేవీ ఉండటం విశేషం. వీటితో కొత్తగా ఏమేం చేసుకోవచ్చో చూద్దామా.



చిన్న ప్రాంప్ట్‌తో లోపాల సవరణ: స్నేహితులతో కలిసి షికారుకు వెళ్లారు. ఫొటోలు తీసుకున్నారు. కానీ కళ్లద్దాలు తీయటం మరిచారు. ఒక స్నేహితుడేమో కళ్లు మూసుకున్నాడు. మరొకరి ముఖంలో నవ్వు లేదు. వీటిని సవరిస్తే ఫొటో చాలా అందంగా ఉంటుంది కదా. కొత్త ఏఐ టూల్స్‌తో ఇది సాధ్యమే. ఫొటోను ఓపెన్ చేసి 'హెల్ప్ మీ ఎడిట్' ఆప్షన్‌ను ఎంచుకొని ప్రాంప్ట్‌ను టైప్ చేస్తే చాలు. ఉదాహరణకు- కళ్లద్దాలు తీసెయ్యి, మూసుకున్న కళ్లను తెరిపించు, ఆమె ముఖంలో నవ్వు తెప్పించు.. ఇలా అవసరమైన పని చేయాలంటూ ప్రాంప్ట్ ఇవ్వచ్చు. అప్పుడు ఫొటోస్ యాప్ మీ వ్యక్తిగత ఫేస్ గ్రూప్స్‌లోని ఇమేజ్‌లను వాడుకొని కచ్చితమైన విధంగా సవరిస్తుంది.

ఎడిటర్ రీడిజైన్: మాన్యువల్‌గా స్లైడర్లను అడ్జస్ట్ చేయాల్సిన పనిలేదు. వేర్వేరు టూల్స్‌కు మారాల్సిన అవసరం లేదు. కేవలం టెక్స్ట్ లేదా వాయిస్ కమాండ్స్‌తోనే ఫొటోలను ఎడిట్ చేసుకుంటే? దీనికి వీలు కల్పించే టూల్ సైతం ఫొటోస్‌కు తోడైంది. అవసరమైన మార్పులను మాటలు లేదా పదాల రూపంలో వర్ణిస్తే చాలు. తక్షణం కోరుకున్న విధంగా ఇమేజ్‌లు మారతాయి. దీన్ని ముందుగా అమెరికాలో ఐఓఎస్ పరికరాలకు అందుబాటులోకి తేనున్నారు.



నానో బనానా సాయంతో: జెమినైకి చెందిన నానో బనానా సృష్టించిన హవా అంతా ఇంతా కాదు. ఎంతోమంది దీని సాయంతో తమ రూపాలను రకరకాలుగా మార్చుకొని సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేస్తూనే ఉన్నారు. ఇది గూగుల్ ఫొటోస్‌లోకి ఎప్పుడు వస్తుందోనని ఎదురు చూస్తున్నారు కూడా. ఇప్పుడు ఆ నిరీక్షణకూ తెరపడింది. నానో బనానా ఇమేజింగ్ మోడల్ ఇప్పుడు గూగుల్ ఫొటోస్‌లోనూ ఒదిగిపోయింది. దీంతో ఇమేజ్‌లను వేర్వేరు రూపాల్లోకి చిటికెలో మార్చుకోవచ్చు. ఫొటోను ఓపెన్ చేసి 'హెల్ప్ మీ ఎడిట్' ఆప్షన్ మీద తాకి ఎలాంటి శైలిలోకి మార్చాలో వర్ణిస్తే సరి. ఉదాహరణకు- ఈ ఫొటోను పురాతన కళాచిత్రంగా మార్చు లేదా పిల్లల కథల పుస్తకంలోని బొమ్మ రూపంలోకి మార్చు అని అడగొచ్చు. వెంటనే పని చేసిపెడుతుంది.

టెంప్లేట్‌తో ఎడిటింగ్: జనరేటివ్ ఏఐతో ఫొటోను ఎలా మార్చుకోవాలో తెలియక తికమక పడేవారి కోసం క్రియేట్ విత్ ఏఐ అనే ఫీచర్ వచ్చింది. ఇందులో ఏఐ టెంప్లేట్లు సిద్ధంగా ఉంటాయి. నచ్చిన దాన్ని ఎంచుకొని, ఫొటోను అప్‌లోడ్ చేసి క్రియేట్ బటన్ మీద తాకితే వెంటనే ఫొటో కొత్తగా తయారవుతుంది. ఈ నానో బనానా ఆధారిత టెంప్లేట్లు ముందుగా అమెరికా, భారత్‌తో అందుబాటులోకి రానున్నాయి. ఫొటోను హై ఫ్యాషన్ ఫొటోషూట్‌లోకి మార్చుకోవటం వంటివి చిటికెలో చేసుకోవచ్చు. త్వరలో పర్సనలైజ్డ్ టెంప్లేట్లనూ అమల్లోకి తేవాలనీ భావిస్తున్నారు.

ఆస్క్ ఫొటోస్‌తో శోధన: గ్యాలరీలోని ఫొటోల నుంచి అవసరమైనదాన్ని తేలికగా వెతకటానికి ఆస్క్ ఫొటోస్ తోడ్పడుతుంది. మాట రూపంలో ఆదేశమివ్వగానే గూగుల్ ఫొటోస్ పనిలోకి దిగుతుంది. సమంజసమైన ఫొటోలు, సమాచారాన్ని ముందుంచుతుంది. ఈ వారం నుంచే దీన్ని 100కు పైగా దేశాలు, ప్రాంతాలు.. 17 కొత్త భాషలకు అందుబాటులోకి తేనున్నారు.

మరో కొత్త ఆస్క్ బటన్: ఫొటోలు, సమాచారాన్ని వెతకటానికి ఆస్క్ ఫొటోస్ ఆప్షన్ సాయం చేస్తే.. కొత్త ఆస్క్ బటనేమో ఆ ఇమేజ్‌లను ఇష్టమైనట్టుగా మార్చుకోవటానికి తోడ్పడుతుంది. ఇమేజ్‌ను చూస్తూ ముచ్చటించి, సందర్భానికి తగిన సమాచారాన్ని పొందొచ్చు. ఆ ఫొటోతో ముడిపడిన విషయాలను గుర్తించొచ్చు. కావాలనుకుంటే దాన్ని ఇష్టమైనట్టుగా మార్చుకోవచ్చు. ఆస్క్ ఆప్షన్ మీద తాకి టైప్ చేసి లేదా సజెషన్‌ను ఎంచుకోగానే కోరిన పని చేసేస్తుంది.



భూమి తిరుగుతున్నా మనకెందుకు తెలియదు?

భూమి తన చుట్టూ తానే కాదు, సూర్యుడి చుట్టూ ఆగకుండా తిరుగుతూనే ఉంటుంది. అదీ చాలా వేగంతో. అయినా మనకెందుకు ఆ విషయం తెలియదు? ఎందుకంటే భూమితో పాటు మనం, మన చుట్టు ఉన్నవీ అదే వేగంతో నిరంతరం తిరుగుతుంటాయి మరి. అందువల్ల భూమి తిరుగుతున్న విషయం మన అనుభవంలోకి రాదు. భూమి ప్రతి 24 గంటలకోసారి తన చుట్టూ తాను భ్రమిస్తుంది. మీరు భూమధ్య రేఖ వద్ద ఉన్నట్టయితే గంటకు సుమారు 1,670 కి.మీ. వేగంతో తిరుగుతున్నారని అనుకోవచ్చు. అలాగే భూమి గంటకు 1.07లక్షల కి.మీ. వేగంతో సూర్యుడి చుట్టూ పరిభ్రమిస్తుంటుంది కూడా. ఇదంతా ఎలాంటి కుదుపులు లేకుండా సున్నితంగా, స్థిరంగా సాగుతూ ఉంటుంది. అంటే మన శరీరం గుర్తించే స్థాయిలో వేగం, దిశల్లో మార్పులేవీ ఉండవన్నమాట. సాధారణంగా మన లోపలి చెవులు, శరీరం త్వరణం (యాక్సిలరేషన్).. వేగంలో వృద్ధి, తరుగులు ఉన్నప్పుడే చలనాన్ని గుర్తిస్తాయి. ఉదాహరణకు- మీరు కారులో ప్రయాణిస్తున్నారనుకోండి. స్టార్ట్ అయినప్పుడు, వేగం పుంజుకున్నప్పుడు, ఆగినప్పుడు, పక్కలకు తిరిగినప్పుడు కారు కదులుతున్న విషయం తెలుస్తుంది. అదే ఒక స్థిరమైన వేగంతో, ఎలాంటి కుదుపులూ లేకుండా సాగుతున్నప్పుడు బయటకు చూస్తే తప్ప కారు కదులుతుందనే సంగతి తెలియదు. భూమి కదులుతున్న విషయం తెలియకపోవటానికీ ఇదే వర్తిస్తుంది. భూమి వేగం హఠాత్తుగా పెరగటం, తగ్గటమనేవి ఉండవు. భూమి, ఇక్కడి గాలి, మహా సముద్రాల వంటి అన్నింటితో పాటే మనం తిరుగుతుంటాం. కాబట్టి మనకేమీ తేడా తెలియదు. భూమి తిరగటాన్ని మనం నేరుగా చూడలేం కూడా. ఎందుకంటే సుదూరంగా ఉండే నక్షత్రాలు, సూర్యుడి వంటివి మన కంటికి స్థిరంగా అక్కడే ఉన్నట్టు కనిపిస్తుంటాయి. శాస్త్రీయ ప్రయోగాలు, పరిశీలన ద్వారానే భూమి తిరుగుతున్నట్టు గమనించగలం.

ఒప్పో ఫైండ్ ఎక్స్9 వచ్చేసింది

ఒప్పో చైనాలో విడుదల చేసిన ఫైండ్ ఎక్స్9 శ్రేణి స్మార్ట్‌ఫోన్లను ఇప్పుడు మనదేశంలోనూ పరిచయం చేసింది. ఫైండ్ ఎక్స్9, ఫైండ్ ఎక్స్9 ప్రొ మోడళ్లలో అందుబాటులో ఉండే ఇవి మీడియాటెక్ డైమెన్సిటీ 9500 చిప్‌సెట్, ఆండ్రాయిడ్ 16 ఆధారిత కలర్‌ఓఎస్ 16తో పనిచేస్తాయి. నవంబరు 21 నుంచి అమ్మకానికి అందుబాటులో ఉండనున్నాయి. వీటి ఫీచర్లు ఇవీ...

ఫైండ్ ఎక్స్9 ప్రొ ఫీచర్లు


- 3,600 నిట్స్ గరిష్ఠ ప్రకాశం, 1,800 నిట్స్ ఫుల్ స్క్రీన్ ప్రకాశంతో కూడిన 6.78 అంగుళాల ఎమోలెడ్ తెర
- వెనకాల 50ఎంపీ వైడ్ యాంగిల్ మెయిన్, 50ఎంపీ అల్ట్రా వైడ్ యాంగిల్, 200ఎంపీ పెరిస్కోప్ టెలీఫొటో కెమెరాలు.. ముందు 50ఎంపీ కెమెరా
- 16జీబీ ర్యామ్, 512జీబీ స్టోరేజీ
- 7,500ఎంఏహెచ్ బ్యాటరీ.. 80డబ్ల్యూ సూపర్‌వూక్, 50డబ్ల్యూ ఎయిర్‌వూక్, 10డబ్ల్యూ రివర్స్ వైర్‌లెస్ ఛార్జింగ్
- ఐపీ66, ఐపీ68, ఐపీ69 రేటింగ్.. ఎస్‌జీఎస్ డ్రాప్ రెసిస్టెన్స్
- ధర రూ. 1,09,999



ఫైండ్ ఎక్స్9 ఫీచర్లు

- 3,600 నిట్స్ గరిష్ఠ ప్రకాశం, 120హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగంతో కూడిన 6.59 అంగుళాల ఫుల్ హెచ్‌డీ ప్లస్ ఎమోలెడ్ తెర, కార్నింగ్ గ్లాస్ విక్టస్ 2 రక్షణ
- వెనకాల 50ఎంపీ మెయిన్ కెమెరా, 50ఎంపీ అల్ట్రావైడ్ యూనిట్, 50ఎంపీ టెలీఫొటో యూనిట్‌తో కూడిన మూడు కెమెరాల వ్యవస్థ. ముందు 32ఎంపీ కెమెరా
- 7,025ఎంఏహెచ్ బ్యాటరీ. 80డబ్ల్యూ సూపర్‌వూక్, 50డబ్ల్యూ ఎయిర్‌వూక్, 10డబ్ల్యూ రివర్స్ వైర్‌లెస్ ఛార్జింగ్.
- 12జీబీ ర్యామ్. స్టోరేజీ 256జీబీ/512జీబీ.
- ఐపీ66, ఐపీ68, ఐపీ69 రేటింగ్. ఎస్‌జీఎస్ డ్రాప్ రెసిస్టెన్స్
- ధర రూ. 29,999

ఈనాడు సినిమా


నయనతార


మహారాణి పోరుకు సిద్ధం

నందమూరి బాలకృష్ణ - నయనతార జంట వెండితెరపై విజయవంతమైన జోడీ. వీళ్లిద్దరి నుంచి వచ్చిన 'సింహా', 'శ్రీరామరాజ్యం' మంచి విజయాలందుకున్నాయి. ఇప్పుడీ ఇద్దరూ జంటగా మరోసారి మురిపించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. ఇందులో కథానాయికగా నయనను ఖరారు చేశారు. ఈమేరకు మంగళవారం ఆమె పుట్టినరోజు సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేశారు. అందులో ఆమె కదనరంగంలో పోరుకు సిద్ధమవుతున్న మహారాణిలా సీరియస్ లుక్‌తో కనిపించిన తీరు ఆసక్తి రేకెత్తించింది. ఇందులో బాలకృష్ణ రెండు కోణాల్లో సాగే పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం ఈ నెల 26న పూజా కార్యక్రమాలతో మొదలు కానుంది.

అభిమానుల సినిమా ఆంధ్ర కింగ్ తాలూకా


భాగ్యశ్రీ, రామ్

"నేను ఇప్పటి వరకు వరుసగా మాస్ సినిమాలు చేశాను. కానీ, 'ఆంధ్ర కింగ్ తాలూకా' చాలా భావోద్వేగభరితమైన సినిమా. నేను ఈ చిత్రానికి ఫీల్ అయినంత ఎమోషన్‌ను ఇంతవరకు ఏ సినిమాకీ అనుభూతి చెందలే"దన్నారు హీరో రామ్. ఆయన భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన ఈ సినిమాని పి.మహేశ్‌బాబు తెరకెక్కించారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. ఉపేంద్ర ప్రత్యేక పాత్రలో నటించారు. ఈ సినిమా ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం రాత్రి కర్నూల్‌లో ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ.. "వ్యక్తిగతంగా నాకెంతో ప్రత్యేకమైన చిత్రమిది. ఎప్పట్నుంచో నా మనసులో ఉన్న ఆలోచనలన్నీ ఈ సినిమాలో ఉన్నాయి. నేనిందులో అభిమాని పాత్రను పోషించాను. సూపర్‌స్టార్ పాత్రను ఉపేంద్ర పోషించారు. సినిమాలో మా ఇద్దరికీ ఉన్న సంబంధం ఏంటన్నది తెరపైనే చూసి తెలుసుకోవాలి. ఓ స్టార్ ఎలా ఆలోచిస్తే ఇలాంటి కథ చేయగలరు అనేది ఈ చిత్రం చూశాక మీకు అర్థమవుతుంది. ఇది అభిమానుల సినిమా. భాగ్యశ్రీ అద్భుతంగా నటించింది. దర్శకుడు మహేశ్ థియేటర్లలో కాదు మనసులో సౌండ్ వచ్చే సినిమా చేశారు" అన్నారు. "రామ్ గర్వంగా ఫీల్ అయ్యే సినిమా చేశామని అనుకుంటున్నా. వివేక్ - మెర్విన్ అద్భుతమైన సంగీతమందించారు" అన్నారు దర్శకుడు పి.మహేశ్‌బాబు. ఈ కార్యక్రమంలో నిర్మాత వై.రవిశంకర్, భాగ్యశ్రీ, వివేక్ - మెర్విన్, సిద్ధార్థ నుని తదితరులు పాల్గొన్నారు.


బాలకృష్ణ, సంయుక్త

హైందవ ధర్మం శక్తిని.. పరాక్రమాన్ని అఖండ 2లో చూస్తారు: బాలకృష్ణ

"మన సనాతన హైందవ ధర్మం శక్తిని.. పరాక్రమాన్ని.. గొప్పతనాన్ని 'అఖండ 2: తాండవం'లో చూస్తారు" అన్నారు కథానాయకుడు నందమూరి బాలకృష్ణ. ఆయన.. సంయుక్తా మేనన్ జంటగా నటించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని బోయపాటి శ్రీను తెరకెక్కించారు. రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. ఆది పినిశెట్టి, జగపతిబాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా డిసెంబరు 5న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రంలోని 'జాజికాయ జాజికాయ' అనే పాటను మంగళవారం వైజాగ్‌లో విడుదల చేశారు. దీనికి తమన్ స్వరాలు సమకూర్చగా.. కాసర్ల శ్యామ్ సాహిత్యమందించారు. బ్రిజేష్ శాండిల్య, శ్రేయా ఘోషల్ ఆలపించారు. ఈ సందర్భంగా కథానాయకుడు బాలకృష్ణ మాట్లాడుతూ.. "నాడు.. బోయపాటితో సినిమా వస్తుందంటేనే ఇంట గెలిచినట్టే. ఇప్పుడు 'అఖండ 2'తో రచ్చ గెలవడానికి సిద్ధమవుతున్నాం. ఇప్పటికే 'అఖండ తాండవం' పాటతో మా తాలి దెబ్బను హిందీకి చూపించాం. ఇప్పుడు 'జాజికాయ' పాటని తెలుగు నాట విడుదల చేశాం. ఇది ఐటెం పాట కాదు. కుటుంబ పండగలో వచ్చే గీతమిది. భాను మాస్టర్ చక్కటి నృత్యరీతులు అందించారు. ఈ సినిమాలో సంయుక్తా మేనన్ గ్రామ దేవత పాత్రలో నటిస్తున్నా చూస్తారు. దీంతో హర్షాలి పాత్రకు ఎంతో ప్రాధాన్యముంది. సనాతన హిందూ ధర్మం మన జాతి మూలం. సత్యం కోసం పోరాడండి.. ధర్మాన్ని జీవితాన్ని గడపండి. అన్యాయం ముందు తల వంచకండి అని మన ధర్మం చెబుతుంది. ఈ అంశాలన్నింటితో ఈ చిత్రాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లామన్నది ఆసక్తికరం" అన్నారు. "ఈ చిత్రంలో ఉన్న ఒకే ఒక్క మాస్ పాట 'జాజికాయ'. పుట్టినరోజు వేడుక నేపథ్యంలో వస్తుంది. ఈ పాటలో బాలకృష్ణను మరో కోణంలోనూ చూస్తారు. అది ప్రేక్షకుల్ని బాగా అలరిస్తుంది" అన్నారు దర్శకుడు బోయపాటి శ్రీను. నటి సంయుక్తా మేనన్ మాట్లాడుతూ.. "బాలకృష్ణ - బోయపాటి కలయికలో సినిమా అనగానే మరో ఆలోచన లేకుండా ఈ చిత్రం చేయడానికి ఒప్పుకున్నా. ఇందులో నా పాత్రలో కొన్ని సస్పెన్స్‌లు ఉన్నాయి. అవేంటన్నది సినిమా చూసి తెలుసుకోవాలి" అంది. ఈ కార్యక్రమంలో గోపీ ఆచంట, భాను మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

పైరసీ చేసేవారిని కఠినంగా శిక్షించాలి

పైరసీ చేసేవారిని కఠినంగా శిక్షించాలని కోరారు సీనియర్ నిర్మాత సి.కల్యాణ్. ఎంతగానో శ్రమించి రవిని పట్టుకున్న నేపథ్యంలో హైదరాబాద్ సీపీ సజ్జనార్, తెలంగాణ పోలీసు అధికారుల్ని ఫిల్మ్ ఛాంబర్ తరఫున త్వరలో సత్కరిస్తామన్నారు. పైరసీ వెబ్‌సైట్ నిర్వాహకుడు రవి అరెస్టు నేపథ్యంలో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాత సి.కల్యాణ్ మాట్లాడుతూ.. "దేశంలో యాంటీ పైరసీ సెల్‌ను నిర్వహిస్తోంది తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఒక్కటే. ఒకానొక సమయంలో దాన్ని మూసేయాల్సిన పరిస్థితి ఎదురైనా.. కొనసాగిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సినీ పరిశ్రమకు అండగా నిలబడాలి. సామాజిక మాధ్యమాల ద్వారా పైరసీ వల్ల జరిగే నష్టాన్ని ప్రేక్షకులకు అర్థమయ్యేలా చేయాలి" అన్నారు. ఈ కార్యక్రమంలో భరత్ భూషణ్, చదలవాడ శ్రీనివాసరావు, ప్రసన్న కుమార్, బాపిరాజు, వీరశంకర్, అమ్మిరాజు, వల్లభనేని అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హృదయాల్ని తాకే ముగింపు రాజు వెడ్స్ రాంబాయి సొంతం

"ఇప్పటి వరకు మన సినిమాల్లో రాని క్లైమాక్స్‌ను 'రాజు వెడ్స్ రాంబాయి'లో చూస్తారు. ఇది కచ్చితంగా 'ప్రేమిస్ట్', 'బేబీ', 'సైరత్' తరహాలో మంచి కల్ట్ మూవీగా పేరు తెచ్చుకుంటుంది" అన్నారు అఖిల్ రాజ్ - తేజస్విని. ఈ ఇద్దరూ జంటగా నటించిన ఈ ప్రేమకథా చిత్రాన్ని సాయిలు కంపాటి తెరకెక్కించారు. ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్స్ వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మించారు. ఈ సినిమా బన్నీ వాస్, వంశీ నందిపాటి ద్వారా ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు అఖిల్ - తేజస్విని.



రెండు నెలలు డప్పుకొట్టడం నేర్చుకున్నా!: అఖిల్

"నిజమైన ప్రేమలో ఉన్న ప్రేమికులు ఒకరికోసం ఒకరు ఎంత బలంగా నిలబడతారనేది ఈ చిత్ర కథ. చాలా గాఢమైన భావోద్వేగాలతో నిండిన కథ ఇది. స్క్రిప్ట్ చదివినప్పుడు క్లైమాక్స్‌లో ఊపిరి ఆడనట్లు అనిపించింది. కాసేపు ఓ బాధలో అలా ఉండిపోయా. నిజ జీవితంలో ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవడం విషాదకరం. ఆ ప్రేమికులు ఈ ఘటనను ఎలా డీల్ చేశారో అనిపించింది. ఈ చిత్రంలో నేను చేసిన రాజు పాత్ర ప్రతి అబ్బాయికి కనెక్ట్ అవుతుంది. ప్రతి ప్రేమలో సంతోషం, బాధ, కోపం ఉంటాయి. కానీ, ప్రేమకు ఎదురయ్యే ప్రతి పరిస్థితిలో ధైర్యంగా నిలబడతాడు రాజు. నటుడవ్వాలన్నది నా కల. ఆ ఇష్టంతోనే ఇంటర్ పూర్తయిన వెంటనే ఇండస్ట్రీలోకి వచ్చాను. కొన్నాళ్లు మీడియాలో యాంకర్‌గా, ఫొటోగ్రాఫర్‌గా పని చేశా. 'సఖియా', 'ఏవండోయ్ ఓనర్ గారు' లాంటి షార్ట్‌ఫిల్మ్స్‌తో మంచి పేరు తెచ్చుకున్నా. ఆ తర్వాత నేను చేసిన 'విందు భోజనం' ఓటీటీలో విడుదలైంది. ఈ క్రమంలోనే కొన్నాళ్ల క్రితం 'రాజు వెడ్స్ రాంబాయి'కి అడిషన్ ఇచ్చి.. సెలెక్ట్ అయ్యా. ఈ చిత్రం కోసం నేను రెండు నెలలు డప్పు కొట్టడం నేర్చుకున్నాను. పదేళ్లుగా ఈ ఇండస్ట్రీలో నేను పడిన కష్టానికి ఈ చిత్రంతో ఫలితం దక్కుతుందని నమ్ముతున్నా".

ఏ హీరోయిన్‌కైనా ఇలాంటి పాత్రలు అరుదు: తేజస్విని

"వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందించిన ప్రేమకథా చిత్రమిది. నేనిందులో రాంబాయి అనే పాత్ర పోషించా. ఆమెలో చాలా కోణాలుంటాయి. తన ప్రేమికుడు రాజు దగ్గర క్యూట్‌గా ఉంటుంది. కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంగా నిలబడుతుంది. తన ప్రేమను తండ్రి అంగీకరించాలని తపన పడుతుంది. ఏ కథానాయికకైనా ఇలాంటి పాత్రలు దొరకడం అరుదనే చెప్పాలి. మన తెలుగు సినిమాలో చాలా అందంగా రాసిన పాత్రగా రాంబాయికి ప్రశంసలు దక్కుతాయి. ఈ చిత్ర క్లైమాక్స్ షూట్ చేస్తున్నప్పుడు వ్యక్తిగతంగా చాలా భావోద్వేగానికి గురయ్యాను. సినిమా చివరి 30నిమిషాలు హృదయాల్ని బలంగా తాకుతుంది. ఆ సీన్‌లో నటించాక దాని నుంచి బయటకు రావడం చాలా కష్టంగా ఉండేది. అంతగా ఉద్వేగానికి గురయ్యాం. నా గత సినిమా 'కమిటీ కుర్రోళ్ళు' చిత్ర దర్శకుడు యదు వంశీ ద్వారా 'రాజు రాంబాయి' సినిమా గురించి తెలిసింది. దీనికి నేను ఆడిషన్ ఇచ్చాక రాంబాయి పాత్రకు సరిపోతానని ఎంపిక చేసుకున్నారు".

థ్రిల్ పంచే మఫ్టీ పోలీస్


అర్జున్

అర్జున్ సర్జా, ఐశ్వర్య రాజేశ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'మఫ్టీ పోలీస్'. ఈ సినిమాని దినేశ్ లక్ష్మణ్ దర్శకత్వంలో జి.అరుల్ కుమార్ నిర్మించారు. ఈ నెల 21న విడుదల కానున్న ఈ తమిళ చిత్రాన్ని తెలుగులో ప్రముఖ నిర్మాత ఎ.ఎన్.బాలాజీ.. శ్రీలక్ష్మి జ్యోతి క్రియేషన్స్ ద్వారా విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.."యాక్షన్ కింగ్ అర్జున్, ఐశ్వర్య రాజేశ్‌లకు తెలుగునాట ఉన్న క్రేజ్‌ని దృష్టిలో పెట్టుకుని అత్యధిక థియేటర్లలో ఈ సినిమాని విడుదల చేస్తున్నాం. ఒక రచయిత హత్య కేసుని ఛేదించే నేపథ్యంలో సాగే ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ చిత్రమిది"అని చెప్పారు.

ప్రజలు నిద్రపోయే వేళలో నీవు మేల్కొని ఉన్నావు


'120 బహదూర్'

'తన తల్లి రక్షణతోనే అతని ముఖంలో గర్వం కనిపించిందం'టున్నారు బాలీవుడ్ నటుడు ఫర్హాన్ అక్తర్. ఆయన ప్రధాన పాత్రలో సైనికుడిగా నటిస్తున్న చిత్రం '120 బహదూర్'. రెజాంగ్ లా యుద్ధానికి నాయకత్వం వహించిన మేజర్ షైతాన్ సింగ్ భాటి జీవితం ఆధారంగా రూపొందుతోందీ చిత్రం. రజనీశ్ ఘాయ్ దర్శకత్వం వహిస్తున్నారు. రాశీఖన్నా కథానాయిక. ఈ సినిమా ఈ నెల 21న విడుదలకానున్న సందర్భంగా చిత్ర బృందం ఇన్‌స్టా వేదికగా.. "తనను రక్షించడానికి ప్రాణాలను అర్పించిన వారందరికీ మాతృభూమి నుంచి హృదయ విదారకమైన లాలిపాట" అంటూ 'మై హూన్ వోహ్ ధర్తీ మా'అనే ప్రత్యేక గీతాన్ని విడుదల చేసింది. "నా శాశ్వత జ్ఞాపకాలతో.. మరణ యుద్ధ జ్వాలల కోపంలోనూ ఒక్క క్షణం కూడా తల వంచలేదు. అప్పుడు నా తల్లి ముఖంలో గర్వం కనిపించింది.. ప్రియతమా నీకు ధన్యవాదాలు! ప్రజలు నిద్రపోయే వేళలో నీవు మేల్కొని ఉన్నావు"అంటూ సాగే ఈ పాట సైనిక కుటుంబాల భావోద్వేగ సన్నివేశాలతో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. శ్రేయా గోషల్ ఆలపించిన ఈ గీతానికి జావేద్ అక్తర్ సాహిత్యమందించారు.

రేడియోనే నా గురువు


ఉషా ఉతుప్

"నేను ఎవరిలా పాడలేను.. నాకు నేను నిజాయతీగా ఉండటం వల్లే ప్రేక్షకులు ఇప్పటికీ నన్ను ప్రేమిస్తున్నారని నమ్ముతున్నా" అన్నారు ప్రముఖ గాయని ఉషా ఉతుప్. క్లాసికల్ అయినా.. వెస్ట్రన్ అయినా ఈమె మైక్ పట్టుకున్నారంటే అన్ని వయసుల వారు డ్యాన్స్ చేయాల్సిందే. గాత్రంతో అంతగా మాయ చేసే ఉష తన గొంతులో మాత్రమే ప్రత్యేకతను నింపుకోలేదు.. ఆమె ఆహార్యం కట్టూ, బొట్టూ అన్నీ స్పెషలే. విభిన్నమైన స్వరంతో శ్రోతల్ని ఉర్రూతలూగించే ఈమె.. తాజాగా ఏడవ దేహ్రాదూన్ సాహిత్య ఉత్సవం ముగింపు కార్యక్రమంలో పాల్గొని తన పాటలతో అలరించి, కెరీర్ ప్రారంభ రోజుల గురించి పంచుకున్నారు.

'నేను లతా జీ, ఆశాలాగా ఎప్పుడూ పాడలేనని ముందే గ్రహించాను. మంచి అమ్మాయిలందరూ లతా మంగేష్కర్ స్వరాన్ని మాత్రమే కోరుకుంటారు. వాళ్లనే స్ఫూర్తిగా తీసుకుంటారు. అందుకే వాళ్లంతా ఆశా, లతాలా అద్భుతంగా పాడతారు. బ్యాడ్ గర్ల్స్ అందరూ నన్ను కోరుకుంటారు. అయినా నేను నాలాగే పాడతాను. ఆ కాలంలో రూ.126 ఖరీదు చేసే నా మొట్టమొదటి కాంచీవరం చీర మద్రాసులోని హోటల్ సవేరాలో ఇచ్చిన ప్రదర్శనకు బహుమతిగా వచ్చింది. నా కెరీర్‌లో ఇదెప్పటికీ ప్రత్యేకమే".

ఇలా పాడిన మొదటి గాయని నేనే

"భారతీయ, విదేశానికి చెందిన పలు భాషలలో ఎన్నో అద్భుతమైన పాటలకు ప్రాణం పోశాను. ఇలా వివిధ భాషలలో నాకున్న ప్రావీణ్యం కేవలం రికార్డులు సృష్టించడం.. గుర్తింపులు పొందడం కోసమే కాదు.. ప్రేక్షకుల్ని అలరించడం, ప్రదర్శనలు ఇవ్వడమే నాకు ముఖ్యం. నాకు తెలిసి పంజాబీని సరిగ్గా పాడిన మొదటి మద్రాసీ అమ్మాయిని నేనే. నా కన్నా ముందు మరెవరూ ఇలా పాడలేదు".

వ్యక్తిత్వమే నా బలం

"మీరు ఏ గాయకుడి నుంచి ప్రేరణ పొందారని అడుగుతుంటారు. కానీ రేడియోనే నా గురువు. అందులో ప్రసారమయ్యే పాటల్ని వింటూ అన్నీ నేర్చుకున్నా. నా వ్యక్తిత్వమే చివరికి బలంగా మారింది. మీరు మీ పరిమితులను గ్రహించి వాటిని మీ బలాలుగా మార్చుకుంటే అది అద్భుతంగా, గొప్పగా మారుతుంది. నేటికీ నేను భిన్నంగానే ఉంటాను.. అలానే ఆలోచిస్తాను. కాబట్టి ప్రేక్షకులు నన్ను అంగీకరిస్తారు".

నాతో సెల్ఫీ కూడా తీసుకోలేదు

"దశాబ్దాలుగా సినీరంగంలో ఉంటున్న నేను కూడా పరిచయం లేని వాళ్లు ఉంటారు. ఓసారి ఓ అమ్మాయి తన ఫోన్ చేతిలో పట్టుకొని రెండు, మూడుసార్లు నా పక్కనే నడిచింది. ఆమె నాతో సెల్ఫీ తీసుకోవడానికే ఇలా చేస్తుందేమో అని అనుకున్నా. నా చీరను కూడా సరి చేసుకొని సిద్ధంగా ఉన్నా. తర్వాత ఆమె వచ్చినప్పుడు 'నువ్వు సింగర్ రునా లైలానా?' అని అడిగింది. నేను 'లేదు నేను ఉషా ఉతప్‌ని' అని అన్నాను. అప్పుడామె అక్కడి నుంచి వెళ్లిపోయింది. కనీసం సెల్ఫీ కూడా తీసుకోలేదు. కాబట్టి అప్పుడప్పుడూ ఇలా జరుగుతుంది. అందుకే మిమ్మల్ని మీరు సీరియస్‌గా తీసుకోకండి. నేనూ అంతే. ప్రతి ఒక్కరినీ ఇదే అనుసరించమని సూచిస్తా".


నాగచైతన్య, శేఖర్ కమ్ముల, ప్రియదర్శి

ప్రేమకథలు ఎప్పటికీ నిలిచే ఉంటాయి

"ప్రేమకథలకు ఎప్పుడూ కాలం చెల్లద"న్నారు కథానాయకుడు నాగచైతన్య. ఓ సరికొత్త ప్రేమకథతో వస్తున్న 'ప్రేమంటే' విజయం సాధించాలని ఆకాంక్షించారు. ప్రియదర్శి, ఆనంది జంటగా నటించిన చిత్రమిది. నవనీత్ శ్రీరామ్ తెరకెక్కించారు. రానా దగ్గుబాటి సమర్పణలో పుస్కూర్ రామ్ మోహన్ రావు, జాన్వీ నారంగ్ నిర్మించారు. సుమ కనకాల కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా ఈనెల 21న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో లవ్ ట్రాటర్ వేడుక నిర్వహించారు. హీరో నాగచైతన్య, దర్శకుడు శేఖర్ కమ్ముల ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగచైతన్య మాట్లాడుతూ.. "ఓ నటుడిగా.. ప్రేక్షకుడిగా నాకు ప్రేమకథలంటే పిచ్చి ఇష్టం. కొవిడ్ తర్వాత ప్రేక్షకులు యాక్షన్ సినిమాలు.. కొత్త ప్రపంచాలతో నిండిన సినిమాలకే వస్తున్నారని కొందరు నన్ను భయపెట్టారు. కానీ, ఈ మధ్య వచ్చిన కొన్ని ప్రేమ చిత్రాలు అవన్నీ తప్పని నిరూపించాయి. ప్రేమకథలు ఎప్పటికీ అలాగే నిలిచి ఉంటాయి. దర్శకుడు నవనీత్ ఈ సినిమాతో ఓ ఫ్రెష్ ప్రేమకథను చూపించనున్నాడు" అన్నారు. "ప్రియదర్శి ఎంతో కష్టపడి చాలా మంచి చిత్రాలు చేస్తున్నాడు. ఇది కూడా మంచి మ్యాజిక్‌లా ఉంటుందని నమ్ముతున్నా" అన్నారు దర్శకుడు శేఖర్ కమ్ముల. ప్రియదర్శి మాట్లాడుతూ.. "ఈ కథ విన్నప్పుడే చాలా వినూత్నంగా అనిపించింది" అన్నారు. "ఆశా మేరీ లాంటి పాత్ర నాకిచ్చినందుకు దర్శకుడు నవనీత్‌కు థ్యాంక్స్" అన్నారు సుమ. ఈ కార్యక్రమంలో సురేశ్‌బాబు, సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు, జాన్వీ నారంగ్, నవనీత్ శ్రీరామ్, ఆనంది, లియోన్ జేమ్స్, హైపర్ ఆది తదితరులు పాల్గొన్నారు.

షాకిచ్చేలా ఇంటర్వెల్


శ్రీనివాసా చిట్టూరి, హరీశ్ శంకర్, నరేశ్, కామాక్షి

"సినిమాపై నమ్మకం ఉంటే భయం ఉండద"న్నారు కథానాయకుడు అల్లరి నరేశ్. '12ఏ రైల్వే కాలనీ'పై ఆ నమ్మకం ఉందని.. ఇది కచ్చితంగా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆయన. . కామాక్షి భాస్కర్ల జంటగా నటించిన ఈ చిత్రాన్ని నాని కాసరగడ్డ తెరకెక్కించారు. శ్రీనివాసా చిట్టూరి నిర్మాత. అనిల్ విశ్వనాథ్ షోరన్నర్. ఈ సినిమా ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకని నిర్వహించారు. దర్శకులు హరీశ్ శంకర్, వీఐ ఆనంద్, విజయ్ కనకమేడల తదితరులు అతిథులుగా హాజరయ్యారు. అల్లరి నరేశ్ మాట్లాడుతూ.. "నాకు.. సంగీత దర్శకుడు భీమ్స్‌కి ఇది ఛాలెంజింగ్ సినిమా" అన్నారు. "ఇంటర్వెల్ ప్రతి ఒక్కరూ షాక్ అవుతారు. క్లైమాక్స్ రోమాలు నిక్కబొడుచుకునేలా ఉంటుంది" అన్నారు దర్శకుడు అనిల్ విశ్వనాథ్. ఈ కార్యక్రమంలో భీమ్స్ సిసిరోలియో, వైవా హర్ష, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేను ఎంత నలుగుతుంటే ప్రేక్షకులకు అంత నవ్వులు


రాజ్‌తరుణ్

"ఇప్పటి వరకు నేను చేసిన ప్రతి చిత్రంతోనూ ఏదోక కొత్త కథ చెప్పే ప్రయత్నమే చేశా. 'పాంచ్ మినార్'లోనూ అలాంటి ఓ కొత్తదనం ఉంది" అన్నారు రాజ్ తరుణ్. ఆయన హీరోగా నటించిన ఈ సినిమాని రామ్ కడుముల తెరకెక్కించారు. మాధవి, ఎం.ఎస్.ఎం రెడ్డి నిర్మాతలు. రాశీ సింగ్ కథానాయిక. ఈ చిత్రం ఈనెల 21న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడారు రాజ్‌తరుణ్.

- "ఇదొక మంచి క్రైమ్ కామెడీ సినిమా. కథ నుంచి బయటకు వెళ్లకుండా జానర్‌కు తగ్గట్లు ప్రతి సందర్భంలో నుంచి థ్రిల్.. వినోదాన్ని పుట్టించే ప్రయత్నం చేశాం. స్క్రీన్‌ప్లే చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఈ సినిమాలో ఓ కీలక మలుపులో వినిపించే పదం 'పాంచ్ మినార్'. ఆ తర్వాత నుంచే కథ మరో మలుపు తిరుగుతుంది. వినడానికి బాగుండే పదం కావడంతో దాన్నే టైటిల్‌గా ఖరారు చేశాం".
- "ఉద్యోగం సాధించాలనే క్రమంలో ఈజీగా డబ్బులు సంపాదించాలనుకునే ఓ కుర్రాడు ఎలాంటి సమస్యలో ఇరుక్కున్నాడు అనేది ఈ చిత్ర కథాంశం. ఈ సినిమాలో నా పాత్ర ఎంత నలిగిపోతుంటే చూసే వాళ్లకు అంత నవ్వొస్తుంటుంది".
- "నేను కచ్చితంగా దర్శకత్వం చేస్తా. దాని కోసం కథలు సిద్ధం చేసుకుంటున్నా. కాకపోతే దానికి ఇంకా సమయం ఉంది. దర్శకత్వం చేయాలంటే ఓ రెండేళ్ల గ్యాప్ తీసుకోవాలి. ప్రస్తుతం తెలుగులో 'రామ్ భజరంగ్', 'టార్టాయిస్' చిత్రాలు చేస్తున్నా. తమిళంలో విజయ్ మిల్టన్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నా".

ఏఐతో ముడిపడిన కిల్లర్


పూర్వజ్, జ్యోతి

జ్యోతి పూర్వజ్, పూర్వజ్, మనీశ్ గిలాడ ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న చిత్రం 'కిల్లర్'. పూర్వజ్ దర్శకత్వం వహిస్తూ ఎ.పద్మనాభ రెడ్డితో కలిసి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రంలోని 'ఫైర్ అండ్ ఐస్' అనే పాటను మంగళవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా నటి జ్యోతి పూర్వజ్ మాట్లాడుతూ.. 'ఇదొక కొత్త తరహా కథతో రూపొందిన సినిమా" అన్నారు. "ప్రస్తుతం తెలుగు సినిమా కొత్త దారిలో వెళ్తోంది. ఈ సమయంలో మేము చేసిన ఈ సైన్స్ ఫిక్షన్ చిత్రం మరో సరికొత్త ప్రయత్నంగా ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటుంది. ఏఐతో ముడిపడి ఉన్న ఆసక్తికర కథతో దీన్ని రూపొందించాం" అన్నారు దర్శకుడు.

800మందితో.. క్లైమాక్స్ ఫైట్


విశాల్

విశాల్ హీరోగా నటిస్తూ.. స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం 'మకుటం'. ఆర్బీ చౌదరి నిర్మాత. దుషార విజయన్, అంజలి కథానాయికలు. తంబి రామయ్య కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్ర క్లైమాక్స్ చిత్రీకరణ పూర్తయినట్లు చిత్ర బృందం ప్రకటించింది. దాదాపు 800మంది బృందంతో 17రోజుల పాటు ఈ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను తెరకెక్కించినట్లు తెలిపింది. ఇది సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలిచేలా ఉంటుందని సినీ వర్గాలు తెలిపాయి.

పాకిస్థాన్‌కు కలలో కూడా మనదేశమే కనిపించాలి


రణ్‌వీర్ సింగ్


"మీరందరూ మీ బాణసంచాతో ఆడుకోవడం ముగించినట్లయితే.. ఇక టపాసుల మోత నేను మొదలుపెడతా" అంటున్నారు రణ్‌వీర్ సింగ్. మరి ఆయన టపాసుల మోతకు కారణమేంటో తెలుసుకోవాలంటే 'ధురంధర్' సినిమా చూడాల్సిందే. ఆయన హీరోగా ఆదిత్య ధర్ దీన్ని తెరకెక్కిస్తున్నారు. సంజయ్ దత్, ఆర్.మాధవన్, అక్షయ్ ఖన్నా, అర్జున్ రాంపాల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. 'పాకిస్థాన్‌లోని ఉగ్రవాద మూలాన్ని అంతం చేయాలి. వారు నిద్రలో భారతదేశానికి హాని చేయాలనుకున్నా... ఆ కలలో కూడా మనల్ని మాత్రమే చూడాలి' లాంటి శక్తిమంతమైన సంభాషణలతో ఆద్యంతం ఆసక్తిగా సాగుతోందీ ట్రైలర్. ఈ సినిమా వచ్చే నెల 5న రానుంది.

క్షేత్రగణితం-2D (త్రిభుజాలు)

★ క్షేత్ర గణితం అనేది వివిధ ఆకారాల పరిమాణాలు అంటే వైశాల్యాలు, ఘనపరిమాణాలు, చుట్టుకొలతల గురించి తెలియజేస్తుంది.

★ ఈ చాప్టర్‌ను అధ్యయనం చేయడానికి త్రిభుజాలు, చతుర్భుజాలు, బహుభుజాలు, వృత్తాలు లాంటి ఆకారాలు, వాటి ప్రాథమిక సూత్రాల గురించి తెలుసుకోవాలి.

ఆకారాలు, పరిమాణాలు, స్థానం, దిశ తదితరాల అధ్యయనానికి సంబంధించిందే క్షేత్రగణితం. భూమిని కొలవడం అనే అర్థంలోనూ ఆ పదాన్ని ఉపయోగిస్తారు. ఇది ప్రధానంగా ద్విమితీయ, త్రిమితీయ వస్తువుల లక్షణాలు, సంబంధాలను వివరిస్తుంది. ఈ గణితాన్ని ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్, ఆర్ట్, ఖగోళ శాస్త్రాల్లో ఎక్కువగా ఉపయోగిస్తారు. క్షేత్రగణితంలో త్రిభుజం ఒక ప్రాథమిక భాగం. మూడు భుజాలు, మూడు కోణాలు, మూడు శీర్షాలు ఉండే ఒక ద్విమితీయ సంవృత పటం. అతి తక్కువ భుజాలున్న బహుభుజి. దీనిపై పోటీ పరీక్షల్లో తరచూ ప్రశ్నలు అడుగుతున్నారు. త్రిభుజాల రకాలు, ధర్మాలతోపాటు వైశాల్యం, చుట్టుకొలతలను లెక్కించడంతోపాటు, సంబంధిత సూత్రాలు, వాటి అనువర్తనాలను అభ్యర్థులు తెలుసుకోవాలి. పైథాగరస్ సిద్ధాంతంపై అవగాహన పెంచుకోవాలి.




సగంతో భాగించి.. ఎత్తుతో గుణిస్తే!


ముఖ్యమైన ప్రాథమిక సూత్రాలు

త్రిభుజం


a) ఒక త్రిభుజం యొక్క భూమి b, ఎత్తు h అయితే త్రిభుజ వైశాల్యం $= \frac{1}{2}bh$.




b) లంబకోణ త్రిభుజ వైశాల్యం $= \frac{1}{2}bh$.



c) లంబకోణ సమద్విబాహు త్రిభుజ వైశాల్యం $= \frac{1}{2}a^2$



d) i) సమద్విబాహు త్రిభుజ వైశాల్యం $= \frac{1}{4}b\sqrt{4a^2 - b^2}$




ii) సమద్విబాహు త్రిభుజం ఎత్తు $h = \frac{1}{2}\sqrt{4a^2 - b^2}$


సమబాహు త్రిభుజం

i) 'a' భుజంగా ఉన్న సమబాహు త్రిభుజ వైశాల్యం $A = \sqrt{3}\frac{a^2}{4}$


ii) సమబాహు త్రిభుజం ఎత్తు $h = \sqrt{3}\frac{a}{2}$




iii) సమబాహు త్రిభుజం A, ఎత్తు h, అయితే $A = \frac{h^2}{\sqrt{3}}$



నోట్: i) a భుజంగా ఉన్న సమబాహు త్రిభుజంలో ఒక వృత్తాన్ని అంతర్లిఖించిన అంతర వృత్త వ్యాసార్ధం (r) అయితే $a = 2\sqrt{3}\,r$




ii) a భుజంగా ఉన్న సమబాహు త్రిభుజానికి ఒక పరివృత్తాన్ని నిర్మిస్తే, దాని వ్యాసార్ధం 'R' అయితే $a = \sqrt{3}R$



iii) 'a' భుజంగా ఉన్న ఒక సమబాహు త్రిభుజానికి నిర్మించిన పరివృత్తం, అంతర వృత్తం వైశాల్యాల మధ్య భేదం $= \pi\frac{a^2}{4}$


★ ఒక సమబాహు త్రిభుజంలో అంతర బిందువు నుంచి గీసిన లంబాలు h_1, h_2, h_3 అయితే



జనరల్ స్టడీస్ అరిథ్‌మెటిక్

$h = h_1 + h_2 + h_3$

★ a, b, c భుజాలుగా త్రిభుజానికి వైశాల్యం.



$= \sqrt{s(s-a)(s-b)(s-c)}$

s = అర్ధ చుట్టుకొలత $= \frac{a+b+c}{2}$


నోట్: తప్పనిసరిగా నేర్చుకోవాల్సిన 'పైథాగరస్' త్రికాలు



(3, 4, 5) (6, 8, 10) (9, 12, 15)
(5, 12, 13)
(7, 24, 25) (8, 15, 17)
(9, 40, 41)
(11, 60, 61)

నోట్: a) రెండు సరూప త్రిభుజాల భుజాల నిష్పత్తి = a : b అయితే వాటి వైశాల్యాల నిష్పత్తి $= a^2 : b^2$


b) ఒక త్రిభుజం మధ్య బిందువులను కలిపితే ఏర్పడే త్రిభుజ వైశాల్యం, అసలు త్రిభుజ వైశాల్యంలో 4వ వంతు ఉంటుంది.



ΔDEF వైశాల్యం $= \frac{\Delta ABC \text{ వైశాల్యం}}{4}$

ΔDEF చుట్టుకొలత $= \frac{\Delta ABC \text{ చుట్టుకొలత}}{2}$

c) ABC త్రిభుజంలో G గురుత్వకేంద్రం అయితే AGB త్రిభుజ వైశాల్యం $= \frac{\Delta ABC \text{ వైశాల్యం}}{3}$



మాదిరి ప్రశ్నలు

1. 10 సెం.మీ. భుజంగా ఉన్న సమబాహు త్రిభుజ వైశాల్యం (చ.సెంటీమీటర్లలో)


1) $50\sqrt{3}$ 2) $10\sqrt{3}$ 3) $25\sqrt{3}$ 4) 50

వివరణ: భుజం a = 10 సెం.మీ.

సమబాహు త్రిభుజ వైశాల్యం

$= \sqrt{3}\frac{a^2}{4} \Rightarrow \sqrt{3}\frac{10 \times 10}{4}$

$= 25\sqrt{3}$



జ: 3

2. ఒక సమబాహు త్రిభుజ వైశాల్యం $81\sqrt{3}$ చ.సెం.మీ. అయితే దాని చుట్టుకొలత ఎంత?


1) 54 2) $36\sqrt{3}$ 3) $54\sqrt{3}$ 4) 36

వివరణ: సమబాహు త్రిభుజ వైశాల్యం $= 81\sqrt{3}$

$\sqrt{3}\frac{a^2}{4} = 81\sqrt{3} \Rightarrow a^2 = 81 \times 4$

$a = \sqrt{81 \times 4}$

$a = 9 \times 2 = 18$




సమబాహు త్రిభుజ చుట్టుకొలత $= 3a \Rightarrow 3 \times 18 = 54$ జ: 1

3. ఒక త్రిభుజం భుజాలు వరుసగా 13 సెం.మీ., 14 సెం.మీ., 15 సెం.మీ. అయితే ఆ త్రిభుజం వైశాల్యం ఎంత? (చ.సెం.మీ.లలో)

1) 84 2) 64 3) 74 4) 44

వివరణ: a, b, c భుజాలుగా ఉన్న త్రిభుజ వైశాల్యం $= \sqrt{s(s-a)(s-b)(s-c)}$

$s = \frac{13 + 14 + 15}{2} = 21$



$= \sqrt{21 \times (21-13) \times (21-14) \times (21-15)}$

$= \sqrt{21 \times 8 \times 7 \times 6} \Rightarrow \sqrt{7 \times 3 \times 4 \times 2 \times 7 \times 2 \times 3}$


$= 7 \times 3 \times 2 \times 2 \Rightarrow 84$ చ.సెం.మీ. జ: 1

4. ఒక త్రిభుజ వైశాల్యం 1445 చ.సెం.మీ. దాని భూమి, ఉన్నతుల నిష్పత్తి 2 : 5. అయితే వాటి మొత్తం ఎంత?

1) 112 2) 119 3) 85 4) 289

వివరణ: b : h = 2 : 5
= 2x : 5x

ఒక త్రిభుజం వైశాల్యం $= \frac{1}{2}bh$



$\frac{1}{2} \times 2x \times 5x = 1445 \Rightarrow 5x^2 = 1445$

$x^2 = 289$, x = 17 భూమి, ఉన్నతుల మొత్తం = 2x + 5x

$= 7x \Rightarrow 7 \times 17 = 119$ జ: 2

5. ఒక లంబకోణ సమద్విబాహు త్రిభుజం చుట్టుకొలత $(4 + 4\sqrt{2})$ సెం.మీ. అయితే కర్ణం పొడవు ఎంత?

1) 4 2) 6 3) 8 4) 10


వివరణ: ఒక లంబకోణ సమద్విబాహు త్రిభుజం భుజం a అయితే దాని చుట్టుకొలత $= (2a + a\sqrt{2})$

$2a + a\sqrt{2} = (4 + 4\sqrt{2})$

$a\sqrt{2}(\sqrt{2} + 1) \Rightarrow 4(1 + \sqrt{2})$

$a\sqrt{2} = 4 \Rightarrow a = 2\sqrt{2}$

కర్ణం $= a\sqrt{2} = 2\sqrt{2} \times \sqrt{2} = 4$



జ: 1

6. ఒక త్రిభుజం మూడు భుజాలు వరుసగా 15 సెం.మీ., 20 సెం.మీ., 25 సెం.మీ. అయితే దాని పరివృత్త వ్యాసార్ధం ఎంత?

1) 10.5 2) 11.5 3) 9.5 4) 12.5

వివరణ: 15 సెం.మీ. 20 సెం.మీ. 25 సెం.మీ. భుజాలు

లంబకోణ త్రిభుజం భుజాలు

★ లంబకోణ త్రిభుజానికి పరివృత్త వ్యాసార్ధం

$= R = \frac{\text{కర్ణం}}{2} = \frac{25}{12}$

= 12.5 జ: 4



రచయిత: పిరాది నరేష్

కరెంట్ అఫైర్స్

◆ మహిళల క్రికెట్ ప్రపంచకప్ 2025 అధికారిక పాట ఏది?
(అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) విడుదల చేసిన ఈ గీతాన్ని ప్రముఖ భారత గాయని శ్రేయా ఘోషల్ పాడారు. 2025లో భారత్, శ్రీలంకలు ఆతిథ్యం ఇచ్చిన 13వ ఎడిషన్



మాదిరి ప్రశ్నలు

మహిళల క్రికెట్ ప్రపంచకప్ విజేతగా భారత్ నిలిచింది. ఫైనల్లో దక్షిణాఫ్రికా పై 52 పరుగుల తేడాతో నెగ్గిన భారతజట్టు తొలి ప్రపంచ కప్‌ను అందుకుంది.)
జ: బ్రింగ్ ఇట్ హోమ్

◆ భారత్ తన తొలి రక్షణ తయారీ కర్మాగారాన్ని ఇటీవల ఏ ఆఫ్రికా దేశంలో ప్రారంభించింది? (భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ దేశ పర్యటనలో భాగంగా బెర్రెచిడ్‌లో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఏర్పాటు చేసిన ఈ కర్మాగారాన్ని ప్రారంభించారు.)
జ: మొరాకో

మరింత సమాచారం

◆ 'ప్రాజెక్ట్ కుశ' అనేది?
జ: డీఆర్‌డీఓ అభివృద్ధి చేస్తున్న ప్రతిష్ఠాత్మక స్వదేశీ దీర్ఘ శ్రేణి వాయు రక్షణ వ్యవస్థ.

దరఖాస్తు చేశారా?



☛ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్‌లో జూనియర్ టెక్నీషియన్ ఖాళీలు
చివరి తేదీ: 2025, నవంబరు 21

☛ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్‌లో డిప్లొమా టెక్నీషియన్ ఖాళీలు
చివరి తేదీ: 2025, నవంబరు 21

మనసుకు నచ్చే కొలువునే ఎంచుకోండి!

లైఫ్‌స్కిల్స్



చదువు పూర్తయిన తర్వాత చేరే కొలువు జీవితంలో అత్యంత కీలకం. దాదాపు మూడు దశాబ్దాలకు పైగా దానితోనే గడపాల్సి ఉంటుంది. అందుకే ఎంపిక చేసుకునే రంగాన్ని, సంబంధిత చదువును నిర్ణయించుకోవడానికి ముందే ఆ ఉద్యోగం నచ్చుతుందా లేదా అనేది ఒకసారి చెక్ చేసుకోవాలి. నిజానికి ఎక్కువమందికి ఆ నిర్ణయం అంత సులభం కాదు. స్పష్టత కోసం స్నేహితులను సలహా అడగవచ్చు. కెరియర్ కౌన్సెలర్ల సూచనలు తీసుకోవచ్చు. ఇంకా సందిగ్ధత ఉంటే అభ్యర్థి వ్యక్తిత్వానికి ఏ పని సరిపోతుందో దాని వైపు వెళ్లాలి. ఆ విధంగా మనసుకు నచ్చిన కొలువును ఎంచుకోవడానికి ఏం చేయాలి, ఎలాంటి అవగాహన పెంచుకోవాలి, ఈ అంశంపై నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసుకోవాలంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.


సరికొత్త సంస్కృతిగా సంవాదం.. చర్చ!

ఆధునిక యుగంలో సమాచార వేగం, విస్తృతికి బీజం వేసిన తొలి పరిణామమే ముద్రణ. అచ్చుయంత్రాలతో ప్రచురణలు రావడంతో ప్రపంచవ్యాప్తంగా రాజకీయంగా, సామాజికంగా పలు విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. పుస్తకాలు, వార్తాపత్రికల ద్వారా ప్రజల్లో చైతన్యం పెరిగింది. సాహిత్య, సంప్రదాయ ఆలోచనా వైఖరి ప్రభావితమైంది. విద్య విస్తరించి, జ్ఞానవ్యాప్తి జరిగింది. భారతదేశంలో సామాజిక సంస్కరణలు సాధ్యమయ్యాయి. ఈ పరిణామక్రమం, ప్రధాన సంఘటనలపై పోటీ పరీక్షార్థులకు స్థూల పరిజ్ఞానం ఉండాలి. ముద్రణ సంస్కృతికి ముందు ఉన్న పరిస్థితులు, ఆ తర్వాత వచ్చిన నిర్మాణాత్మక మార్పులు, అందుకు దోహదపడిన పత్రికలు, ప్రచురణ కర్తలు, రచయితలు, వారు వెలుగులోకి తెచ్చిన అంశాలు, అభిప్రాయాలనూ తెలుసుకోవాలి.

ముద్రణ - ఆధునిక ప్రపంచం

1. ఫ్రెంచ్ విప్లవానికి దారితీసిన ముద్రణ సంస్కృతి పరిస్థితులు..?
   1) చైతన్యవంతులైన మేధావుల భావాలను ముద్రణ ప్రాచుర్యంలోకి తెచ్చింది.
   2) సంవాదం, చర్చ అనే కొత్త సంస్కృతిని ముద్రణ సృష్టించింది.
   3) 1780 నాటికి రాజరికాన్ని అపహాస్యం చేసే నైతికతను విమర్శించే సాహిత్యం వెల్లువెత్తింది.
   4) పైవన్నీ

2. 'ది ఫర్ బిడెన్ బెస్ట్ సెల్లర్స్ ఆఫ్ ప్రి రెవల్యూషనరీ ఫ్రాన్స్'ను రచించింది?




   1) రాబర్ట్ దారంటన్
   2) మాక్స్ ముల్లర్
   3) మెర్సియర్
   4) కారల్ మార్క్స్

3. పిల్లలకు మాత్రమే అంకితమైన ముద్రణ ప్రెస్‌ను ఫ్రాన్స్‌లో ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1875 2) 1857 3) 1764 4) 1785

4. గ్రీమ్ బ్రదర్స్ ఏ దేశంలో సాంప్రదాయ జానపద కథలను రైతుల నుంచి సేకరించారు?
   1) ఫ్రాన్స్ 2) రష్యా 3) జర్మనీ 4) ఇంగ్లండ్

5. కింది వాటిని పరిగణించండి.
   ఎ) థామస్ వుడ్ అనే యార్క్‌షైర్ మెకానిక్ కొవ్వొత్తులు లేని కారణంగా అద్దెకు తీసుకున్న వార్తాపత్రికను సాయంత్ర వేళల్లో ఫైర్ లైట్లలో చదివేవారు.
   బి) 20వ శతాబ్ద రష్యన్ విప్లవ రచయిత మాగ్జిమ్ గోర్కి 'మై చైల్డ్‌హుడ్, మై యూనివర్సిటీ'లో తను పడిన కష్టాల గురించి వివరించారు.
   1) ఎ సరైంది, బి సరికాదు
   2) ఎ సరికాదు, బి సరైంది
   3) ఎ, బి సరికావు 4) ఎ, బి సరైనవి

6. విద్యుత్తుతో పనిచేసే స్థూపాకార ప్రెస్‌ను తయారుచేసిన వ్యక్తి, దేశం వరుసగా గుర్తించండి.



   1) గుటెన్‌బర్గ్ - జర్మనీ
   2) ఎం.రిచర్డ్ హు - న్యూయార్క్
   3) మెర్సియర్ - ఫ్రాన్స్ 4) కాంగ్ హు - చైనా

7. 'షిల్లింగ్ సిరీస్' అని పిలిచే ప్రసిద్ధ రచనలను ఎప్పుడు, ఏ దేశంలో ప్రచురించారు?
   1) 1920 - అమెరికా 2) 1920 - చైనా
   3) 1920 - ఇంగ్లండ్ 4) 1920 - ఫ్రాన్స్

8. "ఈ నగరంలో ప్రింటింగ్ ప్రెస్ లేకపోవడం వ్యాపారంలో చాలా ఇబ్బందిగా ఉంది. ప్రావీణ్యం ఉన్నవారు ఎవరైనా వస్తే వారికి ప్రోత్సాహం ఇస్తాను." అని ఎవరు, ఎప్పుడు, ఎక్కడ అన్నారు?
   1) విలియం బెంటిక్ - 1768 - కోల్‌కతా
   2) విలియం బోల్ట్స్ - 1768 - కోల్‌కతా
   3) విలియం జోన్స్ - 1786 - బొంబాయి
   4) విలియం బోల్ట్స్ - 1786 - కోల్‌కతా


9. కింది వాటిలో రాజా రామ్మోహన్ రాయ్ గ్రంథాలు, పత్రికలు గుర్తించండి.
   ఎ) సంవాద కౌముది బి) సమాచార చంద్రిక
   సి) జామ్-ఇ-జహన్ డి) షంసుల్-అక్బర్
   1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, సి, డి 4) ఎ, డి

10. బొంబాయి సమాచార్ అనే పత్రిక ఒక..
   1) మరాఠా వార్తాపత్రిక 2) గుజరాత్ వార్తాపత్రిక
   3) మల్యాణి వార్తాపత్రిక 4) హిందీ వార్తాపత్రిక

11. 'దేవబంద్ మత పాఠశాల' ఏ మతం వారి కోసం, ఎప్పుడు స్థాపించారు?
   1) హిందువులు - 1867 2) ముస్లిం - 1867
   3) జైనులు - 1787 4) పర్షియన్లు - 1876

12. కింది వాటిని పరిగణించండి.
   ఎ) ఉలేమా-ఇస్లాం, షరియా న్యాయశాస్త్ర పండితులు.
   బి) ఫత్వా-ఇస్లామిక్ న్యాయం గురించి ఇచ్చే న్యాయ ప్రకటన.
   సి) ముఫ్తి-ఇస్లాం న్యాయ అధికారి
   1) ఎ, బి సరైనవి; సి సరికాదు.
   2) ఎ, సి సరైనవి; బి సరికాదు.
   3) ఎ, బి, సి సరైనవి. 4) ఎ, బి, సి సరికావు.

13. 16వ శతాబ్దంనాటి గ్రంథమైన 'తులసీదాస్ రామచరిత మానస్' ఎప్పుడు, ఎక్కడ నుంచి ముద్రితమైవెలువడింది?




   1) 1860, కోల్‌కతా
   2) 1810, బొంబాయి
   3) 1810, కోల్‌కతా
   4) 1860, బొంబాయి

14. కింది వాటిలో మత గ్రంథాలను ప్రాంతీయ భాషల్లో ప్రచురించిన ప్రెస్‌లు?
   1) లఖ్‌నవూ - నావల్ కిషోర్ ప్రెస్, ఆంధ్రా - శ్రీ వేంకటేశ్వర ప్రెస్
   2) బొంబాయి - నావల్ కిషోర్ ప్రెస్, పుణె - శ్రీ వేంకటేశ్వర ప్రెస్
   3) లఖ్‌నవూ - నావల్ కిషోర్ ప్రెస్, బొంబాయి - శ్రీ వేంకటేశ్వర ప్రెస్
   4) దిల్లీ - నావల్ కిషోర్ ప్రెస్, కోల్‌కతా - శ్రీ వేంకటేశ్వర ప్రెస్

15. 'మరాఠా భాషలో వార్తాపత్రికలను ప్రచురించాలి' అని అనుకున్నది ఎవరు?
   1) జ్యోతిరావు పులె - పుణె
   2) కృష్ణాజీ త్రయంబక్ - బొంబాయి
   3) కృష్ణాజీ - త్రయంబక్ - పుణె
   4) ఎం.జి.రనడే - పుణె

16. యువరాణి మదాలసను రాజా రితుధ్వజ్ రాక్షసుల చెర నుంచి విడిపించడాన్ని చిత్రించింది ఎవరు?



   1) రవివర్మ 2) నందకుమార్
   3) విశ్వనాథ్‌వర్మ 4) కీర్తివర్మ

17. 'నవల' అనే సాహితీ రూపం ఏ ఖండంలో అభివృద్ధి చెందింది?
   1) ఆఫ్రికా 2) చైనా 3) ఐరోపా 4) అమెరికా

18. తూర్పు బెంగాల్‌కు చెందిన ఏ మహిళ రహస్యంగా విద్యాభ్యాసం చేసింది?
   1) రమాబాయి సరస్వతి 2) రాస్ సుందరి దేవి
   3) తారాబాయి షిండే 4) ముంతాజ్ అలీ

19. కింది వాటిని పరిగణించండి.
   ఎ) హిందువులు - బాలికలు విద్యావంతులైతే వితంతువులు అవుతారు.
   బి) ముస్లింలు - ఉర్దూశృంగార సాహిత్యం చదివితే మహిళలు పతితులు అవుతారు.
   1) ఎ, బి సరైనవి. 2) ఎ, బి సరికావు.
   3) ఎ సరైంది, బి సరికాదు.
   4) ఎ సరికాదు బి సరైంది.

20. 'అమరజీవి' అనే పేరుతో మొదటగా స్వీయ చరిత్రను రాసింది?
   1) రాస్ సుందరి దేవి 2) కాదంబరి గంగూలీ
   3) సావిత్రిబాయి పులె 4) రమాబాయి సరస్వతి

జనరల్ స్టడీస్ - హిస్టరీ

21. 1860లో కొందరు బెంగాలీ స్త్రీల అనుభవాలను తెలుపుతూ రచనలు చేసినదెవరు?
   1) రాస్ సుందరి దేవి 2) కైలాష్ బాషిని దేవి
   3) కాదంబరి గంగూలీ
   4) బేగం రోఖియా సఖావత్

22. 1860ల నుంచి మహారాష్ట్రలో అగ్రవర్ణ మహిళలు, వితంతువుల గురించి రచనలు చేసింది?
   1) తారాబాయి షిండే
   2) పండిత రమాబాయి సరస్వతి
   3) సావిత్రిబాయి పులె 4) 1, 2

23. "వాక్ స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం, సమావేశమయ్యే స్వేచ్ఛ... అనే ఈ మూడు శక్తిమంతమైన సాధనాలు అణచివేయడానికి భారత ప్రభుత్వం ప్రయత్నిస్తుంది." అని ఎప్పుడు, ఎవరు అన్నారు?
   1) 1922 - గాంధీజీ
   2) 1922 - బాలగంగాధర్ తిలక్
   3) 1928 - భగత్ సింగ్
   4) 1928 - చంద్రశేఖర్ ఆజాద్

24. మతం పేరుతో స్త్రీలకు విద్యను నిరాకరించినందుకు పురుషులను తీవ్రంగా ఖండించింది ఎవరు?
   1) తారాబాయి షిండే 2) బేగం రోఖియా సఖావత్
   3) కాదంబరి 4) సావిత్రిబాయి పులె


25. కింది వాటిని పరిగణించండి.
   ఎ) రామ్ చడ్డా - స్త్రీ ధర్మ విచార్‌లో విధేయులైన భార్యలు ఎలా ఉండాలో బోధించారు.
   బి) ఖాల్సా ట్రాక్ట్స్ సొసైటీ - విధేయత ఉన్న స్త్రీ లక్షణాలను సంవాద రూపంలో వివరించింది.
   1) ఎ, బి సరైనవి. 2) ఎ, బి సరికావు.
   3) ఎ సరైంది, బి సరికాదు.
   4) ఎ సరికాదు, బి సరైంది.

26. బట్టాలా అనే ప్రదేశమంతా ప్రాచుర్యం పొందిన పుస్తకాల ముద్రణ జరిగేది. ఇది ఎక్కడ ఉంది?



   1) మహారాష్ట్రలోని సెంట్రల్ బొంబాయి
   2) తమిళనాడులోని సెంట్రల్ చెన్నై
   3) కర్ణాటకలోని సెంట్రల్ బెంగళూరు
   4) బెంగాల్‌లోని సెంట్రల్ కోల్‌కతా

27. బుఢీ అయిర్ సాధు (అమ్మమ్మ కథలు), ఓ మోర్ అపునర్ దేశ్ (ఓ నా ప్రియమైన భూమి) అనే అస్సామీ రచనలు చేసింది?



   1) లక్ష్మీనాథ్ సింగ్
   2) లక్ష్మీనాథ్ బెజ్ బరూహ్
   3) రామ్‌నాథ్ సింగ్
   4) రామ్‌నాథ్ బెజ్ బరూహ్

28. గులాంగిరి అనే నవలను రచించింది?
   1) జ్యోతిబా పులె 2) రామస్వామి నాయకర్
   3) డా.బి.ఆర్.అంబేడ్కర్ 4) అరిగె రామస్వామి

29. కింది వాటిలో సరైంది గుర్తించండి?
   ఎ) 1938లో కాశీ బాబా అనే కాన్పుర్ మిల్లు కార్మికుడు 'ఛోటే ఔర్ బడే కా సవాల్' పుస్తకం రాశాడు.
   బి) కాన్పుర్‌లోని మరో మిల్లు కార్మికుడు 'సుదర్శన చక్ర' పేరుతో కవితలను ఒక చోటకు చేర్చి 'సచ్చీ కవితాయే' అనే సంకలనం ప్రచురించాడు.
   సి) బొంబాయి కార్మికులను ఆదర్శంగా తీసుకుని బెంగళూరు కాటన్ మిల్లు కార్మికులు లైబ్రరీలను ఏర్పాటు చేశారు.
   1) ఎ, బి, సి 2) ఎ 3) బి, సి 4) బి


30. ఇంగ్లిష్, ప్రాంతీయ భాషా పత్రికలు అత్యవసర పిటీషన్‌లను ఎప్పుడు దాఖలు చేశాయి? ఆ సమయంలో ఉన్న గవర్నర్ జనరల్?
   1) 1935 - మెకాలే 2) 1835 - విలియం బెంటింక్
   3) 1835 - మెకాలే
   4) 1833 - విలియం బెంటింక్

31. వెర్నాక్యులర్ ప్రెస్ చట్టాన్ని ఎప్పుడు, ఏ దేశ తరహాలో భారతదేశంలో ఆమోదించారు?
   1) 1878 - ఐరిష్ 2) 1878 - ఇంగ్లండ్
   3) 1787 - ఐరిష్ 4) 1788 - ఇంగ్లండ్

32. పంజాబ్‌లోని విప్లవకారులను దేశాంతరవాసం ఎప్పుడు పంపారు?
   1) 1905 2) 1906 3) 1907 4) 1908

33. బ్రిటిష్ పరిపాలనా కాలంలో ప్రభుత్వ ఆదేశాలకు కట్టుబడి ఉండాల్సి వస్తుందని భయపడి ప్రభుత్వ రాయితీని నిరాకరించిన పత్రిక?
   1) ది హిందూ 2) ది బెంగాల్ గెజిట్
   3) ది ఫ్రెండ్ ఆఫ్ ఇండియా 4) పైవన్నీ

34. 1942, ఆగస్టు క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో బ్రిటిష్ ప్రభుత్వం అణచివేసిన పత్రికల సంఖ్య?
   1) 18 2) 22
   3) 78 4) 90



రచయిత: గద్దె నరసింహారావు

సమాధానాలు

1-4; 2-1; 3-2; 4-3; 5-4; 6-2; 7-3; 8-2; 9-3; 10-2; 11-2; 12-3; 13-3; 14-3; 15-3; 16-1; 17-3; 18-2; 19-1; 20-1; 21-2; 22-4; 23-1; 24-2; 25-1; 26-4; 27-2; 28-1; 29-1; 30-2; 31-1; 32-2; 33-3; 34-4.

ఘనం


సూచన (ప్ర. 1 – 5): కింది దత్తాంశాన్ని ఆధారంగా చేసుకుని, ఇచ్చిన ప్రశ్నలకు సమాధానం గుర్తించండి.

ఒక ఘనం ఎదురెదురు తలాలకు ఎరుపు, నీలం, నలుపు రంగులు వేశారు. ఆ ఘనాన్ని 216 సమాన ఘనాలుగా విభజించారు. ఒక్కొక్క చిన్న ఘనం భుజం పొడవు 1 సెం.మీ.

1. ఒకవైపు ఎరుపు, నలుపు రంగులు మాత్రమే వేసినవి ఎన్ని?

1) 16 2) 12 3) 28 4) 24

సాధన:



పటంలో చుక్కలతో చూపిన ఘనాలు పై తలంలో 8, కింది తలంలో 8. మొత్తంగా 16. కేవలం ఒకవైపు ఎరుపు, నలుపు రంగులను కలిగి ఉంటాయి.

సమాధానం: 1

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
రీజనింగ్

2. ఒకే ఒక తలం రంగు వేసి, అది కూడా ఎరుపు రంగు అయ్యే ఘనాలు ఎన్ని?

1) 81 2) 36 3) 84 4) 32

సాధన: $n^3 = 216 \Rightarrow n = 6$

పెద్ద ఘనం భుజం పొడవు = 6 సెం.మీ.

ఒకే ఒక తలం కేవలం ఎరుపు ఉన్న ఘనాల సంఖ్య

$= 2(\text{భుజం} - 2)^2$

$= 2(6 - 2)^2 = 2(4)^2 = 2 \times 16 = 32$

సమాధానం: 4

3. ఎలాంటి రంగు వేయని ఘనాల సంఖ్య ఎంత?

1) 64 2) 48 3) 72 4) 81

సాధన: ఎలాంటి రంగు వేయని ఘనాల సంఖ్య $= (\text{భుజం} - 2)^3$

$= (6 - 2)^3 = 4^3 = 64$

సమాధానం: 1

4. ఒక తలం మాత్రమే రంగు వేసిన ఘనాల సంఖ్య ఎంత?

1) 96 2) 88 3) 144 4) 102

సాధన: ఒక్క తలం మాత్రమే పెయింట్ వేసిన ఘనాల సంఖ్య

$= 6(\text{భుజం} - 2)^2 \Rightarrow 6(6 - 2)^2$

$= 6 \times 4^2 = 6 \times 16 = 96$

సమాధానం: 1

5. రెండు తలాలకు మాత్రమే రంగు వేసిన ఘనాల సంఖ్య?

1) 16 2) 24 3) 36 4) 48

సాధన: రెండు తలాలు మాత్రమే రంగు వేసిన ఘనాల సంఖ్య

$= 12(\text{భుజం} - 2) \Rightarrow 12(6 - 2)$

$= 12 \times 4 = 48$

సమాధానం: 4

6. 16 సెం.మీ. పొడవైన భుజం ఉన్న ఒక ఘనాన్ని 2 సెం.మీ. భుజం ఉన్న చిన్న ఘనాలుగా విభజించారు. అయితే కేవలం ఒక ముఖానికి మాత్రమే రంగు వేసి ఉన్న చిన్న ఘనాల సంఖ్య?

1) 64 2) 125 3) 216 4) 100


సాధన: $n = \dfrac{\text{పెద్ద ఘనం భుజం పొడవు}}{\text{చిన్న ఘనం భుజం పొడవు}} = \dfrac{16}{2} = 8$

ఒక ముఖానికి మాత్రమే రంగు వేసి ఉన్న చిన్న ఘనాల సంఖ్య

$= (n - 2)^2 \times 6$

$= (8 - 2)^2 \times 6 = 6^2 \times 6 = 36 \times 6 = 216$

సమాధానం: 3



పోటీపరీక్షల్లో రీజనింగ్ విభాగంలో ఘనం అనే టాపిక్ ముఖ్యమైంది. ఘనం అంటే ఒక త్రిమితీయ వస్తువు. ఇందులో పొడవు, వెడల్పు, ఎత్తులు సమానంగా ఉంటాయి. దీనిలో అన్ని ముఖాలు సమాన పరిమాణంలో చతురస్రాకారంలో ఉంటాయి. సాధారణంగా ఘనాన్ని చూస్తే మూడు ముఖాలు కనిపిస్తాయి. వాస్తవానికి దీనిలో మొత్తంగా ఆరు ముఖాలు ఉంటాయి. అలాగే 8 శీర్షాలు, 12 అంచులు ఉంటాయి. వాటిని సరిగ్గా అంచనా వేయగలిగితే సమస్యలకు జవాబు కనుక్కోవడం తేలికవుతుంది.


ఆరు ముఖాలు.. ఎనిమిది శీర్షాలు..
సమపరిమాణ చతురస్రాకారాలు!

సూచన (ప్ర. 7 – 10): ఒక ఘనానికి 4 వైపులు పక్కపక్కన నీలిరంగు, మిగతా రెండు ఎదురు ముఖాలకు ఆకుపచ్చ రంగు వేశారు. ఆ ఘనాన్ని నాలుగు సమానమైన కొలతలతో నిలువుగా పైనుంచి కిందికి, రెండు సమానమైన కొలతలతో అడ్డంగా పక్కలకు కత్తిరించారు. చిత్రాన్ని అధ్యయనం చేసి కింది ప్రశ్నలకు జవాబు గుర్తించండి.

7. ఏ వైపూ రంగు వేయని ఘనాల సంఖ్య?

1) 3 2) 2 3) 1 4) 4

సాధన:



కింది భాగంలో రంగు వేయలేదు | పైన, కింది భాగంలో రంగు వేయలేదు | పైన రంగు లేదు. కింద ఆకుపచ్చ రంగు ఉంది

ఇచ్చిన సమాచారం ప్రకారం ఘనాన్ని మొత్తం 3 సమాన భాగాలుగా కత్తిరించవచ్చు. అవి పైభాగం, మధ్య భాగం, కింది భాగాలుగా ఏర్పడతాయి. అయితే మధ్య భాగంలోని ఘనానికి చెందిన మధ్య ఘనానికి మాత్రమే రంగు ఉండదు.

సమాధానం: 3

8. కేవలం ఒకవైపు ఆకుపచ్చ రంగు వేసిన ఘనాల సంఖ్య?

1) 4 2) 3 3) 2 4) 6

సాధన: పటంలో పైభాగం, కింది భాగాలలోని ఘనానికి మాత్రమే ఆకుపచ్చ రంగు వేసి ఉంది. అంటే కేవలం ఒకవైపు ఆకుపచ్చ రంగు వేసిన ఘనాల సంఖ్య = 2.

సమాధానం: 3

9. దత్తాంశం ప్రకారం ఏర్పడే మొత్తం ఘనాల సంఖ్య?

1) 32 2) 27 3) 48 4) 14

సాధన: మూడు భాగాల నుంచి ఏర్పడే మొత్తం ఘనాల సంఖ్య 27

సమాధానం: 2

10. కేవలం ఒకవైపు మాత్రమే నీలిరంగు కలిగిఉన్న ఘనాల సంఖ్య?

1) 8 2) 4 3) 6 4) 12


సాధన: దత్తాంశం, పటాల ఆధారంగా కేవలం ఒకవైపు మాత్రమే నీలిరంగు కలిగి ఉన్న ఘనాల సంఖ్య 4

సమాధానం: 2

11. ఒక సమఘనం అన్నివైపులా పసుపు రంగు వేశారు. ఆ సమఘనాన్ని సమాన ఘనపరిమాణం ఉన్న 27 చిన్న సమ ఘనాలుగా కత్తిరిస్తే ఒకవైపు మాత్రమే పసుపు రంగు కలిగిన ఘనాల సంఖ్య?

1) 12 2) 8 3) 6 4) 16

సాధన:




పైన చూపిన పటంలో ● గుర్తు కలిగిన ఘనాలకు మాత్రమే ఒకవైపు పసుపురంగు ఉంటుంది. అలాంటివి ఒక్కొక్క ముఖానికి ఒక్కటి మాత్రమే ఉంటుంది. అలా మొత్తం 6 ఘనాలు ఉంటాయి.

సమాధానం: 3

12. ఒక ఘనం అన్నివైపులా ఒకే రకమైన రంగు వేశారు. ఆ ఘనాన్ని 1/4 వ వంతు భుజం పొడవు కలిగి ఉండేలా సమఘనాలుగా కత్తిరించారు. అప్పుడు ఏర్పడే చిన్న ఘనాల్లో ఒకవైపు మాత్రమే రంగు కలిగి ఉండే ఘనాల సంఖ్య?

1) 12 2) 48 3) 6 4) 24

సాధన:



ఘనం భుజం పొడవు 1 యూనిట్ అనుకుంటే చిన్న ఘనం భుజం పొడవు $\frac{1}{4}$ యూనిట్ అవుతుంది.

ఏర్పడే ఘనాల సంఖ్య $= 4 \times 16 = 64$.

ఒక ముఖం వైపు మధ్యలో ఉన్న 4 ఘనాలు మాత్రమే రంగు కలిగి ఉంటాయి.

✦ ఘనంలో ఉండే 6 ముఖాల పరంగా చూస్తే ఒకవైపు మాత్రమే రంగు వేసిన చిన్న ఘనాల సంఖ్య $= 6 \times 4 = 24$

సమాధానం: 4



రచయిత
బూసర గణేష్,
విషయ నిపుణులు

Word of the Day 835

Magnate

Telugu meaning: అతిసంపన్నుడైన, ధనికుడైన

English meaning: The word magnate (మ్యాగ్నేట్) refers to a wealthy, powerful, and influential person, especially in business or industry.

Synonyms: Tycoon, Mogul; ***Antonyms:*** Beginner, Novice

Usage: **1.** The tech magnate invested billions in renewable energy to expand his global influence.

2. As a media magnate, she controlled several major news networks across the world.

కరెంట్ అఫైర్స్



అరవింద్ పనగరియా నేతృత్వంలోని 16వ ఆర్థిక సంఘం 2026-31 మధ్య కాలానికి రాష్ట్రాలకు పంపిణీ చేసే ఆర్థిక వనరులకు సంబంధించిన నివేదికను 2025, నవంబరు 17న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు అందజేసింది. వచ్చే బడ్జెట్ సమావేశాల్లోగా దీన్ని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది.

✦ కొత్త సిఫార్సులు 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయి. 2023 డిసెంబరు 31న 16వ ఆర్థిక సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది.



ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జూనియర్ వెటర్నరీ అధికారిణి అనురాధకు జాతీయ స్థాయిలో అత్యున్నత పురస్కారమైన 'జాతీయ గోపాలరత్న అవార్డు' వరించింది. ఆమె నంద్యాల జిల్లా గోస్పాడు మండలం చింతకుంట గ్రామీణ పశువైద్య కేంద్రంలో పనిచేస్తున్నారు.



✦ తెలంగాణ నుంచి కంకణాల కృష్ణారెడ్డి (73 ఏళ్లు) కేంద్ర ప్రభుత్వ జాతీయ గోపాల్‌రత్న పురస్కారానికి ఎంపికయ్యారు. స్వదేశీ పశువులు, గేదెల పోషణ విభాగంలో ఉత్తమ పాడి రైతుగా ద్వితీయ బహుమతికి ఎంపిక చేసినట్లు కేంద్ర పశుసంవర్ధకశాఖ 2025, నవంబరు 17న వెల్లడించింది.



ప్రముఖ బౌద్ధ ఆధ్యాత్మిక గురువు 14వ దలైలామా జీవితంపై హైదరాబాద్‌కు చెందిన పాత్రికేయుడు అరవింద్‌యాదవ్ హిందీలో 'అనశ్వర్' పేరుతో పుస్తకం రచించారు. దీన్ని కేంద్ర మాజీమంత్రి కరణ్ సింగ్ 2025, నవంబరు 16న ఆవిష్కరించారు.

వచ్చే ఏడాదిలో (2026) అమెరికా నుంచి 2.2 మిలియన్ టన్నుల వంట గ్యాస్ దిగుమతి కోసం భారత ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. దేశీయ వార్షిక ఎల్‌పీజీ దిగుమతుల పరిమాణంలో ఇది 10 శాతానికి సమానం. పరిమాణం, కాలపరిమితి, ధరలపై అంగీకార షరతులతో భారత్ - అమెరికా మధ్య కుదిరిన మొదటి అధికారిక, వాణిజ్య ఒప్పందం ఇదే.

ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో గుర్‌ప్రీత్ సింగ్ రజతం సొంతం చేసుకున్నాడు. 2025 నవంబరు 17న కైరోలో జరిగిన 25 మీటర్ల ఫైర్ పిస్టల్‌లో 584 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. కొరో త్సెలోవ్ (ఉక్రెయిన్) 594 పాయింట్లతో స్వర్ణం నెగ్గాడు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జాతీయ సమైక్యతా దినోత్సవం



భారతదేశం విభిన్న మతాలు, జాతులు, భాషలు, సంస్కృతి - సంప్రదాయాలకు నిలయం. ప్రజల మధ్య ఎన్ని బేదాలు ఉన్నప్పటికీ అందరం ఒకటే అనే భావనను పెంపొందించడమే జాతీయ సమైక్యత. దేశ పౌరులు తామంతా భారతీయులం, మాది భారత జాతి అని మానసికంగా అనుకున్నప్పుడే ఇది సాధ్యపడుతుంది. తద్వారా దేశం సుస్థిరంగా, పటిష్ఠంగా ఉంటుంది. భారతదేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మన దేశంలో ఏటా నవంబరు 19న 'జాతీయ సమైక్యతా దినోత్సవం'గా (National Integration Day) నిర్వహిస్తారు. దేశ ప్రజల్లో ఐక్యత, శాంతి, ప్రేమ, సోదరభావాన్ని పెంపొందించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

జాతీయ సమైక్యత అంటే?

విభిన్న సమాజాలు, వ్యక్తులను ఏకతాటిపైకి తెచ్చి ఐక్యతను పెంపొందించడమే జాతీయ సమైక్యత. ఇది వివిధ ప్రాంతాలు, భాషలు, మతాలు, సంస్కృతుల ప్రజల మధ్య సామరస్యం, అవగాహన, సహకారాన్ని ప్రోత్సహిస్తుంది.

✦ పౌరులందరికీ సమాన హక్కులు, అవకాశాలు కల్పించే బలమైన, సంఘటితంతో కూడిన దేశాన్ని నిర్మించడం జాతీయ సమైక్యత లక్ష్యం.

✦ దీన్ని సాధించాలంటే.. ప్రతి ఒక్కరూ ఇతర మతాలు, సంప్రదాయాలు, ఆచారాలు, అభిప్రాయాలను గౌరవించాలి. సామరస్యాన్ని అలవరచుకోవాలి. ఇతరుల పట్ల వివక్షను, దురభిప్రాయాలను అంతం చేయాలి.

✦ సమైక్యంగా దేశాభివృద్ధికి పాటుపడటం కూడా జాతీయ సమైక్యతలో భాగమే. ఇది మొత్తం జనాభాకు సామాజిక స్థిరత్వం, శాంతి, సమగ్ర వృద్ధికి దోహదం చేస్తుంది.

నవంబరు 19
చరిత్రలో ఈనాడు


చారిత్రక నేపథ్యం

ఇందిరా గాంధీ 1917, నవంబరు 19న ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రయాగరాజ్ (ప్రస్తుత అలహాబాద్)లో జన్మించారు. ఆమె ప్రధానిగా ఉన్న సమయంలో దేశ ఐక్యత, సమగ్రత కోసం పాటుపడ్డారు. భారత సమాఖ్య నిర్మాణాన్ని బలోపేతం చేసే దిశగా ఆమె ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. ఇందిరా గాంధీ హయాంలో చేపట్టిన గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన, అందరికీ విద్య - ఆరోగ్యం లాంటి కార్యక్రమాలు ఎంతగానో ప్రసిద్ధి చెందాయి. దేశాభివృద్ధితోపాటు జాతీయ సమగ్రతలకు ఆమె చేసిన కృషికి గుర్తింపుగా ఏటా ఆమె జయంతిని 'జాతీయ సమైక్యతా దినోత్సవం'గా జరపాలని ప్రభుత్వం తీర్మానించింది.

'జాతీయ సమైక్యతా దినోత్సవం' ఎప్పటి నుంచి నిర్వహిస్తున్నారు? జాతీయ సమైక్యత మండలి ఏర్పాటు, లక్ష్యం తదితర పూర్తి సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - సైన్స్ అండ్ టెక్నాలజీ

ఘన వ్యర్థాల నిర్వహణ



ఘన వ్యర్థాలను సేకరించి, శుద్ధి చేసి, నాశనం (Disposal) చేయడాన్ని ఘన వ్యర్థాల నిర్వహణ అంటారు. వీటి నిర్వహణలో లోపం జరిగితే అపరిశుభ్ర పరిస్థితులు తలెత్తి, పర్యావరణం కలుషితమవుతుంది. ఘన వ్యర్థాలను పలు రకాలుగా వర్గీకరించారు. మన దేశంలో పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, మారుతున్న సామాజిక పరిస్థితుల కారణంగా ఘన వ్యర్థాలు అధికంగా ఉత్పన్నమవుతున్నాయి. వీటిని నిర్వహించడం కూడా పెద్ద సవాలుగా మారింది.

ఘన/పాక్షిక వ్యర్థాలు

సహజ పద్ధతుల వల్ల లేదా విపత్తుల కారణంగా లేదా మానవుడి ప్రమేయంతో పర్యావరణంలోకి విడుదలయ్యే వ్యర్థాలను ఘన లేదా పాక్షిక వ్యర్థాలు అంటారు.

ఘన వ్యర్థాల నిర్వహణ తీర్మానం, వర్గీకరణ - అంశాలు, వివిధ సంస్థలు, పర్యావరణవేత్తల అంచనాలు, ఘన వ్యర్థాల ప్రభావం, ఈ వ్యర్థాల్లో మనదేశ వాటా, రోజులో తలసరి వ్యర్థ ఉత్పత్తి, మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Faculty, Non-Faculty Jobs

Employees' State Insurance Corporation (ESIC), Alwar is conducting interviews for the recruitment of teaching and non-teaching posts in various departments on a contractual basis. The total no.of posts is 252. Eligible candidates can appear for the interview on 2025 November 24, 25.

Jobs In Cochin Shipyard Limited

Cochin Shipyard Limited, Kolkata is inviting applications for the recruitment of Operator posts on a contract basis. The total no.of posts is 27. The application fee is Rs.200. The last date for online applications is 21 November 2025.

Lecturer Posts

National Institute for the Empowerment of Persons with Visual Disabilities (Divyangjan) invites applications for the Lecturer posts on a contractual basis. The total no. of posts is 14. The application fee is Rs.500. Eligible candidates can apply online before 28 November 2025.

Did You Apply..?

Today (November 19) is the last date for the following Jobs

☛ Probationary Officer posts in South India Bank.
Qualification: CMA/ICWA.

☛ Junior Research Fellow posts in the University of Allahabad.
Eligibility: M.Sc. (Zoology/Agricultural Entomology).

☛ Research Officer posts at PGIMER.
Eligibility: MBBS, BDS, BAMS, PhD.

For more information and other notifications - scan QR code

Bank Exams
English

Error Detection

Directions (Qs. 1 - 30): *In the following question, a sentence is divided into four parts and one of those fragments may have errors. Find out which part of the sentence has an error and select the appropriate option. If a sentence is free from error, select 'No Error' as your answer.*

1. Each of the employees (A)/ have been given a chance (B)/ to present their ideas (C)/ in the monthly review meeting. (D)/ No error. (E)

2. Neither my parents (A)/ nor my brother (B)/ are willing to take (C)/ responsibility for the mistake. (D)/ No error. (E)

3. The data collected during the survey (A)/ shows that most of the customer (B)/ prefer online services (C)/ to visiting branches in person. (D)/ No error. (E)

4. The committee (A)/ have decided that it will (B)/ conduct their meetings (C)/ online from next month. (D)/ No error. (E)

5. Each of the questions in the test (A)/ were carefully designed (B)/ to assess the candidate's (C)/ analytical ability. (D)/ No error. (E)

6. Neither of the solutions (A)/ seem effective (B)/ for the problem (C)/ we are facing now. (D)/ No error. (E)

7. One of my friends (A)/ have applied (B)/ for the internal promotion (C)/ in our department. (D)/ No error. (E)

8. The teacher along with the students (A)/ were preparing (B)/ the auditorium for (C)/ the annual function. (D)/ No error. (E)

9. Each of the candidates (A)/ were asked to introduce themselves (B)/ before the interview panel (C)/ and answer basic questions. (D)/ No error. (E)

10. Everybody (A)/ must submit their feedback form (B)/ before they leave (C)/ the training hall. (D)/ No error. (E)

11. The jury (A)/ were divided among themselves (B)/ on the final decision (C)/ regarding the case. (D)/ No error. (E)

12. The luggage kept in the storeroom (A)/ were moved (B)/ to the new building (C)/ yesterday evening. (D)/ No error. (E)

13. Anybody who wants (A)/ to join the club (B)/ must submit their application (C)/ before Monday. (D)/ No error. (E)

14. The family (A)/ have decided to move (B)/ to a new house (C)/ next summer. (D)/ No error. (E)

15. Many news from the company (A)/ were disappointing (B)/ for the investors (C)/ this quarter. (D)/ No error. (E)

16. One of the issues (A)/ that needs attention (B)/ are the declining (C)/ productivity levels. (D)/ No error. (E)

17. The staff (A)/ were arguing (B)/ among themselves (C)/ about the new rules. (D)/ No error. (E)

18. Not only the students (A)/ but also their teacher (B)/ were happy with (C)/ the exam results. (D)/ No error. (E)

19. The pair of shoes (A)/ kept near the cupboard (B)/ were bought (C)/ last month. (D)/ No error. (E)

20. These kind of mistakes (A)/ reduce the chances (B)/ of scoring well (C)/ in competitive exams000. (D)/ No error. (E)

21. Neither of the boys (A)/ have submitted (B)/ his assignment (C)/ for today's class. (D)/ No error. (E)

22. The scissors (A)/ is lying (B)/ on the table (C)/ near the window. (D)/ No error. (E) Answer: (B); "are lying" should replace "is lying."

23. Everybody in the team (A)/ expressed their willingness (B)/ to participate in (C)/ the upcoming sports event. (D)/ No error. (E)

24. The majority of students (A)/ prefers online classes (B)/ because it saves (C)/ travel time. (D)/ No error. (E)

25. The behaviour of the children (A)/ were observed (B)/ closely by the teacher (C)/ during outdoor activities. (D)/ No error. (E)

26. Each one of them (A)/ were given a booklet (B)/ before entering (C)/ the seminar hall. (D)/ No error. (E)

27. The staff (A)/ has submitted (B)/ their suggestions (C)/ for the annual report. (D)/ No error. (E)

28. The police (A)/ is investigating (B)/ the matter and will soon (C)/ submit its report. (D)/ No error. (E)

29. The books on the top shelf (A)/ is covered (B)/ with dust because (C)/ nobody has used them recently. (D)/ No error. (E)

30. Neither of the two options (A)/ seems practical (B)/ for those who (C)/ wants immediate results. (D)/ No error. (E)

Scan the QR code for Key

Writer: *P. Manoj Kumar, Subject Expert*

సెయిల్‌లో

మేనేజ్‌మెంట్ ట్రెయినీ అవుతారా?

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్).. 124 మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టులను ప్రకటించింది. బీఈ/ బీటెక్‌తో దరఖాస్తు చేసుకోవచ్చు. సీబీటీ, గ్రూప్ డిస్కషన్/ ఇంటర్వ్యూలతో నియామకాలుంటాయి.



మొత్తం ఉద్యోగాల్లో.. అన్‌రిజర్వ్‌డ్‌కు 35, ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు 31, ఈడబ్ల్యూఎస్‌కు 18, ఎస్సీకి 22, ఎస్టీకి 18 కేటాయించారు. కెమికల్, సివిల్, కంప్యూటర్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్, మెటలర్జీ విభాగాల్లో ఈ ఖాళీలు ఉన్నాయి.

ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ), గ్రూప్ డిస్కషన్/ ఇంటర్వ్యూలతో తీసుకుంటారు. సీబీటీని 200 మార్కులకు నిర్వహిస్తారు. పార్ట్-1లోని డొమైన్ నాలెడ్జ్ టెస్ట్‌కు 100 మార్కులు. వ్యవధి 40 నిమిషాలు. పార్ట్-2లో ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు 100 మార్కులు. ఇందులో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ సెక్షన్ల నుంచి ప్రశ్నలు వస్తాయి. సెక్షన్‌కు 25 మార్కులు. వ్యవధి 80 నిమిషాలు.

సీబీటీలో అన్‌రిజర్వ్‌డ్/ ఈడబ్ల్యూఎస్‌లు 50 శాతం, ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ-ఎన్‌సీఎల్, దివ్యాంగులు 40 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి. వీరిని 1:3 నిష్పత్తిలో గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలకు ఎంపిక చేస్తారు. సీబీటీ, జీడీ, ఇంటర్వ్యూలకు 75:10:15 నిష్పత్తిలో వెయిటేజీ ఉంటుంది. ఈ మూడింటి మార్కులతో కేటగిరీలవారీగా తుది నియామకం చేస్తారు. ఎంపికైనవారు సెయిల్‌కు దేశవ్యాప్తంగా ఉన్న ప్లాంట్లు/ యూనిట్లు/ గనుల్లో ఎక్కడైనా సేవలందించాలి.

ఇలా సిద్ధం కండి..

పార్ట్-1లో డొమైన నాలెడ్జ్ ప్రశ్నలకు 100 మార్కులున్నాయి. సబ్జెక్టుల్లోని ముఖ్యాంశాల అధ్యయనం, పునశ్చరణతో ఎక్కువ మార్కులు పొందవచ్చు. పార్ట్-2లోని క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్‌ల అవగాహనకు పోటీ పరీక్షల పాత ప్రశ్న పత్రాలను సాధన చేయాలి. దీంతోపాటుగా మాక్ టెస్టులనూ రాయడం వల్ల నిర్ణీత వ్యవధిలోగా సమాధానాలు గుర్తించడం అలవడుతుంది. అలాగే బలాలు, బలహీనతలపై స్పష్టత వస్తుంది. తక్కువ మార్కులు వచ్చిన అంశాలకు ఎక్కువ సమయాన్ని కేటాయించాలి. రాత పరీక్షను జనవరి/ఫిబ్రవరి 2026లో నిర్వహించే అవకాశం ఉంది. స్టడీ ప్లాన్ వేసుకుని, ఇప్పటి నుంచే సన్నద్ధతను కొనసాగించాలి.

ముఖ్యాంశాలు

అర్హతలు: కెమికల్/ ఎలక్ట్రో కెమికల్/ సివిల్/ కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ మెకానికల్/ మెకానికల్ అండ్ ఆటోమేషన్/ మెటలర్జికల్ బ్రాంచ్‌తో ఇంజినీరింగ్ డిగ్రీ 60 శాతంతో పూర్తిచేయాలి. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు 55 శాతం సరిపోతుంది.

వయసు: 28 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్/ ఓబీసీ-ఎన్‌సీఎల్, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.1,050. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు, డిపార్ట్‌మెంటల్ అభ్యర్థులకు రూ.300.

వేతన శ్రేణి: నెలకు రూ.50,000-1,60,000 ఉంటుంది. మేనేజ్‌మెంట్ ట్రెయినీ - టెక్నికల్ అభ్యర్థులకు ఏడాది శిక్షణ తర్వాత రూ.60,000-1,80,000 చెల్లిస్తారు. మూల వేతనానికి అదనంగా హెచ్ఆర్ఏ, టీఏ, డీఏ, వైద్య, పింఛను సదుపాయాలుంటాయి.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: విజయవాడ/ గుంటూరు, విశాఖపట్నం, హైదరాబాద్. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 05.12.2025

వెబ్‌సైట్: www.sailcareers.com

ఎయిమ్స్‌లో సేవలందిస్తారా..

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్).. గ్రూప్-బీ, సీ విభాగాల్లో 1383 పోస్టుల భర్తీకి ప్రకటన వెలువరించింది. పరీక్షతో నియామకాలుంటాయి. ఎంపికైనవారు దేశవ్యాప్తంగా ఉన్న 26 ఎయిమ్స్‌ల్లో ఎక్కడైనా సేవలందించాలి. వీరికి ఆకర్షణీయ వేతనాలు అందుతాయి.



అన్ని ఉద్యోగాలకూ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)లో ప్రతిభతో తీసుకుంటారు. స్టెనోగ్రాఫర్, ఎల్‌డీసీ లాంటి పోస్టులకు స్కిల్ టెస్ట్ అదనం. రాత పరీక్ష మార్కులతోనే తుది ఎంపిక చేస్తారు. పరీక్ష మల్టిపుల్ ఛాయిస్ విధానంలో 100 ప్రశ్నలతో 400 మార్కులకు ఉంటుంది. ప్రతి ప్రశ్నకూ నాలుగు మార్కులు. జనరల్ నాలెడ్జ్ అండ్ ఆప్టిట్యూడ్, కంప్యూటర్ నాలెడ్జ్‌కు చెందిన 20 ప్రశ్నలు ఇస్తారు. సబ్జెక్టు సంబంధిత ప్రశ్నలు 80 ఉంటాయి. వ్యవధి 90 నిమిషాలు.

▶ ప్రశ్నపత్రంలో ఐదు సెక్షన్లు, ప్రతి సెక్షన్‌లో 20 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి సెక్షన్‌ను 18 నిమిషాల వ్యవధిలో పూర్తిచేయాలి. ప్రశ్నపత్రం హిందీ, ఇంగ్లిషుల్లో ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికీ పావు మార్కు తగ్గిస్తారు. సీబీటీలో అన్‌రిజర్వ్‌డ్/ ఈడబ్ల్యూఎస్‌లు 40 శాతం, ఓబీసీలు 35 శాతం, ఎస్సీ/ ఎస్టీలు 30 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి.

ముఖ్య పోస్టులు: అర్హతలు

అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్–39: ఎంబీఏ/ పీజీ డిప్లొమా (మేనేజ్‌మెంట్), చట్ట పరిజ్ఞానం, కంప్యూటర్ నైపుణ్యం. వయసు 30 ఏళ్లు మించకూడదు.

ఫిజియోథెరపిస్ట్–46: ఫిజియోథెరపీ బ్యాచిలర్ డిగ్రీ, రెండేళ్ల అనుభవం. వయసు 30 ఏళ్లు మించకూడదు.

సీనియర్ నర్సింగ్ ఆఫీసర్–122: బీఎస్సీ నర్సింగ్, నర్సింగ్ కౌన్సిల్‌లో సభ్యత్వం, మూడేళ్ల అనుభవం. వయసు 30 ఏళ్లు మించకూడదు.

జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్/ ఎల్‌డీసీ–121: ఇంటర్మీడియట్, కంప్యూటర్ ప్రాథమిక పరిజ్ఞానం, టైపింగ్ నైపుణ్యం. వయసు 30 ఏళ్లు మించకూడదు.

ఫార్మసిస్ట్ (గ్రేడ్–2)–35: ఫార్మసీ డిప్లొమా. వయసు 27 ఏళ్లు మించకూడదు.

మెడికల్ సోషల్ వర్కర్–22: మెడికల్ సోషల్ వర్క్ స్పెషలైజేషన్‌తో ఎంఏ (సోషల్ వర్క్)/ఎంఎస్‌డబ్ల్యూ, ఐదేళ్ల అనుభవం. కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు. వయసు 35 ఏళ్లు మించకూడదు.

అసిస్టెంట్ స్టోర్స్ ఆఫీసర్/ స్టోర్ కీపర్–102: డిగ్రీ, మెటీరియల్ మేనేజ్‌మెంట్ పీజీ డిగ్రీ/ డిప్లొమా. లేదా మెటీరియల్ మేనేజ్‌మెంట్ డిగ్రీతో మూడేళ్ల అనుభవం. వయసు 35 ఏళ్లు మించకూడదు.

ల్యాబ్ అటెండెంట్/ టెక్నీషియన్ (ల్యాబొరేటరీ)–80: ఇంటర్మీడియట్, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ డిప్లొమా, రెండేళ్ల అనుభవం. వయసు 27 ఏళ్లు మించకూడదు.

హాస్పిటల్/ మార్చురీ అటెండెంట్–54: పదోతరగతి, సర్టిఫికెట్ ఇన్ హాస్పిటల్ సర్వీసెస్. వయసు 30 ఏళ్లు మించకూడదు.

గరిష్ఠ వయసులో ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీకి ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్/ ఓబీసీలకు రూ.3000. ఎస్సీ/ ఎస్టీ/ ఈడబ్ల్యూఎస్‌లకు రూ.2400. దివ్యాంగులకు ఫీజు లేదు.

వేతన శ్రేణి: జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, స్టాఫ్‌నర్స్, టెక్నీషియన్లకు నెలకు రూ.35,400 - 1,12,400. ఫార్మసిస్ట్, ఫిజియోథెరపిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్లకు రూ.29,200 - 92,300. ఎల్‌డీసీ, ల్యాబ్ అటెండెంట్లకు రూ.19,900 - 63,200. హాస్పిటల్ అటెండెంట్‌కు రూ.18,000 - 56,900. మూల వేతనానికి అదనంగా డీఏ, హెచ్ఆర్ఏ, ఇతర ప్రోత్సాహకాలు ఉంటాయి. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 02.12.2025

పరీక్షలు: డిసెంబరు 22 నుంచి 24 వరకు

వెబ్‌సైట్: http://www.aiimsexams.ac.in/

సన్నద్ధత

సబ్జెక్టులకు సంబంధించిన అంశాలకే ఎక్కువ మార్కులు కేటాయించారు. కాబట్టి పాఠ్యపుస్తకాల్లోని ముఖ్యాంశాలను అధ్యయనం చేసి పునశ్చరణ చేసుకోవాలి. ప్రతి సెక్షన్‌నూ నిర్ణీత వ్యవధిలో పూర్తిచేయాలి. వేగంగా సమాధానాలు రాయడాన్ని సాధన చేయాలి. మాక్ టెస్టులతో సమయ నిర్వహణ సాధ్యమవుతుంది. స్టడీ ప్లాన్ వేసుకుని కొంత సమయాన్ని చదవడానికి, మరికొంత సమయాన్ని మాక్ టెస్టులు రాయడానికి కేటాయించుకోవాలి. పరీక్షకు సుమారు నెల రోజులే ఉంది. కాబట్టి వెంటనే సన్నద్ధతను మొదలుపెట్టాలి.

ముందు చూపుతో.. కెరియర్ పసందు!

ఉద్యోగమే లక్ష్యంగా చదవాలనుకున్నప్పుడు.. కొలువుల కల్ప వృక్షాలుగా రూపుదిద్దుకుంటున్న రంగాలనే ఎంచుకోవాలి. అందరికీ తెలిసిన పరిశ్రమలో అవకాశాలు వెతుక్కోవడం కంటే.. అందుబాటులోకి రానున్న కొత్త మార్కెట్లను ముందుగా గుర్తించి, వాటిలోకి అడుగుపెట్టేందుకు దారులు చూసుకోవడం ఉత్తమం. దీంతో తక్కువ కాలంలోనే పసందైన కెరియర్ సొంతమవుతుంది.

ఈ కోణంలో ఆలోచించినప్పుడు కొలువుల కోటలా సాక్షాత్కరిస్తున్న డేటా సెంటర్లు.. తాజా గ్రాడ్యుయేట్ల నుంచి ఐటీలో మేటి ఉద్యోగాలు అన్వేషిస్తున్న యువ అభ్యర్థులకు మంచి గమ్యంగా నిలుస్తాయి. ప్రస్తుతం దేశంలో 1400 మెగావాట్ల సామర్థ్యం ఉన్న డేటా సెంటర్లు ఏర్పడ్డాయి. మరో రెండేళ్లకు అంటే 2027 నాటికి ఈ సామర్థ్యం రెట్టింపై 2800 మెగావాట్లకు చేరుతుంది ఆ తర్వాత మరో మూడేళ్లకు 2030 నాటికి ఐదు రెట్ల సామర్థ్యంతో డేటా సెంటర్లు ఏర్పడతాయని ఇండియా డేటా సెంటర్స్ పేరుతో మక్వేరి ఈక్విటీ రిసెర్చ్ నివేదిక వెల్లడించింది. ఇంత సామర్థ్యం ఉన్న డేటా సెంటర్లు నెలకొల్పాలంటే సంస్థలు రూ.నాలుగు లక్షల కోట్లు వెచ్చించాలి. ఇంతటి భారీ వ్యవస్థాపనకు మానవ వనరుల అవసరం ఎంత పెద్ద సంఖ్యలో ఉంటుందో అంచనా వేయొచ్చు.



రెండు మార్గాల్లో ఉద్యోగాలు

డేటా సెంటర్ అంటే ఐటీ మౌలిక వసతుల భౌతిక వ్యవస్థ. భారీ సర్వర్లు, డేటా నిల్వల సాంకేతిక ఉపకరణాలు, నెట్ వర్కింగ్ సాధనాల సమాహారమే డేటా సెంటర్. వీటిలో యువతకు ఉద్యోగావకాశాలు రెండు విధాలుగా ఉంటాయి.

భారీ డేటా సెంటర్ల నిర్మాణ సమయంలోనూ, దీంతో పాటూ అత్యున్నత సాంకేతిక డేటా సెంటర్ల నిర్వహణలోనూ ఎక్కువ మంది సేవలు అవసరమవుతాయి.

ఒక మెగావాట్ డేటా సెంటర్ నిర్వహణకు 2వేల మంది నిపుణులు అవసరం. వైజాగ్‌లో ఏర్పాటు కానున్న 1000 మెగావాట్ల డేటా సెంటర్ ఏఐ ఆధారిత వ్యవస్థ కావడంతో సమీప భవిష్యత్తులో కనీసం రెండు లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఇదే డొమైన్‌లో ఉన్న వారితో సహా, కొత్తగా కోర్సులు ఎంపిక చేసుకోబోయే వారూ దృష్టి పెట్టాల్సిన కోర్సులున్నాయి.

దరిచేరేందుకు దారిచూపే కోర్సులు

డేటా సెంటర్లలో కొలువులు కైవసం చేసుకోవాలంటే చేయాల్సిన కోర్సులను రెండు వర్గాలుగా విభజించారు. అవి..

1) ప్రాథమిక కోర్సులు
2) అడ్వాన్స్‌డ్ కోర్సులు

ప్రాథమిక కోర్సులు

డేటా సెంటర్ ఫౌండేషన్ సర్టిఫికెట్ కోర్సు (డీపీఎస్‌సీ): డేటా సెంటర్‌లోని విభిన్న హోదాల్లో ప్రవేశించేందుకు పునాది లాంటి కోర్సు. డేటా సెంటర్ల నిర్వహణపై ప్రాథమిక పరిజ్ఞానాన్ని కల్పిస్తుంది.

డేటా సెంటర్ సర్టిఫైడ్ అసోసియేట్ (డీసీసీఏ): డేటా సెంటర్ నిర్వహణలో ప్రధానంగా అవసరమైన నైపుణ్యాలను కల్పించి, ప్రారంభ స్థాయి ఉద్యోగాలకు దోహదపడే కోర్సు.

సర్టిఫైడ్ డేటా సెంటర్ ప్రొఫెషనల్ (సీడీసీపీ): ప్రస్తుతం ఐటీ రంగంలో అనుభవం ఉండి డేటా సెంటర్ హోదాల్లోకి ప్రవేశించాలనుకునే వారికి అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన కోర్సు ఇది.

అడ్వాన్స్‌డ్ కోర్సులు

డేటా సెంటర్‌లో సేవలందించాలనుకునే వారి కోసం సిస్కో కొన్ని ప్రొఫెషనల్ కోర్సులు అందిస్తోంది. ప్రస్తుతం ఐటీ రంగంలో ఇతర డొమైన్లలో ఉన్నవారికి ఈ అడ్వాన్స్‌డ్ కోర్సులు ఉపయోగకరం.

సీసీఎన్ఏ డేటా సెంటర్: నెట్‌వర్కింగ్ అనుభవం ఉన్న వారికి డేటా సెంటర్ నిర్వహణ సామర్థ్యాలు నేర్పించే కోర్సు ఇది.

సీసీఎన్‌పీ డేటా సెంటర్: డేటా సెంటర్‌లో ఉన్నత నిపుణుల స్థాయి హోదాలు ఆశించే అనుభవజ్ఞులు చేయాల్సిన ప్రొఫెషనల్ కోర్సు.

ఇతర అనుబంధ కోర్సులు

డేటా సెంటర్ నిర్వహణలో తోడ్పడే మరికొన్ని అనుబంధ కోర్సులపై దృష్టి పెట్టడం ద్వారా వాటిలో ప్రవేశం పొందవచ్చు.

నెట్‌వర్కింగ్: డేటా సెంటర్ల పనితీరులో సహాయకారిగా నిలిచే ఈ కోర్సు ఇతర కోర్సులైన సీసీఎన్ఏ, సీసీఎన్‌పీలకు సహాయకారిగా నిలుస్తుంది.. రౌటింగ్, స్విచ్చింగ్ వంటి డేటా సెంటర్‌లో ముఖ్య అవసరాలకు ఈ కోర్సు చేసిన నిపుణుల సేవలు ఉపయోగపడతాయి.

క్లౌడ్ కంప్యూటింగ్: దాదాపు దేశంలోని అన్ని డేటా సెంటర్లూ క్లౌడ్ వ్యవస్థకు అనుసంధానం అవుతున్నాయి. దీంతో అమెజాన్ వెబ్ సర్వీస్, అజర్, గూగుల్ క్లౌడ్ వంటి కోర్సులు చేసిన నిపుణులకు మంచి డిమాండ్ ఉంది.

పట్టు దొరికితే పెట్టని కోట

డేటా సెంటర్ అనేది ఐటీ సేవలకు మౌలిక వసతులు అమర్చే సాంకేతిక వ్యవస్థ. నానాటికీ డేటా వినియోగం పెరుగుతున్నందున డేటా సెంటర్లకు డిమాండ్ ఏర్పడింది. డేటా సెంటర్ వ్యవస్థ నిర్మాణం, నిర్వహణలో సహకరించే సాంకేతిక నిపుణులకూ కొరత ఉంది. అందువల్ల ఈ దిశగా కృషి చేసిన ఫ్రెషర్స్, సీనియర్స్‌ని ఈ రంగం ఆహ్వానిస్తోంది. మంచి వేతనాలూ, కెరియర్‌లో ఎదిగేందుకు అవకాశాలూ కల్పిస్తోంది. ఈ రంగంలో ఇప్పటి వరకూ రూ.1.78 కోట్ల వార్షిక వేతనం గరిష్ఠ ప్యాకేజీగా నమోదు కాగా, డేటా సెంటర్‌లోని కనీసం పది శాతం పొజిషన్లకు ఏడాదికి రూ.43 లక్షల వేతనాలు ఇస్తున్నారు. ఈ రంగానికి అవసరమైన నైపుణ్యాలు సాధిస్తే మంచి కెరియర్ అందుకోవచ్చు.



యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

ప్రభుత్వ సాయం అందుతుందా..



ఎంఏ, ఎంఈడీ చేశాను. పాఠశాల ప్రారంభించాలనుంది. దీని కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రుణ సహాయం పొందే అవకాశం ఉంటుందా?

- సీహెచ్. రమేష్



■ మీరు ఎంఏ, ఎంఈడీ పూర్తిచేశారు కాబట్టి.. విద్యా వ్యవస్థ, పాఠశాల నిర్వహణ, పాఠ్య ప్రణాళిక రూపకల్పన వంటి అంశాలపై కొంత అవగాహన ఉంటుంది. పాఠశాల స్థాపన విషయానికి వస్తే.. మీ విద్యార్హతల కంటే స్థల లభ్యత, భద్రతా ప్రమాణాలు, భవన నిర్మాణం, మౌలిక వసతులు, శానిటేషన్, తాగునీటి సదుపాయం, రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. సాధారణంగా ప్రైవేటు పాఠశాల స్థాపించడానికి ఏ ప్రభుత్వాలూ రుణ సహాయం అందించవు. కానీ.. ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు నిబంధనలకు లోబడి రుణాలు మంజూరు చేస్తాయి. ఇప్పటికే నడుస్తున్న వాటికి కొన్ని ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందే అవకాశం ఉంది. ఉదాహరణకు.. అర్హత ఉన్న మైనారిటీ పాఠశాలలకు మౌలిక వసతుల కోసం ప్రభుత్వం నుంచి కొంత ఆర్థిక సహాయం లభించవచ్చు. ఎంపిక చేసిన పాఠశాలల్లో కొన్ని సామాజిక వర్గాల విద్యార్థులకు ట్యూషన్ ఫీజు రీఎంబర్స్‌మెంట్ రూపంలో కొంత ఆర్థిక సహాయం దక్కవచ్చు. సాంస్కృతిక అంశాలకు ప్రోత్సాహం కల్పిస్తూ, విలువలతో కూడిన విద్యను అందిస్తున్న అతి తక్కువ ప్రైవేటు పాఠశాలలకు కొంత ప్రభుత్వ సాయం అందే అవకాశం ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రైవేటు పాఠశాలను ప్రారంభించాలంటే పెద్ద మొత్తంలో పెట్టుబడి అవసరం. పిల్లలను ఎక్కువ మౌలిక వసతులు ఉన్న పాఠశాలల్లో చేర్పడానికే చాలా మంది తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తున్నారు. కాబట్టి, మీకు పాఠశాల స్థాపించాలన్న లక్ష్యం బలంగా ఉంటే, సొంత పెట్టుబడితో పాటు, ఏదైనా బ్యాంకు నుంచి రుణం తీసుకునే ప్రయత్నం చేయండి. అంతకంటే ముందు, ఏదైనా ప్రైవేటు పాఠశాలలో కొంతకాలం ఉపాధ్యాయుడిగా పనిచేసి, స్కూల్ నిర్వహించడంలో ఉన్న సవాళ్లను అర్థం చేసుకోండి.

- ప్రొ.బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నో టీ స్ బో ర్డు

బ్యాంక్ ఆఫ్ బరోడాలో మేనేజర్లు..

బ్యాంక్ ఆఫ్ బరోడా.. వివిధ విభాగాల్లో 82 మేనేజర్, డిప్యూటీ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

▶ జోనల్ రిసీవబుల్ మేనేజర్: 13 ▶ రీజనల్ రిసీవబుల్ మేనేజర్: 13
▶ ఏరియా రిసీవబుల్ మేనేజర్: 49 ▶ కంప్లియన్స్ మేనేజర్: 01
▶ కంప్లైంట్ మేనేజర్: 01 ▶ ప్రాసెస్ మేనేజర్: 01 ▶ వెండర్ మేనేజర్: 01
▶ ఫ్లోర్ మేనేజర్: 03

అర్హత: డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: పోస్టు ప్రకారం 25 ఏళ్ల నుంచి 52 ఏళ్ల మధ్య ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 9.
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.850. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, మహిళలకు రూ.175. **ఎంపిక:** ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://bankofbaroda.bank.in/career

ఇన్స్యూరెన్స్ సంస్థలో అప్రెంటిస్‌లు

జనరల్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ముంబయి.. అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

▶ యాక్చూరియల్ అప్రెంటిస్- 20

అర్హత: డిగ్రీ, పీజీతోపాటూ ఉద్యోగానుభవం ఉండాలి.
వయసు: 21 ఏళ్ల నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
స్టైపెండ్: నెలకు రూ.40,000 - రూ.45,000.
దరఖాస్తు: ఈమెయిల్ ద్వారా Recruitment-AA@gicre.inకు పంపాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 7.
ఎంపిక: గ్రూప్ డిస్కషన్/ఇంటర్వ్యూలతో.
వెబ్‌సైట్: https://www.gicre.in/en/

ఐఐటీలో ప్రొఫెసర్లు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్.. వివిధ విభాగాల్లో ప్రొఫెసర్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

▶ అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-II ▶ అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-I
▶ అసోసియేట్ ప్రొఫెసర్ ▶ ప్రొఫెసర్

విభాగాలు: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బయోమెడికల్ ఇంజినీరింగ్, బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజినీరింగ్, కెమిస్ట్రీ, క్లైమేట్ చేంజ్, సివిల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, డిజైన్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్, లిబరల్ ఆర్ట్స్, మెటీరియల్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్, మెకానికల్ అండ్ ఏరోస్పేస్ ఇంజినీరింగ్, ఫిజిక్స్.
అర్హత: పోస్టు ప్రకారం సంబంధిత విభాగంలో పీజీ/పీహెచ్‌డీ, ఉద్యోగానుభవం
వయసు: పోస్టు ప్రకారం 38 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 09-12-2025, **ఎంపిక:** ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://www.iith.ac.in/careers/

ఐఐఎంఆర్‌లో సీనియర్ రిసెర్చ్ ఫెలోలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రిసెర్చ్, హైదరాబాద్.. ఒప్పంద ప్రాతిపదికన.. సీనియర్ రిసెర్చ్ ఫెలోల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

▶ ఎస్ఆర్ఎఫ్/యంగ్ ప్రొఫెషనల్-2 (బ్రీడింగ్/మాలిక్యులర్ బ్రీడింగ్/మైక్రోస్కోపీ): 02
▶ ఎస్ఆర్ఎఫ్/యంగ్ ప్రొఫెషనల్-2 (జీనోమిక్స్ అండ్ బయోఇన్ఫర్మాటిక్స్): 01
▶ ఎస్ఆర్ఎఫ్/యంగ్ ప్రొఫెషనల్-2 (ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్): 01
▶ ఎస్ఆర్ఎఫ్/యంగ్ ప్రొఫెషనల్-2 (ఫిజియాలజీ): 01

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: ఇంటర్వ్యూ తేదీ నాటికి పురుషులకు 35 ఏళ్లు, మహిళలకు 40 ఏళ్లలోపు ఉండాలి. రిజర్వేషన్లు ఉన్నవారికి ఐదేళ్ల సడలింపు వర్తిస్తుంది. **వేతనం:** మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 24.
ఎంపిక: ఇంటర్వ్యూతో. **ఇంటర్వ్యూ తేదీ:** నవంబరు 25.
వేదిక: ఐసీఏఆర్- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రిసెర్చ్, రాజేంద్రనగర్ హైదరాబాద్-500030. **వెబ్‌సైట్:** https://www.millets.res.in/ad.php

ఎన్టీపీసీలో ఎగ్జిక్యూటివ్‌లు..

ఎన్టీపీసీ లిమిటెడ్.. ఎగ్జిక్యూటివ్(ఐబీడీ) ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

▶ ఎగ్జిక్యూటివ్(ఐబీడీ): 04

అర్హత: సంబంధిత విభాగంలో 65 శాతం మార్కులతో బీఈ/బీటెక్‌తో పాటు పని అనుభవం ఉండాలి.
గరిష్ఠ వయసు: 40 ఏళ్లు.
వేతనం: నెలకు రూ.90,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 2.
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.500. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, ఈఎస్ఎం, మహిళలకు ఫీజు లేదు.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో
వెబ్‌సైట్: https://careers.ntpc.co.in/recruitment/

బనారస్ హిందూ యూనివర్సిటీలో..

బనారస్ హిందూ యూనివర్సిటీ.. ఒప్పంద ప్రాతిపదికన ట్రయల్ మేనేజర్ (రిసెర్చ్ అసోసియేట్), రిసెర్చ్ ఫెలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

▶ ట్రయల్ మేనేజర్ (రిసెర్చ్ అసోసియేట్) -01 ▶ రిసెర్చ్ ఫెలో - 02

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో ఎంఏ/ఎమ్మెస్సీ, పీహెచ్‌డీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
వయసు: 28-42 ఏళ్ల మధ్య ఉండాలి.
వేతనం: నెలకు ట్రయల్ మేనేజర్‌కు రూ.80,000. రిసెర్చ్ ఫెలోకు రూ.60,000.
దరఖాస్తు: ఈమెయిల్ ద్వారా createindia2025@gmail.comకు పంపాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: 05.12.2025.
ఎంపిక: ఇంటర్వ్యూతో
వెబ్‌సైట్: https://www.bhu.ac.in//~ite/tempvacancy/1_2_16

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్

సంస్థ: లెర్న్‌బె నైపుణ్యాలు: ఇంగ్లిష్ రాయడం, గూగుల్ అనలిటిక్స్, గూగుల్ కీవర్డ్ ప్లానర్, గూగుల్ సెర్చ్ కన్సోల్, లింక్డ్‌ఇన్, సెర్చ్ ఇంజిన్ మార్కెటింగ్, మోజ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
స్టైపెండ్: రూ.7,000-10,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 11
https://tinyurl.com/mrxm8xcd

ఆండ్రాయిడ్ యాప్ డెవలప్‌మెంట్

సంస్థ: రోషన్ సైనీ నైపుణ్యం: ఆండ్రాయిడ్, సీ++ ప్రోగ్రామింగ్, ఫ్లట్టర్, గిట్‌హబ్, ఆబ్జెక్ట్ ఓరియంటెడ్ ప్రోగ్రామింగ్
స్టైపెండ్: రూ.4,000-5,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 11
https://hosturl.info/EZojSN

బిజినెస్ ఆపరేషన్స్ అండ్ టెక్ కోఆర్డినేషన్

సంస్థ: అఖిల్ వాద్వా నైపుణ్యం: ఆపరేషన్స్
స్టైపెండ్: రూ.5,000-10,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 11
https://hosturl.info/UjzfcJ

మొబైల్ యాప్ డెవలప్‌మెంట్

సంస్థ: స్లైడర్ నైపుణ్యాలు: ఆండ్రాయిడ్, క్లౌడ్ కంప్యూటింగ్, డార్ట్, ఫైర్‌బేస్, ఫ్లట్టర్, ఐఓఎస్, మైఎస్‌క్యూఎల్, నోడ్.జేఎస్
స్టైపెండ్: రూ.25,000-30,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 12
https://tinyurl.com/bdarky5e

డిజిటల్ మార్కెటింగ్ (మీమ్ అండ్ కేరసెల్ మేకింగ్)

సంస్థ: లాటెక్ నైపుణ్యాలు: అడోబ్ క్రియేటివ్ సూట్, కేన్వా, డిజిటల్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్‌మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.6,000-8,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 12
https://hosturl.info/964TND

హైదరాబాద్‌లో..

బిజినెస్ ఆపరేషన్స్

సంస్థ: జీగ్లర్ ఏరోస్పేస్
నైపుణ్యాలు: అటెన్షన్ టు డిటెయిల్, ఈమెయిల్ మేనేజ్‌మెంట్, ఇంగ్లిష్ మాట్లాడటం, గూగుల్ వర్క్‌స్పేస్, మైక్రోసాఫ్ట్ ఔట్‌లుక్, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-వర్డ్, టైమ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.8,000
దరఖాస్తు గడువు: నవంబరు 21
https://tinyurl.com/yc9c22c8

చదువు

కెరియర్, ఉన్నత విద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా: చదువు, ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512 edc@eenadu.in

80 లక్షల ఈ-పాస్‌పోర్టులు జారీ

2035 నాటికి అందరికీ ఇవే

ఇంటర్నెట్ డెస్క్: దేశంలో ఇప్పటివరకు దాదాపు 80 లక్షల ఈ-పాస్ పోర్టులు జారీ చేశామని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ప్రకటించింది. గడువు ముగియని పాత పాస్‌పోర్టులు 2035 వరకు, లేదా వాటి గడువు ముగిసేవరకు చెల్లుబాటులో ఉంటాయని స్పష్టం చేసింది. ‘ ‘ఈ- పాస్‌పోర్టు సేవా కార్యక్రమం (పీఎస్‌పీ) 2.0 ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు 62,000 ఈ- పాస్ పోర్టులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారత రాయబార కార్యాలయాలు, కాన్సులేట్‌లలో ఉన్నవారికి జారీ అయ్యాయి. ఇవి పోయినా, దొంగతనానికి గురైనా సంబంధిత వ్యక్తి డేటాను ఎవరూ చోరీ చేయలేరు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే పాస్‌పోర్టు చిప్‌లోని డేటాను అధికారులు లాక్ చేస్తారు. ఈ పాస్‌పోర్టులో ఉపయోగించే ఫోటో అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ (ఐసీఏఓ) ప్రమాణాలకు అనుగుణంగా ఉంటుంది'' అని విదేశీ వ్యవహారాల శాఖ అధికారి ఒకరు తెలిపారు.

ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌తో ధన్‌ఖడ్ భేటీ

దిల్లీ: ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ మంగళవారం భేటీ అయ్యారు. ఈ సమావేశం మర్యాదపూర్వకంగా జరిగినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. ఆరోగ్య కారణాలతో ఈ ఏడాది జులై 21న తన పదవికి ధన్‌ఖడ్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఉపరాష్ట్రపతిగా ప్రమాణం చేసిన సమయంలో రాధాకృష్ణన్‌ను ధన్‌ఖడ్ కలిసి అభినందించారు. ఆ తర్వాత మళ్లీ ఆయనతో భేటీ కావడం ఇదే తొలిసారి.

బెంగాల్‌లో ‘సర్’ కోసం ఏఐ

నకిలీ, మృతిచెందిన ఓటర్లను గుర్తించేందుకు ఈసీ కొత్త పంథా

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో నకిలీ, మృతిచెందిన వారి ఓటరు కార్డులను గుర్తించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) కొత్త మార్గాన్ని ఎంచుకుంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత ధ్రువీకరణ వ్యవస్థను ఉపయోగించి నకిలీ ఓటర్లను గుర్తించనున్నట్లు మంగళవారం ఎన్నికల సీనియర్ అధికారి తెలిపారు. ఓటర్ల, ముఖ్యంగా వలసదారుల ఛాయాచిత్రాలను దుర్వినియోగం చేస్తున్నారంటూ భారీ సంఖ్యలో ఫిర్యాదులు అందుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. బహుళ ప్రదేశాల్లో నమోదైన ఓటర్లను గుర్తించడంలో ఈ ఏఐ సాంకేతిక సాయపడుతుందని వెల్లడించారు. అయినప్పటికీ.. ధ్రువీకరణ ప్రక్రియలో బూత్‌స్థాయి ఆఫీసర్(బీఎల్ఓ)లదే కీలక పాత్ర అని, ఇంటింటికీ వెళ్లి ఓటర్ల సంతకాలను నమోదు చేయాల్సి ఉంటుందని అన్నారు.

ఆ ఎంపీపై గవర్నర్ బోస్ పరువునష్టం కేసు?

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ రాజ్‌భవన్‌లో ఆయుధాలు, మందుగుండు సామగ్రి ఉన్నాయని ఆరోపించిన టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీపై పరువునష్టం కేసు దాఖలు చేసేందుకు గవర్నర్ ఆనంద బోస్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. ‘‘ఈ అంశంపై గవర్నర్ ఆనంద బోస్ కలకత్తా హైకోర్టును ఆశ్రయించనున్నారు. దీనిపై న్యాయపరమైన అంశాలను పరిశీలించిన తర్వాతే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎంపీ చేసిన వ్యాఖ్యలు బెయిల్ పొందలేనివి. గరిష్ఠంగా ఏడేళ్ల వరకు జైలు శిక్ష కూడా పడొచ్చు'' అని ఓ అధికారి మీడియాకు తెలిపారు. బెనర్జీ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన గవర్నర్ బోస్... సోమవారం రాజ్‌భవన్‌లో రాష్ట్ర పోలీసులు, కేంద్ర బలగాలు, బాంబు స్క్వాడ్‌లు, జాగిలాలతో తనిఖీలు చేయించిన విషయం తెలిసిందే.

ఏఐతో పీడీఎస్ లబ్ధిదారుల అభిప్రాయ సేకరణ

‘ఆశా’పేరుతో డిజిటల్ వేదికను ప్రారంభించిన కేంద్రం

దిల్లీ: ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్) కింద లబ్ధిదారుల నుంచి అభిప్రాయాన్ని సేకరించడానికి కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత వేదిక ‘ఆశా’ను ఆహార, వినియోగదారుల వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రారంభించారు. లబ్ధిదారుల ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. గిడ్డంగుల కార్యకలాపాలను ఆధునికీకరించడం, సరఫరా గొలుసు సామర్థ్యాన్ని మెరుగుపరచడం, పీడీఎస్ అంతటా పారదర్శకతను పెంపొందించడమే లక్ష్యంగా కొన్ని డిజిటల్ వేదికలను ఆయన మంగళవారం ఆరంభించారు. భండారం 360, అన్నా దర్పన్ పేర్లతో రెండు క్లౌడ్ ప్లాట్‌ఫామ్‌లు, కేంద్ర గిడ్డంగి సంస్థ (సీడబ్ల్యూసీ)కు చెందిన సీఎఫ్‌సీ; ఐసీడీ కార్యక్రమాల కోసం స్మార్ట్ ఎగ్జిమ్ వేర్‌హౌస్‌ను, ఆశా అనే మరో ఏఐ వ్యవస్థను ప్రారంభించారు. ఆశాను ఉపయోగించి ప్రతినెలా పీడీఎస్ వ్యవస్థపై 20లక్షల మంది రేషన్ షాపు లబ్ధిదారుల అభిప్రాయాన్ని సేకరిస్తామని అధికారులు పేర్కొన్నారు.

2.25 కోట్ల అనర్హ లబ్ధిదారులకు రేషన్ కోత

దిల్లీ: జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) ద్వారా లబ్ధి పొందుతున్న 2.25 కోట్ల మంది అనర్హులను గత 4-5 నెలల్లో కేంద్రం తొలగించినట్లు ఆహార మంత్రిత్వ శాఖ అధికారులు మంగళవారం తెలిపారు. అధిక ఆదాయం ఉన్నవారు, కార్లు ఉన్నవారు, కంపెనీల డైరెక్టర్లు ఈ జాబితాలో ఉన్నట్లు గుర్తించి, వారిని తొలగించినట్లు పేర్కొన్నారు. అనర్హులైన వారి వివరాలను గుర్తించి, రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం పంపిందని ఆహార శాఖ కార్యదర్శి సంజీవ్ చోప్రా వెల్లడించారు. అలాగే అర్హులైన లబ్ధిదారులను రాష్ట్ర ప్రభుత్వం జాబితాలో చేర్చుతుందన్నారు. అవసరం ఉన్నవారికే ఈ పథకం కింద ప్రయోజనం చేకూరేలా చర్యలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు.

ప్రత్యేక చట్టాల కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు



ఏర్పాటు చేయాలని కేంద్రానికి సుప్రీం సూచన

దిల్లీ: ఎన్ఐఏ, యూఏపీఏ, మహారాష్ట్ర వ్యవస్థీకృత నేరాల చట్టం (ఎంసీఓసీఏ) వంటి ప్రత్యేక చట్టాల కింద నమోదైన కేసుల్ని ఆరు నెలల్లో పరిష్కరించేందుకు దేశవ్యాప్త యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు మంగళవారం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇందుకోసం ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని సూచించింది. ఎన్ఐఏకి సంబంధించిన కేసులో కేంద్రం తరపున వాదనలు వినిపిస్తున్న న్యాయవాదుల్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. ‘‘మీరు అత్యున్నత స్థాయి అధికారులతో మాట్లాడండి. ఇలాంటి ప్రత్యేక కేసుల సత్వర పరిష్కారానికి ఒక నిబద్ధ వ్యవస్థను వెంటనే ఏర్పాటు చేయాలని మేం కోరుతున్నాం. ఈ కేసుల్లో ఆరు నెలల్లోగా విచారణ పూర్తి కావాలి. తద్వారా బెయిలు వంటి అంశాలపై అనవసర వ్యాజ్యాలు నివారించవచ్చు. కేసుల్ని సత్వరం పరిష్కరిస్తే పిటిషనర్లు తమకు బెయిలు మంజూరు కావడం లేదని ఫిర్యాదు చేయరు. ఎంతో తీవ్రమైన కారణాలుంటే తప్ప బెయిలు నిరాకరణకు వీలుండదు. అలాగే అతిదారుణ నేరాలు ఈ ప్రత్యేక చట్టాల కిందికి వస్తాయి కాబట్టి, దేశానికి, సమాజానికి వ్యతిరేకంగా దారుణ నేరాలకు పాల్పడే వారికి ఆరు నెలల పాటు బెయిలు రాకుండా నిరోధించవచ్చు. అయితే విచారణ సత్వరం పూర్తి చేయాలి'' అని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. మావోయిస్టు సానుభూతి పరుడైన కైలాష్ రామ్‌చందాని, కరుడుగట్టిన నేరగాడు మహేశ్ ఖత్రిలపై ఎన్ఐఏ, యూఏపీఏ చట్టాల కింద నమోదైన కేసుల విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. న్యాయ వ్యవస్థ కోసం కేంద్రం మౌలిక సదుపాయాలు కల్పిస్తే కోర్టులు రేయింబవళ్లు పనిచేసి దేశానికి, సమాజానికి వ్యతిరేకంగా దారుణ నేరాలకు పాల్పడిన వారిపై ఆరు నెలల్లో విచారణ పూర్తి చేసేలా చూస్తామని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు పేర్కొంది. .

వృద్ధులకు కరవైన ఆత్మీయ స్పర్శ

భారతీయులు కొత్త ప్రపంచాన్ని అందుకుంటున్నా మానవతా స్పర్శను కాపాడే పాత ప్రపంచాన్ని కోల్పోతున్నారనీ, నేటి తరంవారు వృద్ధులను గౌరవించడం మరచిపోతున్నారని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన వెలిబుచ్చారు. తరాల మధ్య బంధాలు, అనుబంధాలు తగ్గిపోతున్నాయనీ, వృద్ధుల సంరక్షణపై సామాజిక కట్టుబాటును పునరుద్ధరించాలనీ, చట్టపరంగా కూడా పకడ్బందీ ఏర్పాట్లు జరగాలని పిలుపునిచ్చారు. వృద్ధులపై డిజిటల్ మోసాలు పెరుగుతున్నాయనీ, వారి ఆలనాపాలనను కుటుంబ సభ్యులు పట్టించుకోవడం లేదనీ, కుటుంబంతో జీవిత కాలం ఆస్తిపరమైన వ్యాజ్యాలలో చిక్కుకుపోతున్నారని జస్టిస్ సూర్యకాంత్ ఆవేదన వ్యక్తంచేశారు. తల్లిదండ్రుల, వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టంపై సోమవారం ఇక్కడ ఏర్పాటైన ప్రత్యేక సమావేశంలో ఆయన ప్రసంగించారు. భారతదేశంలో వృద్ధులను పెద్దదిక్కుగా చూసేవారనీ, ఆధునికత ఈ సంప్రదాయాన్ని బలహీనపరుస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. 50 ఏళ్లుగా భరణం కోసం పోరాడుతున్న ఓ వితంతువుకు సుప్రీంకోర్టు 142వ రాజ్యాంగ అధికరణం కింద ఆస్తిని తిరిగి స్వాధీనం చేసిందని తెలిపారు. ఒంటరిగా ఉంటున్న పెద్దలను ఆత్మీయ స్పర్శ పులకింపజేస్తుందని కేంద్ర న్యాయశాఖ మంత్రి వీరేంద్ర కుమార్ అన్నారు. వృద్ధుల హక్కుల పునరుద్ధరణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.

ఉమర్ ఖాలిద్‌కు బెయిలు ఇవ్వొద్దు

సుప్రీంకోర్టును కోరిన దిల్లీ పోలీసులు

దిల్లీ: దేశ రాజధానిలో 2020లో జరిగిన అల్లర్లకు సంబంధించి నిర్బంధంలో ఉన్న జేఎన్‌యూ విద్యార్థి నాయకుడు ఉమర్ ఖాలిద్ తదితరులకు బెయిలు ఇవ్వొద్దని దిల్లీ పోలీసులు సుప్రీంకోర్టును గట్టిగా కోరారు. అవి అప్పటికప్పుడు జరిగినవేవీ కాదని, ఒక పథకం ప్రకారం దేశ సార్వభౌమత్వంపై జరిగిన దాడిలో భాగమని తెలిపారు. దిల్లీ అల్లర్లకు సూత్రధారులుగా పేర్కొంటూ పోలీసులు ఉమర్ ఖాలిద్, గుల్ఫిషా ఫాతిమా, మీరాన్ హైదర్, రహమాన్ తదితరులపై ఉగ్రవాద వ్యతిరేక చట్టాల కింద, ఐపీసీలోని వివిధ నిర్దేశాల కింద కేసులు నమోదు చేసి ఐదేళ్లుగా నిర్బంధంలో ఉంచిన సంగతి తెలిసిందే. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌరసత్వ పట్టికలకు వ్యతిరేకంగా జరిగిన నిరసనలు హింసాత్మకం కావడంతో 53 మంది ప్రాణాలు కోల్పోయారు. అది కేవలం సీఏఏకి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం కాదని, సమాజాన్ని మతప్రాతిపదికన విభజించే ప్రయత్నమని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు. జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్.వి.అంజరియాలతో కూడుకున్న ధర్మాసనానికి దిల్లీ పోలీసుల తరఫున ఆయన వాదనలు వినిపించారు. నిందితులు తమ ప్రసంగాల ద్వారా సమాజాన్ని మత ప్రాతిపదికన విడగొట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. అసంపూర్తిగా మిగిలిన వాదనలు ఈనెల 20న కొనసాగనున్నాయి.

నివురుగప్పిన నిప్పులా బంగ్లాదేశ్

- హసీనాకు శిక్షను తప్పుబట్టిన హక్కుల సంఘాలు

ఢాకా: మాజీ ప్రధాని షేక్ హసీనాకు అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ మరణ శిక్ష విధించిన నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో మంగళవారం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోలేదు. హసీనా నేతృత్వంలోని ఆవామీ లీగ్ పార్టీ దేశవ్యాప్త బంద్‌కు పిలుపునివ్వడంతో భారీగా బలగాల్ని మోహరించారు. పరిస్థితి అదుపులో ఉన్నా అంతర్గతంగా ఉద్రిక్తత స్పష్టంగా కనిపించింది. ఎక్కడా హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోలేదు. అలజడి చెలరేగవచ్చన్న అనుమానాలు ఉండటంతో ప్రజల రాకపోకలు బాగా తగ్గిపోయి వీధులు నిర్మానుష్యంగా కనిపించాయి. ‘‘హంతక ఫాసిస్టు (మొహమ్మద్) యూనస్'' నేతృత్వంలోని అక్రమ, రాజ్యాంగ విరుద్ధ ప్రభుత్వం పతనమై ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరిగేదాకా ఉద్యమం కొనసాగుతుందని అవామీ లీగ్ తెలిపింది. హసీనాకు మరణశిక్ష. కక్ష సాధింపులో భాగమేనంది.

ఖండించిన ఆమ్నెస్టీ

హసీనాకు శిక్ష విధించడంపై అంతర్జాతీయ మానవహక్కుల సంస్థలు నిరసన తెలియజేస్తున్నాయి. హసీనా పరోక్షంలో జరిగిన విచారణ నిష్పాక్షికంగా లేదన్నది సుస్పష్టమని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ పేర్కొంది. తన వాదనను వినిపించేందుకు తగినంత సమయాన్ని ఆమెకు ఇవ్వలేదని విమర్శించింది. విచారణ అంతర్జాతీయ ప్రమాణాల మేరకు లేదని న్యూయార్క్‌కు చెందిన హ్యూమన్ రైట్స్ వాచ్ (హెచ్ఆర్‌డబ్ల్యూ) వ్యాఖ్యానించింది. ఆమెకు మరణశిక్ష విధించడం విచారకరమని ఐరాస పేర్కొంది. హసీనాకు శిక్ష విధించడం బంగ్లాదేశ్ అంతర్గత వ్యవహారమని చైనా వ్యాఖ్యానించింది. హసీనా వెలువరించే ప్రకటనల్ని ప్రచురించవద్దని ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలను బంగ్లాదేశ్ ప్రభుత్వం హెచ్చరించింది.

2027 ఆగస్టులో బుల్లెట్‌రైలు మొదటిదశ

100 కి.మీ. సిద్ధమవుతుంది: వైష్ణవ్

దిల్లీ: దేశంలో తొలి బుల్లెట్ రైలు 2027 ఆగస్టులో గుజరాత్‌లోని సూరత్-వాపి మధ్య నడుస్తుందని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మంగళవారం రైల్‌భవన్‌లో విలేకరులకు తెలిపారు. అహ్మదాబాద్‌లోని సబర్మతి నుంచి ముంబయికి 508 కి.మీ. పొడవైన హైస్పీడ్ రైల్‌కారిడార్‌ను నిర్మిస్తున్న విషయం తెలిసిందే. తొలిదశలో 50 కి.మీ. మేర మాత్రమే రైలును నడపాలని మొదట అనుకున్నా ఇప్పుడు దానిని 100 కి.మీ.కి పెంచామని, మొత్తం ప్రాజెక్టు 2029 చివరికి పూర్తవుతుందని మంత్రి చెప్పారు. మొత్తం మార్గం పూర్తయితే ముంబయి నుంచి అహ్మదాబాద్‌కి గంటా 58 నిమిషాల్లో చేరుకోవచ్చని తెలిపారు. పనుల్లో పురోగతిపై ప్రధాని సంతృప్తిగా ఉన్నారని చెప్పారు.

నేడు భారత్‌కు గ్యాంగ్‌స్టర్ అన్మోల్ బిష్ణోయ్!



ముంబయి: మహారాష్ట్రలో ఎన్సీపీ నేత బాబా సిద్దిఖ్ హత్య కేసులో కీలక నిందితుడైన గ్యాంగ్‌స్టర్ అన్మోల్ బిష్ణోయ్‌ని అమెరికా నుంచి భారత్‌కు రప్పించనున్నట్లు ఓ పోలీసు అధికారి మంగళవారం వెల్లడించారు. బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ ఇంటిపై గత సంవత్సరం ఏప్రిల్‌లో జరిగిన కాల్పుల కేసులో కూడా నిందితుడైన అన్మోల్ బుధవారం దిల్లీ చేరుకుంటాడని భావిస్తున్నారు. భారత్, కెనడాల్లో అనేక హత్యలు, కిడ్నాప్‌లు, బ్లాక్‌మెయిల్ వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్న లారెన్స్ బిష్ణోయ్‌కి అన్మోల్ స్వయానా తమ్ముడు. ఈ గ్యాంగ్‌స్టర్‌కు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా అనేక కేసులు నమోదయ్యాయి. అతణ్ని ఏ విచారణ సంస్థకు అప్పగించాలన్న దానిపై కేంద్రం నిర్ణయం తీసుకుంటుంది. గతేడాది నవంబరులో అన్మోల్‌ను అమెరికాలో నిర్బంధించారు. పంజాబీ గాయకుడు మూసేవాలా హత్య కేసులోనూ ఇతని ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలున్నాయి.



రాయగఢ్ కోట కట్టిన ఖైదీలు

మహారాష్ట్రలోని నాగ్‌పూర్ కేంద్ర కారాగారంలో శిక్షలు అనుభవిస్తున్న పదిమంది ఖైదీలు నాలుగు రోజులు శ్రమించి మినీ రాయ్‌గఢ్ కోటను నిర్మించారు. తాము గతంలో ఎప్పుడూ ఆ కోటను చూడకపోయినా ఇంటర్నెట్‌లోని ఫొటోల ఆధారంగా అచ్చు గుద్దినట్టుగా ప్రతిరూపాన్ని సృష్టించారు. కోట పైభాగాన ఛత్రపతి శివాజీ మహారాజు ప్రతిమను పెట్టారు. జైలు అధికారి ఆనంద్ పన్సారే, డిప్యూటీ సూపరింటెండెంట్ దీపా వైభవ్ వారికి సహకరించి, పర్యవేక్షించారు. కారాగారం ఆవరణలో వృథాగా పడున్న వస్తువులతో దీన్ని రూపొందించడం విశేషం. నాగ్‌పూర్‌లో జరుగుతున్న సాంస్కృతిక ఉత్సవం నిర్వహించిన పోటీలో ఈ కళాకృతికి మూడో బహుమతి దక్కింది.

శునక గణన చేపడితేనే సమస్యకు పరిష్కారం



దిల్లీ: వీధికుక్కల కచ్చితమైన సంఖ్య ఎంతో తేల్చనిదే వాటికి సంతాన నిరోధం చేపట్టడం, శరణాలయాలకు తరలించడం సాధ్యపడదని ఏస్య సెంటర్ అధ్యయన నివేదిక పేర్కొంది. కుక్కల బెడదపై ఈ నెల 7న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం జంతువుల్లో జనన నిరోధ కార్యక్రమాన్ని చేపట్టదలచింది. దీనికి 2023నాటి జంతు జనన నియంత్రణ నిబంధనలను పాటించదలచింది. దిల్లీ-జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్.సి.ఆర్)లో మొత్తం ఎన్ని కుక్కలు ఉన్నాయో గణించనిదే చర్యలు సాధ్యపడవంది. 2022-25 మధ్య దేశంలో 126 రేబిస్ మరణాలు నమోదు కాగా, వాటిలో ఏ ఒక్కటీ ఎన్.సి.ఆర్.లో సంభవించలేదని తెలిపింది. 10 నగరాల్లో 1,000 మందిని ఇంటర్వ్యూ చేయగా వారిలో 75 శాతంమంది తమ పరిసరాల్లోని వీధికుక్కలు స్నేహపూర్వకంగా మెలగుతాయని చెప్పినట్లు వెల్లడించింది. వీధి కుక్కలు పిరికిగా ఉంటాయని 15 శాతం మంది చెప్పగా, అవి దురుసుగా మీదికొస్తాయని చెప్పినవారు 10 నుంచి 11 శాతంమంది. కుక్కల వల్ల నేర కార్యకలాపాలు తగ్గుతాయని 90 శాతంమంది భావించగా, వాటి వల్ల మహిళలు, పిల్లలకు రక్షణ లభిస్తుందని చెప్పినవారు 52 శాతం మంది. వీధి కుక్కలను ప్రమాదకరమైనవిగా పరిగణించేవారు తక్కువేనని తెలుతోంది కాబట్టి జంతు జనన నిరోధ కార్యక్రమం చేపట్టేముందు శునక గణన చేపట్టాలని ఏస్య సెంటర్ సూచించింది.

దోపిడీలు.. కిడ్నాప్‌ల బారిన పడొద్దు

ఇరాన్ వెళ్లే భారతీయులకు కేంద్రం సూచన

దిల్లీ: ఇరాన్ వెళ్లాలనుకునే భారతీయులు అప్రమత్తంగా ఉండాలని.. దోపిడీ, కిడ్నాప్‌ల బారిన పడొద్దని విదేశీ వ్యవహారాల శాఖ సూచించింది. అధిక జీతంతో ఉద్యోగాలు కల్పిస్తామని హామీలు ఇస్తూ, ఇరాన్ నుంచి ఇతర దేశాలకు పంపిస్తామనే ఏజెంట్లను నమ్మొద్దని హెచ్చరించింది. అక్కడికి వెళ్లాక భారతీయులను కిడ్నాప్ చేసి వారి కుటుంబసభ్యులను డబ్బులు చెల్లించాలని దొంగల ముఠాలు డిమాండ్ చేస్తున్నట్లు వివరించింది. ఉద్యోగాల పేరిట తప్పుడు హామీలతో భారతీయుల్ని ఇతర దేశాలకు తీసుకెళ్లడానికి తమ దేశాన్ని ప్రతిపాదికన వాడుకుంటున్నారన్న నేపథ్యంలో.. వీసా లేకుండా ప్రయాణించే సదుపాయాన్ని నవంబరు 22 నుంచి నిలిపివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. భారతీయులకు 15 రోజులు వీసా లేకుండా పర్యటించడానికి 2023లో ఇరాన్ అనుమతించింది.

బ్రిటిష్ మ్యూజియంతో అస్సాం ప్రభుత్వం ఒప్పందం

16వ శతాబ్దం నాటి బృందావనీ వస్త్రం అరువు

గువాహటి: లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియంతో అస్సాం ప్రభుత్వం రుణ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తెలిపారు. శ్రీకృష్ణుడి జీవితాన్ని వర్ణించే 16వ శతాబ్దపు ‘బృందావనీ పట్టు వస్త్రం’ను 2027లో రాష్ట్రంలో ప్రదర్శించడానికి ఈ ఒప్పందంపై సంతకాలు చేసినట్లు ఆయన వివరించారు. ‘‘బృందావనీ అనేది కేవలం వస్త్రమే కాదు. అస్సాం సాంస్కృతిక వారసత్వానికి చిహ్నం. ఇది మహాపురుషుడు శ్రీమంత శంకరదేవ్ భక్తి, దార్శనికతను ప్రతిబింబిస్తుంది. ఈ వస్త్రాన్ని అరువు ఒప్పందంతో తిరిగి స్వదేశానికి తీసుకురావడం.. అస్సాం కాలతీత వారసత్వంతో మన బంధాన్ని బలోపేతం చేసే క్షణాన్ని సూచిస్తుంది'' అని శర్మ ‘ఎక్స్’లో పేర్కొన్నారు.

ఫొటో, క్యూఆర్ కోడ్‌లతోనే ఆధార్ కార్డు!

యూఐడీఏఐ యోచన

దిల్లీ: సమాచార భద్రత కోసం ఎటువంటి వివరాల్లేకుండా కేవలం ఫొటో, క్యూఆర్ కోడ్‌తోనే కొత్త ఆధార్ కార్డును ప్రవేశపెట్టాలని యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) యోచిస్తోంది. తద్వారా పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగపరిచే అవకాశాన్ని నివారించడంతోపాటు ఆఫ్‌లైన్ పద్ధతిలో ఆధార్ కార్డును పరిశీలించే పద్ధతికి స్వస్తి పలకవచ్చని సంస్థ భావిస్తోంది. ఆధార్ కొత్త యాప్‌పై జరిగిన బహిరంగ ఆన్‌లైన్ సమావేశంలో యూఐడీఏఐ సీఈవో భువనేశ్ కుమార్ ఈ విషయం వెల్లడించారు. హోటళ్లు, ఈవెంట్లు తదితరచోట్ల ఆధార్ కాపీని తీసుకునే విధానాన్ని నివారించేందుకు ఈ కొత్త నియమాన్ని వచ్చే నెల నుంచి అమలులోకి తేవాలని యోచిస్తున్నట్లు ఆయన తెలిపారు. కేవలం వయసును మాత్రమే తెలియజేసి ఇతర ప్రైవేటు సమాచారాన్ని దాచేలా ఈ నిబంధనను రూపొందించబోతున్నారు. ‘కార్డుపై పౌరుడి పూర్తి వివరాలు ఇవ్వాల్సిన అవసరం ఏముందని యోచిస్తున్నాం. ఫొటో, క్యూఆర్ కోడ్ ఉంటే చాలు’ అని ఆయన పేర్కొన్నారు. ‘ఆధార్ నంబరును సేకరించడం, కాపీలను నిల్వ ఉంచుకోవడం నిషిద్ధమని ఆధార్ చట్టం చెబుతోంది. అయినప్పటికీ అనేక సంస్థలు ఆధార్ కార్డు కాపీలు తీసుకోవడంతోపాటు వాటిని తమవద్ద ఉంచుకుంటున్నాయి’ అని భువనేశ్ కుమార్ తెలిపారు.



నికొలాయ్ పాత్రుషెవ్‌తో ప్రధాని మోదీ

పుతిన్ సహాయకునితో మోదీ చర్చలు

దిల్లీ: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సహాయకుడు నికొలాయ్ పాత్రుషెవ్ మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారు. పుతిన్ వచ్చే నెలలో భారత్ సందర్శించనున్న నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. సముద్ర సంబంధ విషయాల్లో భారత్- రష్యాల మధ్య సహకార పెంపుదలపై ఇరువురు నేతలూ మాట్లాడుకున్నారు. సముద్ర మార్గ అనుసంధానం, నైపుణ్య వృద్ధి, నౌకా నిర్మాణం, నీలి ఆర్థికం వంటి అంశాలూ మోదీ, పాత్రుషెవ్‌ల మధ్య చర్చకు వచ్చాయి. మోదీ ఈ సందర్భంగా పుతిన్‌కు హార్దిక అభినందనలు తెలియజేశారు. వచ్చే నెలలో ఆయన ఆగమనం కోసం ఎదురు చూస్తానని రష్యన్ నేతతో మోదీ అన్నారు.

పుతిన్‌తో జైశంకర్ సంప్రదింపులు

మాస్కో: షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) ప్రభుత్వాధినేతల మండలి సమావేశంలో పాల్గొనేందుకు ఇక్కడికి వచ్చిన విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మంగళవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను కలిశారు. ‘ఎస్‌సీవో ప్రతినిధి బృందంలో సభ్యునిగా వ్లాదిమిర్ పుతిన్‌ను ఇతర ప్రభుత్వాధినేతలను కలిశాను’ అని జైశంకర్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.

వెనెజువెలాపై సైనిక చర్యను తోసిపుచ్చలేం

ట్రంప్ స్పష్టీకరణ

వాషింగ్టన్: వెనెజువెలాపై సైనిక చర్య చేపట్టే విషయాన్ని తోసిపుచ్చలేమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. వెనెజువెలా అధ్యక్షుడు నికోలాస్ మదురోతో మాట్లాడేందుకు తాను సిద్ధమేనని, అయితే ఆ దేశ భూభాగంపై సైనిక చర్యను కూడా కాదనలేమని ట్రంప్ అన్నారు. అమెరికాలో మాదక ద్రవ్యాల సరఫరాకు మదురోకు సంబంధం ఉందని ఆయన ఆరోపించారు. అమెరికాతో సంప్రదింపులకు తాను సిద్ధమేనని మదురో ప్రకటించిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

కత్తిపోట్ల ఘటనలో ఇజ్రాయెలీ మృతి

జెరూసలెం: వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలోని ఒక కూడలిలో జరిగిన కత్తిపోట్ల సంఘటనలో మంగళవారం ఓ ఇజ్రాయెలీ మరణించాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ దాడిలో ఎంతమంది పాల్గొన్నారు, బాధ్యులెవరు వంటి వివరాలు తెలియరాలేదు. మరోవైపు వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలో ఇజ్రాయెలీ సెటిలర్లు స్థానిక పాలస్తీనియన్లపై జరుపుతున్న దాడులు మరింత తీవ్ర రూపం దాలుస్తున్నాయి. తాజాగా పాలస్తీనియులకు చెందిన అల్ జబా గ్రామంపై యూదు సెటిలర్లు దాడి చేసి విధ్వంసం సృష్టించారు. అనేక ఇళ్లను, కార్లను తగులబెట్టారు. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ దాడిని ఖండించారు.

అంబులెన్స్‌లో మంటలు.. నవజాత శిశువు సహా నలుగురి మృతి

మొడాసా: గుజరాత్‌లోని అర్వల్లి జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. మొడాసా వద్ద అంబులెన్స్‌లో మంటలు చెలరేగి నవజాత శిశువు సహా నలుగురు మృతిచెందారు. పలువురు గాయపడ్డారు. అప్పుడే పుట్టిన శిశువు అస్వస్థతకు గురికావడంతో మెరుగైన చికిత్స కోసం మొడాసా నుంచి అహ్మదాబాద్‌కు అంబులెన్సులో బయలుదేరారు. సోమవారం అర్ధరాత్రి తర్వాత ధన్సుర రోడ్డులో ప్రయాణిస్తున్న అంబులెన్స్‌లో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో శిశువు, శిశువు తండ్రి జిగ్నేష్ మోచి(38), డాక్టర్ శాంతిలాల్ రెంటియా(30), నర్సు బూరిబెన్ మనత్ (23) మృతిచెందారు. డ్రైవర్, మోచి బంధువులు ఇద్దరు గాయపడ్డారు. వారిని స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశాయి. ప్రమాదానికి కారణాలు తెలుసుకునేందుకు ఫోరెన్సిక్ నిపుణులు విశ్లేషిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముంచుకొస్తున్న వాతావరణ మార్పులు

కాప్ సదస్సులో హెచ్చరించిన కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్

బెలెం: వాతావరణ మార్పుల నిరోధానికి సవరించిన జాతీయ నిర్దేశిత లక్ష్యాలను(ఎన్‌డీసీ) డిసెంబరులో సమర్పిస్తామని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ సోమవారం తెలిపారు. వాతావరణ మార్పులు కేవలం ఒక సూత్రప్రాయ ప్రతిపాదన కావనీ, అవి నిజంగానే ముంచుకొస్తున్నాయని హెచ్చరించారు. బ్రెజిల్‌లోని బెలెంలో జరుగుతున్న కాప్ 30 సదస్సులో ఆయన ప్రసంగించారు. ఎన్‌డీసీ అంటే వాతావరణ మార్పుల నిరోధానికి కర్బన ఉద్గారాలను తగ్గించే ప్రణాళిక. పారిస్ వాతావరణ సభ తీర్మానించిన ప్రకారం భూ ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్ వద్ద నిలపడానికి ఒక్కో దేశం తీసుకునే చర్యల ప్రణాళిక అది. 2031-35 మధ్య కాలంలో తీసుకోబోయే చర్యల జాబితా అయిన ఎన్‌డీసీని అనేక దేశాలు ఇక్కడ కాప్ 30 మహా సభ ప్రారంభం కావడానికి ముందే సమర్పించాయి. కేంద్ర మంత్రివర్గ చర్చలు, మరి ఇతర కార్యక్రమాలను పూర్తి చేసుకోవడానికి సమయం పట్టినందున తాము ముందే సమర్పించలేకపోయామని.. డిసెంబరులో ఆ పని పూర్తిచేస్తామని భూపేందర్ వివరించారు. 2070కల్లా కర్బన ఉద్గారాల తటస్థతను సాధించడానికి భారత్ ఇటీవల న్యూక్లియర్ మిషన్, హరిత ఉదజని మిషన్‌లను ప్రారంభించిందని ప్రకటించారు. పారిస్ వాతావరణ సభ తీర్మానానికి అనుగుణంగా భారత్‌లో కేవలం 16 నెలల్లో 200 కోట్ల మొక్కలు నాటినట్లు కేంద్రమంత్రి వివరించారు.

గుజరాత్ ఎమ్మెల్యే హార్దిక్ పటేల్‌పై నేరాభియోగాలు

అహ్మదాబాద్: గుజరాత్‌లో పటీదార్ రిజర్వేషన్ల కోసం జరిగిన ఆందోళనల సందర్భంగా పెట్టిన కేసులకు సంబంధించి మంగళవారం భాజపా ఎమ్మెల్యే హార్దిక్ పటేల్‌పై నేరాభియోగాలు నమోదయ్యాయి. అహ్మదాబాద్ గ్రామీణ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జీబీ సయాగ్ ఈ అభియోగాలకు ఆమోదం తెలిపారు. 2018లో ఈ రిజర్వేషన్ల కోసం ఆందోళనలు జరిగాయి. అప్పట్లో నికోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ కేసులు నమోదయ్యాయి.

సనాతన ధర్మ పరిరక్షణకు జీవోలు మారుస్తాం

ప్రైవేట్ ఆలయాల సమాచారం సేకరణ: మంత్రి ఆనం

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఆలయాల పవిత్రత, సనాతన ధర్మం పరిరక్షణకు అవసరమైతే పాత జీవోలను మార్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం నెల్లూరులో విలేకర్లతో ఆయన మాట్లాడారు. 'రాష్ట్రవ్యాప్తంగా దేవాదాయశాఖ అధికారులు వారి పరిధిలో ఉన్న ప్రైవేట్ ఆలయాలు, ఆధ్యాత్మిక సంస్థల వివరాలు సేకరించాలి. అక్కడ జరిగే కార్యక్రమాలతో ప్రత్యేక నివేదికలు తయారుచేయాలి. ప్రైవేట్ ఆలయాలు, సంస్థలపైనా ప్రభుత్వ పెత్తనం ఉండదు. కేవలం అక్కడ జరిగే కార్యక్రమాల పట్ల అవగాహన, సహకారం కోసమే ఈ నివేదికలు రూపొందిస్తున్నాం. ఇటీవల కాశీబుగ్గలో జరిగిన ఘటన నేపథ్యంలో ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నాం' అని పేర్కొన్నారు. అంతకుముందు దేవాదాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు 288 ఆలయాల పునర్నిర్మాణానికి రూ.221 కోట్లు కేటాయించామని వెల్లడించారు.

వేసవిలో తెలుగు రాష్ట్రాల్లో సద్గమయ కార్యక్రమం

తిరుమల, న్యూస్‌టుడే: వచ్చే వేసవిలో తెలుగు రాష్ట్రాల్లో 8, 9, 10 తరగతి విద్యార్థులకు వైదిక విలువలు, మానవీయ ధర్మాలు, వ్యక్తిత్వ నిర్మాణంపై శిక్షణ కార్యక్రమాన్ని 'సద్గమయ' పేరుతో నిర్వహించాలని నిర్ణయించినట్లు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. స్థానిక అన్నమయ్య భవనంలో మంగళవారం హిందూ ధర్మప్రచార పరిషత్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం, స్విమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌తో కలిసి ఛైర్మన్ బీఆర్ నాయుడు పాల్గొన్నారు. తిరుమలలోని అలిపిరిలో సంకీర్తనల సమీకరణ చేసుకున్న 7,856 భజన బృందాల నైపుణ్యాన్ని పరిశీలించి జిల్లా స్థాయిలో భజన ప్రదర్శనలు ఏర్పాటు చేసే ప్రణాళికకు ఆమోదం తెలిపారు. స్విమ్స్‌లో పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపారు.

ఎస్సీ విద్యార్థుల ఉపకార వేతనాలకు రూ.87 కోట్లు

ఈనాడు, అమరావతి: ఎస్సీ విద్యార్థుల ప్రీ మెట్రిక్ ఉపకారవేతనాలు చెల్లింపునకు రూ.87 కోట్లు విడుదల చేయడానికి ప్రభుత్వం పరిపాలనా అనుమతిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు సంబంధించి 9, 10 తరగతుల విద్యార్థుల ఉపకారవేతనాలకు ఈ మొత్తాన్ని విడుదల చేయనుంది.

పత్తి రైతులకు మద్దతు ధర కల్పించాలి

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల

ఈనాడు, అమరావతి: తేమ శాతంతో సంబంధం లేకుండా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా పత్తి కొనుగోలు చేయించి, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోళ్లు ప్రారంభించి రైతులకు మద్దతు ధర కల్పించాలని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 'తుపాను కారణంగా దిగుబడి తగ్గి రైతులు దిగులు చెందుతుంటే ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పించకుండా చోద్యం చూస్తోంది. క్వింటా పత్తికి కనీస మద్దతు ధర రూ.8,110 ఉండగా మార్కెట్‌లో గరిష్ఠంగా రూ.7 వేలు కూడా రావడం లేదు. మొక్కజొన్నకు కనీస మద్దతు ధర రూ.2,400 ఉంటే మార్కెట్‌లో రూ.1,400 కూడా ఇవ్వడం లేదు. వేరుశెనగ, మిర్చి వంటి పంటలకూ ఇదే పరిస్థితి' అని పేర్కొన్నారు.

రూ.9.28 కోట్లతో ప్రభుత్వ వసతి గృహాల్లో ఆర్వో ప్లాంట్లు

45 రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశం

ఈనాడు, అమరావతి: సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో కలుషిత నీటి ఘటనలు తరచూ జరుగుతుండటంతో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థులకు సురక్షిత నీటిని అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ సంక్షేమ వసతిగృహాలు సహా 49 ఎస్సీ గురుకులాలు, రెండు అంబేడ్కర్ స్టడీ సర్కిళ్లలో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు రూ.9.28 కోట్లు మంజూరుచేసింది. ఒక్కో ఎస్సీ వసతిగృహానికి రూ.2 లక్షల చొప్పున మొత్తం 311 వసతి గృహాల్లో ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు రూ.6.22 కోట్లు వెచ్చించనుంది. గురుకులాల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున అధిక సామర్థ్యం గల ఆర్వో ప్లాంట్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందుకోసం ఒక్కో దానికి రూ.6 లక్షల చొప్పున కేటాయించింది. 49 గురుకులాలు, రెండు స్టడీ సర్కిళ్లకు మొత్తం రూ.3.06 కోట్లు విడుదల చేసింది. వీటన్నింటినీ 45 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పాలకొల్లులో అంబేడ్కర్ కమ్యూనిటీ భవన్

ఈనాడు, అమరావతి: పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ భవనం ఏర్పాటు కానుంది. ఈ మేరకు రూ.75 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

30 మంది ఇన్‌సర్వీసు టీచర్ల దరఖాస్తుల తిరస్కరణ

ఈనాడు, అమరావతి: 30 మంది ఇన్ సర్వీసు టీచర్లు అనుమతి లేకుండానే బీఈడీ, బీపీఈడీ ప్రవేశ పరీక్షలు రాశారని పేర్కొంటూ వారి ఉన్నత చదువుల దరఖాస్తులను పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ తిరస్కరించింది. అనంతపురం, కాకినాడ, కృష్ణా, కర్నూలు, నంద్యాల, నెల్లూరు, ప్రకాశం, శ్రీసత్యసాయి, విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన టీచర్ల దరఖాస్తులు చేసుకోగా రిమార్కులతో డీఈవోలకు తిప్పి పంపింది. జీఓ-342 ప్రకారం ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లు ఉన్నత చదువులకు అనుమతి కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. ఈ నిబంధన ప్రకారం కొంత మంది సాధ్యాసాధ్యాలు ప్రవేశ పరీక్షలు రాశారు. కానీ డీఈవో అనుమతి లేకుండా ప్రవేశ పరీక్ష రాశారని రిమార్కుల్లో పేర్కొంటూ ఆయా జిల్లా డీఈవోలకు వెనక్కి పంపింది.

హమ్మయ్య 'గట్టె'క్కించారు!

మండ్య, న్యూస్‌టుడే: కర్ణాటకలోని మళవళ్లి తాలూకా శివనసముద్ర కాలువలోకి దిగిన ఓ ఏనుగును 48 గంటల తర్వాత బయటకు తీశారు. శనివారం రాత్రి నీటి కోసం వచ్చిన ఏనుగు 50 అడుగుల లోతున్న కాలువలోకి దిగింది. తర్వాత పైకి రాలేక ఇబ్బందిపడుతుండగా స్థానికులు ఆదివారం గుర్తించారు. సమాచారం అందుకున్న విద్యుత్తు ఉత్పత్తి కేంద్ర ప్రతినిధులు, అటవీశాఖ సిబ్బంది సోమవారం ఉదయం నుంచి బయటికి తీసేందుకు యత్నించారు. కాలువలోకి నీరు రాకుండా గేట్లను మూసివేసి, ఏనుగుకు ఓ వైపు ఆహారం అందిస్తూ వచ్చారు. క్రేన్‌లో ఎక్కేందుకు ఏనుగు భయపడుతుండగా, దానికి మత్తు ఇచ్చి క్రేన్లతో మంగళవారం మధ్యాహ్నానికి పైకి తీసుకొచ్చారు. ప్రథమచికిత్స చేసి, కోలుకున్నాక అడవిలో వదులుతామని అటవీశాఖ అధికారులు తెలిపారు.




నీటి కాలువలో ఏనుగు ◆ క్రేను సాయంతో బయటకు తీస్తున్న సిబ్బంది

విదేశాల్లో మైనింగ్‌పై ఏపీఎండీసీ ఆసక్తి

- ఆఫ్రికా దేశాల్లోని ఖనిజాలపై దృష్టి
- ఏదైనా ప్రైవేటు సంస్థతో కలిసి పనిచేసే యోచన

ఈనాడు, అమరావతి: విదేశాల్లో మైనింగ్ కార్యకలాపాలు చేపట్టేందుకు ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) దృష్టిసారించింది. ముఖ్యంగా ఆఫ్రికన్ దేశాల్లో గనులు దక్కించుకొని, తవ్వకాలు చేసి.. సంస్థకు అదనపు రాబడి పెంచుకోవాలని భావిస్తోంది. సంస్థకు దశాబ్దాల తరబడి మంగంపేట ముగ్గురాయి తవ్వకాల్లో అనుభవముంది. చీమకుర్తిలో గ్రానైట్ లీజులూ నిర్వహిస్తోంది. కొంతకాలంగా మధ్యప్రదేశ్‌లోని సులియారీలో బొగ్గుగనుల్లో తవ్వకాలు ఆరంభించింది. ఈ అనుభవంతో విదేశాల్లో లీజులు తీసుకోవాలని భావిస్తోంది. ఇప్పటికే జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్‌ఎండీసీ) వివిధ దేశాల్లో మైనింగ్ కార్యకలాపాలు ఆరంభించింది. అదే విధంగా ఏపీఎండీసీ కూడా ప్రణాళిక సిద్ధం చేసుకుంటోంది. ఆఫ్రికాలో లభించే ఇనుప ఖనిజం, బొగ్గుతోపాటు పలు ముఖ్య ఖనిజాల గనులు తీసుకోవాలనుకుంటోంది. ఇందుకు ఏదైనా ప్రైవేటు సంస్థతో కలిసి జాయింట్ వెంచర్‌గా ప్రాజెక్టులు చేపట్టాలని చూస్తోంది. ఏ దేశాల్లో ఏ గనులు దక్కించుకుంటే రాబడి వచ్చే అవకాశముందో అధ్యయనం చేయాలంటూ సలహా సంస్థ కేపీఎంజీని ఆదేశించింది. ఈ మేరకు కసరత్తు మొదలైంది. త్వరలో దీనిపై ముందడుగు పడే అవకాశం ఉందని ఏపీఎండీసీ వర్గాలు తెలిపాయి.

మన బొగ్గు బ్లాకుల్లోనూ.. బిడ్లు వేద్దాం

మన రాష్ట్ర పరిధిలోని బొగ్గు గనులకు ప్రభుత్వరంగ సంస్థ టెండర్లు వేసి, పోటీలో నిలవాలని సీఎం చంద్రబాబు ఇటీవల సూచించారు. దీంతో ఏలూరు జిల్లాలోని చింతలపూడి, సోమవరం బొగ్గు బ్లాక్‌లకు టెండర్లు వేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

- ◆ సోమవరం బ్లాక్‌లో సగటున జి-13 రకం బొగ్గు లభిస్తుంది. ఇది 38.08 చదరపు కి.మీ. మేర విస్తరించి ఉంది.
- ◆ చింతలపూడి బ్లాక్‌లో సగటున జి-12 రకం బొగ్గు లభిస్తుంది. బ్లాక్ 12.04 చదరపు కి.మీ.మేర ఉంది.

గ్యాస్ ఉత్పత్తికి అవకాశం

చింతలపూడి, సోమవరం బొగ్గు బ్లాక్‌ల్లో భూగర్భ మైనింగ్ చేయాలి. అలా చేస్తే సంస్థకు గిట్టుబాటు కాదని కొందరు నిపుణులు అంటున్నారు. దీనికి బదులు ప్రత్యేక పద్ధతిలో భూమి లోపలి నుంచి మీథేన్ గ్యాస్ ఉత్పత్తి చేయవచ్చని సూచిస్తున్నారు. ఈ బ్లాక్‌లకు టెండర్లు దాఖలు చేసేందుకు డిసెంబరు 24 వరకు గడువు ఉంది. ఆలోపు అధ్యయనం చేసి బిడ్లు వేసేందుకు ఏపీఎండీసీ సమాయత్తమవుతోంది.

72 వేల క్వింటాళ్ల పత్తి సేకరణ

మంత్రి అచ్చెన్నాయుడు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 11 మార్కెట్ యార్డులు సహా 64 జిన్నింగ్ మిల్లుల్ని పత్తి కొనుగోలు కేంద్రాలుగా ప్రకటించామని, ఇప్పటివరకు 19 జిన్నింగ్ మిల్లుల ద్వారా 72,240 క్వింటాళ్ల పత్తి సేకరించామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. పత్తి రైతుల ఇబ్బందుల్ని పరిష్కరించేందుకు గతంలో తాము కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్‌కు వినతిపత్రం పంపామని, దానిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు మంగళవారం ఓ ప్రకటనలో వివరించారు. ఎల్1, ఎల్2, ఎల్3 జిన్నింగ్ మిల్లుల్ని ఒకేసారి ప్రారంభించడం, తేమను 18% వరకు అనుమతించడం సహా తడిసి, రంగు మారిన పత్తిని తగిన ధరలకు కొనుగోలు చేయడానికి కేంద్రంపై ఒత్తిడి తెచ్చామని పేర్కొన్నారు. స్లాట్ బుకింగ్ సమయంలో రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులు రైతులకు సహకారం అందించాలని సూచించారు.

యూనివర్సల్ హెల్త్ పాలసీ పేదలకు వరం

ఏపీ బయోడైవర్సిటీ ఛైర్మన్ విజయ్‌కుమార్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా ప్రతి కుటుంబానికీ ఆరోగ్య బీమా కల్పించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకురానున్న 'యూనివర్సల్ హెల్త్‌పాలసీ' పేదల పాలిట వరమని రాష్ట్ర బయోడైవర్సిటీ ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ తెలిపారు. మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. "పేద, ధనిక తేడా లేకుండా ప్రతి కుటుంబానికి ఈ పథకం వర్తిస్తుంది. 2,493 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 31 సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో సేవలు పొందవచ్చు. ఈ పథకంతో 1.63 కోట్ల కుటుంబాలకు మేలు కలుగుతుంది" అని విజయ్‌కుమార్ వివరించారు. వైకాపా పాలనలో ఆరోగ్యశ్రీ పేరుతో వేర్వేరు ప్యాకేజీలు, ధరలతో వైద్యం అందించి ప్రజలను గందరగోళంలోకి నెట్టేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అన్నింటినీ ఒకే ప్యాకేజీ కింద తీసుకొచ్చి నాణ్యమైన వైద్యం అందేలా వ్యవస్థను రూపొందించిందని కొనియాడారు.

రూ.600 కోట్లతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో సీసీబీల నిర్మాణాలు

- వచ్చే ఆగస్టుకు పూర్తి చేయాలని ప్రణాళికలు

ఈనాడు, అమరావతి: అత్యవసర వైద్యసేవలకు వీలుగా రాష్ట్రంలోని 24 ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్రిటికల్ కేర్ బ్లాకుల (సీసీబీ) నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య, మౌలిక సదుపాయాల మిషన్‌లో భాగంగా రూ.600 కోట్లతో ఈ నిర్మాణాలను దశలవారీగా వచ్చే ఏడాది ఆగస్టు నాటికి పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం నెల్లూరు, ఒంగోలు బోధనాసుపత్రుల్లో సీసీబీల నిర్మాణం కొలిక్కివచ్చింది. వచ్చే నెలలో కడప, కర్నూలు, తిరుపతి, హిందూపురం, అనంతపురం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ఆసుపత్రుల్లో వీటిని పూర్తిచేయాలని నిర్ణయించారు. 2026 మార్చి నాటికి తెనాలి జిల్లా ఆసుపత్రిలో, ఆగస్టు నాటికి పాడేరు, పాలకొండ, కాకినాడ, భీమవరం, ఏలూరు, మచిలీపట్నం, నరసరావుపేట, చీరాల, నంద్యాల, రాయచోటి ఆసుపత్రుల్లో సీసీబీల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం. 50 పడకలతో ఏర్పాటయ్యే 22 సీసీబీల్లో యంత్ర పరికరాలతో కలిపి ఒక్కోదానికి రూ.23.75 కోట్ల చొప్పున వెచ్చిస్తున్నారు. నరసరావుపేటలో 75 పడకల సీసీబీకి రూ.36.35 కోట్లు, తెనాలి జిల్లా ఆసుపత్రిలో 100 పడకల సీసీబీకి రూ.44.50 కోట్లు కేటాయిస్తున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. వీటిని నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

కల్తీ అని తెలిసినా.. అనుమతించడానికి కారణమేంటి?

- ప్రీమియర్ అగ్రిఫుడ్స్‌కు ఎందుకు వత్తాసు పలికారు
- రెండోరోజూ చిన్న అప్పన్నకు సిట్ ప్రశ్నలు

ఈనాడు-తిరుపతి, తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: 'ప్రీమియర్ అగ్రిఫుడ్స్ నిర్వాహకులతో నీకు ఎప్పటి నుంచి పరిచయం ఉంది.. తితిదే నెయ్యి సరఫరా కాంట్రాక్టు వారికి కట్టబెట్టేలా ఎందుకు ప్రయత్నించారు' అంటూ సిట్ అధికారులు తితిదే మాజీ ఛైర్మన్, వైకాపా రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాజీ వ్యక్తిగత కార్యదర్శి చిన్న అప్పన్నను రెండోరోజు ప్రశ్నించారు. వారు టెండర్‌లో పాల్గొని.. నిబంధనల ప్రకారం కాంట్రాక్టు దక్కించుకున్నారని.. ఇందులో తన ప్రమేయం ఏమీలేదని అప్పన్న చెప్పినట్లు సమాచారం. తిరుపతి తూర్పు పీఎస్ కస్టడీలో ఉన్న చిన్న అప్పన్నను స్థానిక భూదేవి కాంప్లెక్స్‌లోని సిట్ కార్యాలయానికి తీసుకొచ్చి రెండోరోజు మంగళవారం విచారించారు. ప్రీమియర్ అగ్రిఫుడ్స్ సంస్థతో సంబంధం లేకపోతే రూ.50లక్షలు దిల్లీలో వారి ప్రతినిధుల నుంచి ఎందుకు తీసుకున్నారని అడగ్గా.. ఆయన సమాధానం దాటవేసినట్లు తెలిసింది. 'మైసూరు ల్యాబ్‌పరీక్షల్లో కల్తీనెయ్యిగా నిర్ధారణ అయినప్పటికీ.. మీ ఒత్తిడివల్లే ట్యాంకర్లలో కల్తీనెయ్యి తిరుమలకు వచ్చినట్లు విచారణలో తేలింది. అందులో తితిదే పెద్దలు, అధికారుల ప్రమేయం ఏమైనా ఉందా' అని ప్రశ్నించగా మౌనం వహించిన ఆయన అదే సమయంలో కల్తీ నెయ్యి గురించి తనకంటే తితిదే ప్రొక్యూర్‌మెంట్ అధికారులకే తెలియాలని చెప్పినట్లు సమాచారం. విశాఖ, విజయనగరంలో రూ.కోట్ల విలువ చేసే ఆస్తులు.. ఎక్కడి ఆదాయంతో కొన్నారని ప్రశ్నించగా గతంలో పలు ఉద్యోగాలు చేసి డబ్బు పోగుచేసినట్లు తెలిపారు. విచారణ అనంతరం చిన్న అప్పన్నను తిరుపతి తూర్పు పోలీసుస్టేషన్‌కు తరలించారు.

వైవీ విచారణకు హైదరాబాద్‌కు బృందం

తితిదే మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని కల్తీనెయ్యి కేసులో విచారించేందుకు సిట్ అధికారుల బృందం బుధవారం హైదరాబాద్‌కు వెళుతున్నట్లు సమాచారం. వైవీ సుబ్బారెడ్డికి కల్తీ నెయ్యి గురించి తెలిసినా తిరుమలకు అనుమతించినట్లు సిట్ అధికారుల విచారణలో తేలింది. ప్రీమియర్ అగ్రిఫుడ్స్ నుంచి చిన్న అప్పన్న రూ.50 లక్షలు తీసుకున్నారని నిర్ధారణ కాగా.. అదే సమయంలో వైవీ సుబ్బారెడ్డి దంపతుల లావాదేవీల వివరాలు ఇవ్వాలని యాక్సిస్ బ్యాంకు అధికారులను సిట్ కోరింది. ఈ కోణంలో వైవీ సుబ్బారెడ్డిని విచారించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

గోదారిపాలైన బతుకులు

- కోనసీమలో పిల్లలను నదిలోకి తోసి ఆత్మహత్య చేసుకున్న ఫైనాన్స్ వ్యాపారి!

తండ్రి, కుమారుడి మృతదేహాలు లభ్యం • కుమార్తె కోసం కొనసాగుతున్న గాలింపు

మలికిపురం, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం లక్కవరానికి చెందిన ఓ వ్యక్తి తన ఇద్దరు పిల్లలను గోదావరిలోకి తోసేసి తానూ దూకి ఆత్మహత్య చేసుకున్నారు. తండ్రి, కుమారుడి మృతదేహాలు బయటపడగా కుమార్తె ఆచూకీ లభ్యం కావాల్సి ఉంది. లక్కవరం గ్రామానికి చెందిన శిరిగినీడి దుర్గాప్రసాద్ (37) ఫైనాన్స్ వ్యాపారం చేస్తారు. ఆయనకు భార్య నాగవేణి, కుమారుడు మోహిత్ (13), కుమార్తె జాహ్నవి (9) ఉన్నారు. వారం రోజులుగా విశ్వేశ్వరాయపురంలోని అత్తవారి ఇంటి వద్ద దుర్గాప్రసాద్ కుటుంబం ఉంటోంది. ఆధార్ వివరాలు అప్‌డేట్ చేయాలంటూ సోమవారం సాయంత్రం ఇద్దరు పిల్లలను తీసుకొని ఇంటినుంచి దుర్గాప్రసాద్ ద్విచక్రవాహనంపై బయలుదేరారు. రాత్రి పశ్చిమగోదావరి జిల్లా చించినాడ వశిష్ఠ వారధిపై ద్విచక్ర వాహనం, వారి పాదరక్షలు, కొంతమంది మొబైల్ నంబర్లతో కూడిన కాగితం కనిపించాయి. పోలీసులు, కుటుంబసభ్యులు మంగళవారం ఉదయం నుంచి గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రానికి వారధి వద్ద దుర్గాప్రసాద్, సమీపంలోని ప్రైవేటు రిసార్ట్స్ వద్ద గోదావరిలో మోహిత్ మృతదేహాలను గుర్తించారు. జాహ్నవి ఆచూకీ కానరాలేదు. బుధవారం ఉదయం మళ్లీ గాలించనున్నట్లు మలికిపురం ఎస్సై పి.సురేశ్ తెలిపారు. దుర్గాప్రసాద్ వంతెనపై నుంచి పిల్లలను నదిలోకి తోసేసి తానూ ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఘటనకు కారణం ఆర్థిక సమస్యలా.. ఇంకేమైనా వివాదాలా అన్నది తెలియరాలేదు.



దుర్గాప్రసాద్ ◆ మోహిత్ ◆ ఆచూకీ కానరాని జాహ్నవి

కరుణాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డిలను రక్షించడానికే సతీష్‌కుమార్ హత్య

ఏపీ లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు

ఈనాడు, అమరావతి: తిరుమల పరకామణిలో సహాయ విజిలెన్స్ భద్రత అధికారి(ఏవీఎస్‌వో)గా పనిచేసిన వై.సతీష్‌కుమార్‌ది ముమ్మాటికీ వైకాపా నేతలు చేసిన హత్యేనని, సాక్ష్యాధారాలు తారుమారు చేసేందుకే హతమార్చారని ఏపీ లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు ఆరోపించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అప్పట్లో అవినాష్‌రెడ్డి కోసం వరుస హత్యలు చేయించిన వైకాపా.. ఇప్పుడు సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డిల కోసం సతీష్‌కుమార్‌ను హత్య చేయించిందని ఆరోపించారు. వైకాపా ప్రజా సేవ పార్టీ కాదని, ఉగ్రవాద పార్టీ అని విమర్శించారు. సతీష్‌కుమార్ హత్యవెనుక కరుణాకర్‌రెడ్డి హస్తం ఉందని, మెడకు చుట్టుకుంటుందనే భయంతోనే ప్రెస్‌మీట్ పెట్టి అది ఆత్మహత్య అని చెప్పారని మాణిక్యరావు గుర్తుచేశారు. పరకామణిలో రూ.వేల కోట్లు దోచుకున్న రవికుమార్. . వెంకన్నకు ఆస్తులు ఇచ్చిన దాత ఎలా అవుతారని ప్రశ్నించారు. ఆయనకు వైకాపా నుంచి ప్రాణహాని ఉన్నందున రక్షణ కల్పించాలని సూచించారు.

ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొన్న మరో టిప్పర్

- సీటులో ఇరుక్కుపోయి ఏడు గంటలపాటు డ్రైవర్ నరకయాతన

విశాఖపట్నం(పెందుర్తి), న్యూస్‌టుడే: ఆగి ఉన్న టిప్పర్‌ను మరో టిప్పర్ బలంగా ఢీకొట్టిన ఘటనలో డ్రైవర్ సీటులో ఇరుక్కుపోయి నరకయాతన అనుభవించాడు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు ఏడు గంటలపాటు శ్రమించి అతణ్ని సురక్షితంగా బయటకు తీశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున 5 గంటలకు కంకర లోడుతో వెళ్తున్న ఓ టిప్పర్ టైర్ పేలిపోవడంతో విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం రాంపురం వద్ద జాతీయ రహదారి పక్కన నిలిపి ఉంచారు. అదే సమయంలో ఫ్లైయాష్ లోడుతో వెళ్తున్న మరో టిప్పర్ అతి వేగంగా దాన్ని ఢీకొట్టింది. వెనకాల ఉన్న టిప్పర్ ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఆ వాహనంలో ఉన్న అనకాపల్లి జిల్లా వెంకన్నపాలెం గ్రామానికి చెందిన డ్రైవర్ డొక్కరి సాయికుమార్(30) ఎడమ కాలు సీటులో ఇరుక్కుపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కట్టర్లతో టిప్పర్‌ను కత్తిరించడానికి ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. దీంతో పొక్లెయిన్‌ను తీసుకొచ్చి టిప్పర్లను వేరు చేయాలని చూశారు. ఎట్టకేలకు కొన్ని ప్రయత్నాల తర్వాత మధ్యాహ్నం 12.10 గంటలకు డ్రైవర్‌ను బయటకు తీసి అనకాపల్లి జిల్లా ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం డ్రైవర్ ఆరోగ్యం నిలకడగా ఉందని ట్రాఫిక్ ఎస్సై నరసింగరాజు తెలిపారు.



సీటులో ఇరుక్కుపోయి అవస్థలు పడుతున్న డ్రైవర్ సాయికుమార్



ప్రమాద స్థలంలో కొనసాగుతున్న సహాయక చర్యలు

అదనపు సీట్లు కోల్పోయిన పాడేరు వైద్య కళాశాల

- అధికారుల నిర్వాకంతో ఈ ఏడాది చేజారిన అవకాశం
- బాధ్యులకు షోకాజ్ నోటీసు ఇవ్వాలని మంత్రి ఆదేశం

ఈనాడు, అమరావతి: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాల ఈ ఏడాదికి అదనపు సీట్లు పొందే అవకాశం కోల్పోయింది. జాతీయ వైద్యమండలి (ఎన్ఎంసీ) మార్గదర్శకాల ప్రకారం మౌలిక వసతులు, బోధకులు, ఇతర సిబ్బందిని నియమించినా.. అదనపు సీట్లు తెచ్చుకోవడంలో వైద్య విద్య విభాగం విఫలమైంది. కొందరు అధికారుల నిర్వాకం, ఉన్నతాధికారుల నిశిత అనుశీలన లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. తరచూ సమీక్షల్లో ఎన్ఎంసీతో సంప్రదింపులు జరుపుతున్నామని, అదనపు సీట్లు వస్తాయని డీఎంఈ సహా ఇతర అధికారులు చెప్పుకొచ్చారు. తాజాగా వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పాడేరు కళాశాలపై ఆరా తీస్తే.. అదనపు సీట్లు వచ్చే అవకాశం లేదని అధికారులు వెల్లడించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని వైద్యారోగ్యశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్‌ను ఆదేశించారు. పాడేరు వైద్య కళాశాలను 50 సీట్లతో నిర్వహిస్తున్నారు. 2025-26 సంవత్సరానికి 50 సీట్లు అదనంగా మంజూరు చేయాలని ప్రిన్సిపల్.. ఎన్ఎంసీకి దరఖాస్తు చేశారు. దీన్ని పరిశీలించిన ఎన్ఎంసీ.. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నుంచి గతేడాది పొందిన అనుమతి (కాన్సెంట్ ఆఫ్ అఫిలియేషన్) సరైన ఫార్మాట్‌లో పంపాలని, కళాశాల నిర్వహణ వీడియోలు పంపాలని సూచించింది. ఎన్ఎంసీ కోరిన రెండు వివరణలు అప్పీళ్లు పరిశీలించే విభాగానికి కాకుండా వేరొక విభాగానికి పంపడంతో సీట్లు కోల్పోవాల్సి వచ్చింది.

ఎంఎస్ఎంఈ సాంకేతిక అభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలి: మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఈనాడు, దిల్లీ: రాష్ట్రంలోని కేంద్ర ప్రభుత్వ పారిశ్రామిక నోడ్ కొప్పర్తిలో ఎంఎస్ఎంఈ సాంకేతిక అభివృద్ధి కేంద్రంతో పాటు ఐదు చోట్ల విస్తరణ, అభివృద్ధి కేంద్రాలు ఏర్పాటుచేయాలని ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం దిల్లీకి వెళ్లిన ఆయన మంగళవారం కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి రజనీష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. జేఎన్‌టీయూ విజయనగరం, అనంతపురం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ, గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, నంద్యాల జిల్లా బేతంచెర్ల, నెల్లూరు జిల్లాలో ఎంఎస్ఎంఈ విస్తరణ అభివృద్ధి కేంద్రాలు నెలకొల్పాలని కోరారు.

వైకాపా నేతలు మా భూమి ఆక్రమించి దాడి చేశారు

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: కర్నూలు జిల్లా పునులూరులోని తమ భూమిని వైకాపా హయాంలో ఆ పార్టీ నేతలు ఆక్రమించి, తనపై దాడిచేశారని అయ్యస్వామి అనే వ్యక్తి వాపోయారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. తెదేపా కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఫరూక్, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అజీజ్ ప్రజల నుంచి మంగళవారం వినతులు స్వీకరించారు. అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఆమె మామ కంగాటి వెంకటరెడ్డి కలిసి మోసపూరిత అగ్రిమెంట్ రాయించి తమ కుటుంబానికి వంశపారంపర్యంగా వస్తున్న భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం కోసానపల్లికి చెందిన వెంకటరాము ఫిర్యాదు చేశారు. 32 ఏళ్లుగా సాగుచేసుకుంటున్న 4.96 ఎకరాల భూమి చుట్టూ ఉన్న దారిని వైకాపా నేతలు ఆపేశారని పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం చక్రాయపాలెం గ్రామానికి చెందిన చంద్రనాయక్ ఫిర్యాదు చేశారు.

కొత్త టీచర్లకు సెలవులు మంజూరు చేయాలి: ఏపీటీఎఫ్

ఈనాడు, అమరావతి: మెగా డీఎస్సీ ద్వారా నియమితులైన కొత్త టీచర్లకు సెలవుల సౌకర్యం కల్పించాలని ఏపీ ఉపాధ్యాయ సమాఖ్య(ఏపీటీఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హృదయరాజు, చిరంజీవి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. "లీవ్ యాప్‌లో సెలవులు కనిపించకపోవడంతో కొత్త టీచర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారికి వెంటనే అర్హత గల సెలవులను మంజూరు చేయాలి. మరోవైపు ఇన్ సర్వీసు ఉపాధ్యాయులుగా పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గానికి చెందిన వారు ఉన్నత విద్యార్హతలు పొందడానికి చేసుకుంటున్న దరఖాస్తులను చిన్నచిన్న కారణాలతో తిరస్కరిస్తున్నారు. ఇలాంటి వాటిని పునఃపరిశీలించాలి" అని పేర్కొన్నారు.

జోరుగా పన్నుల రాబడి


ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆశించిన పన్నుల రాబడిలో సగం మేర ఖజానాకు చేరింది. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తం మీద రాష్ట్ర పన్నుల రాబడి రూ.1,66,573.09 కోట్లుగా అంచనా వేశారు. అక్టోబరు నెలాఖరుకు రూ.82,983.17 కోట్లు వచ్చింది. ఏడు నెలల్లో సగం రాబడి సాధించింది.

పన్నుల రాబడి అంచనాలు, సాధించింది (అంకెలన్నీ రూ.కోట్లలో)

అంశం	ఏడాది బడ్జెట్ మొత్తం అంచనా	అక్టోబరు నెలాఖరు వరకు వచ్చింది
జీఎస్టీ	57,477.15	30,170.98
స్టాంపులు, రిజిస్ట్రేషన్ల వసూళ్లు	13,150.44	6,227.48
భూమి శిస్తు	221.94	98.03
అమ్మకపు పన్ను	20,873.65	10,249.14
రాష్ట్ర ఎక్సైజ్ డ్యూటీ	27,097.26	9,998.00
కేంద్ర పన్నుల్లో వాటాలు	40,807.28	23,017.05
ఇతర పన్నులు, సుంకాలు	6,945.37	3,222.49
మొత్తం పన్నుల రాబడి	**1,66,573.09**	**82,983.17**

ఆస్తుల సృష్టికి రూ.13,942.50 కోట్లు: ఏడు నెలల్లో రాష్ట్రం ఆస్తుల సృష్టికి ఉపయోగపడే ఖర్చు రూ.13,942.50 కోట్లు చేసింది. ఇది బడ్జెట్ అంచనాల్లో దాదాపు 35%. రెవెన్యూ ఖర్చులను రూ.1,39,444.97 కోట్లుగా పేర్కొంది. రెవెన్యూ రాబడితో పోలిస్తే ఖర్చు ఎక్కువగా ఉంది. రెవెన్యూ లోటు బడ్జెట్ అంచనాల్లో ఏడు నెలలకు 144.05% ఉంది. ఏడాది అంచనాలతో పోలిస్తే రెవెన్యూ లోటు ఇప్పటికే 44% అధికంగా ఉంది.

అపెక్మా అధ్యక్షుడిగా కోయ సుబ్బారావు



కోయ సుబ్బారావు గ్రంధి సత్యనారాయణ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ (అపెక్మా) నూతన అధ్యక్షుడిగా గుంటూరు జిల్లా కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ కోయ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా తాడేపల్లిగూడెం వాసవి ఇంజినీరింగ్ కళాశాల యజమాని గ్రంధి సత్యనారాయణ ఎన్నికయ్యారు. కానూరులోని అపెక్మా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల్లో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా లింగయ్యాస్ ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ గద్దె రాజ్‌లింగ్, ఉపాధ్యక్షుడుగా కేవీ సుబ్బారెడ్డి, ప్రగతి కృష్ణారావు, వి.వి.నాగేశ్వరరావు, కార్యదర్శులుగా కేవీవీ సత్యనారాయణ, ఎస్.వెంకటరామిరెడ్డి, మదనపల్లి రమణారెడ్డి ఎంపికయ్యారు.

కాణిపాకంలో రూ.25 కోట్లతో.. వసతి కాంప్లెక్స్, వివాహ హాళ్లు

తితిదే ఆర్థిక సాయానికి ప్రభుత్వం అనుమతి

ఈనాడు, అమరావతి: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయం వద్ద భక్తులకు వసతి కాంప్లెక్స్, సామూహిక వివాహాల కోసం పెద్దహాళ్ల నిర్మాణానికి తితిదే రూ.25 కోట్ల ఆర్థికసాయం అందించేందుకు ప్రభుత్వం అనుమతించింది. దీనిపై అక్టోబరు 28న తితిదే బోర్డు ఆమోదించిన ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపారు. ఈ మేరకు అనుమతిస్తూ మంగళవారం ఉత్తర్వు జారీచేసింది. వరసిద్ధి వినాయక ఆలయ ఈవో టెండర్లు పిలిచి, ఈ పనులు చేపట్టవచ్చని దేవాదాయశాఖ కార్యదర్శి డాక్టర్ హరిజవహర్‌లాల్ పేర్కొన్నారు. వీటి నిర్మాణాల సమయంలో విడతల వారీగా తితిదే ఆర్థికసాయాన్ని అందిస్తుందని తెలిపారు.

వయోజన విద్య డైరెక్టర్‌గా రంజిత్ బాషా

ఈనాడు, అమరావతి: ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ రంజిత్ బాషాకు వయోజన విద్య డైరెక్టర్, ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఇన్‌ఛార్జిగా ఉన్న నారాయణ భరత్ గుప్తాను రిలీవ్ చేస్తున్నట్లు పేర్కొంది.

'పోలవరాని'కి ఆ అడ్డంకి వద్దు

- పనుల నిలుపుదల ఉత్తర్వులు శాశ్వతంగా తొలగించాలి
- అంతర్రాష్ట్ర సమస్యలు పరిష్కరిస్తున్నాం
- కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం మరో లేఖ

ఈనాడు, అమరావతి: ఒకవైపు పోలవరం ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నా.. మరోవైపు ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు అనుమతులు తీసుకోవాల్సి వస్తోంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు కొనసాగించేందుకు కేంద్ర అటవీ పర్యావరణ శాఖ 2026 జులై 7 వరకు తాజాగా అనుమతులు ఇవ్వగా.. నిషేధ ఉత్తర్వులను శాశ్వతంగా ఎత్తేసి ప్రాజెక్టు నిర్మాణానికి ఇబ్బందులు లేకుండా చూడాలని కేంద్రాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ కోరుతోంది.

తరచూ ఈ పరిస్థితి ఎందుకు?

పోలవరం బహుళార్థసాధక ప్రాజెక్టు. గోదావరిపై +45.72 మీటర్ల ఎత్తున నిర్మిస్తుండటం, ఆ మేరకు నీటి నిల్వ వల్ల ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాలపై పడే ప్రభావంతో అక్కడ అవసరమైన ప్రత్యామ్నాయ చర్యలను ఏపీ చేపట్టాలి. ఆ రాష్ట్రాల్లో ముంపు ఏర్పడకుండా గోదావరి తీరం వెంబడి కరకట్టల ఎత్తు పెంచేందుకు, రక్షణ గోడలు నిర్మించేందుకు చేయాల్సిన పనులపై ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో ప్రజాభిప్రాయ సేకరణ చేయాలి. ఆ ప్రక్రియ పూర్తిచేయకపోవడంతో ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులపై 2011లో కేంద్ర అటవీ పర్యావరణ శాఖ నిషేధం విధించింది. అప్పటి నుంచి ఆంధ్రప్రదేశ్ తరఫున సాగుతున్న ప్రయత్నాలు, ఎదురవుతున్న అడ్డంకులను వివరిస్తూ ఎప్పటికప్పుడు ఆ ఉత్తర్వులపై ప్రభుత్వం స్టే పొందుతూ వస్తోంది. దాంతోనే పోలవరం పనులు కొనసాగిస్తోంది. ఇలా ఇప్పటివరకు 10 సార్లు అనుమతులు తీసుకోవాల్సి వచ్చింది. ఇప్పుడీ నిషేధ ఉత్తర్వులను శాశ్వతంగా తొలగించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తాజాగా మరో లేఖ రాసింది. ఏపీ తరఫున అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించి చేయాల్సిన పనులన్నీ పూర్తి చేసినందున పనుల నిలిపివేత ఉత్తర్వులను పూర్తిగా ఎత్తివేయాలని కోరుతోంది.

◆ పోలవరం అంతర్రాష్ట్ర వివాదాలకు సంబంధించి సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు కేంద్ర జల శక్తి శాఖ ఒక కమిటీని నియమించింది. ఎం.గోపాలకృష్ణన్ అనే నిపుణుడి ఆధ్వర్యంలో కేంద్ర జల సంఘం కమిటీ ఈ అంశాన్ని పరిష్కరించాలని ఆదేశించింది. గోదావరి అవార్డు ప్రకారమే ప్రాజెక్టు నిర్మాణం సాగుతోందని వారు తేల్చి చెప్పారు. భాగస్వామ్య రాష్ట్రాల అభ్యంతరాలు పరిష్కరించే ప్రయత్నాలు కొనసాగించాలని సుప్రీంకోర్టు కేంద్రానికి సూచించింది. దాంతో కేంద్ర జల సంఘం ఛైర్మన్ ఆధ్వర్యంలో ఉన్న కమిటీ అనేక సమావేశాలు నిర్వహించింది. నాలుగు రాష్ట్రాల సీఎస్‌లతో సమావేశం ఏర్పాటుచేయడంతో పాటు 3 సార్లు సాంకేతిక అంశాలపై సమావేశాలు నిర్వహించింది.

◆ ఆయా రాష్ట్రాల అభ్యంతరాల నివృత్తికి కేంద్ర జల సంఘం అన్ని ప్రయత్నాలూ చేసింది. వారి అభ్యంతరాలపై శాస్త్రీయ సమాచారం అంతా ఆయా రాష్ట్రాలకు అందించింది. వారి అభ్యంతరాలపై చేపట్టిన అధ్యయన నివేదికల ఫలితాలూ ఆయా రాష్ట్రాలకు అందించింది.

◆ ఒడిశా తప్ప ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలు సంయుక్త సర్వేకు అంగీకరించాయి.

◆ తెలంగాణలో భద్రాచలం, మణుగూరుల్లో రక్షణ పనులను పోలవరం రెండో దశలో చేపట్టనున్నట్లు పోలవరం అథారిటీ పేర్కొంది. గోదావరిలో ఆరు వాగులు కలిసే చోట ముంపు సమస్య అధ్యయనానికి పోలవరం అథారిటీ అంగీకరించింది. కిన్నెరసాని, ముర్రేడు వాగులు గోదావరిలో కలిసే చోట ఎంత ముంపు ఉంటుందో ఆ ప్రాంతాన్ని ఏపీ, తెలంగాణ సంయుక్త సర్వేలో గుర్తించేందుకు ఏపీ అంగీకరించింది.

◆ ఛత్తీస్‌గఢ్‌లో +150 అడుగుల నుంచి +177 అడుగులకు సంబంధించి ముంపు ఎలా ఉంటుందో ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సంయుక్త సర్వే పూర్తి అయింది. ఇంకా ఛత్తీస్‌గఢ్ అధికారుల నుంచి సర్వే నివేదికలు రావాల్సి ఉంది.

◆ మరోవైపు కేంద్ర జలసంఘం ఎన్నిసార్లు ప్రయత్నించినా ఒడిశాలో సంయుక్త సర్వే సాధ్యం కాలేదు. తమ రాష్ట్ర సమస్యలు పరిష్కారం కాలేదని ఒడిశా అభ్యంతరాలు వ్యక్తం చేస్తూనే ఉంది.

◆ ఈ అన్ని ప్రయత్నాలను వివరిస్తూ కేంద్ర జల శక్తి శాఖ నుంచి సుప్రీంకోర్టులో ఒక అఫిడవిట్ దాఖలు చేశారు.

◆ ఎగువ రాష్ట్రాల సమస్యలు పరిష్కారమవుతున్న నేపథ్యంలో ప్రాజెక్టు నిర్మాణ పనుల నిలుపుదల ఉత్తర్వులను కేంద్ర అటవీ పర్యావరణశాఖ శాశ్వతంగా తొలగించాలని రాష్ట్రం కోరుతోంది.



ఆలమట్టి ఎత్తు పెంపును... పోలవరం-బనకచర్ల కొత్త రూపాన్ని అడ్డుకోండి!

కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వినతి

ఈనాడు, దిల్లీ: సుప్రీంకోర్టు విధించిన స్టేకి విరుద్ధంగా కర్ణాటక ప్రభుత్వం తలపెట్టిన ఆలమట్టి డ్యాం ఎత్తు పెంపును, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు నూతన స్వరూపాన్ని అడ్డుకోవాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్‌పాటిల్‌ను కోరినట్లు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. తన శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న తెలంగాణ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఆయన మంగళవారం సాయంత్రం దిల్లీ శ్రమశక్తిభవన్‌లో కేంద్ర మంత్రిని కలిసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... "ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రలలో ఏ పార్టీల ప్రభుత్వాలు ఉన్నప్పటికీ కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణకున్న హక్కులను కాపాడుకోవడానికి మా ప్రభుత్వం అన్ని రకాల పోరాటం చేస్తుంది. కేంద్రంతోనూ పోరాడి తెలంగాణ హక్కులను కాపాడుకుంటాం. ఆలమట్టి ఎత్తు పెంపుపై పోరాడటానికి న్యాయ కోణాలన్నింటినీ పరిశీలిస్తున్నాం. మరోవైపు పోలవరం వరద జలాల తరలింపునూ అడ్డుకుంటాం. మేం ఫిర్యాదు చేసిన తర్వాతే పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు టెండర్లు రద్దయ్యాయి. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం దానిపై కొత్త ప్రణాళిక వేస్తున్నట్లు పత్రికల్లో కథనాలు చూశాం. అందుకే కొత్త ప్రతిపాదనను కూడా మేం వ్యతిరేకిస్తున్నట్లు ముందస్తుగానే కేంద్ర మంత్రికి లిఖిత పూర్వకంగా వివరించాం" అని వెల్లడించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ముందుంచిన పెండింగ్ పథకాల వివరాలను వెల్లడించారు.

మిన్ను విరిగిన పీఎల్‌జీఏ!

- రెండున్నర దశాబ్దాల్లో చిక్కిశల్యం

ఈనాడు, హైదరాబాద్: మావోయిస్టు పార్టీ సెంట్రల్ మిలిటరీ కమిషన్(సీఎంసీ)కు వెన్నెముకగా నిలిచిన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) మిన్ను విరిగింది. బెటాలియన్ కమాండర్ హోదాలో మిలిటరీ ఆపరేషన్లను క్షేత్రస్థాయిలో ముందుండి నడిపించిన కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా ఎన్‌కౌంటర్‌లో మరణించడంతో పీఎల్‌జీఏ కకావికలమైనట్లయింది. వాస్తవానికి అప్పటి సీపీఐ-పీపుల్స్‌వార్ గానీ, ఇప్పటి మావోయిస్టు పార్టీకి గానీ గెరిల్లా ఆర్మీ అత్యంత కీలకమైంది. పీపుల్స్‌వార్ గ్రూపులో పీపుల్స్ గెరిల్లా ఆర్మీ(పీజీఏ)గా ఈ విభాగం కొనసాగింది. 1999 డిసెంబరు 2న ఉమ్మడి కరీంనగర్ జిల్లా కొయ్యూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్రకమిటీ సభ్యులు నల్ల ఆదిరెడ్డి అలియాస్ శ్యాం, ఏపీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి అలియాస్ మహేశ్, ఉత్తర తెలంగాణ ప్రత్యేక జోనల్ కమిటీ కార్యదర్శి శీలం నరేశ్ ఒకేసారి మృతిచెందడం అప్పుడు పీపుల్స్‌వార్ పార్టీకి పెద్ద నష్టం కలిగించింది. ఆ ఆగ్రహంతో నివాళిగా వారి ప్రథమ వర్ధంతి సందర్భంగా 2000 డిసెంబరు 2న పీజీఏను ఏర్పాటుచేశారు. 2004 సెప్టెంబరు 21న సీపీఐ-పీపుల్స్‌వార్.. మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా(ఎంసీసీఐ)తో కలిసి సీపీఐ-మావోయిస్టు పార్టీగా అవతరించిన తర్వాత అది పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ)గా మారింది. అప్పట్లో ఇది 8 బెటాలియన్లు.. 13 ప్లటూన్లతో సుమారు 10-12 వేల సైన్యంతో ఉండేది. దేశంలో దాదాపు సగం రాష్ట్రాల్లో మావోయిస్టుల ప్రభావం ఉండటంతో పీఎల్‌జీఏ అత్యంత బలంగా ఉండేది. ఛత్తీస్‌గఢ్, ఏవోబీల్లో భారీ దాడులన్నీ పీఎల్‌జీఏ నేతృత్వంలోనే జరిగాయి. అయితే ఆపరేషన్ గ్రీన్‌హంట్, ఆపరేషన్ ప్రహార్, ఆపరేషన్ కగార్‌లతో దశాబ్దన్నర కాలంగా పరిస్థితి తారుమారైంది. మిగిలిన బెటాలియన్లు క్రమేపీ అస్త్రాలు కోల్పోగా.. హిడ్మా నేతృత్వం వహించిన మొదటి బెటాలియన్ మాత్రమే ఇప్పటివరకు మిలిటరీ ఆపరేషన్లకు వెన్నుదన్నుగా నిలిచింది. కొంతకాలం క్రితం హిడ్మా డీకేఎస్‌జడ్‌సీ బాధ్యతలు తీసుకోవడంతో మొదటి బెటాలియన్‌కు బర్సేదేవా నాయకత్వం వహించారు. ఆ బెటాలియన్‌లోని కాయ్-1కు లెంగు.. కాయ్-2కు కల్లు.. కాయ్-3కి లక్ష్ము నేతృత్వం వహిస్తున్నారు. నాయకత్వం మారినా ఆ బెటాలియన్‌పై హిడ్మా పట్టు కొనసాగింది. తాజాగా అతని ఎన్‌కౌంటర్‌తో ఇక పీఎల్‌జీఏ కార్యకలాపాలు దాదాపు కనుమరుగైనట్లేనని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వరుస ఎన్‌కౌంటర్లలో అగ్రనేతల్ని కోల్పోతున్న మావోయిస్టు పార్టీ

- కేంద్ర కమిటీ సభ్యులు హతం
- ఆపరేషన్ కగార్‌తో కకావికలం..

ఈనాడు, అమరావతి: మావోయిస్టు పార్టీకి దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. ఆపరేషన్ కగార్‌లో భాగంగా భద్రతా బలగాల నుంచి ముప్పేట నిర్బంధం, దాడులు పెరుగుతంతో.. ఆ పార్టీ కకావికలమవుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్‌కౌంటర్లలో వరుసగా అగ్రనేతల్ని కోల్పోతోంది. కేంద్ర కమిటీ సభ్యుడు, దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి, గెరిల్లా ఆపరేషన్లలో దిట్టగా పేరొందిన హిడ్మా తాజాగా మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో మరణించడంతో ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బగా చెప్పొచ్చు. ఈ ఏడాది జనవరి నుంచి ఛత్తీస్‌గఢ్, ఏపీ, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో ఆ పార్టీ కేంద్రకమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు ఎలియాస్ బస్వరాజ్ సహా అనేకమంది కేంద్రకమిటీ సభ్యులను కోల్పోయింది. వరుసగా కేంద్ర కమిటీ సభ్యుల్ని, అగ్రనేతల్ని కోల్పోవడం ఆ పార్టీ మనుగడనే ప్రశ్నార్థకంగా మార్చేసింది. ఎన్‌కౌంటర్లలో ముఖ్య నేతలు వరుసగా మరణించడంతో కేంద్ర కమిటీలో చివరికి ఎనిమిది మందే మిగిలారు. వీరిలో ఆరుగురు తెలుగు రాష్ట్రాల వారే.

కీలక నేతల్ని కోల్పోయారిలా: జనవరి 21: కేంద్ర కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి ప్రతాప్‌రెడ్డి ఎలియాస్ చలపతి ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దుల్లోని గరియాబంద్ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో మృతిచెందారు.

◆ మే 21: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎలియాస్ బస్వరాజ్ ఛత్తీస్‌గఢ్‌లోని గుండెకోట్ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో మరణించారు.

◆ జూన్ 5: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ ఏరియాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు తెంటు లక్ష్మీనరసింహాచలం ఎలియాస్ సుధాకర్ మరణించారు.

◆ సెప్టెంబరు 11: గరియాబంద్ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు మోడెం బాలకృష్ణ ఎలియాస్ మనోజ్, కేబీఎన్ డివిజన్ కార్యదర్శి అల్లాల్ చంద్రహాస్‌లు మృతిచెందారు.

◆ సెప్టెంబరు 19: కేంద్ర కమిటీ సభ్యుడు, ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గాజర్ల రవి ఎలియాస్ ఉదయ్, ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు, ఏసీఎం అరుణ ఎలియాస్ అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం కింటుకూరు సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయారు.

◆ సెప్టెంబరు 22: కేంద్ర కమిటీ సభ్యులు కట్టా రామచంద్రారెడ్డి, కదరి సత్యనారాయణరెడ్డిలు ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించారు.

ఏపీకి విస్తరించిన కగార్

చింతూరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల ఏరివేతకు ప్రారంభించిన ఆపరేషన్ కగార్ ఆంధ్రప్రదేశ్‌కూ విస్తరించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో తాజాగా చోటుచేసుకున్న ఎదురుకాల్పుల ఘటనే ఇందుకు నిదర్శనం. దండకారణ్యంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న మావోయిస్టుల ఏరివేత చేపట్టిన ఈ ఆపరేషన్‌లో భాగంగా ఈ ఏడాది జరిగిన ఎన్‌కౌంటర్లలో కేంద్ర కమిటీ సభ్యులైన నంబాల కేశవరావు, చలపతి, గణేశ్, రామచంద్రారెడ్డి, సత్యనారాయణరెడ్డి మృతిచెందారు. మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న లొంగిపోయిన విషయం తెలిసిందే. గత ఆరు నెలల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో పలువురు కేంద్ర కమిటీ సభ్యులు, మావోయిస్టు కీలక నేతలు మృత్యువాత పడ్డారు.

దండకారణ్యం దాటొచ్చిన తొలిసారే మృత్యుఒడికి..!

ఈనాడు, హైదరాబాద్: తనకు పట్టున్న దండకారణ్యంలో ఎన్నో పోలీసు దాడుల నుంచి తప్పించుకున్న మోస్ట్‌వాంటెడ్ మావోయిస్టు హిడ్మా చివరకు ఏపీలో మృత్యువాతపడటం చర్చనీయాంశంగా మారింది. దండకారణ్యంలోనే పుట్టి పెరిగిన హిడ్మాకు ఇప్పటివరకు బయటి ప్రపంచంలో అడుగుపెట్టిన దాఖలాల్లేవని నిఘావర్గాలు స్పష్టం చేస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. వాస్తవానికి మూడున్నర దశాబ్దాలుగా పీపుల్స్‌వార్, మావోయిస్టు పార్టీల్లో కీలకంగా వ్యవహరించిన హిడ్మాకు ఇప్పటివరకు దండకారణ్యం దాటాల్సిన అవసరం రాలేదని చెప్పొచ్చు. ఆ మాటకొస్తే కొంతకాలం క్రితం వరకు హిడ్మా స్వగ్రామం సుక్మా జిల్లా పూవర్తిలో పోలీసు బలగాలు అడుగుపెట్టిన దాఖలాల్లేవు. మావోయిస్టు పార్టీకి పెట్టనికోటగా ఉన్న దక్షిణబస్తర్‌లోని చాలా గ్రామాల్లో హిడ్మాకు సొంతంగా నెట్‌వర్క్ ఉండేది. మిగతా అగ్రనేతలంతా పోలిస్తే హిడ్మా స్థానికుడు కావడంతో గుర్తుతెలిసిన గూడేల ప్రజలు అతడికి రక్షణ కవచంగా ఉండేవారు. అలా దండకారణ్యంలో హిడ్మాను పట్టుకోవడం అటుంచి కనీసం అతడి ఆనుపానులు తెలుసుకోవడం కూడా పోలీసు బలగాలకు సవాల్‌గా మారింది. అయితే ఆపరేషన్ కగార్ విస్తృతం కావడంతో పరిస్థితి తలకిందులైంది. గతంలో ఎప్పుడు ఏ వైపు నుంచి మృత్యువు పొంచి వస్తుందోనని భయపడుతూ అడవుల్లో కూంబింగ్ చేసిన కేంద్రబలగాలు.. కొంతకాలంగా పైచేయి సాధిస్తూ వస్తున్నాయి. ప్రతి 4 కి.మీ.కి సీఆర్పీఎఫ్ క్యాంపు ఏర్పాటు చేస్తూ దండకారణ్యంలో క్రమేపీ పట్టు పెంచుకున్నారు. హిడ్మా స్వగ్రామంలోనూ క్యాంపు ఏర్పాటు చేసి తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. తమకు కేంద్రస్థానంగా భావించిన అబూజ్‌మడ్‌లో అగ్రనేత బస్వరాజ్ సహా 200 మందికిపైగా కేడర్‌ లొంగిపోవడం.. మరో అగ్రనేత అభయ్ 70 మందితో కలిసి ఉద్యమం వీడటంతో నేషనల్ పార్క్ ప్రాంతం ఖాళీ కావడం.. లాంటి పరిణామాలతో హిడ్మా ఉక్కిరిబిక్కిరైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇన్నాళ్లూ దక్షిణ బస్తర్‌లోని కర్రెగుట్టలను స్థావరంగా చేసుకొని పోలీసులకు కంటపడకుండా ఉన్న అతను ఇక తప్పదనే పరిస్థితుల్లోనే దండకారణ్యం దాటి తొలిసారిగా బయటికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఛత్తీస్‌గఢ్-ఒడిశా-ఆంధ్రప్రదేశ్ ట్రైజంక్షన్‌లోని ఏవోబీని దాటి ఏపీలోకి అడుగుపెట్టినట్లు తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాల నిఘావర్గాలను తక్కువగా అంచనా వేసినందునే హిడ్మా మృత్యువుకు చిక్కినట్లయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మొబైల్ ఫోన్లు పక్కనపెట్టి.. వాకీటాకీలతో

ఈనాడు, అమరావతి: విజయవాడ నగర శివారు కొత్త ఆటోనగర్ రోడ్ నంబర్ 5లోని ఓ భవనం మూడో అంతస్తులో అధిక సంఖ్యలో మావోయిస్టులు ఉన్నారని తెలిసి పోలీసులు ఆపరేషన్ చేపట్టారు. ఇందులో భాగంగా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల పోలీసులు, ఆక్టోపస్ బృందాలతో కలిసి పక్కా ప్రణాళిక రూపొందించారు. అత్యవసరంగా బయల్దేరి రమ్మంటూ మంగళవారం ఉదయం 7 గంటలకు ఎంపిక చేసిన ముఖ్యమైన అధికారులకు వాట్సప్ సమాచారం ఇచ్చారు. అందరి నుంచి ఫోన్లు స్వాధీనం చేసుకుని వాకీటాకీలిచ్చారు. పేలుడు పదార్థాల నిర్వీర్య బృందాలు, డాగ్‌స్క్వాడ్, అంబులెన్సులతో ఒకే సమయానికి దాడి చేశారు.

ఎన్‌కౌంటర్ చేసి చంపడం దుర్మార్గం: సీపీఐ

ఈనాడు, అమరావతి: మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకుడు హిడ్మా, అతని భార్య, పలువురు మావోయిస్టు సభ్యులను ఎన్‌కౌంటర్ చేసి చంపడం దుర్మార్గమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య విమర్శించారు. మరణించిన వారికి నివాళులు, జోహార్లు అర్పించారు. చర్చలకు సిద్ధమంటూ మావోయిస్టు నేతలు ముందుకొచ్చినప్పటికీ ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లు చేయడం దుర్మార్గమన్నారు.

పెట్టుబడుల సదస్సు సక్సెస్‌తో.. తాడేపల్లి ప్యాలెస్‌కు పగుళ్లు


ఉండవల్లి శ్రీదేవి

ఈనాడు, అమరావతి: సీఐఐ సదస్సు విజయవంతమవడంతో తాడేపల్లి ప్యాలెస్‌కు పగుళ్లు వచ్చాయని ఏపీ మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. మంగళవారం తెదేపా కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 2019-2024 మధ్యలో జగన్ ప్రభుత్వం అంతర్జాతీయ సదస్సు నిర్వహించి పచ్చళ్లు, నూడుల్స్, కరివేపాకు పొడి, ఫిష్ మార్ట్ లాంటి కంపెనీలను మాత్రమే తీసుకొచ్చిందని ఎద్దేవా చేశారు. రాజధాని లేని రాష్ట్రంగా మార్చి, కంపెనీలను వెళ్లగొట్టి, నిరుద్యోగంతో యువత ఆత్మహత్యలు చేసుకునే స్థాయికి దిగజార్చిందని ధ్వజమెత్తారు. విశాఖలో నిర్వహించిన సదస్సు ఏపీ పెట్టుబడుల దిశనే మార్చేసిందని.. రాష్ట్రాన్ని పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పడిన కష్టాన్ని అందరికీ చూపించిందని అన్నారు.

యథేచ్ఛగా యాంటీ బయాటిక్స్ వాడితే ముప్పే!

- అలా చేస్తే శరీరానికి నిజంగా అవసరమైనప్పుడు పనిచేయవు
- భారత్‌లో అత్యంత ప్రమాదకరంగా ఏఎంఆర్
- ఏఐజీ అధ్యయనంలో గుర్తింపు
- లాన్సెట్ ఈ-క్లినికల్ మెడిసిన్ జర్నల్‌లో ప్రచురితం

ఈనాడు, హైదరాబాద్: వైద్యుల సూచన లేకుండానే జ్వరం... జలుబు... దగ్గు తగ్గేందుకు మందుల దుకాణానికి వెళ్లి యాంటీ బయాటిక్ మందులు కొనుక్కొని వాడేస్తున్నారా? అయితే... మీ ఆరోగ్యం ప్రమాదంలో పడినట్లే! తరచూ యాంటీ బయోటిక్స్ వినియోగంతో శరీరానికి నిజంగా అవసరమైన రోజు అవి పనిచేయకుండా పోతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీలో అమెరికా, ఇటలీ, నెదర్లాండ్స్‌కు చెందిన వారితోపాటు భారతీయులు కలిపి దాదాపు 1,200 మందిపై జరిపిన అధ్యయనంలో ఈ విషయం బయటపడింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 18 నుంచి 80 ఏళ్ల వయసున్న 300 మంది భారతీయులను పరీక్షించగా... దాదాపు 83% మంది ఈ ముప్పును ఎదుర్కొంటున్నారని తేలింది. ఈ అధ్యయన వివరాలు ప్రఖ్యాత లాన్సెట్ ఈ-క్లినికల్ మెడిసిన్ జర్నల్‌లో తాజాగా ప్రచురితమయ్యాయి. మంగళవారం ఏఐజీ ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి, సహ పరిశోధకులు డాక్టర్ హార్దిక్ రుగ్వానీతో కలిసి మీడియాకు వివరాలు వెల్లడించారు. ఇంతలోతైన పూర్తి పరిశోధన చేయడం దేశంలో ఇదే తొలిసారని డాక్టర్ నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఇతర దేశాలతో పోల్చితే భారత్‌లో ఏఎంఆర్ అత్యంత ప్రమాదకరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.



అధ్యయనం వివరాలు వెల్లడిస్తున్న ఏఐజీ ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి. చిత్రంలో డాక్టర్ హార్దిక్ రుగ్వానీ

పూర్తిగా వాడకపోయినా ప్రమాదమే..

డాక్టర్ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ... "జలుబు, దగ్గు, గొంతు నొప్పి లాంటి వైరల్ వ్యాధులకు వైద్యుల సూచనలు లేకుండా యాంటీ బయాటిక్స్ వాడటం ఎంత ప్రమాదమో... వారు సూచించిన మందులన్నీ పూర్తిస్థాయిలో వాడకపోయినా అంతే ముప్పు ఉంటుంది. ఇలా చేయడం వల్ల శరీరానికి యాంటీ బయాటిక్ నిరోధకత వస్తుంది. మరోసారి ఇదే మందు వాడితే పనిచేయదు. ఇది యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్)కు దారి తీస్తుంది. దీన్ని సూపర్ బగ్‌గా పిలుస్తున్నారు. ఏటా దాదాపు 58 వేల నవజాత శిశువుల మరణాలకు ఏఎంఆర్ ఇన్‌ఫెక్షన్లు కారణం. 'ఎక్స్టెండెడ్ స్పెక్ట్రమ్ బీటా లాక్టమేజ్' ఆర్గానిజం ఉత్పత్తి చేసే బ్యాక్టీరియా నిరోధకత 70.2% మందిలో, కార్బాపెనెమ్ నిరోధక బ్యాక్టీరియా 23.5% మందిలో ఉన్నట్లు అధ్యయనంలో గుర్తించాం. పలు యాంటీ బయాటిక్ మందులు పనిచేయకుండా ఇవి అడ్డుకుంటాయి.

ఆహార ఉత్పత్తుల నుంచీ 'సూపర్ బగ్'

వ్యవసాయ ఉత్పత్తులు, డెయిరీ ఫాం, పౌల్ట్రీ, రొయ్యలు, చేపల సాగులో అధిక దిగుబడి కోసం యాంటీ బయాటిక్స్ వినియోగిస్తున్నారు. అలాంటి ఆహార ఉత్పత్తుల వినియోగంతో మనుషుల శరీరంలోకి సూపర్ బగ్ చేరుతోంది. దీని నిరోధానికి తరచూ చేతులు శుభ్రం చేసుకోవడం, శుభ్రమైన నీరు తాగడం, పోషకాహారం తీసుకోవడంతోపాటు క్రమం తప్పకుండా టీకాలు తీసుకోవాలి. అలాగే పశువైద్యుల సలహాలు లేకుండా జంతువులకు యాంటీ బయాటిక్స్ ఇవ్వకూడదు. పంటల అధిక దిగుబడికి మందులు వినియోగించకూడదు" అని సూచించారు.

2015-16.. తెలంగాణ గ్రూప్-2 రద్దు

రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం సంచలన తీర్పు

ఈనాడు, హైదరాబాద్: 2015-16 గ్రూప్-2ను రద్దు చేస్తూ మంగళవారం తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నాటి ఎంపిక జాబితాను కొట్టివేసింది. హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు, సాంకేతిక కమిటీ సిఫార్సులకు విరుద్ధంగా డబుల్ బబ్లింగ్, వైట్‌నర్ వినియోగం, తుడిపివేతలున్న పార్ట్-బి పత్రాలను పునర్ మూల్యాంకనం చేయడం చెల్లదని పేర్కొంది. హైకోర్టు తీర్పు, సాంకేతిక కమిటీ సిఫార్సులకు విరుద్ధంగా వ్యవహరించే అధికారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు లేదని తేల్చి చెప్పింది. జవాబు పత్రాల్లో ట్యాంపరింగ్ జరిగిందన్నది స్పష్టంగా కనిపిస్తున్నపుడు వాటిని పక్కన పెట్టకపోవడం కమిషన్ వైఫల్యమేనని తేల్చి చెప్పింది. 2019 అక్టోబరు 24లో ఇచ్చిన ఫలితాలు ఏకపక్షమని, చట్టవిరుద్ధమని వాటిని రద్దు చేసింది. సాంకేతిక కమిటీ సిఫార్సులు, హైకోర్టు తీర్పునకు అనుగుణంగా తిరిగి మూల్యాంకనం నిర్వహించి అర్హుల జాబితాను విడుదల చేసి నియామకాలు చేపట్టాలని, ఈ ప్రక్రియను 8 వారాల్లో పూర్తి చేయాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ఆదేశాలు జారీ చేసింది. దిద్దుబాటు, వైట్‌నర్ వినియోగం, డబుల్ బబ్లింగ్ జరిపినవాటిని మూల్యాంకనం చేయడం ద్వారా చేపట్టిన నియామకాలను రద్దు చేయాలంటూ పలువురు దాఖలు చేసిన 6 పిటిషన్‌లపై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టి ఈమేరకు తీర్పు వెలువరించారు.

ఇదీ పిటిషనర్ల కేసు

గ్రూప్-2 కింద 13 కేటగిరీల్లో 1,032 పోస్టుల భర్తీకి 2015 నోటిఫికేషన్ జారీ కాగా, 2016లో అనుబంధ నోటిఫికేషన్ జారీ అయింది. 2016 నవంబరు 11, 13 తేదీల్లో రాత పరీక్షలు జరిగాయి. ప్రశ్న పత్రం బుక్‌లెట్‌కు, ఓఎంఆర్ షీట్లకు పొంతన కుదరకపోవడంతో ఈ సమస్య పరిష్కారానికి 2016 డిసెంబరులో కమిషన్ సాంకేతిక కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ అధ్యయనం చేసి 2017 మార్చిలో నివేదిక సమర్పించింది. ప్రశ్న పత్రంలోని బుక్‌లెట్ నంబరు, ఓఎంఆర్ నంబరు ఒకటే ఉండాలన్న అభ్యర్థులు, ఇన్విజిలేటర్లు భావించడం వల్ల ఈ గందరగోళం తలెత్తిందని కమిటీ నివేదికలో పేర్కొంది. అంతేగాకుండా ఓఎంఆర్ షీట్ పార్ట్-ఎలోని అభ్యర్థి వ్యక్తిగత వివరాలకు సంబంధించి చిన్నచిన్న పొరపాట్లు ఉంటే మన్నించవచ్చని, అయితే పార్ట్-బిలోని 150 ప్రశ్నల జవాబులకు ఏదైనా తుడిచివేత, వైట్‌నర్ వాడినట్లయితే వాటిని మూల్యాంకనం చేయరాదని కమిటీ సిఫార్సు చేసింది. ఈ వ్యవహారంపై కొందరు హైకోర్టును ఆశ్రయించగా సింగిల్ జడ్జి మాన్యువల్‌గా మూల్యాంకనం చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. దీనిపై హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించగా ఇరుపక్షాల వాదనలను విని సాంకేతిక కమిటీ సిఫార్సులను సమర్థిస్తూ వాటి ప్రకారం మూల్యాంకనం చేపట్టాలంటూ 2019 జూన్ 6న తీర్పు వెలువరించింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పు అమలు ముసుగులో ఓఎంఆర్ షీట్‌లలో వైట్‌నర్, తుడిచివేతలకు పాల్పడిన అభ్యర్థుల పత్రాలను మూల్యాంకనం చేయడం ద్వారా ఆ తీర్పు స్ఫూర్తికి విరుద్ధంగా కమిషన్ వ్యవహరించిందని పలువురు పిటిషన్‌లు దాఖలు చేశారు. కమిషన్ వైఖరితో ఎంపిక ప్రక్రియ లోపభూయిష్టంగా ఉందని పిటిషనర్లు పేర్కొన్నారు.

ఇంటి దీపం ఆరిపోయి.. దిక్కుతోచక దీనస్థితి!

- మొత్తం కుటుంబాలను కోల్పోయి ఒంటరిగా కొందరు
- ఇంటి పెద్దలు దూరమై మరికొందరు...
- సౌదీ ప్రమాద మృతుల కుటుంబాల్లో అంతులేని వేదన


ఈనాడు, హైదరాబాద్: బరువెక్కిన హృదయాలు... ఉబికివస్తున్న కన్నీళ్లు... ఏ ఇంటికి వెళ్లినా వేదనే... ఎవరిని కదిలించినా అంతులేని ఆవేదనే... సౌదీ అరేబియా బస్సు ప్రమాదంలో మృతి చెందిన 45 మంది కుటుంబాల్లో పరిస్థితి ఇది. దేశంకాని దేశంలో తమ వాళ్లు మరణించడంతో అంత్యక్రియలు ఎప్పుడు జరుగుతాయో తెలియక బాధితులు అల్లాడుతున్నారు. ఏడ్చి ఏడ్చి ఇంకిన కన్నీళ్లతో చూస్తున్న వారిని ఓదార్చడం ఎవరితరమూ కావడం లేదు.

కుటుంబమంతా ఆహుతి.. ఆసుపత్రిలో సిరాజ్

ప్రమాదంలో హైదరాబాద్ విద్యానగర్‌కు చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి నజీరుద్దీన్ కుటుంబంలోని 18 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వారిలో చిన్నారులే తొమ్మిది మంది ఉండటం హృదయాలను కలచివేస్తోంది. విషయం తెలుసుకున్న నజీరుద్దీన్ పెద్ద కుమారుడు, అమెరికాలో ఉంటున్న సిరాజుద్దీన్ దిగ్భ్రాంతికి లోనై ఆసుపత్రిలో చేరినట్లు బంధువులు తెలిపారు. మంగళవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశాక విద్యానగర్‌లోని బంధువులతో ఫోన్‌లో మాట్లాడారు. అదే సమయంలో మాజీ ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ అక్కడికి వచ్చారు. బాధిత బంధువులను సౌదీకి పంపించేందుకు వివరాలను సమర్పించడానికి నాంపల్లిలోని హజ్‌హౌస్‌కు తీసుకెళ్లారు. మృతుల కుటుంబ సభ్యుల్ని మాజీ గవర్నర్ దత్తాత్రేయ తదితరులు పరామర్శించారు.







నజీరుద్దీన్, అక్తర్‌బేగం దంపతులతో మనవలు, మనవరాళ్లు (వీరంతా ప్రమాదంలో మరణించారు)
★ కుమారుడు మహ్మద్ అలీ చనిపోవడంతో టప్పాచబుత్రలోని జిర్రాలో మనవణ్ని ఓదారుస్తున్న ఇస్మాయిల్‌బీ
★ భార్యతోపాటు పెద్ద కొడుకు, కోడలు, ఇద్దరు మనవళ్లు ఒకేసారి మృత్యువాత పడటంతో విలపిస్తున్న కార్వాన్ మొఘల్‌నగర్‌కు చెందిన సలీంఅహ్మద్

అందని లోకాలకు అన్నం పెట్టే చేయి

టప్పాచబుత్ర జిర్రాలోని నటరాజ్‌నగర్‌లో నివసించే మహ్మద్ అలీ, అతని భార్య షాహెనాజ్‌బేగం కూడా ప్రమాదంలో చనిపోయారు. మహ్మద్ అలీకి తల్లి, ఐదుగురు పిల్లలు ఉన్నారు. వీరిలో ఇద్దరు కుమార్తెల వివాహం చేశారు. మూడో కుమార్తెకు ఇటీవలే వివాహం నిశ్చయమైంది. హోటల్ నిర్వహిస్తున్న మహ్మద్ కానరాని లోకాలకు వెళ్లిపోవడంతో కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. కొడుకు, కోడల్ని పోగొట్టుకున్న ఇస్మాయిల్‌బీని ఊరడించడం ఎవరితరం కావడం లేదు. తల్లిదండ్రుల మృతితో హోటల్ నిర్వహణ బాధ్యత మహ్మద్ అలీ పెద్దకుమారుడు మహ్మద్ షోయబ్(18)పై పడింది.

వారింట్లో మిగిలింది ఇక ఇద్దరే!

భార్యతోపాటు పెద్ద కొడుకు, కోడలు, ఇద్దరు మనవళ్లు ఒకేసారి మృత్యువాత పడటంతో కార్వాన్ డివిజన్‌లోని మొఘల్‌నగర్‌కు చెందిన సలీం అహ్మద్‌ను ఓదార్చడం ఎవరివల్లా కావడం లేదు. రెండు రోజుల నుంచి తిండీతిప్పలు మాని తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఉమ్రా యాత్రకు వెళ్లిన పెద్ద కొడుకు ఇర్ఫాన్ అహ్మద్, కోడలు హుమేరా నజ్‌నీన్, భార్య సబిహా సుల్తానా, మనవళ్లు ఇజాన్, హమ్దాన్‌లు తిరిగిరాని లోకాలకు వెళ్లారంటూ దుఃఖిస్తున్నారు. ఈ కుటుంబంలో సలీం అహ్మద్, ఆయన చిన్న కొడుకు రిజ్వాన్ అహ్మద్ మాత్రమే మిగిలారు.